

వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 24 సంచిక : 8,9
జూన్ - జులై - 2021
'ప్లవ' జ్యేష్ఠ, ఆషాఢ మాసాలు

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
SAGI KAMALAKARA SHARMA

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**దత్తయ్య అట్టెం**
DATTAIAH ATTEM

Printed and Published by
B. Anantha Laxmi

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013**
**ఫోన్ : 9347971177**
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ... వ్యాసాలు

### పోరంకి వారి కౌటుంబికం

నా సాహిత్యానువాదం - డా. పోరంకి దక్షిణామూర్తి ... 5; తెలుగు ముంగిట రంగవల్లులు దిద్దిన డా. పోరంకి దక్షిణామూర్తి (ముఖాముఖి) - డా.పి.ఎస్. గోపాలకృష్ణ ... 8; అద్దరి వారు కాదు.. అందరివారు - వక్కలంక రమణ ... 13; తెలుగుకు వెలుగు పందిరి - సుధామ ... 14; మా తాతగారు - వైష్ణవి మైత్రేయి ... 15; ఆప్తవాక్యం - ఆచార్య జి. జెన్నకేశవ రెడ్డి... 16; నేనూ - మా దక్షుడు - పాండురంగ విఠల్ ... 17; మా నాన్నగారు - పోరంకి రమణ ప్రసాద్ ... 18; మా పినతండ్రి - పోరంకి ఆనందం ... 20; మా సహాధ్యాయులు - ఐ.వి. కాంతలక్ష్మి... 21; సహాధ్యాయులు - డా.బంధకవి దీనావతి ... 22;

### పోరంకి వారి సాహిత్యం

కథాగీత - పరిశోధనా బాట - డా.బి.వి.ఎన్.స్వామి ... 23; తెలుగు కథా చరిత్రకు లఘు చిరునామా 'కథానికా వాఙ్మయం' - డా.ఎస్. రఘు ... 27; పరిశోధనా దక్షుడు దక్షిణామూర్తి - డా. ఏలె విజయలక్ష్మి ... 29; నిజమైన మనిషి కోసం 'చంద్రవంక' - డా. వెల్దండి శ్రీధర్ ... 35; రాజకీయ నవల 'నీడలూ - జాడలూ' - డా. బంధకవి దీనావతి ... 37; నవల 'నివేదన' విశేషాలు - డా.ఐ.వి.కాంతలక్ష్మి ... 40; చేనేత వృత్తి : సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ 'ముత్యాల పందిరి' - కోడం కుమారస్వామి ... 42; మాండలిక పద మణిహారం - వెలుగూ వెన్నెలా గోదారీ - వడ్లపురం కృష్ణ ... 47; అరచేతి అద్దంలో దక్షిణామూర్తి - ఆచార్య సూర్యా ధనంజయ్ ... 53; ఉన్నది ఉన్నట్లుగా చెప్పే దక్షిణామూర్తి సమీక్షలు - డా. పి. వారిజారాణి ... 56; పోరంకివారి తెలుగు మాండలికాలు - డా. శ్రీరంగాచార్య ... 61; పోరంకి దక్షిణామూర్తి విద్యాసంబంధ రచనలు - డా. వి. జయప్రకాశ్ ... 63; మన వాయుసేన - కాశీ భార్గవ ... 66;

### పోరంకి వారి ఆధ్యాత్మిక అనువాదాలు

ఆధ్యాత్మిక గ్రంథానువాద శైలికి ప్రామాణిక మార్గదర్శి డా. పోరంకి - గురిజాల రామశేషయ్య ... 69; తెలుగులో శ్రీ పోరంకి ఆర్యమిషన్ గీత - ఆచార్య కసిరెడ్డి ... 71; క్రియా గీత - శ్రీ యోగసాధనా కరదీపిక - డా.డి. కామేశ్వరరావు ... 73; అదొక్కటే తెలుసుకో చాలు - డా. జె. భారతి ... 76; జ్ఞాన సంకలినీ తంత్రం - డా. ఎన్. అనంతలక్ష్మి ... 78; ఆధ్యాత్మిక సాధనలో దక్షిణామూర్తి - జె.ఎల్. అనూరాధ ... 80; ప్రాణమయం జగత్ - డా. తెన్నేటి హరీష్ ... 84; క్రియాయోగ ప్రచారాస్త్రంగా బాబాజీ ఎన్నుకున్న యోగానంద - ఎ. శ్రీనాథ్ ...85; మన ఆధ్యాత్మిక వారసత్వం - టి. లక్ష్మీనారాయణ ... 90; డా॥ దక్షిణామూర్తి లఘు అనువాదాలు - మంత్రి శ్రీనివాస్ ... 94; సద్గురు స్వామి నిగమానంద సరస్వతి (ఒకయోగి అద్భుత కథ) - సాగి తేజశ్రీ ... 98; భారతీయ ఆధ్యాత్మికతను పరిచయం చేసిన భక్తి కథలు - డా. బి. మనోహరి ... 103; ఆధ్యాత్మిక అనువాద శిఖరం - ఒక యోగి ఆత్మకథ - డా. సాగి కమలాకర శర్మ ... 107

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# అమృతం

మరణము లేదా మరణ సదృశమైనది మృతం. దానికి వ్యతిరేకమైనది అమృతం. రూపం లేకున్నా తలపుల్లో నిరంతరం జీవించేది అమృతమే. ఒకరి తలపులో కన్నా వందల, వేల, లక్షల, కోట్ల మంది తలపుల్లో జీవించగలిగే అంశమేదైనా అమృతమైనదే. ఈ ప్రకృతి, పశు పక్ష్యాదుల చేతనలో కూడా ఉండగలిగే అంశం ఏదైనా ఉంటే అదే పూర్ణామృతం అవుతుంది. వ్యక్తమైన జీవి మృత్యువును చేరుకోక తప్పదు. తన ప్రయాణంలో మృత్యువు నుండి మృత్యురహితమైన స్థితికి చేరుకోవడానికి ప్రయత్నించి తీరాలని ఆధ్యాత్మిక శాస్త్రాలన్నీ ఉద్బోధిస్తూనే ఉన్నాయి. (మృత్యోర్మా అమృతం గమయ). మృత్యుమయమైన, పాంచభౌతిక రూపాన్ని దాల్చిన రూపాన్ని దాటి రూప రహితమై, అన్నింటిలోనూ విస్తరించే స్థితికి చేరడమే అమృతం. వ్యాపించడం, విస్తరించడం అమృతం. ముద్దలాగా, ఘనంలాగా పడి ఉండే పదార్థ స్థితి నుండి కనిపించనంత విభజనలు పొందే యథార్థ స్థితికి చేరే ప్రయత్నమే అమృతం.

కనిపించే పదార్థం, కనిపించని అణుమయం కావడానికి ఎన్నో దెబ్బలు తినాల్సి వస్తూనే ఉంటుంది. కనిపించే కొండను పేల్చి, పెద్ద రాళ్ళుగా, చిన్న రాళ్ళుగా, గులకరాళ్ళుగా, దుమ్ముగా మార్చడానికి ఎంత సమయం పడుతుందో మనకు తెలుసుకదా! పెద్ద రాయికి రూపం ఉంది, దుమ్ముకు రూపం లేదు. రాయి పడి ఉంటుంది. దుమ్ము విస్తరిస్తుంది. దానికి స్వతంత్రం ఉంటుంది. చెట్టుకు వేలాడుతున్నప్పుడు పండుకు రూపం కనిపిస్తుంది. కోసుకొని ముక్కలు చేసి, పంటి క్రింద పెట్టుకొని కొరికి కొరికి తిని, ఇంకా ఇంకా సూక్ష్మీకృతం చేస్తున్నా కొద్దీ దానిలోని శక్తి శరీరానికి అందుతుంది. ఆ శక్తితో నిత్యజీవిత వ్యవహారాలు ఈ శరీరం చేస్తూ ఉంటుంది. ఏదయినా సూక్ష్మమవుతున్నా కొద్దీ శక్తివంతమవుతుంది. స్థూలస్థితిలో శక్తి తగ్గిపోతూ ఉంటుంది. సూక్ష్మస్థితిలో ఉన్న చైతన్యం, స్థూలంలో జాడ్యంగా మారిపోతుంది. కనిపించే దేహం కన్నా, కనిపించని మనస్సుకు శక్తి అధికం. మనస్సు, శరీరాన్ని శాసిస్తుంది. పరిమితమైన మనో శరీరాలకన్నా, వాటి క్రియాశీలతకు కారణమైన ప్రాణ చైతన్యం మరింత సూక్ష్మమైంది. ఈ లోకంలో వ్యక్తమైన మానవ ప్రయత్నమంతా స్థూలం నుండి సూక్ష్మానికి మారే ప్రయత్నంచడమే. వ్యక్తం నుండి అవ్యక్తానికి మారడమే.

మార్గాలు అనేకంగా ఎన్నుకొని అమృతమయులవుతుంటారు. తాము చేసే ప్రతి కర్మను సేవగా మార్చుకొని, ఆశించని ఒకానొక ఉన్నత తత్త్వంతో ఉన్నవారు క్రమంగా ఈ అమృతమయులుగా మారుతుంటారు. ఆశించడం స్వార్థం, వదులుకోవడం పరమార్థం. త్యాగమే వ్యక్తిని అమృతమయుణ్ణి చేస్తుంది. తాము చేస్తున్న పని వల్ల వచ్చే కీర్తి ప్రతిష్ఠలు, ధనం, సౌఖ్యం మొదలైనవానిని పక్కకు పెట్టి, పూర్ణంగా తమకు కేటాయించిన పనిలో నిమగ్నమైన వారు పొందబోయేది అమృతమయ జీవనమే. తమకు ఉన్న ప్రజ్ఞాపాటవాలు కేవలం విశ్వ దత్తాలుగా భావించి, ఆ విశ్వం సూచించిన కార్యక్రమాలను మనసా, వాచా, కర్మణా శుద్ధితో నిర్వహించడమే కర్తవ్యమంటే. అటువంటి కర్తవ్య నిర్వహణ చేసిన వారంతా అమృతమయులవుతారు.

ఈ జన్మకు దత్తమైన శరీరంతో సరిపుచ్చుకుని, దత్తమైన జ్ఞానాన్ని పెద్ద చేసుకుంటూ, మనస్సును చైతన్యంగా మార్చుకునే ప్రయత్నం చేయడం వల్లనే మనిషి మనీషిగా మారుతాడు. మానవత్వం దైవత్వంగా మారుతుంది. ఆశింపు నుండి అందింపుకు చేరుకుంటారు. మృతం నుండి అమృతమయ లవుతారు. అటువంటి కోవలోని వారందరికీ మనం సవినయ ప్రణామాలు సమర్పిస్తూ... వారి మార్గాన్ని అనుసరించడానికి ప్రయత్నిద్దాం.

# నా సాహిత్యానువాదం

## డా. పోరంకి దక్షిణామూర్తి



మనకు వచ్చిన తలపుల్లో, ఊహల్లో కొన్ని మనకు బాగా నచ్చుతాయి. ఇతరులకు చెప్పాలనిపిస్తాయి. అది మనకొక వేడుక. అలాగే ఇతరుల భావాలు, ఇతర భాషల్లో చదివినప్పుడు మనకు బాగా నచ్చినప్పుడు, మన భాషలో వాటిని చెప్పాలనిపిస్తుంది. ఇతర భాషల్లో చదివే అవకాశం లేని మనవాళ్ళకు మన భాషలోనే చదివే అవకాశం కల్పించాలనిపిస్తుంది. ఇది కూడా వేడుకే. దీన్ని తీర్చుకోవడానికి చేసే ప్రయత్నమే అనువాదం. 'అను-వాదం' అనే మాటవల్ల ఒక ఇబ్బంది కలగడం సహజం. ఏమంటే, ఆ మాటకు అర్థం **'ఒకరు పలికిందే పలకడం'** అని. మన చేసే అనువాదాలు **'చిలక పలుకులు'** కావు. ఒకరు (ఒక సాంస్కృతిక నేపథ్యంలో) చెప్పిన భావాన్ని మనం మన భాషలో చెబుతాం. మనకు సహజమయిన పద్ధతిలోనే చెబుతాం. **'మక్కికి మక్కి'** అనువాదం ఎవరికీ నచ్చదు. సహజమూ కాదు.

కవితాత్మకమయిన భావాన్ని, పరభాషలో నుంచి తీసుకని మన భాషలో చెప్పాలనుకొన్నప్పుడు దానికి రెండు పద్ధతులను అనుసరిస్తాం. ఒకటి, దాని తాత్పర్యాన్ని చెప్పడం, మరొకటి, దాన్ని మన భాషలోకూడా కవితాత్మకంగా చెప్పడం. ఈ రెండో పద్ధతి **'అనుసృజన'** (Transcreation) అనిపించుకొంటుంది. మన భాషలో చెప్పే పద్ధతి మూలభాషలో చెప్పే పద్ధతికి భిన్నంగా ఉండటం సహజం. కాబట్టి **'అనుసరణ'** అనేది కూడా ఆ మాదిరిదే. కాబట్టి **'అనువాదం'** వాటికి భిన్నమయినదని గుర్తిస్తాం. మూలంలో ఉన్నది చెప్పడం, లేనిది చెప్పకపోవడం అనువాదానికి ముఖ్యం. చెప్పినది, మన భాషకు సహజమయిన రీతిలో చెప్పడమన్నదే ప్రమాణం. సాధారణంగా, అనువాదకులందరూ ఆ ప్రమాణాన్ని పాటిస్తారు.

చిన్నప్పుడు నేను హిందీ కొద్దిగా నేర్చుకున్నాను. ఆ పరిచయంతో అన్ని వ్యాసాలు, కథలు, కవితలు చదువుతుండేవాణ్ణి. పరిణామ వాదాన్ని గురించి ఎప్పుడో ఒక వ్యాసం చదివాను. సరదాపడి, దాన్ని తెలుగులోకి అనువదించాను అప్పటికి నాకు చేతనయిన తీరుగా. పందిరి మల్లికార్జునరావుగారి కిన్నెర మాసపత్రికకు పంపించాను. (1954లో అనుకుంటాను). అది అచ్చయింది. ఆనందం కలిగింది. ఆ తరువాత డేవ్ కార్నెగీ రాసిన 'How to Win Friencs and influence people' అన్నది అనువదించాలని సరదా పడ్డాను. మొదలు పెట్టాక ఒక సమస్య వచ్చి పడింది. కార్నెగీ ఆ పుస్తకంలో వర్ణించిన వృత్తాంతాలు అమెరికా జీవన సరణికి సహజమయిన పద్ధతిలో ఉన్నాయి. వాటిలో తెలుగుతనం తీసుకురావాలంటే నాకున్న శక్తి చాలదనిపించి ప్రయత్నం విరమించుకున్నాను. అప్పటికీ, ఇప్పటికీ దాన్నెవరూ తెలుగులోకి అనువదించగా చూడలేదు.

1956లో Love potion అన్న ఆంగ్లకథను అనుసరించి తెలుగు చేసిన కథ **'ప్రేమసుధ'** అన్న పేరుతో, 'తెలుగు స్వతంత్ర'లో అచ్చయింది. 1958లో Nice Girl అన్న ఆంగ్లకథకు చేసిన అనుసృజన **'శశిబాల'** అన్న పేరుతో, ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురణ అయింది.

1962లో నేను 'ప్రజాప్రభ' దినపత్రికలో ఉప సంపాదకుడిగా పనిచేసే రోజుల్లో ఇంగ్లీషులోని కొన్ని వ్యాసాలు తెలుగు చేశాను. వాటిలో నాకు బాగా తృప్తినిచ్చింది **'ఆరోజు... గాంధీజీ జీవితంలో తుదిరోజు'** అన్నది. మరి రెండేళ్ళు పోయాక, గ్రాంధిక - వ్యావహారిక భాషా వివాదానికి సంబంధించి గురజాడ అప్పారావుగారి **'మినిట్ ఆఫ్ డిసెంట్'** (1914) అనువాదానికి పూనుకొన్నాను. అందులో వచ్చిన కష్టం, తెలుగు వ్యాకరణ పరిభాషలోని కొన్ని పదాలకు అప్పారావుగారిచ్చిన ఇంగ్లీషు మాటలను మళ్ళీ తెలుగు పరిభాషలో వెదికి పట్టుకోవడం, దీన్ని ఆంధ్రప్రభ దినపత్రిక వారు 1964 ఆదివారం సంచికల్లో ధారావాహికంగా ప్రచురించారు. (1968 విశాలాంధ్ర వారు పుస్తకరూపంలో ప్రచురించారు).

అటు మీదట, నేషనల్ హెరాల్డ్ ఆంగ్ల దినపత్రిక సంపాదకులు ఎం. చలపతిరావుగారు రచించిన **'ఆల్ ఇన్ ఆల్'** అనువదించాను. **'ఎందరో మహానుభావులు'** (1973) అన్న పేరుతో. దీనికి పరిచయ వాక్యాలు రచించినవారు మాన్యశ్రీ పి.వి. నరసింహారావుగారు.

ఇందులో ప్రపంచ ప్రఖ్యాతులయిన కొందరు వ్యక్తుల లఘు పరిచయాలున్నాయి. ఆర్.కె. లక్ష్మణ్‌గారి కార్టూన్లు ప్రత్యేకాకర్షణలు. చలపతిరావుగారి ఆంగ్లభాషా శైలి మంచి పటిష్టమయినది. దాన్ని అనువదించడంలో చాలా జాగ్రత్త. నిదానం అవసరమయ్యాయి.

కేంద్ర సాహిత్య అకాడమీవారి కోసం అనువదించినది బి.ఎం. శ్రీకంఠయ్య (ఎ.ఎన్.మూర్తిరావు ఆంగ్ల రచన) మోనోగ్రాపు (1978) నేషనల్ బుక్ ట్రస్ట్‌వారి కోసం అనువదించినవి. **'మన వాయుసేన'** (సి.ఎల్.ప్రౌడ్‌ఫుట్ ఆంగ్ల రచన), **'భారతీయ జానపద కళలు : చేతి పనులు'** (ఇండియన్ ఫోక్ ఆర్ట్స్ అండ్ హేండీక్రాఫ్ట్స్), ఆంధ్రప్రదేశ్ (ఎ. రమేశ్ చౌదరి ఆంగ్ల రచన). వీటిలో మొదటి ఒక్కటే అచ్చయి వచ్చింది. (1983). తక్కినవిరెండూ దాదాపు ఇరవై ఏళ్ళనుంచి (ఈ వ్యాసం 2006లో ప్రచురితమైంది. అప్పటికి 20 ఏళ్ళు) అముద్రితాలుగా ఉన్నాయి. వీటి అనువాదంలో శ్రమ ఏమీ కలగలేదు.

నా అనువాద రచనా సామర్థ్యాన్ని పరీక్షకు పెట్టిన గ్రంథం శ్రీశ్రీ పరమహంస యోగానందగారి **'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి'**. భారతీయ ఆధ్యాత్మిక భావనలను, పరిభాషను విదేశీయుల అవగాహనకు అందేటట్లుగా చెప్పారు యోగానందులు. వారు ఆంగ్లంలో చెప్పినవాటిని తెలుగులో చెప్పడానికి తగిన పదాలనూ, పదబంధాలనూ ఎన్నుకోడానికి శ్రమించవలసి వచ్చింది. తృప్తికరమయిన తెలుగు మాట కోసం ఎన్నెన్ని నిఘంటువులు, ఎన్నివేల సార్లు తిరగవేయవలసి వచ్చిందో! **అర్ధశతాబ్ది కాలపు అనువాద రచనానుభవంలో, ఆ మహాగ్రంథాన్ని అనువదించడానికి పడ్డ శ్రమ మరే గ్రంథాన్ని అనువదించడానికీ నేను పడలేదు. శ్రమ ఫలించినందుకు, చదువరులకు నచ్చినందుకు మంచి తృప్తి కలిగింది.** ఒక్కొక్క ఘట్టంలో ఒక్కొక్క వాక్యాన్నీ, పదబంధాన్నీ అనువదించ డానికి చాలామందిని సంప్రదించిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ఒక అధ్యాయం చివరలో యోగానందులు వాక్యాన్ని ఇంగ్లీషులో ఇలా ఉదాహరించారు. "A Saint who is Sad is a Sad Saint" దీన్ని మక్కికి మక్కిగా అనుదించలేం కదా! హిందీ, కన్నడ గ్రంథాల్లో దీన్ని అనువదించిన తీరు నాకు నచ్చలేదు. అప్పుడొక స్నేహితుడి దగ్గర నా సమస్యను ప్రస్తావించాను. అప్పుడాయన **"సాధువన్నవాడు దుఃఖపడటం ఏమిటి? దుఃఖించే సాధువు సాధువే కాదు!"** అన్నాడు. ఇది నాకు నచ్చింది. ఆ ప్రకారంగానే తెలిగించాను. స్వతంత్రించి.

యోగానంద గారివే చిన్న చిన్న పుస్తకాలు కూడా కొన్ని తెలిగించాను. **"దేవుడితో మట్లాడ్డం ఎలా, సఫలతా నియమం, విజయానికి ఒక దారి కనుక్కోవడం ఎలా, దేవుడి అపరిమిత శక్తితో రోగచికిత్స, రోగచికిత్స చేసే భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక పద్ధతులను పొత్తుపరచడం, సఫలత కోసం అవధానతా శక్తిని కేంద్రీకరించడం"** అన్నవి. శ్రీశ్రీ దయామాత ప్రసంగానికి చేసిన అనువాదం **'ఇతరులను మార్చడం ఎలా'** అన్నది. శ్రీ మృణాళినీ మాత రచనకు అనువాదం **'గురుశిష్య సంబంధం'** (ఇవి కాక, ఇలాంటివే మరో ఆరు ఇప్పుడు అచ్చులో ఉన్నాయి). శ్రీశ్రీ పరమహంస యోగానందగారు స్థాపించిన 'యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా/ సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్' సంస్థ ప్రచురించే అనువాద గ్రంథాల మీద అనువాదకుల పేర్లు కనిపించవు. వారి అనువాదకులెవరూ పేరు కాని, డబ్బు కాని ఆశించినవాళ్ళు కారు.

అనుకోకుండా ఇతరుల కోరిక మీద, మూడు గ్రంథాలను హిందీలో నుంచి అనువదించవలసి వచ్చింది. **1. పురాణ పురుష యోగిరాజ శ్రీశ్యామాచరణ లహరీ 1988 (మూల రచయిత అశోక్‌కుమార్ చట్టోపాధ్యాయ గారు దీన్ని బెంగాలీలో రచించారు) 2. ప్రాణమయం జగత్ 1991 (ఇదీ అశోక్‌కుమార్ గారిచే) 3. సద్గురు నిగమానంద (డా. కాళీకింకర్ చక్రవర్తిగారు రచించినది).** కుముదం పబ్లికేషన్స్ వారి 'భక్తి' మాసపత్రికలో ధారావాహికగా వెలువడింది. వీటి అనువాద ప్రయత్నం నల్లేరు మీద బండి నడకలా సాగిపోయింది.

నేను సంస్కృత పండితుణ్ణి కాకపోయినప్పటికీ ఇతరుల సహాయ సహకారాలతో రెండు పుస్తకాలు తెలుగులో వెలువరించడానికి సాహసించాను. వాటిలో ఒకటి **'అధర్వ వేదంలో అక్షయ నిధులు'** అధర్వణ వేదంలోని 'పృథివీ సూక్తం'లోను, 'ప్రాణ సూక్తం'లోను ఉన్న మంత్రాలకు తాత్పర్యాలను, వివరణలను ఆధునిక విజ్ఞాన శాస్త్ర పరమయిన అన్వయాలనూ మా మిత్రులు మంజులూరి నరసింహారావుగారు రచించగా, ఆ అనువాదాన్ని సరళమయిన నేటి తెలుగులోకి చక్కదిద్దే ప్రయత్నం చేశాను. ఇది 1980వ దశకంలో ఆంధ్రప్రభ వారపత్రికలో ధారావాహికగా ప్రచురించారు. పొత్తూరి వేంకటేశ్వరరావుగారు దీన్ని టాగూర్ పబ్లిషింగ్ హౌస్‌వారు 2000లో పుస్తకరూపంలో ప్రచురించారు. మరొక పుస్తకం **'జ్ఞాన సంకలనీ తంత్రం'.** ఇందులోని కొన్ని శ్లోకాలను నేను మొదట, 'పురాణ పురుష...' గ్రంథంలో అశోక్‌కుమారుగారు ఉదాహరించినప్పుడు చూశాను. బాగున్నాయనిపించింది. మొత్తం శ్లోకాలున్న పుస్తకం కోసం ప్రయత్నించాను. కాశీలో ఒక చిన్న పుస్తకం, హిందీ అనువాదంతో దొరికింది. దాన్ని నేను తెలిగించాను. మిత్రులు నరసింహారావు గారు నా అనువాదాన్ని సరిచూశారు. దీన్ని నేనే ప్రచురించాను సద్గురు శ్రీరాంగారికీ, మిత్రులు ప్రొఫెసర్ మలపాక శివరామకృష్ణగారికీ, నూతన సంవత్సర నూతన శతాబ్ది, నూతన సహస్రాబ్ది సంయుక్త శుభాకాంక్షలతో 2000 డిసెంబర్ 31నాడు అంకితమిచ్చారు.

స్వామి రంగనాథానందగారి **'హ్యూమన్ వాల్యూస్ ఇన్ మేనేజ్‌మెంట్'** అన్న పుస్తకానికి చేసిన అనువాదం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు పర్యటన శాఖవారి కోసం **'హైదరాబాదు జాతరలు,**

**పండుగలు, ఉత్సవాలు'** అన్న పేరుతో చేసిన అనువాదం పదిహేనిరవై ఏళ్ల నుంచి అముద్రితాలుగానే ఉండిపోయాయి.

స్వామి అమృత స్వరూపానందగారు ఆంగ్లంలో రచించిన గ్రంథానికి అనువాదం **'అమ్మ అమృతానందమయి జీవిత చరిత్ర, భక్తుల అనుభవాలు'** అన్నది 1996లో వెలువడింది. **'అమృతజ్యోతి'** (సంసారులకు సలహాలు) మాతా అమృతానందమయి దేవి వాక్కుల సంకలనం.. ఇది 1999లో వెలువడింది. ఆ తరువాత ఆమె **'ఉపదేశామృతం'** రెండోభాగానికి కూడా నా అనువాదం వచ్చింది.

ఆర్థర్ ఆస్బర్న్ రచించిన The Incredible Saibaba అన్న పుస్తకాన్ని ఓరియంటల్ లాన్ కంపెనీవారు ప్రచురించారు. దానికి నా అనువాదాన్ని కూడా వారే ప్రచురించారు. (1996/97) **'మహా మహిమాన్వితులు సాయిబాబా'** అన్న పేరుతో.

An Anthology of Indian Literature అన్న గ్రంథాన్ని **'భారతీయ సాహిత్య సంకలనం'** అన్న పేరుతో తెలుగు అకాడమీవారు అనువదింపజేశారు. అందులోని కాశ్మీరీ భాషా సాహిత్య విభాగాన్ని అనువదించే అవకాశం నాకు కలిగింది.

కేంద్ర సాహిత్య అకాడమీవారు Anthology of Contemporary Indian Stories అన్న మూడు భాగాల గ్రంథాన్ని తెలుగులోకి అనువదింపజేయడానికి సుమారు 15 ఏళ్ల కిందట ఒక కార్యగోష్ఠి నిర్వహించారు. వాటిలోని రెండు కథలను, గ్రంథానికి హుమాయూన్ కబీర్ రాసిన పీఠికను నేను తెలుగులోకి అనువదించాను.

భారతీయ సంస్కృతిని గురించి విదేశీయులు చేసే దుర్విమర్శలను ప్రత్యాఖ్యానం చేస్తూ వచ్చింది. శ్రీ అరవిందుల Foundations of Indian Culture అనే గ్రంథం (ఆర్య పత్రికకు రాసిన వ్యాసాల కూర్పు) ఆధారంగా, వారి శిష్యులయిన చారుచంద్ర దత్తగారు **'కల్చర్ ఆఫ్ ఇండియా యాజ్ ఎన్విసేజ్డ్ బై శ్రీ అరబిందో'** అన్న ఆంగ్ల గ్రంథం రచించారు. దానికి నా తెలుగు అనువాదం **'శ్రీ అరవిందులు దర్శించిన భారతీయ సంస్కృతి'**. ఇందులో శ్రీ అరవిందుల రచనల్లో నుంచి పేరాలకు పేరాలను ఉదాహరిస్తూ వచ్చారు శ్రీ దత్తగారు. యోగానందుల ఆత్మకథను అనువదించడం చాలా కష్టమయింది అనుకున్నాను. కాని అరవిందుల వాక్య విన్యాసాలను అనువదించడం ఇంకా మహాకష్టమయింది అని తర్వాత తెలిసి వచ్చింది. అయినా వారి అనుగ్రహం లేకపోతే నాకు అనువాద రచనా సామర్థ్యం అలవడేదా?

**(మూసీ మాసపత్రిక 2006 డిసెంబర్‌లో ప్రచురితం)**







**(డా॥ పోరంకి దక్షిణామూర్తి గారి కుటుంబ సభ్యులు, మిత్రులు)**

# తెలుగు ముంగిట రంగవల్లులు దిద్దిన డా. పోరంకి దక్షిణామూర్తి

**ముఖాముఖి : డా. పి.ఎస్. గోపాలకృష్ణ,** పూర్వ సంచాలకులు, ఆకాశవాణి. ఫోన్ : 94920 58970

**"ప్రపంచంలో ఎవరి బతుకు వాళ్లది. ఎవరి దారి వాళ్లది. ఆశయాలూ, ఆదర్శాలూ అలవాట్లూ ఎవరివి వాళ్లకు ఉంటాయి. ఈతిబాధలూ మనఃక్లేశాలూ అసంతృప్తులూ అన్నిచోట్లా కనిపిస్తూనే ఉంటాయి. అటువంటప్పుడు ఒక మంచి మాట, ఆప్యాయమైన ఒక పలకరింపు, కొంత సానుభూతి, మరికొంత మంచిదనం, చేతనైన సాయం లేనప్పుడు ఉపాయం అందిస్తూ మనసు నిడిస్తూ, ఆదరం చూపడానికి అందరూ ప్రయత్నిస్తే ఈ లోకం ఎంత అందంగా హాయిగా ఉంటుంది"** అంటారు డా. పోరంకి దక్షిణామూర్తి. ఆ వ్యక్తిత్వం వయసు 77 సంవత్సరాలు (పదకొండేళ్ళే). రచయితగా అరవయ్యవ యేట అడుగుపెడుతున్న దక్షిణామూర్తి ఆడంబరాలకూ, ఆర్భాటాలకూ, అతివాదానికీ దూరంగా ఉంటారు. ఆయన కథలు, నవలలు రాశారు. భాషా సాహిత్యాల గురించి వాయసాలు రాశారు. ఆధ్యాత్మిక రచనలలో తమదైన ఒరవడిని సృష్టించారు. అనువాదకులుగా అరుదైన గుర్తింపు పొందారు. వృత్తి పదకోశాలనూ, నిఘంటువులనూ నిర్మించడంలో విశేష కృషి చేశారు. కథానిక స్వరూప స్వభావాల గురించి సిద్ధాంత గ్రంథం వెలయించారు. తెలుగు వాచకాలు కూర్చారు. అవిశ్రాంతంగా తమ రచనా వ్యవసాయాన్ని కొనసాగించి కొత్త పంటలు పండిస్తున్నారు. ఇన్ని ప్రత్యేకతలున్నా వినయంగా **"ఏ చెట్టుకున్న ఏ రెండాకులూ తీసుకొన్నా దేనికదే ప్రత్యేకమైనది. మౌలికమైనది. ఇది ప్రతి మనిషికీ వర్తిస్తుంది కాబట్టి నా జీవితానికీ సరిపోతుంది"** అంటారు.

1935 డిసెంబర్ 24, యువనామ సంవత్సరం మార్గశిర బహుళ చతుర్దశి మాస శివరాత్రి, మంగళవారం నాడు తూర్పు గోదావరి జిల్లా ఆలమూరులో పుట్టిన పోరంకి దక్షిణామూర్తి తెలుగులో ఎం.ఏ. పట్టభద్రులు. **"తెలుగు కథానిక – స్వరూప స్వభావాలు"** అనే అంశం గురించి సిద్ధాంత వ్యాసం రాసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి. పొందారు. భాషా శాస్త్రాన్ని శాస్త్రీయంగా అభ్యసించారు.

1957లో హైదరాబాదులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కేషియర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించినా రొక్కం లెక్కలు రాస్తూ ఉండడం జీవితానికి పరమార్థం కాదనిపించి – 1962 మొదట ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. పండితారాధ్యుల నాగేశ్వరరావు నెలకొల్పిన 'ప్రజాప్రభ'లో ఉప సంపాదకులుగా ఆరు నెలలు పనిచేశారు. (ఆరు నెలలకే ఆ పత్రిక ఆగిపోయింది.) ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కోసం ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి నేతృత్వంలో మాండలిక వృత్తి పదకోశ నిర్మాణ పథకంలో పర్యటన పరిశోధకులుగా సంపాదక సహాయకులుగా పనిచేశారు. హైదరాబాదులో లెక్చరర్‌గా పనిచేసి తెలుగు పాఠాలు చెప్పారు. 1968 నుంచి తెలుగు అకాడమీలో పరిశోధన సహాయకులుగా చేరారు. 1993 చివర అకాడమీ ఉపసంచాలకులుగా పదవీ విరమణ చేశారు.

**గోపాలకృష్ణ : తల్లిదండ్రుల గురించీ, బాల్యం గురించీ.....**

**దక్షిణామూర్తి :** మా అమ్మ వరలక్ష్మి, నాన్నగారు సత్యనారాయణ మూర్తి గారు. నాకు ముగ్గురు అక్కలు, ఒక అన్నయ్య. చిన్నప్పుడు బాలారిష్టాలు బాగా పీడించాయట నన్ను. రెండు మూడుసార్లు వీధిలో పెట్టారట కూడా. ఒకసారి మా అమ్మ నన్ను ఒళ్ళోపెట్టుకొని ఏడుస్తూ ఉంటూ నరసింహదేవర కామేశ్వరరావుగారనే హోమియోపతి వైద్యులు నా నోట్లో ఏవో మాత్రలు వేసి నన్ను బతికించారట. మా అమ్మగారికీ, నాన్నగారికీ ఆధ్యాత్మిక దృష్టి ఎక్కువగా ఉండేది. మా అమ్మ ఇంట్లో పనిచేసుకొంటూ చదువుతూ పాడుతూ ఉంటే ఎన్నో స్తోత్రాలు, శ్లోకాలు, పాటలు నాకు కంఠస్థమయ్యాయి. అట్లాగే మా నాన్నగారు నేర్చుకొంటున్న తైత్తిరీయోపనిషత్తునూ వింటూ వింటూ మొత్తం నేర్చుకొన్నాను. నా చిన్నతనంలోనే మా నాన్నగారు కంటికి శుక్లాలు రావడం వల్ల ఉద్యోగం మానేశారు. రెండుసార్లు ఆపరేషన్లు చేయించుకొన్నా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. ఉన్న భూములన్నీ తరిగిపోగా రెండెకరాల పొలం మిగిలింది. ఆ భూమి నుంచి వచ్చే ఆదాయంతోనూ తాము కట్టించిన రెండు ఇళ్లమీద వచ్చే అద్దెలతోనూ కుటుంబాన్ని నిర్వహించేవారు. అద్దెలు సరిగా వస్తే ఇరవైరూపాయల ఆదాయం ఉండేది.

మా నాన్నగారు నియమ నిష్ఠలతో నిప్పులా బతికారు. ఆయన నోటివెంట ఒక అబద్ధం కానీ, తిట్టుకానీ వచ్చేవి కావు. మాటల్లో కానీ చేతల్లో కానీ ఆడంబరాలూ ఆర్భాటాలూ ఆయనకు నచ్చేవి కావు. ఖర్చులు పరిమితం చేసుకొని సాదాసీదాగా ఉండటం అలవాటు చేసుకొన్నారు. మాకూ అలవాటు చేశారు. కఠినమైన దీక్షలు పాటించి పూజలు చేసేవారు. ఓపిక తగ్గిపోయాక మానసికం గానే పూజ, యోగసాధన చేసేవారు.

**గోపాలకృష్ణ : మీ చదువు గురించి చెప్పండి....**

**దక్షిణామూర్తి :** ఐదో ఏట అక్షరాభ్యాసం చేసినా మా వాళ్ళు నాకు తొమ్మిదో ఏడు వచ్చేదాకా బడికి పంపలేదు. ఆలమూరులో ఐదో తరగతి దాకా ఉన్న బడి చదువు మీద మావాళ్ళకు నమ్మకం కుదరకపోవడం అందుకు కారణం. అలా మా ఊరికి మైలు దూరంలో ఉన్న కొత్తూరు బడి – హౌజింగ్ బోర్డు మిడిల్ స్కూలులో ఆరవ తరగతిలో చేరాను. ఆ బడికి నడిచి వెడుతూ ఉండేవాణ్ణి.

నేను ఎనిమిదవ తరగతిలో ఉండగా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కొత్తూరు బడిలో ఎనిమిదవ తరగతి దాకానే ఉండడంతో తొమ్మిదవ తరగతి చదువు కోసం మండపేట జిల్లా బోర్డు హైస్కూలులో చేర్చారు. బడి ఆరుమైళ్ల దూరంలో ఉండటంతో నడక అసాధ్యమని తేల్చారు. ఇంట్లో ఉన్న సైకిలును మా ఊళ్లో ఉన్న మేడావారి అబ్బాయికి ఇచ్చి అతను నన్ను రోజూ బడికి తీసుకువెళ్లి తిరిగి ఇల్లు చేర్చే ఏర్పాటు చేశారు. అయితే ఒకసారి నా కాలు సైకిలు చక్రంలో ఇరుక్కొని పెద్ద గాయం అయింది. గాయం మానడానికి ఒకటిరెండు నెలలు పట్టింది. ఆ సైకిలు ప్రమాదంతో మండపేట చదువు ఆగిపోయింది. సంకురాత్రి సెలవుల తర్వాత నన్ను రాజమండ్రి ఇన్నీసుపేట (ఇప్పుడు త్యాగరాజ నగరం)లోని వీరేశలింగం ఆస్తికోన్నత పాఠశాలలో చేర్పించారు. అప్పటికే మా పెద్దక్కయ్యా, బావగారూ రాజమండ్రిలో ఉండేవాళ్లు. వాళ్ల యింటికి దగ్గరలోనే చల్లపల్లివారి వీధిలో మాకు అద్దె ఇల్లు దొరికింది.

పల్లెటూరి నుండి వచ్చినవాణ్ణి కావడంతో నాకు బడిలో చాలా భయంగా ఉండేది. అయితే ఇంగ్లీషూ, లెక్కలూ చెప్పే భమిడిపాటి కామేశ్వరరావుగారు నా భయం పోగొట్టారు. ఆయనవల్ల నా సాహిత్యాభిరుచి కూడా ఎక్కువయింది. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు తెలుగు చెప్పేవారు.

**గోపాలకృష్ణ : సాహిత్యం పట్ల మీకు అభిరుచి కలగడానికి రాజమండ్రి నివాసం బాగా తోడ్పడిందేమో కదా?**

**దక్షిణామూర్తి :** అవును. అప్పట్లో రాజమండ్రిలో ప్రసిద్ధులయిన కవులు, పండితులు, నటులు, నాటక కర్తలు, లలితకళల పోషకులు, సంఘసేవా తత్పరులూ ఎందరో ఉండేవాళ్లు. ఎప్పుడూ ఏవో సభలూ, కార్యక్రమాలు జరుగుతూ ఉండేవి. పద్నాలుగు పదిహేనేళ్ల వయస్సులో నాకు అర్థం అయినా కాకున్నా నేను ఆ సభలకు హాజరయ్యేవాణ్ణి.

మేమున్న ఇంట్లోనే మరొక వాటాలో రామం – పెండ్యాల శ్రీరామచంద్రమూర్తి కాపురం ఉండేవాడు. రామం నాకంటే కొంచెం పెద్ద కావచ్చు. అతనికీ వాళ్ళ అన్నయ్యకూ సాహిత్యంలో అభిరుచి ఉండేది. సాయంకాలాలు మేము గోదావరి ఒడ్డుకు షికారుకు వెళ్ళినప్పుడో గోదావరిలో లంగరు వేసి ఉన్న 'దరోతి' లాంటి లాంచీల మీద పడవల మీదో కూర్చున్న రామం సాహిత్యం గురించి కబుర్లు చెబుతూ ఉండేవాడు. ఆ స్నేహం నాలో పుస్తకాలు చదవాలనే కోరికను పెంచింది. వెళ్లి నచ్చిన పుస్తకాలూ, పత్రికలూ చదువుతూ ఉండేవాణ్ణి.

**గోపాలకృష్ణ : రాజమండ్రిలో చదువుకొంటూ ఉన్నప్పుడే మీ రచనా వ్యాసంగం మొదలయిందా?**

**దక్షిణామూర్తి :** రాయడం అయితే రాజమండ్రిలోనే మొదలు పెట్టాను. అవీ ఇవీ చదివిన ఉత్సాహంతో తెలిసీ తెలియని రాతలేవో గిలుకుతూ ఉండేవాణ్ణి. అయితే ఎవరయినా చూస్తే నవ్వుతారేమోనని వాటిని చింపేస్తూ ఉండేవాణ్ణి. 1951లో ఎస్.ఎస్.ఎల్.సి చదువు పూర్తి అయ్యాక మళ్లీ ఆలమూరు వెళ్లిపోయాను. ఇంటర్‌మీడియట్ చదవడానికి కాకినాడ పి.ఆర్. కాలేజీలో చేరాను. ఆ ఏడాది కాలేజీలో జరిగిన ఆంధ్రాభ్యుదయోత్సవాల్లో నేను చురుగ్గా పాల్గొని ఒక నాటకంలో వేషం కూడా వేశాను. ఆ సభల్లో పాల్గొనడానికి దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి గారు, గిడుగు వెంకట సీతాపతి గారు, నిడదవోలు వెంకటరావు గారు, శ్రీశ్రీ మొదలయిన వారంతా వచ్చారు. వచ్చిన అతిథుల్లో కొందరికి మా హాస్టలులోనే వసతి ఏర్పాటు చేశారు. ఆ విధంగా శ్రీశ్రీ నాకు అతిథిగా ఉన్నారు. అప్పటికే 'మహాప్రస్థానం' చదివి ఉండడం వల్ల ఆయన మీద నాకు అభిమానం ఏర్పడింది. ఒకనాడు పొద్దుట దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ గారి కోసం నా పేరు చెబుతూ నా గదికి వెతుక్కుంటూ వచ్చినందుకు మురిసిపోయాను.

ఆ మరుసటి సంవత్సరం నాకు పెళ్లి అయింది. అంత చిన్న వయసులో పెళ్లి వద్దన్నా మా నాన్నగారు వినలేదు. ఆయనను ఎదిరించి ఇంటినుండి బయటకు పోయి స్వతంత్రంగా జీవించే అవకాశం నాకు లేదు. మైనారిటీ తీరలేదు. పెళ్లి ఎలాగూ తప్పేటట్టు లేదు కనుక కట్నం తీసుకోకుండా ఉండేటట్లయితే పెళ్లికి ఒప్పుకుంటానన్నాను.

ఇక ఆ ఏడాదే ఆంధ్రోద్యమం ఊపందుకుంది. 'ఆంధ్ర కేసరి' ప్రకాశం పంతులు గారి వంటి నాయకులు అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించారు. నేను కాకినాడలో జరిగిన ఊరేగింపు సభలలో పాల్గొన్నాను. కొన్ని గేయాలు కూడా రాశాను. నాయకులు వచ్చి ఉపన్యాసాలు మొదలు పెట్టడం ఆలస్యమయిన సందర్భాలలో – కొన్నిసార్లు నేను కూడా ప్రసంగాలూ చేశాను. పాటలూ పాడాను. అప్పట్లో ప్రకాశం గారు చేసిన ప్రసంగం నాలో చెరగని ముద్ర వేసింది. దాన్ని 1966లో నేను రాసిన 'నీడలూ జాడలూ' నవలలో ఉదాహరించాను. ఆ రోజుల్లో కాకినాడ నుండి వెలువడే 'అరుణ' అనే స్థానిక దిన పత్రికలో నేను రాసిన సంపాదక లేఖలు వెలువడ్డాయి.

ఈ ఉత్సాహపు ఉరవడిలో ఇంటర్మీడియట్ పరీక్ష తన్నేసింది. హిందీలో నాలుగు మార్కులు తక్కువ వచ్చాయి. తరువాత కాలంలో నేను హిందీ నుంచి తెలుగులోకి అనువాదాలు చేయగలనని అప్పట్లో ఊహించే అవకాశమే లేదు!

**గోపాలకృష్ణ : మీ తొలి రచనల గురించి చెబుతారా?**

**దక్షిణామూర్తి :** 1953లో మా ఆలమూరులో శంకర జయంతి సభ జరిగింది. ఆ సభలో పురాణపండ రామమూర్తి గారు (నా స్నేహితుడు 'ఉషశ్రీ' తండ్రిగారు) ఆది శంకరాచార్యుల వారి గురించి అద్భుతంగా ప్రసంగించారు. అది విన్నాక శంకరుల గురించి వ్యాసం

రాయాలనిపించింది. వ్యాసం రాసి ప్రకాశం పంతులు గారు నడిపిస్తున్న 'ప్రజా పత్రిక'కు పంపించాను. (క్రొవ్విడి లింగరాజు గారు ఆ పత్రిక సంపాదకులు). 'ప్రజా పత్రిక'లో నా వ్యాసం అచ్చయిందన్న సంగతి రాజమండ్రికి చెందిన ప్రముఖ పత్రికా రచయిత ఆర్.బి. పెండ్యాల గారు చెప్పేదాకా నాకు తెలియదు. అలా నా మొదటి వ్యాసం వెలువడింది. నేను ఇంగ్లీషు నుండి అనువదించిన **'లవ్ పోషన్'** అనే కథ **'ప్రేమసుధ'** పేర 'స్వతంత్ర'లో అచ్చయింది.

బి.ఎ. చదువు కోసం నేను రాజమండ్రి వెళ్లాను. చరిత్ర, ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం ప్రధాన పాఠ్య విషయాలుగా ఎన్నుకున్నాను. బి.ఎ. మొదటి సంవత్సరంలో ఉండగా, **'నీడలూ జాడలూ'** అనే కథ రాశాను. నాటకాలలో వేషాలు వేయడం, చర్చలలోనూ పోటీలలోనూ పాల్గొనడం వంటి కార్యకలాపాలలో మునిగి తేలి జనతా క్లాసులో పరీక్ష పాసయ్యాను. 1956 జూన్‌లో పరీక్షా ఫలితాలు వచ్చాయి. 1956 ఆగస్టులో నేను హైదరాబాదులో అడుగుపెట్టాను. ఇక అప్పటి నుంచి నా జీవితం హైదరాబాదుతో ముడిపడింది.

మా పెదనాన్న గారి కూతురు (మా చిట్టెక్కయ్య) బావగారు (ఉప్పులూరి వెంకట సుబ్బారావు గారు) చిక్కడపల్లిలో ఉండేవారు. మా అక్కయ్యా, బావగారు – తమ పిల్లలతో సమానంగా నన్ను చూసుకున్నారు. నేను నిలదొక్కుకోవడానికి ఎంతో సాయం చేశారు. ఈ నేపథ్యంలో నాకు స్టేట్ బ్యాంక్‌లో కేషియర్‌గా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరిన నెలరోజులకే మహా శివరాత్రి నాడు మా నాన్నగారు మరణించారు.నేను ఆలమూరు వెళ్లేసరికి అస్థి నిమజ్జనం కూడా అయిపోయింది. నేను మానసికంగా కుదుటపడడానికి కొంత కాలం పట్టింది. నవ్య సాహితీసమితి సమావేశాలకు వెళ్లి పోతుకూచి సాంబశివరావు గారితో పరిచయం చేసుకున్నాను. అక్కడే అక్కిరాజు రమాపతి రావు (మంజుశ్రీ) గారిని కలుసుకున్నాను.

1958 నుండి నా రచనాభిలాష ఎక్కువయింది. 1960 మేలో హైదరాబాదులో జరిగిన అఖిల భారత తెలుగు రచయితల ప్రథమ మహాసభలలో ఉత్సాహంగా పాల్గొన్నాను. ఎందరెందరో రచయితలతో పరిచయమూ స్నేహాలూ ఏర్పడడానికి ఆ సభలు తోడ్పడ్డాయి. సభల సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రంథ చిత్రకళా ప్రదర్శన నిర్వాహక సమితికి నేనూ రమాపతిరావు గారూ కన్వీనర్లం.

**గోపాలకృష్ణ : మీరు కవిత్వం ఎందుకు రాయలేదు? వచన రచనల మీదే దృష్టి పెట్టడానికి ప్రత్యేక కారణాలు ఏవయినా ఉన్నాయా?**

**దక్షిణామూర్తి :** పూర్వ కవుల రచనలు ఎన్నో చదివి ఉన్నా ప్రాథమికంగా నాకు కవిత్వం కంటే వచనం అంటేనే ఇష్టం. మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి వంటి కవి దగ్గర తెలుగు చదువుకున్నా ఆయన వల్ల ప్రభావితుణ్ణి అయినానని చెప్పలేను. భమిడిపాటి కామేశ్వరరావు గారూ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారూ రాసిన వచన రచనలు నన్ను ఎంతో ఆకర్షించాయి.

భాషాశాస్త్ర విషయాలను కూడా సరళంగా సులువుగా రాసే భద్రిరాజు కృష్ణమూర్తి గారి శైలీ నాకెంతో ఇష్టం. మొదటి నుంచీ వ్యావహారిక భాష మీద ఉన్న ఆసక్తి వల్ల నేను ఆ దృష్టితోనే నవలలూ వ్యాసాలూ రాశాను. **'వెలుగూ వెన్నెలా గోదారీ'** నా మొదటి నవల. పూర్తిగా కోస్తా ప్రాంతపు శిష్టేతర జానపద మాండలికంలోనే కాక తెలుగులో తొలి మాండలిక నవలగా అది గుర్తింపు పొందింది. ఆంధ్రప్రభ వారపత్రిక 1961లో మొదలు పెట్టిన ఉగాది నవలల పోటీలో దానికి బహుమతి వచ్చింది. అది పుస్తకంగా వెలువడినప్పుడు కృష్ణశాస్త్రి గారికి అంకితం చేశాను. 'వెలుగూ వెన్నెలా గోదారీ' చదివి భద్రిరాజు కృష్ణమూర్తి గారు నాకోసం కబురు చేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి చేనేత వృత్తి పదకోశం కోసం తెలుగు నాట అన్ని ప్రాంతాలలోనూ పర్యటించి పద సేకరణ చేసే బాధ్యత చాలా వరకు నా మీద పెట్టారు. కార్యభారం ఎక్కువగా ఉన్నా ఈ అవకాశం నాకొక వరమయింది. మొదటి నవలకు ఆలమూరు తోడ్పడితే రెండవ నవలకు పాలమూరు తోడ్పడింది. అచ్చంపేటలో వనం ముత్యాలుగారు **'ముత్యాల పందిరి'** అనే చీర గురించి చెప్పారు. **'ఈ పేరుతో నవల రాస్తే ఎంత బాగుంటుంది'** అనిపించింది. 1964లో ఆ నవలకు ఆంధ్రప్రభ వారపత్రిక బహుమతి లభించింది. ఈ నవల విషయంలో పి.సి. నరసింహారెడ్డి గారు, పాశం చెన్నకేశవ రెడ్డి గారు, నిమ్మగడ్డ సుబ్బారావు గారు వంటి మిత్రులు నాకు ఎంతో తోడ్పడ్డారు. రాయలసీమ మాండలికంలో నవల రాయాలన్న ముచ్చట **'రంగవల్లి'**తో తీరింది. మూడు మాండలికాలలోనూ రచయిత కథనంతో బాటు పూర్తిగా జానపదుల పలుకుబడిలో రాసిన మొదటి నవలలుగా ఈ మూడు నవలలూ నాకు గుర్తింపు తెచ్చాయి. ఈ మూడు నవలలూ ఒక పాదుకు పూసిన పువ్వులు అనుకుంటున్నాను.

నా మొదటి నవల **'నివేదన'** వీరేశలింగం పంతులు కాలం నాటి సమాజ చరిత్రను అందులో నేపథ్యంగా తీసుకున్నాను. అప్పట్లో **'గోల్కొండ పత్రిక'** సంపాదకులుగా ఉన్న మిత్రులు పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి గారు **'నవల ఎందుకు రాసివ్వకూడదు?'** అని అడిగారు. ఆయన కోరిక ప్రకారం రాసిన 'నివేదన' 1960లో ధారావాహికగా అచ్చయింది. ఆ తర్వాత పుస్తక రూపంలోనూ వచ్చింది. తెలుగు నాట జరిగిన రాజకీయ ఉద్యమాల నేపథ్యంలో రాసిన నవల **'నీడలూ జాడలూ'.**

**గోపాలకృష్ణ : మీ కథా ప్రపంచం గురించి చెప్పండి.**

**దక్షిణామూర్తి :** జాన్ కోలియర్ ఇంగ్లీష్‌లో రాసిన **'లవ్ పోషన్'** అనే కథను **'ప్రేమసుధ'** అనే పేర అనువదించాను. ఆ కథ 1956లో 'స్వతంత్ర'లో వెలువడింది. నా మొదటి కథ **'నీడలూ జాడలూ'.** ఆ

కథ రాజమండ్రి ప్రభుత్వ కళాశాల పత్రికలో అచ్చయింది. ఆ తర్వాత ఆ పేరుతోనే ఒక నవల కూడా రాశాను. 1960లో 'జాగృతి' మాసపత్రిక నడిపిన దీపావళి కథల పోటీలో నా కథ **'చిత్రలత'**కు మొదటి బహుమతి వచ్చింది. దాదాపు 40, 50 కథలు రాసి ఉంటాను. యాభై ఏళ్ళకు పైగా కథలు రాస్తున్నా. 2008లో నా కథల సంపుటం **'చంద్రవంక'** పేరిట అచ్చయింది. అందులో 29 కథలున్నాయి.

**గోపాలకృష్ణ : మీరు చాలా అనువాదాలు చేసినట్టున్నారు.**

**దక్షిణామూర్తి :** నా అనువాదాలు ప్రధానంగా ఇంగ్లీష్ నుంచీ హిందీ నుంచీ చేసినవి. నలభై గ్రంథాల దాకా అనువదించి ఉంటాను. గ్రాంథిక వ్యవహార భాషా వివాదంలో అధిక సంఖ్యాక సభ్యులు చేసిన నిర్ణయానికి నిరసనగా మహాకవి గురజాడ **'మినిట్ ఆఫ్ డిసెంట్'** పేరిట ఒక అద్భుత రచన చేశారు. గురజాడ శత జయంతి సంవత్సరం (1961-62) లో దాన్ని అనువాదం చేయాలని పించింది. మిత్రుడు అబ్బూరి గోపాలకృష్ణ నా అభిప్రాయాన్ని సమర్థించాడు. **'డిసెంట్ పత్రం'** పురుతో నా అనువాదం ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం సంచికలలో వెలువడింది. అటు తర్వాత పుస్తక రూపంలో వచ్చింది. పరమహంస యోగానంద గారి **'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి' 'ఒక యోగి ఆత్మకథ'** గా అనువదించాను. 1986 లో వెలువడిన ఈ అనువాదం నాకు గొప్ప పేరు వచ్చింది. 1989లో తెలుగు విశ్వవిద్యాలయం వారి అనువాద పురస్కారాన్ని ఇప్పించింది. సుమారు ఇరవై అయిదేళ్ల కాలంలో సుమారు 24 సార్లు పునర్ముద్రణ కావడం ఆ గ్రంథం గొప్పతనమే కాని నాది కాదు. ఏ భాషలో వెలువడినా అనువాదకుల పేరు లేకుండా ఆ పుస్తకం వెలువడుతూ వచ్చింది. నా అనువాద రచనల్లో ఆధ్యాత్మికమయినవే ఎక్కువ. కాకుంటే ఆధ్యాత్మిక విషయాల గురించినవే కాక వివిధ శాస్త్ర సాంకేతిక విషయాల గురించిన పుస్తకాలనూ అనువదించడం తృప్తి కలిగించింది.

**గోపాలకృష్ణ : మీరు నాటకాలు కూడా రాశారు కదా?**

**దక్షిణామూర్తి :** రంగస్థల ప్రదర్శన కోసం నాటకాలు ఏమీ రాకపోయినా, 'ఆకాశవాణి' ప్రసారాల కోసం నాటకాలు, నాటికలూ రాశాను. నేను రాసిన **'యామినీ పూర్ణతిలక'** అనే నాటకాన్ని స్థానం నరసింహారావు గారు రేడియోలో ప్రసారం చేశారు. అందులో ఆయన ఒక వేషం కూడా వేశారు. **'ముత్యాల పందిరి'** కూడా రేడియో నాటకంగా వచ్చింది. మిత్రులు సి.ఎస్. రావు రాసిన **'ఊరుమ్మడి బతుకులు'** నాటకాన్ని తెలంగాణ, సీమ రూపాలలో రాశాను.

**గోపాలకృష్ణ : వాచకాల రూపకల్పన నుంచి నిఘంటువుల నిర్మాణం దాకా మీరు తెలుగులో ఎంతో పనిచేశారు. ఆ వివరాలు చెబుతారా?**

**దక్షిణామూర్తి :** వృత్తిపరంగా ప్రవృత్తిపరంగా నాకు తెలుగు భాషతో ఉన్న అనుబంధం వల్ల చాలా పనులు చేసే అవకాశాలు దొరికాయి. ప్రాథమికస్థాయి వాచకాల నుంచి తెలుగు నేర్చుకొనే పరభాషల వారికి పనికి వచ్చే వాచకాల దాకా ఎన్నో రాయగలిగాను. చేనేత **వృత్తి పదకోశ నిర్మాణంలో** సంపాదక సహాయకుడిగానూ **'పరిపాలన- న్యాయపదకోశం'** సంకలన కర్తలలో ఒకడుగాను **'మేదర పరిశ్రమ'** కోశానికి సంకలనకర్తగానూ పనిచేశాను. తెలుగు పదబంధ కోశం, ఇంగ్లీషు- తెలుగు నిఘంటువు. తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు, తెలుగు- తెలుగు నిఘంటువు మొదలైన వాటి నిర్మాణంలోనూ పరిష్కరణలలోనూ పాల్గొనగలిగాను. భాష గురించి ఎన్నో వ్యాసాలు రాశారు. తెలుగు అకాడమీ నుంచి పదవీ విరమణ చేసే నాటికి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులలో ర,ల,వ,స అక్షరాల కింద వచ్చే మాటల పరిష్కరణ మిగిలిపోయి ఉంది. నాకు తగిన సదుపాయాలూ సహాయమూ కల్పిస్తే ప్రతిఫలాన్ని కోరకుండా నిఘంటువు పూర్తి చేస్తానని నా వీడ్కోలు సభలో 1993 డిసెంబర్ 31న చెప్పాను. ఆరు నెలల తర్వాత అకాడమీ వారు అలాగే కానిమ్మన్నారు. అద్వితీయంగా అంటే రెండో మనిషి సాయం లేకుండా చేయవలసి రావడంతో ఆ పనికి ఏడాదిన్నర పట్టింది. నిఘంటువు అచ్చు కావడానికి మరొక పుష్కర కాలం పట్టింది.

**గోపాలకృష్ణ : మీ పరిశోధనాంశం 'కథానిక- స్వరూప స్వభావాలు' కదా?**

**దక్షిణామూర్తి :** పరిశోధనకు పర్యవేక్షకులు జ్ఞానపీఠ బహుమతి గ్రహీత ఆచార్య సి. నారాయణరెడ్డి గారు. ఈ ముడి ఆసక్తికరంగా ఉంది. బి.ఏ. పాసైన 7 ఏళ్లకు గానీ ఎం.ఏ.చదివే అవకాశం కలుగలేదు. 1963 లో ఉస్మానియాలో తెలుగు ఎం.ఏలో చేరాను. 1965 లో డిగ్రీ వచ్చింది. ఎం.ఏ పాసయ్యాక కొంతకాలం లెక్చరర్‌గా పనిచేశాను. తెలుగు అకాడమీలో చేరిన తర్వాత పీహెచ్.,డీ చేద్దామని ప్రయత్నించాను. అప్పటి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు నన్ను వ్యాకరణం గురించి పరిశోధన చేయమన్నారు. ఆ పరిశోధన చేసే వీలు చిక్కలేదు. పరిశోధన విషయాన్నీ, పర్యవేక్షకులనూ మార్చుకొనే అవకాశం చిక్కింది. అడిగిన వెంటనే నారాయణరెడ్డి గారు పరిశోధన పర్యవేక్షకులుగా ఉండడానికి అంగీకరించి చాలా సాయపడ్డారు. కథానిక గురించి పరిశోధన చేయమని ఆయనే సూచించారు. వేలకొలదిగా వెలువడిన కథల గురించి కాక, కథానిక స్వరూప స్వభావాల గురించి పరిశోధన చేయడం ప్రయోజనకరంగా ఉంటుందనిపించింది. ఆ రెండేళ్లూ సినారె ఎంతో ప్రోత్సహించారు. జరదా కిళ్లీలు జోరుగా వేసుకొని రాత్రింబవళ్లు మేలుకొని సిద్ధాంత వ్యాసం రాసేవాణ్ణి. నారాయణ రెడ్డి గారు ఎటువంటి కష్టమూ కలగకుండా పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చి తోడ్పడ్డారు. మొత్తం రెండేళ్లలో ఆఫీసుకు రెండు నెలలు సెలవు పెట్టే వీలు చిక్కింది. వ్యవధి లోపలే

ఉస్మానియాకి నా సిద్ధాంత గ్రంథం సమర్పించాను. 1977 లో డిగ్రీ వచ్చింది. నా సిద్ధాంత గ్రంథం రెండు సార్లు అచ్చయింది.

**గోపాలకృష్ణ : 'రంగవల్లి' తరువాత మీరు మళ్లీ నవలలు రాసినట్టు లేదు?**

**దక్షిణామూర్తి :** తెలుగు అకాడమీలో చేరినప్పటి నుండి పని ఒత్తిడి ఎక్కువగా ఉండేది. స్థిమితంగా ఒక విషయాన్ని ఆలోచించి పరిశోధన చేసి ఇతివృత్తాన్ని పాత్రలనూ రూపొందించుకునే వ్యవధి చిక్కలేదు. అరిషడ్వర్గాల నుంచి ఆరు నవలలు రాద్దామనుకున్నాను. వీలు చిక్కలేదు. ఆ ఇతివృత్తాలతో ఆరు కథలయినా రాద్దామను కున్నాను కాని గట్టిగా ఆలోచించలేదు.

ఈలోగా నా దృక్పథంలో మార్పు వచ్చింది. **కథ, నవల, నాటకం వంటి ఏ సృజనాత్మక రచన చేసినా వాటిలో వెలుగుతో బాటు నీడనూ మంచితో బాటు చెడునూ చూపించాలి. మంచిని ఎత్తుగా చూపించడా నికి నీడను కూడా చూపించాలి. అందుకు మంచి పాత్రలతో బాటు దుష్ట పాత్రలనూ సృష్టించాలి. అటువంటి పాత్రల గురించీ ఆ పాత్రలకు సంబంధించిన సంఘటనల గురించీ ఆలోచిస్తూ ఉంటే వ్యక్తిగతంగా నష్టం కలుగుతుంది అనిపించింది. ఆ రకమైన 'నెగటివ్' దృష్టి వ్యక్తిత్వంలో భాగమయ్యే ప్రమాదం ఉందనిపించింది. అందువల్ల అటువంటి రచనలు చేయకూడదనుకున్నాను.**

వస్తువు మీద ఏకాగ్ర దృష్టి ఏర్పడి మనసు స్థిమితంగా ఉండి లోపల నుండి రాయాలన్న ప్రేరణ బయటకు తన్నుకువస్తే రాయవచ్చు – ఏదైనా. అటువంటి ప్రయత్నం ఏదీ గడచిన 20 ఏళ్ళలో చేయలేదు. అయితే – ఎవరైనా ఏదైనా అడిగితే అడిగితే రాస్తున్నాను. అలా ఎన్నో వ్యాసాలు, పీఠికలు రాశాను. అనువాదాలు చేశాను. ఆధ్యాత్మిక విషయాల గురించి రాస్తున్నవే ఎక్కువ. నాకు రాయడం చదవడం రెండూ ఇష్టమే అయినా – చదవడం మీదే ఆసక్తి ఎక్కువ. అందువల్ల రాయడం కంటే చదవడమే ఎక్కువగా చేశాను. చేస్తుంటాను.

**గోపాలకృష్ణ : ఇప్పటిదాకా నడచి వచ్చిన దారి గురించి ఒకసారి ఆలోచిస్తే ఏమనిపిస్తుంది మీరు?**

**దక్షిణామూర్తి :** నడచి వచ్చిన దారిలో నాకెందరో స్నేహితులు దొరికారు. కొందరు పెద్దల అవ్యాజమైన ప్రేమాభిమానాలు రుచి చూడగలిగాను. చాలా మందిని దగ్గరగా చూసే అవకాశం చిక్కింది. పెద్దవాళ్లుగా పేరున్నవాళ్ల కురుచ బుద్ధులు, చిన్నవాళ్లు అని చాలామంది పట్టించుకోని మామూలు మనుషుల పెద్దరికం – తెలియవచ్చాయి. ఎవరినీ కాదనలేము. ఎవరినీ తోసేయలేము. మనుషులను మనుషులుగా చూసి ప్రేమించడం ఒక్కటే మనం చెయ్యగలిగింది అనిపిస్తుంది. నాకు దురాశలూ నిరాశలూ లేవు. జీవితంలో చాలా చేదు మింగాను. అందువల్ల కలిగిన లాభం ఏమిటంటే ఆ చేదు మింగిన నోటికి ఒక చుక్క తేనె తగిలినా అమృత మనిపిస్తుంది. ఆ చేదును మరిపిస్తుంది. అది చాలనుకుంటాను.

**'ప్రాప్తవ్య మర్థం లభతే మనుష్యః'** అంటారు పెద్దవాళ్లు. **'ఎవరికేది ప్రాప్తమో అదే దొరుకుతుంది',** అని దాని తాత్పర్యం. ప్రతి కార్య రంగంలోనూ శక్తి వంచన లేకుండా పని చేసేవాళ్లు ఎంతో కొంత మంది తప్పకుండా ఉంటారు. వాళ్లు సాధించిన ఫలితాలు గొప్పవా కావా అనే ప్రశ్నకు తావు లేదని నా అభిప్రాయం. ఫలితాలను ఎవరూ సాధించరు. చేసిన పనులకు కొందరికి ఫలితాలు వస్తాయి. అంతే!

బిరుదులు, బహుమతులు, గుర్తింపు వంటివి సఫలమైన జీవితానికి కొలబద్దలు కావని నా నమ్మకం. **'నేను, నాది'** అనే వాటి నోరు మూయించి **'మనం, మనది'** అనే భావాన్ని చెరపకుండా నిలుపుకుంటే చూపు విశాలమవుతుంది. హృదయం అమృత కలశమవుతుంది.

నా భార్య వరలక్ష్మి – మా పెళ్ళైనప్పటి నుంచీ అంటే – ఆరు దశాబ్దాల నుంచీ అందిస్తున్న సహకారం ఎంతో విలువైనది. మాకు ఒక అమ్మాయి. ఇద్దరు అబ్బాయిలు. వాళ్ల వాళ్ల పిల్లా పాపలతో వర్ధిల్లుతూ ఉన్నారు! ఇంతకంటే ఇంకేం కావాలి?

**ఒక డాక్టర్ బోర్డు కథ...**

డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి
సరస్వతీ వైద్య నిలయం
ఆలమూరు

అని కాకినాడలో ఉన్న రత్నం గారనే చిత్రకారుని చేత బోర్డు రాయించుకుని ఇంటి వాకిట బోర్డు తగిలించినప్పుడు దక్షిణామూర్తి గారి వయసు 18 ఏళ్లు ఉంటాయి. వాళ్లూ వీళ్లూ డాక్టర్ గారి గురించి అడగడంలోని హాస్యాన్ని గుర్తించి 'డాక్టర్' గారు కొన్నాళ్ల తరువాత బోర్డు తీసేశారు! సరస్వతి పేరు ఎందుకు? సరస్వతి చదువుల తల్లి కదా మరి!

మాధ్యమిక పాఠశాలలో చదువుకుంటున్న పదేళ్ల దక్షిణామూర్తిని ఆయన పినతల్లి భర్త వేదుల వెంకట సత్యనారాయణమూర్తి గారు 'పెద్దయితే ఏం చేస్తావు?' అని అడిగారట. 'ఎం.ఏ, పి.హెచ్.డి చేస్తాను' అన్నారట దక్షిణామూర్తి. ఎంతో అనురాగంతో వెంకట నారాయణమూర్తి గారు 'గాడ్ బ్లెస్ యూ' అని ఆశీర్వదించారట!



# అద్దరి వారు కారు.... అందరివారు

**వక్కలంక రమణ,** ఫోన్ : 9985493777

మిలమిల మెరిసే తెల్లని దుస్తులు, చక్కని ముఖ వర్చస్సు, వెనక్కి దువ్విన తీరైన జుట్టు, నుదుట ఎర్రని కుంకుమ బొట్టు, వివేకానందుడి తరహాలో దర్జాగా చేతులు కట్టుకునే తీరు, స్పష్టమైన ఉచ్చారణ, ఎంతో చురుకుదనం... పోరంకి దక్షిణామూర్తి గారు అనగానే నాకు గుర్తుకువచ్చేవి ఇవే. ఈనాడు జర్నలిజం స్కూలులో 1994 సెప్టెంబర్ నుంచి 1995 మార్చి మధ్య మాకు ఆయన క్లాసుతోనే రోజు మొదలయ్యేది. నాకు తెలిసిన తెలుగు కొంతే. తెలియనిది ఎంతో అనేది తెలిసింది కూడా ఆయన వల్లే. తెలుగంటే ఇష్టమే కాదు.... భయభక్తులు కూడా ఉండాలని నేర్చుకున్నది ఆయన దగ్గరే.

పోరంకి గారిది కూడా మా తూర్పు గోదావరి జిల్లాయే అని తెలిసి, **"మీరూ మా జిల్లావారేనట కదా"** అని నేను, మా అన్నయ్య (వక్కలంక కిషోర్) ఆయనతో మాట కలపడానికి ప్రయత్నించాం. కానీ అన్ని ప్రాంతాల వారూ ఉన్న క్లాసులో అలాంటి కూడదను కున్నారో ఏమో ఆయన. **"మీరు అద్దరివారు... మేం ఇద్దరివారం"** అంటూ మధ్యలో మా గోదారమ్మను అడ్డం పెట్టేశారు. (మాది కోనసీమ... ఆయనది గోదావరికి ఆవల ఉండే ఆలమూరు) అయితే రానురాను నేను ఆయనకు అభిమాన విద్యార్థిగా మారిపోయాను. ఆయన మాటల్లో ఉండే చమత్కారం నా మాటల్లో కూడా కనిపించడం అందుకు కారణం కావచ్చు. నేను 22 ఏళ్ల వయసులో జర్నలిజం స్కూలులో అడుగుపెట్టినా, నన్ను ఆయన ఓ చిన్నపిల్లవాడిగానే చూసేవారు. నా మాటల్ని ఇష్టపడేవారు. నేను మాట్లాడుతుంటే నవ్వుతూ ఎంజాయ్ చేసేవారు. అప్పుడప్పుడు మరీ ముద్దొస్తే... "ఆ...ఆ..ఆ..." అంటూ నా సీటు వద్దకు వచ్చి నా తలమీద మొట్టికాయ వేసేవారు. నగ్న సత్యం అనే సంస్కృత పదాన్ని ఒకాయన "చీర విడిచిన నిజం" అని అనువదించారని పోరంకి గారు చెప్పగా "చీర" అంటే ప్రాచీనార్థంలోనా? ప్రస్తుతార్థంలోనా? అని నేను అడిగాను. "నీకు ప్రస్తుతార్థమే కావాలి కదా! అదే తీసుకో!" అంటూ నవ్వుతూ వచ్చి ఆయన నా తలమీద మొట్టిన సందర్భం ఇప్పటికీ గుర్తొస్తుంటుంది. (ప్రాచీన కాలంలో మగవారు ధరించే వస్త్రాన్ని కూడా చీర అనేవారు. ప్రస్తుతం ఆడవారి వస్త్రాన్ని మాత్రమే చీర అంటున్నారు)

తెలుగు వ్యాకరణంపైన ఆయనకు పట్టు మాత్రమే కాదు, చెప్పలేనంత ప్రేమ కూడా ఉండేది. ఆయనలోని చమత్కారం ఆ రెండింటికీ తోడై మరింత శోభ తెచ్చేది. **"ఎవరిని? దేనిని? అని ప్రశ్నించుకుంటే సరైన జవాబు వస్తే అది సకర్మక క్రియ. లేదంటే అది అకర్మక క్రియ"** అనేది అందరికీ తెలిసిందే. ఈ ప్రకారం "ఏడ్చు" అనే క్రియ అకర్మకం అని పోరంకి గారు క్లాసులో చెప్పారు. కానీ ఒక్క నిముషం ఆగి ఆలోచించి, **"వాడు ఏదో ఆ అమ్మాయిని ఏడుస్తున్నాడు అన్నప్పుడు అది సకర్మకం కూడా అవుతుంది"** అని అన్నారు. భాష గురించి ఆయన ఎంత లోతుగా, ఎంత చమత్కారంగా ఆలోచిస్తారో చెప్పడానికి ఇదో మంచి ఉదాహరణ. ఒకసారి మా అన్నయ్య కిషోర్ కూర్చున్న కుర్చీ కోడు సరిగా లేకపోవడంతో **"సార్... నా కుర్చీ కుంటుతోంది"** అనగా... పోరంకి గారు తన కుర్చీ కోళ్ళు చూసుకుని **"నా కుర్చీ అకుంటితం"** అన్నారట.

నాకు పరిచయం అయ్యేసరికే ఆయన వయస్సు 60 ఏళ్లు దాటింది. కానీ ఆయన నడక, మాటలు, కదలికలు, వేటిలోనూ ఆయన వయస్సు అస్సలు కనిపించేది కాదు. ఎంతో ఆత్మవిశ్వాసంతో చేతులు కట్టుకుని ఆయన నిలబడే తీరు నా కళ్లలో ఇప్పటికీ కదులుతూ ఉంటుంది. ఆయన అనువదించిన **"ఒక యోగి ఆత్మకథ"** పుస్తకం చాలా మందికి తెలుసు. కానీ ఆనందంగా ఉండడం, ఆత్మ విశ్వాసంతో ఉండడం, జ్ఞానాన్ని అందరికీ పంచడం అనేవి ఆచరించి చూపిన కర్మయోగి ఆయన. పోరంకి గారి మరణం తెలుగు భాషకు జరిగిన పెద్ద నష్టం. కానీ జీవితకాలంలో తన రచనల ద్వారా, తన పాఠాల ద్వారా ఆయన ఆ నష్టాన్ని తగ్గించగలిగారు. ఎందుకంటే నాలాంటి ప్రతి శిష్యుడిలో ఆయన కొంత మిగిలే ఉన్నారు. ఆయన ప్రశిష్యులైన నా శిష్యుల్లో కూడా ఆయన ఎంతోకొంత ఉంటారని నా ఆశ. పోరంకి మాకెప్పుడూ **అద్దరివారు కాదు.. మా అందరివారు!**



# తెలుగుకు వెలుగు పందిరి

**సుధామ,** ఫోన్ : 98492 97958

ఆయన ఎంత విశిష్ట కథకుడో అంత విలక్షణ నవలా రచయిత. అంతేకాదు భాషాపర శేషభోగి అయిన ఒక భాషా శాస్త్రవేత్త. సంప్రదాయాభిజ్ఞత, ఆధునికత జమిలికగా సంతరించుకున్న వాడు. కథానికపై మొట్టమొదటి సిద్ధాంత గ్రంథాన్ని రచించింది ఆయనే. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటిసారిగా ఉత్తరాంధ్ర, తెలంగాణ, రాయలసీమ మాండలికాలలో నవలలు రాసిన ఏకైక రచయితగా అరుదైన సాహితీవేత్త ఈయన. వృత్తిపదకోశాల నిర్మాణంలో నిఘంటు రూపకల్పనల్లో తెలుగు అకాడమీ ద్వారా చిరస్మరణీయ సేవలందించిన ఖ్యాతి వారిది. ఆయనే డా॥ పోరంకి దక్షిణామూర్తి.

ఫిబ్రవరి 6 శనివారం రాత్రి హైదరాబాద్ చైతన్యపురిలోని స్వగృహంలో తన 80వ ఏట తనువు చాలించిన సాహితీ మూర్తి. బహుశా ఆయన పాల్గొన్న చివరి సాహిత్య సభ రెండేళ్ల క్రితం, 2018 సెప్టెంబర్ 2న యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ కీ॥శే॥ ఇరివెంటి కృష్ణమూర్తి గారి పేరిట సాహిత్య పురస్కారాన్ని వారికి అందించిన సభయే. అప్పటికే పోరంకివారు అనారోగ్యంతో ఉన్నారు. జ్ఞాపకశక్తి క్షీణించి పోయింది. మాట ఉంది కానీ అభివ్యక్తి రావడంలేదు. తనకు జరిగిన సన్మానానికి ప్రతిస్పందన చెప్పాలని ప్రయత్నించి మాటలు సరిగా రాక, ఇరివెంటిని జ్ఞాపకం చేసుకోవడానికి శ్రమపడుతూ అంతటి భాషావేత్త, సాహితీవేత్త కన్నుల నీరు పెట్టుకోవడం ఇప్పటికీ కనులముందుంది. అయితే ఆ తరువాత ఆయన కొంత కోలుకున్నారు. పుస్తకం పట్టుకుంటే అక్షరాలు గుర్తించలేనంతటి స్థితి కొంత అనుభవించారు. గలగలా కబుర్లు చెబుతూ ఎంతో ఆత్మీయంగా సంచరించే ఆ సౌజన్యశీలి కొద్దిఏళ్ళుగా అనారోగ్యం పాలవడం విషాదం. అయినా ఆయన సాహితీ ప్రియత్వం, స్నేహశీలం గొప్పవి. శీలా వీర్రాజుగారిని చూడాలని ఉందని అంటే కుమారుడు ఆయన ఇంటికి తీసుకువెళ్ళాడు కొంతకాలం కిందటే.

తెలుగు సాహిత్యంలో దక్షిణామూర్తి వటవృక్షం. కథ, నవల, వ్యాసం, సమీక్ష, అనువాదం, పదకోశ నిఘంటు నిర్మాణం, వక్తృత్వం వీటన్నిటా ఆయన నిష్ణాతులు. 1935 డిసెంబర్ 29న తూర్పుగోదావరి జిల్లా ఆలమూరులో జన్మించిన దక్షిణామూర్తి డిగ్రీవరకు కాకినాడలో చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసి డా. సి. నారాయణరెడ్డి పర్యవేక్షణలో **'తెలుగు కథానిక స్వరూప స్వభావాల'**మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే తెలుగుశాఖ రీడర్‌గా కొంతకాలం పనిచేసి 1969లో తెలుగు అకాడమీకి బదిలీ అయ్యారు. ప్రఖ్యాత భాషాశాస్త్రవేత్త భద్రిరాజు కృష్ణమూర్తికి కుడిభుజంలాటి సహాయకునిగా ఆరోజుల్లో దక్షిణామూర్తి వారు పలు నిఘంటు నిర్మాణాల్లో, వృత్తిపద కోశాల రూపకల్పనలో క్రియాశీల పాత్ర పోషించారు. నలభైవేల పదాలతో ఇంగ్లీషు – తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు సంకలనం చేసిన ఘనత ఆయనది. పాఠ్యపుస్తకాల రూపకల్పనలోనూ పోరంకివారిది ముఖ్యభూమిక. తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా 1993లో పదవీ విమరణ చేసినా పాత్రికేయ విద్యార్థులకు శిక్షణా తరగతులు తీసుకున్నారు. కథలు, నవలలు, పరిశోధనా వ్యాసాలతో సుమారు యాభై దాకా పుస్తకాలు రచించడం, లెక్కకు మిక్కిలిగా అనువాదాలు చేయడం విశేషం.

ఆయనకు విశేష ఖ్యాతి తెచ్చిన అంశం ఉత్తరాంధ్ర మాండలికంలో **'వెలుగు వెన్నెల గోదారి'**, తెలంగాణ మాండలికంలో **'ముత్యాల పందిరి'**, రాయలసీమ మాండలికంలో **'రంగవల్లి'** నవలలు రచించడం ఒకటి కాగా, మరొకటి పరమహంస యోగానంద జీవిత చరిత్రను **'ఒక యోగి ఆత్మకథ'**గా తెలుగులోకి అనువదించటం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రియాయోగులందరికీ అదొక పాఠ్య గ్రంథంగా వినుతికెక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ అనువాద పురస్కారాన్ని ఆ గ్రంథం అందుకుంది.

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కమిటీ సభ్యుడిగా దక్షిణామూర్తి పనిచేసిన కాలంలో అకాడమీ తెలుగు కార్యక్ర మాలు బహుధా విస్తరించాయి. హైస్కూలు రోజుల్లోనే తన సృజన శీలత్వాన్ని పెంచుకుంటూ వచ్చిన ఆయన తొలుత అచ్చులో చూసుకున్నది మాత్రం తన వ్యాసరచననే. పందిరి మల్లికార్జునరావు సారథ్యంలోని కిన్నెర పత్రికలో **'పరిణామవాదం'**పై తొలి వ్యాసం ముద్రితమైంది. 1955లో చిలకమర్తిపై సాహిత్యవ్యాసం రాశారు. అప్పుడే తొలి కథలు రాశారు. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, యువ, భారతి, వసుధ, ఆంధ్రజనత, రచన, ఆనందవాణి, కిన్నెర, నవ్య వంటి అనేకానేక పత్రికలలో వందలాది కథలు రాశారు. ఆయన **'చంద్రవంక'** కథా సంపుటికి విశేష ప్రాచుర్యం లభించింది.

**'తెలుగు కథానిక – స్వరూప స్వభావాలు'** ఒక ప్రామాణిక సిద్ధాంత గ్రంథం. చిన్ననాటనే ఒక సాహిత్య వాతావరణంలో ఆలమూరులో కాలువగట్టున, మామిడి తోటల్లో, చేలగట్ల వెంట కనక్ ప్రవాసి, ఉషశ్రీ, పోలాప్రగడ సత్యనారాయణమూర్తి (ప్రసన్న) నిమ్మగడ్డ సుబ్బారావు వంటి వారితో కలిసి సంచరిస్తూ కథలు రాస్తూ, పరస్పరం విశ్లేషించుకుంటూ భమిడిపాటి కామేశ్వరరావుగారి వద్ద పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, మధునాపంతుల సత్యనారాయణ గారి వద్ద తెలుగు విద్యార్థిగా నేర్చుకుని కవికొండల, శ్రీపాద వంటివారి సాంగత్యమూ పొంది, సాహితీవేత్తగా ఎదిగిన ప్రజ్ఞాశీలి పోరంకి దక్షిణామూర్తి. కథానిక మన భారతదేశంలో పుట్టిందేనని అగ్నిపురాణం 337వ అధ్యాయం 30వ శ్లోకంలో కథానిక నిర్వచనం పొందుపరచబడిందని

సాధికారికంగా నిరూపించినది పోరంకి వారే. తన హృదయానికి స్పందన కలిగించిన అంశాలకు మానవత్వపు విలువలకు ప్రధానంగా తావిస్తూ కథలు రాశారాయన. ఆర్థిక సామాజిక, సాహిత్య స్ఫురణ మాత్రమే కాదు ఉదాత్త సార్వకాలిక విలువలు ప్రధానం అంటారాయన.

**"మానవుడి ఊహ ఏనాడు రెక్క విప్పుకున్నదో ఆనాడే పుట్టింది కథ. చెట్టుకొక కథ, గుట్టకొక కథ, పువ్వుకొక కథ, చెలి నవ్వుకొక కథ, మానవుని బహిరంతరాలలో కన్ను చూసేది కొంత, మనసు చేసేది మరికొంత కలిసి అందంగా హృదయైకవేద్యంగా కథ రూపొంది అలరిస్తోంది"** అంటూ సిద్ధాంత గ్రంథ రచనను మొదలిడడం ఆయనకే చెల్లింది.

**"జాతికి జీవనాడులైన విలువలను విస్మరించి, వాటిని పెంచే రచనలను విస్మరించి, మానసికంగా విదేశీయులకు బానిసలు కావాల్సిన దుస్థితిని రచయితలు పొందకూడదు. తమ స్వతంత్ర బుద్ధిని ఉపయోగించి మన దేశానికి గౌరవాన్ని పెంచే విధంగా, సార్వకాలికమైన విలువలను సంరక్షించే విధంగా చేసిన రచనలే నిలుస్తాయి. ప్రయోజనవంతమవుతాయి"** అని నిష్కర్షగా చాటిన వారాయన. వేదగిరి రాంబాబు జిల్లాల్లో నిర్వహించిన కథానికా సదస్సులకు, గురజాడ, గిడుగు, శ్రీపాద వంటివారిపై చేసిన కార్యక్రమాలకు వెనుక ప్రేరణ, స్ఫూర్తి ప్రదాత పోరంకి దక్షిణామూర్తే. గురజాడ **'డిసెంట్ పత్రం'** ఆంగ్లంలోకి తెచ్చారు. గురజాడ దేశభక్తి గీతం గురించి ఆంగ్లంలో గ్రంథం వెలువరించారు. మాండలిక వృత్తిపద కోశంలో **'మేదర పరిశ్రమ'** గురించి, **'మన ఆధ్యాత్మిక వారసత్వం'** పేర ప్రసిద్ధ రచయిత కొన్ని ఆంగ్ల వ్యాసాలకు అనువాదం, **'భాష – ఆధునిక దృక్పథం', 'భక్తుల కథలు', 'అరచేతి అద్దం'** పేర పీఠికలు, **'అదొక్కటీ తెలుసుకో చాలు', 'ఉన్నది ఉన్నట్లు'** (పుస్తక సమీక్షలు) గ్రంథాలుగా వెలువరించారు. ఆయన గ్రంథాల్లో చిరకాలం నిలబడిపోయేవిగా తెలుగు కథానిక స్వరూప స్వభావాలు, చంద్రవంక (కథా సంపుటి), ఒక యోగి ఆత్మకథ, మూడు మాండలికాల్లో వచ్చిన నవలలు. అశేష సాహిత్యాభిమానులను, తెలుగు కథానికా ప్రియులను, విశేషించి తెలుగు సాహిత్యలోకాన్ని వదిలి పోరంకి దక్షిణామూర్తి కాలధర్మం చెందారు. ఆయన వెలిగించిన సాహిత్య దీధితులు ప్రకాశిస్తూనే ఉంటాయి. సాహిత్యాభిమానుల గుండెల్లో ఒక ఉజ్జ్వల తెలుగుజ్యోతిగా ఆయనది చిరంతనకీర్తి. ఆ మహనీయమూర్తికి అశ్రునివాళి.

# మా తాతగారు

**వైష్ణవి మైత్రేయి,** ఫోన్ : 934 7040591

నా చిన్నప్పటి నుంచీ, నేను ఏ పని చేసినా, నన్ను వెనకేసుకొచ్చింది మాత్రం మా తాతగారే. అందుకే, ఆయనతో ఎక్కువ సమయం గడపడానికి నేను యిష్టపడేదాన్ని. ఆయనకేమో అంత టైం ఉండేది కాదు. మా తాతగారి దినచర్య చూస్తే చాలా ఆశ్చర్యం వేసేది. రోజులో కనీసం 10 గంటలు రాయడానికో, చదవడానికో కేటాయించేవారు. కానీ, నేనెప్పుడు ఏది అడిగినా, తన పనులన్నీ మానుకుని మరీ, ప్రతి విషయం ఓపిగ్గా చెప్పేవారు. పద్యాలైనా, వ్యాసాలైనా, మరేదైనా సరే నాకు అర్థం కాకపోతే పూసగుచ్చినట్లు చెప్పేవారు. బహుశః అలా నేర్చుకోవడం వల్లనో ఏమో, నాకు తెలుగులో ఉన్న అందం తెలిసొచ్చింది.

ఆయన పెద్దవాళ్లతో మాట్లాడేటప్పుడు మాకు అర్థం అయ్యేది కాదు. కానీ, మాతో అలా కాదు. ఒకటి నుంచీ పదో తరగతి వరకూ ప్రభుత్వ పుస్తకాలు మా తాతగారు తయారు చేశారని అందరికీ తెలుసు. కానీ, మరో విషయం ఏమిటంటే అవి రాసేప్పుడు నన్ను, మా యింటి దగ్గర కొంతమంది పిల్లల్నీ పిలిచి, రాసిన పాఠాలు చదివి, వినిపించి, మాకు అర్థమవుతున్నాయో లేదో గమనించేవారు. మాకు చాలా గొప్పగా అనిపించేది.

వ్యాస రచన, లేదా వక్తృత్వ పోటీల్లో మేం పాల్గొనేటప్పుడు, మాకు తగిన సూచనలు, సలహాలు యిచ్చేవారు. అవి వాటికే కాక, ఏ పోటీలకైనా మమ్మల్ని సిద్ధం చేసేలా వుండేవి. ఆఖరికి పరీక్షల్లో కూడా ఉపయోగపడేవి. నాకు తెలిసిన విషయాన్ని కాగితం మీద ఎలా వ్యక్తం చేయాలో ఆయన దగ్గరే నేర్చుకున్నాను. ఆయన ఆరోగ్యం బాగుపడి, ఆయన దగ్గర ఇంకా ఎన్నో నేర్చుకోవచ్చని బాగా ఆశపడ్డా. కానీ, నాకు ఆ అవకాశం లేకుండా పోయింది.

నన్ను ఇంతగా ప్రభావితం చేసిన మా తాతగారు ఎక్కడున్నా, ఆయన ఆశీస్సులు మా మీద ఉంటాయని నా ప్రగాఢ విశ్వాసం. ఆయనకు ఇవే నా నివాళులు.....

# ఆప్తవాక్యం

## ఆచార్య జి. చెన్నకేశవ రెడ్డి,

ఫోన్ : 94920 47027

సుప్రసిద్ధ నవలా రచయిత, కథానికా రచయిత, భాషా శాస్త్రవేత్త డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి 6-2-2021నాడు హైదరాబాద్ చైతన్యపురిలో స్వగృహంలో కన్నుమూశారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రాపురం తాలూకా ఆలమూరు గ్రామంలో జన్మించారు. పుట్టిన తేది 24 డిసెంబర్ 1935. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగు, పి.జి.డిప్లమా ఇన్ లింగ్విస్టిక్స్ చేశారు. తెలుగు అకాడమీలో 1968 నుంచి వివిధ హోదాల్లో పనిచేసి ఉపసంచాలకులుగా 1993లో పదవీ విరమణ చేశారు. పోరంకి దక్షిణామూర్తిగారు తెలుగులో ముఖ్యమైన మూడు మాండలికాలలో (కోస్తా, తెలంగాణ, రాయలసీమ) మూడు నవలలు వరుసగా వెలుగు వెన్నెలా గోదారీ, ముత్యాల పందిరి, రంగవల్లి అనేవి రాశారు. ఆ రకంగా మూడు మాండలికాలలో నవలలు రాసిన ఏకైక వ్యక్తి పోరంకి దక్షిణామూర్తిగారు. ఆయన ఎం.ఏ. తెలుగు చేయకముందే డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి తలపెట్టిన మాండలిక వృత్తిపద కోశాల నిర్మాణంలో పాల్గొన్నారు. **'మాండలిక వృత్తిపద కోశం - చేనేత పదాలు'** అనే సంపుటానికి సహ సంపాదకత్వం వహించారు. ఆ అనుభవంతో చేనేత వృత్తిపనివాళ్ళ జీవితాన్ని ముత్యాల పందిరి నవలగా రాశారు. ముత్యాలపందిరి చేనేత చీర పేరు. ఆయన మూడు మాండలికాలలో మూడు నవలలే కాక నివేదన, నీడలు జాడలు అనే మరో రెండు నవలలు రాశారు. నీడలు జాడలు నవల హైదరాబాద్ నగరం హిందూ ముస్లిం మతకలహాల నేపథ్యంలో రాసిన మంచి నవల.

పోరంకివారు ఎన్నో కథలు రాశారు. వాటిలో కొన్ని ముఖ్యమైన కథలు అనువ్రత, ఆద్యంతా నడుమ, అరవింద, ఎన్నాళ్లకెన్నాళ్ళకు, ఏడుపాయల దొరసాని, ఔరా అనగనగా ఒక మంచి కథ, ఔరా అనువాద కథ, కారప్పూస పొట్లం, కదంబం వంటి కథలు ఎన్నో రాశారు. కారప్పూస పొట్లం, ఏడు పాయల దొరసాని అనేవి మంచి హాస్య కథలు. భక్తుల కథలు కూడా రాశారు. కథలు రాయడమే కాకుండా దక్షిణామూర్తిగారు **"కథానికా స్వరూప స్వభావాలు"** అనే అంశం మీద ఆచార్య సి. నారాయణరెడ్డిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి. పట్టా తెచ్చుకున్నారు. అదొక ఉత్తమ ప్రామాణిక సిద్ధాంత గ్రంథం.

దక్షిణామూర్తిగారు పరమహంస యోగానంద రాసిన **"ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి"** అనే గ్రంథాన్ని **"ఒక యోగి ఆత్మకథ"** అనే పేరుతో తెలుగులోకి అనుసృజన చేసినారు. ఆ పుస్తకం ఆయనకు ఎంతో పేరు తెచ్చింది. ఎంతో మనసు పెట్టి చేసిన అనుసృజన అది. అంతేకాదు ఆయన గొప్ప యోగ సాధకుడు. పరమహంస యోగానంద నెలకొల్పిన యోగద సత్సంగ సంఘంలో సభ్యులుగా చేరి యోగసాధన చేసి క్రియాయోగ దీక్ష తీసుకున్నారు. ఆయన నాకు కూడా యోగద సత్సంగ సభ్యత్వం ఇప్పించి యోగమార్గంలోకి మళ్ళించారు. ఇద్దరం ఒకేసారి క్రియాయోగ దీక్షను తీసుకున్నాము. అయినా ఆయనలా నేను సాధన చేయలేకపోయాను. ఒకయోగి ఆత్మకథను రాస్తున్నప్పుడు నాకు చాలాసార్లు చదివి వినిపిస్తుంటే వినే భాగ్యం కలగడం వల్ల నా జన్మ ధన్యమైందని భావించాను. ఆయన నాకు పరమ ఆత్మీయ మిత్రుడు. తెలుగు అకాడమీలో ఆయనతోపాటు రెండు దశాబ్దాలకు పైగా కలిసి పనిచేసే అదృష్టం నాకు కలిగింది. నాకు యోగ మార్గదర్శకులే కాదు తెలుగు అకాడమీ పనులలో ఎన్నో సలహాలు ఇచ్చి తీర్చిదిద్దిన వ్యక్తి. నా వ్యక్తిగత జీవితాన్ని కూడా ఎంతో ప్రభావితం చేసిన వ్యక్తి దక్షిణామూర్తిగారు. ఆయన ఎం.ఏ. తెలుగు చదువుతున్నప్పటి నుంచే నాకు పరిచయం. అప్పుడు నేను బి.ఏ. తెలుగు చదువుతున్నాను. మా ఊరివాడు పి.సి. నరసింహారెడ్డి ఆయన క్లాస్‌మేట్. ఆ విధంగా నాకు చాలా సన్నిహితుడు అయ్యాడు. ఆయన ఎం.ఏ. చదువుతున్నప్పుడే ముత్యాల పందిరి నవల రాశాడు. అది తెలంగాణ మాండలికంలో ఉన్నందువల్ల మేమిద్దరమూ తెలంగాణ వాళ్లం కావడం వల్ల మాకు వినిపించేవాడు. మంచి సంభాషణ ప్రియుడు. చాలా సరదాగా ఉండేవాడు. నవ్వుతూ ఛలోక్తులు విసురుతూ మనసులో బాగా కలిసిపోయేవాడు.

తెలుగు అకాడమీ కార్యక్రమాలలో ఆయన చాలా ప్రధానమైన పాత్ర పోషించారు. ఆయన తెలుగు అకాడమీకి చేసిన సేవ చాలా విశిష్టమైనది, విలువైనది. తెలుగు పదబంధ కోశం, ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువు, తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు, తెలుగు - తెలుగు నిఘంటువు పరిష్కరణ చేశారు. కొన్నిటికి సంపాదకత్వం వహించారు. మరి కొన్నిటికి కూర్పరిగా పనిచేశారు. నిఘంటువుల నిర్మాణంలో ఆయన నేతృత్వం కింద పనిచేసే భాగ్యం కలగడం నా అదృష్టం. మాండలిక వృత్తిపదకోశం, మేదరి పరిశ్రమకి సంపాదకత్వం వహించారు. తెలుగు రాని ఉద్యోగులకు, ఇతరులకు తెలుగును ద్వితీయ భాషగా బోధించడానికి వాచకాలు, వర్క్ బుక్కులు రూపొందించారు. ఇంకా భాషా ప్రయోగశాల ద్వారా కూడా ఆయన తెలుగుభాషను నేర్పించేవారు. నాకు కూడా బోధనలో అవకాశం కల్పించగా, వారి నేతృత్వంలో మంచి బోధకుడిని కాగలిగాను.

గురజాడ 'డిసెంట్ పత్రాన్ని' తెలుగులోకి అనువదించారు. యోగద సత్సంగ సంఘం కోసం 40 చిన్న పుస్తకాలను అనువాదం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం సభ్యులుగాను, కార్యనిర్వాహక సభ్యులుగాను, తెలుగు సలహా సంఘం

అధ్యక్షులుగాను పనిచేశారు. ఆయన శతాధిక గ్రంథాలను సమీక్షించారు. వాటిలో 102 గ్రంథాల సమీక్ష వ్యాసాలను 'ఉన్నది ఉన్నట్లు' అనే పేరుతో వ్యాస సంకలనం ప్రచురించారు.

పోరంకి దక్షిణామూర్తిగారు తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన సేవ అసమానమైనది, అమూల్యమైనది. నిరాడంబరుడు, నిగర్వి, స్నేహశీలి అయిన దక్షిణామూర్తిగారి మరణం కుటుంబ సభ్యులకే కాక మిత్రులకు కూడా తీరని లోటు. చివరగా చెప్పుకునేది ఏమంటే తెలుగు అకాడమీలో ఆయన ఉప సంచాలకుడిగా పదవీ విరమణ చేయగా, ఆయన తర్వాత ఆ పదవిలో ఆయన కుర్చీ మీద ఆయన గదిలో కూర్చొని పనిచేసే భాగ్యం నాకు కలగడం ఎంతో ఆనంద దాయకంగా ఉన్నది.

# నేనూ - మా దక్షుడు

**పాండురంగ విఠల్,** ఫోన్ : 890 301 7671

ఆలమూరు తూర్పు గోదావరి జిల్లాలో ఓ పల్లె. ఇద్దరం అక్కడే పుట్టడం వల్ల ఆ ఊరితో మాకొక అనుబంధం. **'సఖ్యం సాప్తపదీనాం'** అన్నారు కదా. ఏడడుగులు కలిసి నడిస్తేనే స్నేహం ఏర్పడుతుందే.. మరి 75 సంవత్సరాల స్నేహ బంధం ఓ ప్రత్యేకత కాదా?

ఆలమూరు దగ్గర కొత్తూరు (2 కిలోమీటర్ల దూరం) మిడిల్ స్కూల్లో చదివేటప్పుడు రోజూ చేలగట్ల మీదుగా నడుచుకుంటూ వెళ్లి రావడం మాకు ఏమీ శ్రమ అనిపించేది కాదు. పైగా అదొక సరదా. రాజమండ్రి వీరేశలింగం హైస్కూలులో ఎస్ఎస్ఎల్సీ వరకూకలిసే చదివాం. ఇంటర్ వేర్వేరు ఊళ్లో చదివినా, మళ్లీ డిగ్రీకి రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో కలిశాం. ఇక, మా వాడి రచనావతారం ఇంటర్‌లో ఉండగా, కాలేజీ మేగజైన్‌లో వాడు రాసిన వ్యాసం **"విహార విలాసంతో విషయవిలోకనం"**. అచ్చవడంతో కొత్త ఊపు వచ్చిందనవచ్చు. తనుకూడా రాయగలనన్న ధైర్యాన్నిచ్చింది. అదే జరిగింది కూడాను.

మా దక్షుడే కాకుండా యింకో పదిమంది సాహితీవేత్తలను అందించింది మా ఊరు. ఇదంతా ఆ చెరువు నీళ్ల మాహాత్మ్యం.నేను ఇదే అనుకుంటా. మేం కలిసి పెరిగిన రోజులకీ, యిప్పటికీ మధ్య ఎన్నో విజయాలు, బహుమతులూ, అవార్డులూ, సన్మానాలు పొందినా, వాడి స్నేహశీలత, నిరాడంబరత మాత్రం చెక్కుచెదరలేదు. **'ఒకయోగి ఆత్మకథ'** పుస్తకం మీద తన పేరు లేకపోయినా, ప్రజలకు చేరువైంది చాలు. అని ఎవరు సరిపెట్టుకోగలరు?

ఒకే రచయిత మూడు ప్రాంతాల యాసల్లోనూ నవలలు రాయడం కూడా ప్రత్యేకతే. వాడు అనువదించిన **"జ్ఞాన సంకలినీ తంత్రం"** అంతః సాధనకు సంబంధించిన చిన్ని పుస్తకం. కానీ, నాకూ, నా శ్రీమతికీ మాత్రం అది నిత్య పారాయణ గ్రంథం. మా చిన్ననాటి స్నేహితులం ముగ్గురం. దక్షుడు (దక్షిణామూర్తి), నేను, బాబ్జీ (మల్లంపల్లి జగన్నాథ రావు). మా ముగ్గురి వృత్తులు వేరైనా, ఉద్యోగ రీత్యా వేర్వేరు ఊళ్లలో పనిచేస్తున్నా, వీలు చూసుకొని, కుటుంబాలతో సహా కలుసుకొని, కొద్ది రోజులు సరదాగా గడిపేవారం. ఉత్తర ప్రత్యుత్తరాల ప్రక్రియ కూడా మా మధ్య కొనసాగేది. అందుకేనేమో... మా స్నేహం అలానే నిలిచిపోయింది యిప్పటి వరకూ.

వాళ్లిద్దరూ వెళ్లిపోయారు. తీపి జ్ఞాపకాలు మాత్రం నాకు మిగిలాయి.

**బరువెక్కిన హృదయంతో.... నీ రంగడు.. (పాండురంగ విఠల్)**


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# మా నాన్నగారు

## పోరంకి రమణ ప్రసాద్,

ఫోన్ : 9490 93 9610

మా నాన్న గారు పోరంకి దక్షిణామూర్తి గారు. తూర్పు గోదావరి జిల్లా ఆలమూరులో జన్మించారు. అందరిలాగే, బాల్యమంతా పొలం గట్లమీద, షికార్లు చేయడం, చెరువులో ఈతలు, కాలవ గట్ల మీద కబుర్లు, కాలక్షేపాలతోనే గడిచిపోయింది. హైస్కూలు చదువు కోసం రాజమండ్రికి మకాం మార్చడం ఆయన తొలి మజిలి. వీరేశలింగం హైస్కూలులో భమిడిపాటి కామేశ్వర రావు, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు లాంటి టీచర్ల ప్రభావం ఆయన మీద బాగా పడింది. సాహిత్యం పట్ల అభిమానం కలగడానికి అక్కడే మా నాన్నకు బీజం ఏర్పడింది.

రాజమండ్రి మజిలీ తరువాత తదుపరి మజిలీ కాకినాడ. ఇంటర్మీడియట్ చదవడానికి పీ.ఆర్.కాలేజీలో చేరారు. వార పత్రికల్లో వచ్చే కథలూ, సీరియళ్లు, నవలలు చదవడం, వాటి గురించే చర్చించడం, నచ్చకపోతే వాదులాడుకోవడం, మళ్లీ వారం వరకూ ఎదురుచూడటం, ఇవే అప్పటి యువతకు పెద్ద కాలక్షేపం. కాకినాడలో ప్రతి సంవత్సరం జరిగే "ఆంధ్రాభ్యుదయోత్సవాల"కు పి.ఆర్. కాలేజీ వేదికయ్యేది. సభలకు హాజరైన వక్తలకు, ఇతర ప్రముఖులకూ అక్కడ హాస్టల్లో బస ఏర్పాటు చేసేవారు. అలా మా నాన్నగారి గది శ్రీశ్రీ గారికి కేటాయించారు. ఓ సారి శ్రీశ్రీ గారు విశ్రాంతి తీసుకుంటుండగా, ఆయన్ను కలవడానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు **"దక్షిణామూర్తి గది ఎక్కడ?"** అని వెతుక్కుంటూ రావడం మా నాన్న గారికి మధురమైన జ్ఞాపకం.

స్నేహితులతో కలిసి పిక్నిక్ వెళ్లడం, దాని గురించి కాలేజీ మ్యాగజైన్‌లో రాయడం ఒకటైతే, అప్పట్లో జరుగుతున్న ఆంధ్ర ఉద్యమం గురించి 'జై జై ఆంధ్ర" పేరుతో ఓ వ్యాసం రాసి పంపారు. ఇలా మా నాన్నగారి వ్యాసాంగం ప్రారంభమై, జీవిత చరమాంకం వరకూ కొనసాగింది. బి.ఏ. చదవడానికి మా నాన్నగారు రాజమండ్రికి మారారు. అక్కడ కూడా పెద్దవారితో పరిచయం భాగ్యం కలిగింది. విశ్వనాథ సత్యనారాయణ గారు, ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి గారు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి లాంటి పెద్దవారితో సాంగత్యం ఏర్పడింది.

నాన్నకు స్టేట్ బ్యాంకులో ఉద్యోగం రావడంతో, హైదరాబాదుకు మకాం మారింది. అక్కిరాజు రమాపతి రావు, శశాంక, ఉషశ్రీ, లాంటి స్నేహితులతో కలిసి, సాహిత్య సమావేశాలు, సభలు, పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం లాంటి వాటితో రోజులు గడిచిపోయేవి. ఈ సమయంలోనే మా నాన్నకు ఓ ఆలోచన తట్టింది. ఆయా ప్రాంతాల మాండలికాలను కూడా పరిచయం చేయాలని. దీంతో పాత్రల సంభాషణలే కాక, వర్ణనలూ, ఊత పదాలు, సామెతలూ మొత్తం అదే ప్రాంతానికి చెందిన మాండలికాలను పరిచయం చేయడం ప్రారంభించారు. ఇటువంటి ప్రక్రియ అంతకు ముందెన్నడూ జరగలేదని స్నేహితులు ప్రోత్సహించారు. దీంతో కథని పొడిగించారు. అది కాస్త నవలలాగా మారింది. అదే **"వెలుగు, వెన్నెలా, గోదారి".**

తెలుగులో పూర్తిగా జానపద మాండలికంలో ఒక ప్రాంతపు పల్లె ప్రజల వాడుకలో వెలువడ్డ తొలి నవలగా అది ప్రసిద్ధికెక్కింది. 1961 లో ఆంధ్రప్రభ వార పత్రిక వారు నిర్వహించిన తొలి ఉగాది నవలల పోటీలో రెండో బహుమతి దీనికి దక్కింది. అప్పట్లో చిక్కడపల్లిలో ఉండేవారు. ఆ ప్రాంతమంతా సాహితీ దురంధరులతో సాహిత్యాభిమానులతోనే ఉండేది. నారాయణగూడ వైఎంసీఏ హాలులో తరుచుగా సమావేశాలో, సభలో, కవితా గోష్ఠులో జరుగుతూనే ఉండేవి. అక్కడే ఎంతోమంది సాహితీ ప్రియులతో పరిచయం, స్నేహం ఏర్పడింది. ఆ ప్రభావం వల్లనో ఏమో, సాహిత్య రంగం పట్ల మోజు పెరిగి, బ్యాంకు ఉద్యోగం పట్ల శ్రద్ధ తగ్గడంతో, ఒకానొక రోజున మా నాన్న గారు తన బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసేశారు. దానికీ ఓ కారణం ఉంది లేండీ. అప్పట్లో బ్యాంకు ఉద్యోగులకు ఒక నిర్దిష్ట పనివేళలు ఉండేవి కావు. ఒక్కోరోజు రాత్రి 8 గంటలకు ఆఫీసు నుంచి బయల్దేరినా... "భోజనం చేసి రావయ్యా... కాస్త పనుంది" అనేవారు మేనేజర్లు. ఒక పక్క సాహిత్యం పట్ల అభిమానం, మరో పక్క కుటుంబ బాధ్యతలు ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ నాలుగైదు సంవత్సరాలు గడిపారు. ఓ సారి బ్యాంకులో పనిచేసుకుంటూ ఉండగానే, ప్రకాశం పంతులు గారి అంతిమయాత్ర, బ్యాంకు ముందు నుంచీ సాగుతుందని వార్త వచ్చింది. మేనేజరు అనుమతించక పోయినా, చేస్తున్న పని వదిలి మరీ, ఆ యాత్రలో పాల్గొన్నారు. దానివల్ల కొద్ది రోజులు మేనేజర్‌తో మా నాన్న చీవాట్లు తిన్నా, ఆ రోజు వెళ్లకపోయి ఉంటే, జీవితాంతం ఆ వెలితి ఉండిపోయేదని అంటుండేవారు. ఈ కారణాల రీత్యా ఎలాంటి ఊగిసలాట లేకుండానే తన బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసేశారు.

అ ప్పటికే పరిచయమున్న శ్రీ పండితారాధ్యుల నాగేశ్వర రావు సంపాదకులుగా ఉన్న 'ప్రజా ప్రభ' అనే సాయంకాల దిన పత్రికలో సబ్ ఎడిటర్‌గా చేరారు. ఆరు నెలలకే, ఆ పత్రిక మూతపడటంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కుటుంబాన్ని పోషించడానికి పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ, వివిధ పత్రికల్లో వ్యాసాలు రాస్తూ కొద్దికాలం నెట్టుకొచ్చారు. అప్పుడే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆదేశాల మేరకు, ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణమూర్తి గారి నేతృత్వంలో కొన్ని వృత్త పదకోశాల నిర్మాణం జరిగింది. ఆయన దృష్టి మా నాన్నగారి మీద పడింది. **'వెలుగు, వెన్నెలా, గోదారి'** నవల కృష్ణమూర్తి

గారు చదవడం వల్ల కబురు చేశారని తరువాత తెలిసింది. ఫలితంగా చేనేత వృత్తి పదకోశ నిర్మాణంలో పాలు పంచుకున్నారు. అందుకోసం నల్లగొండ, మహబూబు నగర్ జిల్లాలో విస్తృతంగా తిరిగారు. దానితో చేనేత కార్మికుల జీవన శైలి, అలవాట్లు, మాటతీరు, పనితీరు ఇవన్నీ బాగా ఆకళింపు చేసుకున్నారు. వాటి ఆధారంగానే **'ముత్యాల పందిరి'** అనే నవల రాశారు. అప్పట్లో బాగా ప్రజాదరణ పొందిన ఒక నేతచీర డిజైను పేరు అది. పూర్తిగా తెలంగాణ ప్రాంత మాండలికంలో వెలువడ్డ మొదటి నవల అది. దీనికి కూడా 'ఆంధ్రప్రభ' ఉగాది నవలల పోటీలో బహుమతి లభించింది.

1969 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ఏర్పర్చిన తెలుగు అకాడెమీలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రావడంతో మా కుటుంబ పరిస్థితి కాస్త మెరుగు పడింది. అక్కడ చేసే పనికూడా తెలుగు భాషా అధ్యయనం, అభివృద్ధి, పరిశోధనలతో కూడుకున్నది కావడంతో సహజంగా పదవీ విరమణ వయసు దాకా అక్కడే పనిచేశారు.

ఆ సమయంలోనే తెలుగు భాషలో ఉన్న మాండలికాల గురించి ఎన్నో పరిశోధనలు చేసి వ్యాసాలు రాశారు. అలాగే వందలాది కథలు, కథానికలు చదివి, వాటిపై పరిశోధన చేసి, సినారె పర్యవేక్షణలో **'కథానిక స్వరూప స్వభావాలు'** అనే పేరుతో తన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి, పీహెచ్‌డీ పట్టా పొందారు. ఇప్పటికీ తెలుగు ఎం.ఏ చదివే వారికి అదొక ప్రామాణిక గ్రంథమే. ఆ తరువాత ఆచార్య తూమాటి దోణప్ప గారి సలహాతో రాయలసీమలో కొన్ని ప్రాంతాలు పర్యటించి, అక్కడి మాండలిక యాసతో **'రంగవల్లి'** నవల రాశారు. ఈ విధంగా కోస్తా, తెలంగాణ, సీమ మాండలికాల్లో తొలి నవలలు రాయడం ఆయనకు చాలా సంతృప్తినిచ్చింది.

ఒక చిన్న సంఘటన జీవితంలో పెద్ద మార్పుకు కారణమైంది. 1975 లో చిక్కడపల్లిలో ఒక పాన్ షాపులో పాన్ తీసుకొని, పక్కనే అమ్ముతున్న పాత పుస్తకాలలో నుంచి ఒక లావుపాటి పుస్తకాన్ని 3 రూపాయలకు కొన్నారు. ఆ పుస్తకమే పరమహంస యోగానంద గారు రాసిన **'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి".** అప్పట్లో మా నాన్నకు స్వాముల మీద గానీ, బాబాల మీద గానీ పెద్దగా సదభిప్రాయాలు లేవనే చెప్పాలి. అలాగని వ్యతిరేకతా లేదు. అసలు అలాంటి వారిని పట్టించుకోలేదు. అంటే సాహిత్యం తప్ప మా నాన్నకు వేరే ధ్యాసే లేదు. వ్యాపకమూ లేదు. కానీ, రెండు మూడు నెలల పాటు ఎదురుగా అలమారులో ఆ పుస్తకం కనిపిస్తూ ఉండటంతో మామూలుగా చదవుదామని మొదలుపెట్టారు. మొత్తం చదివిన తరువాత, ఆయనకి కాస్త నమ్మకం కలిగింది. అందులో పొందుపరిచిన విషయాలు, అనుభవాలు, సందేశాలు, ఇంగ్లీషు రాని తెలుగువారు మిస్సవుతున్నారని అనిపించింది. అంతే.. ఆ పుస్తకాన్ని అనువదించడం మొదలుపెట్టారు. అప్పుడు గానీ తెలిసి రాలేదు అదెంత కష్టమో. అమెరికన్ పాఠకులను దృష్టిలో పెట్టుకుని రాసిన పుస్తకం అది. అందులో వాడిన పదాలు, సమాసాలు, శైలి తెలుగు వారికి అర్థమయ్యేట్లు రాయడం అంత సులువు కాదు.

అనువాదానికి, యోగదా సత్సంగ సొసైటీవారిచ్చిన గడువు ఆరు నెలలయితే, అది మూడు సంవత్సరాలపైనే పట్టింది. **"ఒక యోగి ఆత్మకథ"** పేరుతో వెలువడిన ఆ పుస్తకం ఎన్నో వేలమంది జీవితాలను ప్రభావితం చేస్తుందని ఎవరూ ఊహించలేదు. కొద్ది కాలానికి, ఏపీ ప్రభుత్వం ఏటా ఇచ్చే ఉగాది పురస్కారాలలో ఉత్తమ అనువాద రచనగా ఆ పుస్తకం ఎంపికైంది. అనువాదకుడి పేరు ఎక్కడా ముద్రించక పోవడం వల్ల అప్పటివరకూ ఎవరికీ తెలియదు గానీ, అవార్డు వచ్చిన తరువాత ఎంతోమంది, ఆయన్ను వ్యక్తిగతంగా కలుసుకొని మరీ వెళ్లేవారు. తను కేవలం అనువాదం మాత్రమే చేశానని, అందులో రాసినవి తన అనుభవాలు కావనీ, తనకి ఆ స్థాయి లేదనీ, సవినయంగా మనవి చేసుకునేవారు. అయినా జనం వింటేగా...

అంతకు ముందు భాష, మాండలికాలు, కథలు, నవలలు వరకూ మాత్రమే పరిమితమైనా, ఈ పుస్తక అనువాదం తరువాత మరెన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు చదివేవారు. అంతేగాక ఇంగ్లీషు నుంచి హిందీలో నుంచీ, అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను అనువదించారు. అరవిందులు, రమణ మహర్షి, షిర్డీసాయి, లాహిరీ మహాశయ, యుక్తేశ్వర్ గారు, త్రైలింగ స్వామి, మాతా అమృతానందమయి, స్వామి వివేకానంద గారి లాంటి ఎంతోమంది మహా పురుషుల జీవిత విశేషాలు, అనుభవాలు, సందేశాలు తెలుగువారికి అందజేశారు. మూల గ్రంథాలలోని సందేశాన్నీ సారాంశాన్ని, ప్రాముఖ్యతనూ దృష్టిలో పెట్టుకుంటూనే తమ అనువాదాలలో తెలుగుదనాన్ని తమదైన శైలిలో పుష్కలంగా నింపారు.

చిరకాల మిత్రుడు డి.వి.ఆర్. భాస్కర శాస్త్రి గారితో కలిసి **"విజ్ఞాన శాస్త్రంలో ధ్రువతారలు"** అనే పుస్తకం ద్వారా ఎంతో మంది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తల జీవిత విశేషాలు తెలుగులోకి తెచ్చారు. అలాగే మిత్రులు, ఆప్తులు, మంజులూరి నరసింహారావు గారితో కలిసి **"అధర్వ వేదంలో అక్షయ నిధులు"** అనే పుస్తకాన్ని వెలువరించారు.

డిసెంబర్ 1993 అప్పటికే ఉద్యోగ నిర్వహణలో భాగంగా ఇంగ్లీషు – తెలుగు నిఘంటువు నిర్మాణానికి పర్యవేక్షణ చేస్తున్నారు. అది పూర్తి అవ్వకుండానే రిటైర్‌మెంట్ రోజు వచ్చేసింది. అది అసంపూర్తిగా వదిలి వేయాల్సి వచ్చినందుకు కొన్ని రోజులు బాధపడినా, అకాడమీ సంచాలకుల అనుమతితో రిటైర్ అయిన తరువాత కూడా కొద్ది నెలలు అకాడమీకి వెళ్లి, ఆ నిఘంటువు ముద్రణ అయ్యేదాకా ఇతోధిక సేవ చేశారు. ఉద్యోగ విరమణ తరువాత కూడా ఎన్నో వ్యాపకాలు. 'ఈనాడు స్కూల్ ఆఫ్ జర్నలిజం'లో 6 సంవత్సరాల పాటు విద్యార్థులకు తెలుగు భాష, మాండలికాలు, వాడుక, శైలి, ఉచ్చారణ... ఇలా అనేక విషయాల గురించి ప్రసంగాలు చేశారు. తెలుగు అకాడమీలో పనిచేసే సమయంలో తెలుగు రాని ఎంతోమంది

ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలుగు నేర్పడానికి కోర్సులు నిర్వహించిన అనుభవం ఇక్కడ బాగా ఉపయోగపడింది.

ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీలో తెలుగు సలహా సంఘం సభ్యునిగా మరో 5 ఏళ్లపాటు విధులు నిర్వర్తించారు. అలాగే ఏపీ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ, సి.పి. బ్రౌన్ అకాడమీల సలహా సంఘాల సభ్యునిగా సేవలందించారు. మిత్రులు వేదగిరి రాంబాబు గారితో కలిసి జిల్లా స్థాయి కథానిక సదస్సులలోనూ, గురజాడ అప్పారావు గారి 150సంవత్సరాల జయంతి ఉత్సవాలలోనూ చురుగ్గా పాల్గొన్నారు. అలాగే గిడుగు రామ్మూర్తి పంతులు గారి సవర భాష నిఘంటువుని, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి అముద్రిత రచనలనూ, రాంబాబు గారితో కలిసి వెలుగులోకి తెచ్చారు.

సమాజం కోసం ఎక్కువ సమయాన్ని వెచ్చించే వారికి ఎవరికైనా, ఏ రంగంలో వారికైనా అత్యంత ఆవశ్యకమైనది జీవిత భాగస్వామి నుంచి సంపూర్ణ సహకారం. ఈ విషయంలో మా అమ్మ శ్రీమతి వరలక్ష్మీ వందశాతం సహకరించారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, బాసటగా నిలిచి, సర్దుకుపోయింది మా అమ్మ.

సమావేశాలూ, గోష్ఠులు.. ఇలా వీటితో సాగిపోతున్న జీవితంలో ఒక అనూహ్య సంఘటన. 2016 అక్టోబరు నెలలో కాలికి ఏదో తగిలి సడెన్‌గా కిందపడటంతో తలకు గాయైంది. దాంతో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి, నాలుగు నెలల పాటు మంచాన ఉన్నారు. ఆ సమయంలో ఆయనకి చిరకాల మిత్రులు, ఆప్తులు అయిన శ్రీ విహారి గారు కొన్ని సలహాలు ఇవ్వడమే కాక, తరుచుగా ఆయన ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ, త్వరగా కోలుకోవడానికి కారణమయ్యారు.

తరువాత...లేచి, నడవగలిగినా, మాట్లాడటం బాగా తగ్గిపోయింది. అలాగే చదవడం కూడాను. బోర్డుమీద మేము రాసే శ్లోకాలను చదువుకొని, కళ్లు మూసుకొని కూర్చునేవారు. ఆ మౌనానికి అర్థమేమిటో తెలిసేది కాదు. బహుశః అంతవరకూ ఎడతెరిపి లేకుండా చేసిన రచనా వ్యాసంగం, పుస్తకాల పఠనాల పట్ల ఆసక్తి తగ్గి, దైవస్మరణతో కాలం గడిపేవారని మా భావన. అలా నాలుగు సంవత్సరాలు గడిచాక, మళ్లీ 2020 ద్వితీయార్థంలో ఆరోగ్యం కొద్దిగా క్షీణించింది. కొద్ది కాలం మళ్లీ మంచానికే పరిమితం. వయసు కూడా పెరుగుతుండటంతో ఈసారి కూర్చోలేకపోయారు. ఉయ్యాలలో పడుకున్న శిశువులాగే కనిపించేవారు.

భూమ్మీదకు రాగానే, ఏ దశతో జీవితం మొదలైందో, అదే శైశవదశకు మళ్లీ చేరుకొని, ఫిబ్రవరి 6న ఈ లోకం వదిలి మా నాన్నగారు వెళ్లిపోయారు. కానీ, తెలుగు భాష, మాండలికాల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి అజరామరమై ఉంటుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

# మా పినతండ్రి

**పోరంకి ఆనందం,** ఫోన్ : 9290 085 883

కీ.శే. శ్రీ పోరంకి దక్షిణామూర్తి గారు నాకు పినతండ్రి అవుతారు. ఆయనతో నాకున్న అనుబంధం గురించి రాయాలంటే నేను నా బాల్యం గురించీ, నా చదువు గురించీ, టీనేజ్‌లో నా రచనా వ్యాసంగం గురించీ ఎన్నో జ్ఞాపకం చేసుకోవాల్సి వస్తోంది. దానికి ముఖ్య కారణం వాటన్నిటి కోసం ఆయన నాకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయం చేయడం, అలాగే నాకు ఆయన ఇచ్చిన స్ఫూర్తి.

బాల్యావస్థలో నేను కొన్ని సంవత్సరాల పాటు మా తాతగారు, నాయనమ్మల దగ్గర ఉండి చదువుకుంటూ ఉండేవాడ్ని. అది ఒక కారణం అయితే, మా బాబాయ్యకూ, నాకూ వయస్సులో కేవలం 6-7 సంవత్సరాల తేడా ఉండడంతో కొంచెం సాన్నిహిత్యం ఉండేది. నేను కాలేజీలో చేరి చదువుకునేందుకు ఆయన ప్రోద్బలం కూడా ఒక కారణం. అయితే, నేను ప్రైవేటుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి తెలుగు బి.ఏ. డిగ్రీ తీసుకోవడంతో కొంత ఆయన ప్రభావం ఉందనే చెప్పాలి. ఆ కారణంగానే నా టీన్‌ఏజ్‌లో నేను రాసిన కొన్ని వ్యాసాలూ, కథానికలూ ఆనాటి వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి.

కొన్ని 'ఆనంద నందన' అనే కలం పేరుతో రాసేవాడ్ని. ఆ పత్రికలలో కొన్ని (భారతి, కృష్ణా పత్రిక, గోల్కొండ, ప్రజాప్రభ) ఈనాటి పాఠకులు చాలామంది చూసి ఉండకపోవచ్చు.

మా బాబయ్యలో ప్రస్ఫుటంగా కనిపించే స్వయంకృషీ, లక్ష్య సాధనా నన్ను ఎంతో ఆశ్చర్యపరిచేవి. రాయడం ఒకటే కాదు, ప్రతిరోజూ వందల పేజీలు సునాయాసంగా చదివి, క్షుణ్ణంగా ఆకళింపు చేసుకోవడం... ఆయన ప్రత్యేకత. ఆ ఆసక్తీ, ఆ ఓపికా, ఆ నేర్పూ చూసి నేను చాలా ఆశ్చర్యపోతుండేవాడ్ని. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో అపారమైన పరిశోధనలు చేసి తెలుగు సాహితీ సేవలో దశాబ్దాల పాటు తరించిన వ్యక్తి ఆయన. అదంతా అనితర సాధ్యమని అనిపిస్తూ ఉంటుంది. ఆయన యిక మన మధ్య లేరనే విషయం బాధ కలిగిస్తూ ఉన్నా, శ్రీ దక్షిణామూర్తి గారి అన్న గారి కొడుకుగా పుట్టిన విషయం నేను తలుచుకొని సంతోషిస్తూ ఉంటాను.

# మా సహాధ్యాయులు

ఐ.వి. కాంతలక్ష్మి

ఫోన్ : 9490 9935 32

దక్షిణామూర్తిగారు మా సహాధ్యాయులని చెప్పుకోవడం మాకందరికీ గొప్పగా అనిపించేది. అది మేము ఎం.ఏ తెలుగు క్లాసులో చేరినప్పటి సంగతి. తొమ్మిది మంది అబ్బాయిలు తొమ్మిది మంది అమ్మాయిలతో తెలుగు ఎం.ఏ మొదటి సంవత్సరం తరగతి కళకళలాడింది. ఇంత మంది సంఖ్యతో ఈ బ్యాచ్ ప్రారంభం కావడం ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు ముచ్చట కలిగించింది.

ఆనాటి సహాధ్యాయులలో పోరంకి దక్షిణామూర్తి గారు, శశాంక గార్ల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. దక్షిణామూర్తి గారు నవలా రచయితగానూ, శశాంక గారు కవిగానూ అప్పటికే లబ్ధప్రతిష్ఠులు. శశాంక గారు జంట కవులుగా ప్రసిద్ధులైన వేంకట పార్వతీశ్వర కవులలో ఓలేటి పార్వతీశ్వర కవిగారి పుత్రులు. ఆయన పుట్టుపేరు సుబ్బారావు. శశాంక ఆయన కలం పేరు. ఎన్నడూ ముఖంపై చెరగని చిరు మందహాసపు వెలుగుతో, సౌజన్య రేఖతో అందరితో కలుపుగోలుగా మాట్లాడుతూ ఉండే శశాంక నిజంగా శశాంకులే. ఎప్పుడూ ఉల్లాస భరితంగా కబుర్లు చెబుతూ, హృదయపూర్వకమైన నవ్వుతో అందర్నీ తన చమత్కారపు మాటలతో నవ్విస్తూ వెలుగు వెన్నెల వెల్లి విరిసి, గోదావరి మంద్ర స్వరాల తరంగాలు మ్రోగుతున్నట్లుండే సహృదయమూర్తి శ్రీ పోరంకి దక్షిణామూర్తి. అప్పటికే వారి నవలలు సుపరిచితాలు. కోనసీమ తెలుగుయాస అంద చందాలను చిలికిస్తూ వెలుగు వెన్నెల గోదారి వారి మొదటి మాండలిక భాషా నవల వెలువడి వారికి కలికి తురాయిలా వెలుగొందింది.

వీళ్ళిద్దరూ కాకుండా శ్రీయుతులు వేంకటాచారిగారు వేంకటేశ్వరరావుగారు అనే మరో ఇద్దరూ విద్యార్థి దశను దాటి గృహస్థాశ్రమంలో స్థిరపడి ఉద్యోగపర్వాలలో సాగుతూ వచ్చి మళ్ళీ పోస్టుగ్రాడ్యుయేషన్ నిమిత్తం విద్యార్థి దశకు వెనుకకు వచ్చినవాళ్ళు. ఈ విషయాని&న్ని ప్రస్తావిస్తూ "మీరు మా సహాధ్యాయులం అని ఎవరితోనైనా చెప్పారంటే జాగ్రత్త! మిమ్మల్ని మాతో సమవయస్కులనుకుంటారు'' అంటూ నవ్వుతూ ఉండేవారు దక్షిణామూర్తిగారు. క్రితంసారి అదే చివరిసాని అని అనుకోలేదు కానీ కలుసుకొన్నప్పుడు పూర్వ స్మృతులు నెమరువేసుకొంటూ ఈ మాట జ్ఞప్తికి రాగానే ఇప్పుడా సమస్య లేదులెండి అని నువ్వుకున్నాం.

మా సహాధ్యాయులందరిలోనూ దక్షిణామూర్తిగారితోనే మాకు చిరకాలం చిరవిదాకా మైత్రి కొనసాగింది. ఇక్కడ మేము అంటే కొంచెం వివరిస్తాను. మా విద్యార్థినులం అంతా సమానంగా స్నేహితులమే అయినా ఒక నలుగురం మాత్రం అతి సన్నిహితులమయ్యాము. ఆత్మీయతను పంచుకున్నాము, పెంచుకున్నాము. సాహిత్యం మాఉ ముఖ్య వ్యాపకం. మా పేర్లు నేను డా. ఐ.వి.కాంతలక్ష్మి, మిగిలిన స్నేహితురాళ్ళు డా. బి. దీనావతి. డా. డి. విద్యేశ్వరి, శ్రీమతి జి. గౌరీ సరస్వతి, కలసి మెలసి కబుర్లు పంచుకున్నట్లే కలిసి మెలసి ఎన్నో పుస్తకాలు చదివాం. తర్కించుకున్నాం. సమీక్షించుకున్నాం. కలిసి తెలుగు విశ్వ విద్యాలయం, ఈనాడు వారి తెలుగు వెలుగు ఇత్యాది కొన్ని ప్రాజెక్టుల్లో పనిచేశాం. ఎవరిమటుక్కు వాళ్ళం. నేను, విద్యేశ్వరి కలిసీ వ్యాసలు వ్రాశాము, పుస్తకాలు వ్రాసి ప్రచురించాము. వీటన్నిటినీ దక్షిణామూర్తిగారు చదివి, మమ్మల్ని చాలా ప్రోత్సహించేవారు. మీరు చదువుకున్న చదువును సార్థకం చేసుకుంటున్నారు అనేవారు. చక్కని సలహాలనిచ్చేవారు. తమ రచనలన్నింటినీ మాకు బహూకరించేవారు. వాటిని గురించి సుదీర్ఘంగా సంభాషణలు సాగించేవాళ్ళం. ఎం.ఏ చదివేనాటికి నవలా/ కథా రచయితగా పేరు పొందిన దక్షిణామూర్తిగారు తెలుగు అకాడమీలో పదవులు చేపట్టి తమ నైసర్గికమూ, జన్మగతము అయిన మేధస్సు, జిజ్ఞాస, పరిశీలన, పరిశోధనా పాటవాలకు తాము గడించిన వైదుష్యము, రచనా వైదగ్ధ్యములు తోడు కాగా సార్థం చేసుకొని మంచి భాషావేత్తగా, నిఘంటు నిర్మాణ నిపుణులుగా, విమర్శకాగ్రేసరులుగా, పరిశోధకులుగా బహు విషయకమైన విజ్ఞానంతో పరిణతి సాధించి సారస్వత రంగంలో ఒక విశ్వరూపాన్ని చూపారు.

క్రమంగా ఒక ఆధ్యాత్మిక భక్తి తత్త్వవేత్త ఆయనలో ఆవిష్కృతమయ్యారు. తత్ఫలితమే ఆయన దృష్టి యోగి ఆత్మకథపై ప్రసరించడము. ఆ గ్రంతరాజానికి అనువాదం చేపట్టడం జరిగాయి. అది కేవలం అనువాదం కాదు. ఒక యోగ సాధన, తాత్త్విక చింతన, ఆత్మ తత్త్వ విచారము, భక్తి, జ్ఞాన కర్మ యోగాల సారము సమ్మిళితమై ఆయన మేధస్సును, లేఖినిని రసప్లావితం చేశాయి. దాన్ని గురించి వారితో మాట్లాడుతూ ఈ గ్రంథం కేవలం అనువాదం కాదు. దీనికి మామూలు రచనా పాటవం చాలదు. మామూలు పాండిత్యమూ చాలదు. దక్షిణామూర్తి అన్న మీ పేరును సార్థకం చేసుకున్నారు. మీరు మేధా దక్షిణామూర్తులే అన్నాను. ఆయన పెద్దగానవ్వి మీకొక్క విశేషం చెప్పనా అంటూ తాను తన మాతృగర్భస్థ శిశువుగా ఉన్నప్పటి ఒక అద్భుతమైన అనుభవాన్ని చెప్పారు.

తమ తండ్రిగారు ఉపాసకులు. నిత్యమూ దక్షిణామూర్తిస్తోత్ర పారాయణము చేసేవారట. తమ తల్లిగారు గర్భిణి. శ్రద్ధగా ఆ స్తోత్రాన్ని భక్తితో వినేవారట. ఒకరోజు చాలా విచిత్రంగా ఆమె కాళ్లు చేతులు కొట్టుకుంటూ స్పృహ తప్పి పడిపోవడము, నిమిషాలలో ఊపిరి కూడా స్తంభించి చైతన్యరహితంగా అయిపోవడమూ

సంభవించిందట. అందరూ నిశ్చేష్టులై దిగ్భ్రాంతిలో ఉండిపోయారట. ఇంతలో వారి ప్రక్క ఇంట్లో నుండి గొల్లున ఏడుపులు వినిపించడమూ, దక్షిణామూర్తిగారి తల్లిగారు స్పృహలోకి వచ్చి చైతన్యవంతులవడమూ జరిగిందట. తనకు జరిగిన అనుభవాన్ని ఆమె స్వయంగా ఇలాగ చెప్పారట. ఎవరో ఇద్దరూ భయంకరాకారులు నన్ను పట్టి లాగుకొని పోతున్నారు. ఇంతలో మరొక అదృశ్యశక్తి ఈమెను ఎందుకు తీసుకొని వచ్చారు. ఈమెకింకా కాలం ముగియలేదంటూ వాళ్ళని అదిలించారు. వెంటనే వాళ్ళు నన్ను వదిలివేసి ప్రక్క ఇంటికి వెళ్ళినట్లున్నారని ఆ విచిత్ర సంఘటనను వర్ణించి చెప్పారట. తామంతా నివెవ్వరపోయి తాము చేసే పారాయణకు ఆమెను రక్షించిందని నన్ను ఎంతో భక్తితో శిశువు జన్మించిన తరువాత దక్షిణామూర్తి పేరు పెట్టారని, అట్లా తాను దక్షిణామూర్తి నామధేయుడనయ్యానని నవ్వుతూ చెప్పారు. ఇది ఒకప్పటి ప్రత్యక్ష సత్యం. పరమేశ్వరుడి అనుగ్రహంతో మృత్యువాత పడకుండా తప్పించుకొని జన్మనెత్తిన ఆ పుణ్యమూర్తి మహా రచయిత కాకపోవడం ఎలాగ?

ఇటువంటి దక్షిణామూర్తిగారు మాకు మిత్రులు, ఆత్మీయులు, సన్నిహితులు అనుకుంటే గొప్ప కదా మరి!

చివరగా వేదనతో రెండు మాటలు. ఇంతటి మహా రచయిత, వ్యక్తి లేకపోవడం వారి కుటుంబానికే కాదు మాబోటి ఆత్మీయులకు, తెలుగు సారస్వత ప్రపంచానికి కూడా తీరని లోటు. మా వేదన ఇంకా ఉంది. నేను పైన పేర్కొన్న మా నలుగురి స్నేహితురాళ్ళలో గౌరీ సరస్వతి 2019లోనూ, విద్యేశ్వరి 20202లోనూ మరో నాలుగు మాసాలకే దక్షిణామూర్తిగారు దివంగతులవడం నాకు, మా దీనవతికి దుర్భరమైన వెలితి. దుఃఖ కారణం. వీరందరి ఆత్మకు శాంతి కలుగు గాక!

# సహాధ్యాయులు

**డా. బంధకవి దీనావతి,** ఫోన్ : 998 962 1179

1963-65 సంవత్సరాలలో మేము ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగులో చేరిన సమయం. మేం ఏడుగురు అమ్మాయిలం. అప్పుడే డిగ్రీ పూర్తి చేసి ఎం.ఏ.లో చేరాం. అబ్బాయిలలో నలుగురైదుగురు అప్పుడే డిగ్రీ పూర్తి చేసి వచ్చినవారు. నలుగురు వయసు కాస్త పైబడిన వారు. అంటే వారు వివిధ ఉద్యోగాలు చేస్తూ, చేసి వచ్చి ఎం.ఏ.లో చేరినవారు. వారిలో ముఖ్యులు వోలేటి సుబ్బారావు గారు. వీరు జంట కవులుగా ప్రసిద్ధి చెందిన వేంకట పార్వతీశ కవులలోని పార్వతీశం గారి కుమారులు. ఎం.ఏ.లో చేరిన నాటికే కవిత్వ రచనలో లబ్ధప్రతిష్ఠులు. రెండవ వారు పోరంకి దక్షిణామూర్తి గారు. అప్పటికే కథా రచయితగా నవలా రచయితగా ప్రసిద్ధులు. క్లాసులో సాహిత్య చర్చలు జరుగుతుండేవి. దక్షిణామూర్తి గారు అతి సున్నితమైన హాస్యంతో కూడిన చెణుకులు విసురుతుండేవారు.

మేము ఎం.ఏ. చదివేటప్పుడు మా గురువులు తెలుగు విభాగంలో దిగ్గంతులని పేరు పొందిన ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు, డా. దివాకర్ల వేంకటావధాని గారు, పల్లా దుర్గయ్య గారు, చెలమచర్ల రంగాచార్యులు గారు, డా. సి. నారాయణ రెడ్డి గారు, డా. నాయని కృష్ణకుమారి గారు, నిడదవోలు వేంకట్రావు గారు. ఇలాంటి మహానుభావుల వద్ద చదువుకునే భాగ్యం మాకు లభించింది.

సహాధ్యాయులుగా పోరంకి దక్షిణామూర్తి గారు, శశాంక గారు వంటి వారితో కలిసి చదువుకోవడం మా అదృష్టంగానే భావిస్తాం. పోరంకి దక్షిణామూర్తి గారు, మా వారు రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో సమకాలీనులు. వారి శ్రీమతి, మా ఆడపడుచు పాఠశాలలో సహాధ్యాయులు కూడా. వీటన్నింటి వల్ల మా మైత్రి చివరి వరకూ కొనసాగింది.

2019 సంవత్సరంలో దక్షిణామూర్తి గారి ఆరోగ్యం బాగుండలేదని తెలిసి, నేను మా స్నేహితురాలు కలిసి వారిని చూడడానికి వెళ్లాం. మమ్మల్నిద్దర్నీ చూడగానే ఆయనకి మేం ఎం.ఏ. చదివే నాటి రోజులు జ్ఞాపకం వచ్చి ఎన్నో సంఘటనలు జ్ఞాపకం చేసుకొని మాకు చెప్పారు. ఆ తరువాత నేను, మా ఆడపడుచు చూడ్డానికి వెళితే అలమారలో వున్న పుస్తకాలు, నిఘంటువులు చూపిస్తూ ఆ నిర్మాణాల్లో ఆయన పనిచేయడం, భద్రిరాజుగారితో మాండలిక పదకోశంలో పనిచేయడం వంటి అనేక విషయాలు చెప్పారు. ఆరోగ్యం బాగా లేకపోయినా, ఆయన తన సాహిత్య సేవ గురించే మాట్లాడారు. అంతగా సాహిత్య కృషితో మమేకమైన వ్యక్తిత్వం ఆయనది. వారి మరణం వారి కుటుంబానికీ, సాహిత్యానికే కాదు, మా వంటి మిత్రులకు కూడా తీరని లోటే. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాం.

# కథాగీత - పరిశోధనా బాట

**డా. బి.వి.ఎన్. స్వామి,** ఫోన్ : 9247817732

సుఖదుఃఖాల్ని ఎదుటివారితో పంచుకోవడానికి అనువైన లిఖిత ప్రక్రియ కథానిక. భారతీయ మూలాలు కలిగి, పాశ్చాత్య ప్రభావానికి లోనైన సాహితీ ప్రక్రియ కథానిక. అత్యధిక ఆదరణ కలిగినది కథానిక. ప్రతి మనిషి తనదైన రంగు, రూపు, గుణగణాల్ని కలిగి ఉన్నట్లే, కథానిక కూడా తనదైన స్వరూప స్వభావాల్ని కలిగి ఉంది. ఆకారాన్ని బట్టి, గుణగణాల్ని బట్టి మనిషిని గుర్తు పట్టవచ్చు. లక్షణాల్ని, లక్ష్యాల్ని బట్టి కథానిక ప్రాశస్త్యాన్ని నిర్ధారించవచ్చు. కథానికా సాహిత్య జ్ఞానము ఇందుకు దోహదపడుతుంది. అలాంటి జ్ఞానం కోసం భారతీయ, పాశ్చాత్య కథానికా సాహిత్యాన్ని కాచి వడబోసి, నిర్వచించి, లక్షణ చర్చ చేసి, లక్ష్యసిద్ధిని నిర్ధారించి **"కథానికా స్వరూప స్వభావాలు"** అనే పేరున ఒక ఉద్గ్రంథాన్ని సాహితీ సమాజానికి పోరంకి దక్షిణామూర్తిగారు అందించారు. తెలుగు కథానికా సాహిత్యశాస్త్రంలో ఇది తొలి సిద్ధాంత గ్రంథం. అప్పటివరకు ఏవో కొన్ని చిన్న చిన్న పుస్తకాలు, కొత్తగా కథానికలు రాసే కథకుల కోసం రాయబడి ఉన్నవి. ఈ సిద్ధాంత గ్రంథం వెలువడే నాటికి సమగ్ర కథానికాశాస్త్ర గ్రంథాలు లేవు. సర్వకాలాలకు ఉపయోగపడేవిధంగా సమగ్రమైన సమాచారాన్ని, అవసరమైన అవగాహనను అందించే పుస్తకంగా రచయిత దీనిని తీర్చిదిద్దారు.

ఇందులో ఐదు అధ్యాయాలున్నాయి. **1. కథాముఖం 2. తెలుగు కథ – దాని కథ 3. కథానిక – స్వరూప నిరూపణ 4. కథానిక : స్వభావ పరిశీలన 5. కథానిక : సమాజం.** ఈ ఐదు అధ్యాయాలను పరిశీలించినట్లయితే మూడు, నాలుగు, ఐదు అధ్యాయాలు మాత్రమే పరిశోధనాంశమునకు సంబంధించినవి. మొదటి రెండు అధ్యాయాల్లో మానవ వికాస పరిణామ క్రమంలో కథానిక పొందిన చారిత్రక దశల్ని, మనుషుల స్పందనల్ని పొదవుకొని అది విస్తరించిన తీరు తెన్నుల్ని విశదీకరించారు. ఆధునిక పాశ్చాత్య కథానికా లక్షణాల్ని, భారతీయ కథానికా రూపురేఖల్ని తులనాత్మకంగా పరిశీలించారు. మౌఖిక – లిఖిత సాహిత్యాలకు గల భేదాలని, జానపద కథారూపాలు రూపొందడానికి దోహదపడిన సామాన్య సూత్రాలను చర్చించారు. గేయశాఖ, ప్రాచీన కావ్యశాఖ, ప్రాచీన కథాకావ్యశాఖ, వచన కథాశాఖ, ఈ నాలుగు శాఖల్లో ఏర్పడ్డ పరిణామ వికాసాలను వివరించారు. పాశ్చాత్య దేశాల్లో ఈ ప్రక్రియ సాధించిన ప్రగతిని, అది వేసిన ప్రభావాల్ని అంచనా వేశారు. భారతదేశంలో మొదట బెంగాలీలో తరువాత హిందీ, తెలుగు భాషల్లో ప్రక్రియా పరంగా కథానిక ఆవిర్భవించిందని అభిప్రాయపడ్డారు. తెలుగు కథానికా రచయితల కృషిని, కథానికా ఉజ్జ్వల భవిష్యత్తును అంచనా వేశారు. శతాబ్దాలకు పూర్వమే లాక్షణికులు కథానిక లక్షణాల్ని నిర్ధారించారని పేర్కొన్నారు. ఈ రెండు అధ్యాయాల చర్చ, మిగతా మూడు అధ్యాయాలకు ఒక భూమికను ఏర్పరచింది. దీని ఆధారంగా శాస్త్రీయ సైద్ధాంతిక దిశాదర్శనం జరిగింది. కథానికా సాహిత్యశాస్త్ర జ్ఞానం అందింది.




శరీరము లేని ప్రాణి ఉండనట్లే, స్వరూపము లేని ప్రక్రియ ఉండదు. శరీరాకృతి స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. కథ ఒక సాహిత్య ప్రక్రియ కనుక దానికీ స్వరూపం ఉంది. మూడవ అధ్యాయంలో కథానిక స్వరూప నిరూపణ చేశారు. ఇందుకు భారతీయ, పాశ్చాత్య సాహిత్య శాస్త్రాల్ని మథించారు. ప్రపంచంలో ప్రథమంగా చిన్న కథను ప్రక్రియగా గుర్తించిన ఘనత అగ్ని పురాణానికి దక్కుతుందని నిర్ధారించారు. అయినప్పటికీ భారతీయ రచయితల మీద దాని ప్రభావం ఎక్కువ లేదని తెలిపారు. అందుకే ఆధునిక కథానికపై పాశ్చాత్య ప్రభావం పడింది. అగ్నిపురాణ కర్త చెప్పిన లక్షణాలన్నీ ఉన్న కథానికలు ప్రాచీన సాహిత్యంలో కనిపించకపోయినా కథానిక నీడలు మాత్రం గోచరిస్తాయని చెపుతూ **"మచ్చుకు విక్రమార్క చరిత్రలోని 12వ కథ తీసుకోవచ్చు. ఈ కథ మొదట సంభ్రమాశ్చర్యాల్లో ముంచే భయానక ఘట్టం ఒకటి కనిపించి, అది క్రమంగా వికసించి అద్భుతమైన నిర్వహణకు తిరుగుతుంది. దీన్ని విస్తరించి బాగా దిద్దితే మంచి కథానిక అవుతుంది. హితోపదేశంలో ఘంటాకర్ణ, కందర్పకేతులు, చాలా కథానికా లక్షణాలలో ఉన్నవి. దశకుమార చరిత్రలోని కొందరి చరిత్రలు ప్రత్యేకించి దిద్దితే మంచి కథానికలవుతాయి"** అని అన్నాడు. కథానికా లక్షణాల్ని నిర్వచించిన కీర్తి అగ్ని పురాణానికే దక్కింది.

అగ్నిపురాణం 337వ అధ్యాయంలో కావ్యాది లక్షణ నిరూపణ సందర్భంలో జరిగిన గద్యకావ్య విభాగం ఇది.

**"ఆఖ్యాయికా కథా ఖండకథా పరికథా తథా**
**కథానికేతి మన్యంతే గద్యకావ్యంచ పంచధా" (337.12)**

ఇతివృత్త భేదాన్ని బట్టి **"కథా, ఆఖ్యాయికా, ఖండకథా, పరికథా, కథానికా అను నైదు గద్య ప్రబంధభేదములు గలవని కావ్యాదర్శ వ్యాఖ్యాత జీవానంద విద్యాసాగర భట్టాచార్యులు తెలిపిరి"** అంటూ కావ్యాలంకార సంగ్రహ వివరణకర్త, వీటి లక్షణాలను మాత్రం ఆయన తెలపలేదన్నారు. పైన చెప్పిన శ్లోకంలోని కథానికే మన **"చిన్నకథ"** అని చెబుతూ ఇంద్రగంటివారు, **"ఈ గద్య కావ్య విభాగాలు ప్రాచీన సంస్కృత ప్రాకృత గద్యకావ్యాలకు సరిపోతాయి. బృహత్కథ "ఆఖ్యాయిక"గా చెప్పవచ్చు. "కథా సరిత్సాగరము" కథ అనే విభాగానికి చేరుతుంది. వాసవదత్త "ఖండకథ", కాదంబరి "పరికథ".** ఇక మిగిలిన "కథానిక"కు లక్ష్యభూతాలయిన వచన రచన లేమీ కనిపించవు. కాని విక్రమార్క చరిత్ర, హితోపదేశము మొదలయిన కథల పుస్తకాలలోని ఒక్కొక్క కథ ఇంచుమించు కథానికా ప్రాయంగా ఉంటుంది అని అభిప్రాయపడ్డారు.

**"భయానకం ముఖతరం గర్భేచ కరుణో రసః**
**అద్భుతోంఽతే సంక్లుప్తార్థా నోదత్తా సా కథానికా"**

1. కథానిక క్లుప్తంగా ఉండాలి. 2. సమాసాలు, వర్ణనలలో కథా శరీరం బిగిసిపోకూడదు. ఇవి బాహ్యలక్షణాలు.

1. కథానిక అద్భుతములైన సంఘటనలు కలిగి ఉండాలి. 2. కరుణ రసాత్మక సన్నివేశాలుండాలి. 3. చక్కటి ముగింపు ఉండాలి. ఇవి అంతర లక్షణాలు.

పాశ్చాత్య కథా వికాసం, ముఖ్యంగా ఫ్రెంచిభాషలో ఏర్పడిన కథా వికాసం, లక్షణనిర్దేశం వల్ల కాక రూపస్పృహ వల్ల ఏర్పడింది. కథానికా ప్రక్రియ గురించిన మౌలిక లక్షణాల విషయంలో అగ్నిపురాణ కాలం నుంచి ఈనాటివరకు భిన్నాభిప్రాయమన్నది లేనే లేదు. భారతీయ లాక్షణికులు సూత్రప్రాయంగా చెప్పిన అంశాలకు పాశ్చాత్య సాహిత్యశాస్త్రంలో వివరణలు గ్రహించవచ్చు. అయితే భారతీయ కథానిక ప్రగతి అనేక శతాబ్దాల కాలం కుంటుపడి ఉ న్నందువల్ల పాశ్చాత్య లాక్షణికులు గమనించిన అంశాలను భారతీయ లాక్షణికులు సంపూర్ణంగా ఆవిష్కరించలేకపోయారని పోరంకివారు తేల్చారు. కథానిక వికాసంలో భారతీయ, పాశ్చాత్య సాహితీవేత్తలు ఏకోన్ముఖంగానే పయనించారు. భారత, పాశ్చాత్య లక్షణ సమన్వయం జరిగింది.

వస్తుగత, రూపగత, సంవిధాన విభాగాలుగా వింగడించి స్వరూప నిర్ధారణకు పూనుకున్నారు. త్రిమితీయంగా విశ్లేషిస్తూ, సోదాహరణంగా వివరిస్తూ కథానికా స్వరూపాన్ని ఆవిష్కరించారు. ఈ విశ్లేషణ దక్షిణామూర్తిగారి మేధోశిశువు.

కథా శరీరానికి చెందినది రూపగత విభాగం. ఇందులో ఆరు అవయవాల్ని ప్రకటించారు. 1. రచయిత పథకం ప్రకారం కథను ఎక్కడ ప్రారంభిస్తారో అది ఎత్తుగడ. 2. ఆదినుండి అంతం వరకు సాగే క్రమమే నడక 3. కథలో వివిధ శక్తుల మధ్య కలిగిన ఘర్షణ విషమస్థితిని కల్పిస్తుంది. 4. కథలో పరాకాష్ఠ అనేది నిర్ణాయక శక్తి 5. పరాకాష్టకు, ముగింపుకూ మధ్య ఉండేది విడుపు లేదా చరమసీమ, ఈ స్థితికి మినహాయింపు ఇచ్చాడు 6. కథా నిర్మాణం యావత్తు ముగింపుపై ఆధారపడి ఉంటుంది.

కథా శరీరాన్ని నిలబెట్టేది వస్తుగత విభాగం. కథకు మూలమైన బీజంతో మొదలుకొని కథ పరమార్థం సిద్ధించేవరకు సాగే ప్రవంతి వస్తుగత విభాగం. 1. కథాబీజం – కథకుడిలో ఆలోచన స్పందనకు, ప్రేరణకు, కారణమైన అంశం కథాబీజం 2. కథావస్తువు – కథకుడిలో నాటుకున్న బీజం, మొలకగా తలెత్తినపుడే విషయం తెలుస్తుంది. విషయమే సాహిత్య పరిభాషలో వస్తువు. 3. కథా వస్తువుకు రచనానుకూలమైన పథకం రూపొందించినపుడు అది ఇతివృత్తం అవుతుంది. 4. పాఠకుడే అనుభూతిని మిగల్చడమే పరమార్థం.

కథా తీరుతెన్నులను తెలిపేది సంవిధాన విభాగం. ఇందులో ప్రధానంగా ఐదు అంశాలున్నాయి. 1. కథలో మార్పుకు లోనయ్యేవి, లోను కానివి, అనే రెండు రకాల పాత్రలుంటాయి. 2. జరిగిన విషయాన్ని సంఘటన అంటాం. కథలో ఎన్నయినా సంఘటనలుండవచ్చు. ఇవి కథా నడకకు దోహదపడతాయి. 3. కథలో సంఘర్షణకు కీలక స్థానముంది. బాహ్య, అంతరంగ సంఘర్షణలు కథను చదివింపజేస్తాయి. 4. కథలో పాత్రలు సంచరించే పరిసరాలు, ఘటనలు జరిగిన నేపథ్యం, వాతావరణం చిత్రిస్తే సన్నివేశం ఏర్పడుతుంది. సన్నివేశ నిర్వహణ కథకు శోభను చేకూర్చుతుంది. 5. కథకుడు ప్రథమపురుషలో గాని, ఉత్తమ పురుష పద్ధతిలో గాని చెప్పడాన్ని కథనం అంటారు.

పై మూడు విభాగాలవల్ల కథానిక రూపురేఖలు అవగత మవుతాయి. కథానిక మరింత స్పష్టంగా అర్థం కావడానికి, సాహిత్యంలో ప్రముఖంగా రాణిస్తున్న నవల, నవలిక, పెద్ద కథ, గల్పిక, స్కెచ్, కార్డుకథ, మినీ కథ, రేడియో కథ, సినిమా కథ అనే వాటితో కథానికకు గల సాదృశ్య వైదుష్యాలను నిరూపించాడు. భారతీయ, పాశ్చాత్య కథానికా సాహిత్య శాస్త్రాన్ని చిలకరించి పొందిన జ్ఞానంలో పోరంకి దక్షిణామూర్తిగారు స్వయంగా "కథానిక"కు ఒక కొత్త నిర్వచనం ఇచ్చారు.

**"ఏకాంశ వ్యగ్రమై స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ "కథానిక".**

పై నిర్వచనం కథానిక లాగా క్లుప్తంగా ఉంది. ఉపనదులన్నీ, నదిలో కలిసి ఏకమైనట్లు, కథానికలో ఉపాంశాలన్నీ, ప్రధానాంశంలో లయించి, లక్ష్యానికి తోడ్పడడమే **ఏకాంశ వ్యగ్రత.** అవసరమైన సంపూర్ణ విషయం ఉండి, చెప్పడానికి మరేమీ లేదన్నట్లుగా భాసించడం **స్వయం సమగ్రత**. పైన చెప్పిన నిర్వచనం, ఆధునిక కథానికకు చక్కగా సరిపోయింది. స్వరూప నిరూపణలో భాగంగా జాలువారి నిర్వచనం, త్రిమితీయ విశ్లేషణ పరిశోధకుడి నిబద్ధతకు అద్దం పట్టాయి.

నాలుగవ అధ్యాయమైన కథానికా స్వభావ పరిశీలనలో కథానికా స్వరూపంలోని వివిధాంశాల వైవిధ్యం, దాని సహజ ప్రవృత్తులూ, తెలుగు కథానికలో ఏవిధంగా ప్రతిఫలిస్తున్నాయో తెలిపారు. స్వభావము, స్వరూపాన్నుండి విడివడి ఉండదు. స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి స్వరూపంపై ఆధారపడాల్సిందే. కథానికలోని అంశాల సర్వ లక్షణ సమాహారమే సమిష్టిగా స్వభావమై ప్రకాశిస్తుంది. సృష్టిలోని పదార్థం, జీవం మొత్తం అణుఘటనతో ఏర్పడినవే. ఆకారం దాల్చినవే. దాని తాలూకు లక్షణలు, వైవిధ్యాలు కలిసి ఆ పదార్థం లేక ఆకారం యొక్క స్వభావంగా రూపొందుతుంది. స్వభావాన్ని అర్థం చేసుకోవాలంటే, అణుఘటనతో ఏర్పడిన ఆకారంలోని అంశాలను లెక్కలోకి తీసుకోవాలి. ఆ క్రమంలో కథానికా స్వరూపంలో నిరూపించిన అంశాలను, అదే క్రమంలో తీసుకుని పరిశోధకుడు విపులంగా పరిశీలించాడు.

**1. కథాబీజం :** ఇది కథా వస్తువును స్ఫురింపజేస్తుంది. మనసులో నాని మొలకెత్తి వస్తువుగా స్థిరపడుతుంది. కథాబీజాలు రచయిత చుట్టూ ఉన్న ప్రపంచంలోనే లభిస్తాయి.

**2. వస్తువు :** బీజస్థితి నుండి వెలికి చచ్చిన మొలక లాంటిది కథా వస్తువు. కథాబీజాలు అనంతమైనట్లే, కథా వస్తువులు కూడా అనంతం. ఎదగడం మొలక లక్షణం. వికాసం చెందడం వస్తువు లక్షణం.

**3. ఇతివృత్తం :** కథానిక పథకము లేదా ప్రణాళికను ఇతివృత్తం అనవచ్చు. ఆ ప్రణాళిక ప్రకారం కథ నడపడం జరుగుతుంది.

**4. పరమార్థం :** ప్రతిదానికి ఒక అర్థం ఉండడం సార్వత్రికం. కథానికలోని అర్థం ఉదాత్తమైనపుడు పరమార్థంగా భాసిస్తుంది. అది నిగూఢంగాను, స్పష్టంగాను, ముఖ్యంగాను, నామమాత్రంగాను రకరకాలుగా ఉనికిలో ఉంటుంది. **"ఏ రచనలో ఈ పరమార్థం ఉజ్వలంగా వెలుగుతుందో ఆ రచన ఉత్తమ రచన. అది ఏ రచయిత హృదయంలోంచి జాలువారుతుందో అతడు ఉత్తమ రచయిత"** అని సూత్రీకరించాడు.

**5. ఎత్తుగడ :** కథానికలో ఆరంభమే ఎత్తుగడ. ముఖద్వారం లాంటిది. వస్తుతత్వానికి అనుగుణమై, పాఠకుడికి ఆకర్షకమై సూటిగా విషయంలోకి వెళ్ళేటట్లుగా ఎత్తుగడ ఉండాలి.

**6. నడక :** ఎత్తుగడ మొదలు ముగింపు వరకు కథ సాగే పద్ధతిని నడక అంటాం. ఇది సూటిగానో, మలుపులు తిరుగుతూనో, పురోగమిస్తూనో, తిరోగమిస్తూనో, మిశ్రగమనంతోనో సాగవచ్చు. జీవితంలో అనేక రకాల నడకలు ఉంటవి. అవి వస్తువు నాశ్రయించి కథలోనే వస్తవి. నడకకు ఒక సార్థకత ఉండాలి. గమన స్వరూపంతో గమన స్వభావం తెలుస్తుంది.

**7. చిక్కు :** కథాగతమైన పాత్ర స్థితికి ఎదురయ్యే సవాలును చిక్కు లేదా విషమస్థితి అనవచ్చు. కథలో ఇది మంచికి, చెడుకు దేనికైనా దారి తీస్తుంది. కథలో మలుపుకు కారణమవుతుంది. పరస్పర విరుద్ధ శక్తులు ఘర్షణ పడ్డప్పుడు "చిక్కు" సంభవిస్తుంది. కథలో ఇలాంటివి ఒకటికంటే ఎక్కువసార్లు ఏర్పడితే "పట్టు"కు దారి తీస్తుంది.

**8. పట్టు :** కొన్ని సమస్యల పరంపర తీవ్రత నందుకొన్నప్పుడు కలిగే స్థితిని పరాకాష్ఠ అనవచ్చు. ఇది పాత్రగతమే కానక్కరలేదు. చదువుతున్న పాఠకుడిలో కూడా ప్రతిస్పందనకు ప్రతీక కావచ్చు. దీన్నే పతాకస్థాయి, కథా శిఖరం అనవచ్చు. కథ పరిపక్వతకు వచ్చిన భాగమే పరాకాష్ఠ అంటాడు శౌరి కృష్ణమూర్తి.

**9. విడుపు :** పట్టు సడలినది మొదలు ముగింపు వరకు ఉన్న భాగాన్ని విడుపు లేదా చరమసీమ అంటారు. అయితే విడుపు లేకుండా పట్టునుంచి నేరుగా ముగింపుకు వచ్చే కథలు లేకపోలేవు. కాబట్టి ఇతివృత్త తత్వాన్ని బట్టి ఈ భాగం అనావశ్యకం కావడం కూడా సహజమే.

**10. ముగింపు :** కథ నిలిచే స్థానమే ముగింపు. ఎత్తుగడను బట్టి ముగింపు, ముగింపును బట్టి ఎత్తుగడ ఒకనానికొకటి అనుగుణంగా రూపొందుతాయి. ఒక పద్ధతి ముగింపులో నిశ్చితత్వం కనిపిస్తుంది. రెండో పద్ధతి ముగింపులో భావస్ఫోరక ముగింపు ఉంటుంది.

**11. పాత్ర :** ఒక రచనలో తన స్వాభావిక లక్షణాలను మాటల్లో గాని, చేతల్లో గాని వ్యక్తం చేసే వ్యక్తిని పాత్ర అంటాం. మారని పాత్ర (ఫ్లాట్ క్యారెక్టర్), మారే పాత్ర (రౌండ్ క్యారెక్టర్) అని రెండు రకాలు. మారని పాత్రకే నమూనా (టైప్) ద్విమితీయ () పాత్ర అనే పేర్లు ఉన్నవి. పాత్ర యొక్క జీవితంలో జరిగే పరివర్తనను సంక్షిప్తంగా, నాటకీయంగా చెప్పడం పాత్ర చిత్రణ.

**12. సంఘటన :** నిత్యజీవితంలో జరిగే ప్రతి పనిని సంఘటన అంటాం. కథా గమనాన్ని ఇది ప్రభావితం చేస్తుంది. సంఘటన ఘటనాశిల్పం కథానికకు గొప్పబలం చేకూరుస్తుంది.

**13. సంఘర్షణ :** రెండు పరస్పర వ్యతిరేకశక్తుల మధ్య కలిగే రాపిడినే సంఘర్షణ అంటున్నాం. ఈ శక్తులు ఒకదానిమీద ఒకటి ప్రాబల్యం వహించడానికి చేసే ప్రయత్నం గాఢమైన కొద్దీ సంఘర్షణ తీవ్రతరమవుతూ ఉంటుంది. ఇటువంటి ఘట్టం బాగా ఆకట్టుకుంటుంది. కనుక కథలో సంఘర్షణయే ప్రాముఖ్యమేర్పడింది.

**14. సన్నివేశం :** స్థానిక పరిసరాలు, కాలం, వాతావరణం, పరిస్థితి, వీటన్నిటి సమాహారం సన్నివేశం. ప్రతీ సన్నివేశంలో ఇవన్నీ ఉండాల్సిన అవసరం లేదు. వీటిలో ఒకటి కాని అంతకంటె ఎక్కువ కానీ ఉంటే సన్నివేశం అవుతుంది. కథలో సన్నివేశ చిత్రణ ఎంత వాస్తవికంగా, ప్రకృతి సహజంగా సాగితే సన్నివేశం అంత గొప్పగా రాణిస్తుంది.

**15. వర్ణన :** చెప్పదలచుకున్న విషయాన్ని కానీ, వ్యక్తుల ఆకార వికారాలను కానీ, మానసిక స్థితిని కానీ, సంఘటనను, సన్నివేశాన్నీ, దృశ్యాన్ని కంటికి కనపడే విధంగా చిత్రించడం వర్ణన. దీనికి అలంకారాలు తోడ్పడుతాయి. ఇవి సంక్షిప్తంగా, ప్రతీకాత్మకంగా ఉండడం కథానికకు ముఖ్యం.

**16. శైలి :** మాట్లాడేటప్పుడు, రాసేటప్పుడు, భాషాభివ్యక్తిలో కనపడే తీరును శైలి అంటాం. పదాలు, పదాంశాలు, పదబంధాలు, వాక్యాంశాలు, వాక్య నిర్మాణాలు, అర్థాలంకారాలు, శబ్దాలంకారాలను వాడుకునే తీరు, ఆ సందర్భంలో కనిపించే లయ, తూగు, పొందిక మొదలైన వాటిని శైలిగా చెప్పవచ్చు. కథను చదివించడంలో శైలి ప్రముఖ స్థానం వహిస్తుంది. ఒక్కొక్క రచయితది ఒక్కో విధమైన శైలి ఉంటది.

**17. కథనం :** స్థూలంగా కథనం రెండు రకాలు. 1 ప్రథమ పురుష కథనం 2. ఉత్తమ పురుష కథనం. కథలో ప్రమేయం లేకుండా కేవలం సాక్షీభూతుడుగా కథకుడు చెప్పేది ప్రథమ పురుష కథనం. పాత్ర పేర్లతో కాని, అతడు, ఆమె వాళ్ళు తెలిసేటట్లుగా సర్వనామాలతో చెప్పడాన్ని ప్రథమపురుష కథనం అంటారు. కథలో పాత్ర అయినవాడు తన ఉనికి తెలిసేటట్లుగా చెప్పేది ఉత్తమపురుష కథనం. దీంట్లో తరచుగా నేను, మేము అయిన వాడు తన ఉనికి తెలిసేటట్లుగా చెప్పేది ఉత్తమపురుష కథనం. దీంట్లో తరచుగా నేను, మేము అనే ప్రస్తావన సాగుతూ ఉంటుంది. ఇలా చెప్పే పాత్రలు కథలో ప్రధానమైన, అప్రధానమైనవి కావచ్చు. పాత్ర స్వభావాన్ని బట్టి గాని, కథలో గల ప్రాధాన్యాన్ని బట్టి గాని కథన దృక్పథం ఏర్పడుతుంది.

**18. శిల్పం :** ఏ పనిలోనయినా **"కళా నైపుణ్యాన్ని చూపే పద్ధతి"**ని శిల్పమనవచ్చు. ఆ నైపుణ్యమే అతని శిల్పంగా ప్రసిద్ధి గాంచుతుంది. ఇది ఏ ప్రక్రియను ఆశ్రయించుకొని ఉంటే ఆ ప్రక్రియ కళగా రాణిస్తుంది. కథానికకు సంబంధించిన నైపుణ్యాన్ని "కథానికా శిల్పం" అంటారు. ఎత్తుగడ మొదలు ముగింపు వరకు పాత్ర మొదలుకొని కథనం వరకు ప్రతిదీ కథానికా శిల్పాన్ని పోషించడానికి ఉపయోగపడుతుంది. దీన్ని స్థూలంగా ఎనిమిది విభాగాలుగా వర్గీకరించాడు. **వస్తు విన్యాస శిల్పం, పాత్రచిత్రణ శిల్పం, సంఘటన ఘటనా శిల్పం, సంఘర్షణోత్పాదన శిల్పం, సన్నివేశ కల్పనా శిల్పం, కథన శిల్పం, వర్ణన శిల్పం, శీర్షికా శిల్పం.**

పైన జరిగిన పరిశీలనంతా స్వరూప నిరూపకాంశాలను తీసికొని స్వభావ పరిశీలనకు పూనుకున్నారు. **"మంచి కథ, గొప్ప కథ"** అనే అంశాన్ని, తెలుగులో ప్రశస్తమైన కథ ఒకటి తీసుకొచ్చి సప్రమాణంగా నిరూపించారు. అలా నాలుగవ అధ్యాయాన్ని అద్భుతమైన పరిశీలనలో, ఉపయుక్తమై వివరణలతో సోపపత్తికంగా, విజ్ఞానదాయకంగా ముగించారు. సంవాదభాష విషయంలో దేశంలో కొన్ని అపోహలు, మిథ్యావాదాలు ప్రాచుర్యం వహించి ఉన్నాయి. వాటిని సప్రమాణంగా ఖండించారు.

**అయిదవ అధ్యాయం : కథానిక – సమాజం.** సాహిత్యానికీ, సమాజానికీ ఉన్న సంబంధ భావనతో ఈ అధ్యాయం మొదలైంది. ఈ రెంటి మధ్య బింబ భావముంది. కథకుడు తప్పనిసరిగా సమాజాన్ని పరిశీలించాలి, సమాజ భావనను అవగాహన చేసుకోవాలి. అందుకే ఈ విభాగంలో సమాజాన్ని నిర్వచించారు. దానిలో అంతర్భాగాలను సూచించారు. **"శాస్త్రీయ దృష్టి : మిథ్యావాదాలు"** అనే శీర్షిక కింద జాతి, మత కుల భావనల విషయం లోను, జైవిక కారకాల విషయంలోను, యుద్ధ విషయంలోనూ ప్రాచుర్యం వహించి ఉన్న అపోహలనూ మిథ్యావాదాలనూ ఖండించారు. భౌగోళిక విస్తృతి, భాష, సంస్కృతి – సంప్రదాయాలు అనే అంశాలను ప్రధాన నిరూపకాలుగా గ్రహించారు. తెలుగు మాతృభాషగా గలవాళ్ళు ఏ దేశంలో, ఏ ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ వాళ్ళందరూ తెలుగు సమాజం సభ్యులేననే విషయాన్ని **'తెలుగు సమాజ స్వరూపం'** వివరించే సందర్భంలో తెలిపారు. కుటుంబ వ్యవస్థ, వివాహ బంధాల్లోని అంతస్సూత్రాల్ని, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలనూ, తెలుగు సమాజంలో సాగుతూన్న సంస్కరణ కృషినీ వివరించి, వీటి ప్రభావం తెలుగు కథానికలపై ఏవిధంగా ప్రసరించిందో నిరూపించారు.

**"తెలుగు కథానికలో సమాజ స్థితిగతులు"** అనే అంశాన్ని పరిశీలించడానికి ఆరు ప్రధాన అంశాలను ఎంపిక చేసుకున్నారు. 1. సంస్కృతి – సంప్రదాయాలు 2. కుటుంబ జీవనం 3. వృత్తి – ఉద్యోగం 4. రాజకీయ ప్రభావాలు 5. సాంఘిక నేరాలు – దురాచారాలు 6. అభ్యుదయ కామన. వీటి ఆధారంగా సమాజ స్థితిగతులు తెలుగు కథానికలో ఏవిధంగా ప్రతిబింబించాయో సప్రమాణంగా నిరూపించారు.

సమాజంలోని పరిస్థితులను, ధోరణులను పరిశీలించి రచయిత వస్తువును ఎన్నుకుంటాడు. వాస్తవానికి కల్పనను జోడించి కళాత్మకంగా తీర్చిదిద్దుతాడు. రచయితకు **"సామాజిక స్పృహ"** అవసరం. కొందరిలో ఇది సామాజిక స్థితిగతుల అవగాహన వరకే పరిమితమై ఉండి, మరికొందరిలో ఆ స్థితిగతుల వెనుక ఉన్న హేతువుల పరిశీలనకు విస్తరిస్తుంది. ఆ పరిశీలనలన్నిటిని **"రచయిత – సమాజం"** అనే అంశంలో పేర్కొన్నారు. **నిబద్ధత** అనేది రచయిత మీద ప్రభావం చూపే ఆర్థిక రాజకీయాది సాహిత్యేతరాంశాల మీద ఆధారపడి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

ఈ సిద్ధాంత గ్రంథం కొత్త కథకులకు కరదీపిక. పాత కథకులకు రిఫరెన్స్ పుస్తకం. విమర్శకులకు దారిదీపం. పరిశోధకులకు మృష్టాన్న భోజనం. ఈ గ్రంథంలో నాలుగువందలకు పైగా రిఫరెన్స్‌లున్నవి. **"ప్రాచ్య, పాశ్చాత్య, ఆంధ్రాంగ్ల సంస్కృత హిందీ భాషలన్నిటి విస్తృత పరిశీలనలో సేకరించబడ్డవి. ఏదీ అనావశ్యకం అనిపించనివి. గ్రంథకర్త వ్యక్తిత్వ ముద్రను స్పష్టంగా కనిపింపజేసేవి. అగ్నిపురాణం నుండి ఆరుద్రవరకు, బ్రౌను దొర నుండి బంగోరె వరకు, కందుకూరి నుండి కాంతారావు వరకు, గురజాడ నుండి గుర్తు తెలియని వారివరకూ ఎంతమంది సాంప్రదాయిక, ఆధునిక, అత్యంతాధునికుల్ని పరిశీలించారో, ఉపయుక్తమయిన వాటినే వుదాహరించి, పఠనాశక్తిని పెంపొందించి, సాధారణ దైనందిన జర్నలిజంలో జమ అయ్యే కొన్ని విషయాలకు గూడా శాశ్వత సారస్వత స్థాయిని కల్పించారు"** అని ప్రముఖ కథకులు మునిపల్లెరాజుగారు ప్రశంసించారు. నిస్సంశయంగా ఇది ఒక ప్రామాణిక సిద్ధాంత గ్రంథం.

# తెలుగు కథా చరిత్రకు లఘు చిరునామా 'కథానికా వాఙ్మయం'

**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 98482 08533

తెలుగు కథానిక ప్రక్రియపై ప్రామాణిక పరిశోధనకు పర్యాయపదంగా పిలుచుకునే పోరంకి దక్షిణామూర్తి గారు తొలినాళ్లలో రాసిన విలువైన లఘు గ్రంథం **'కథానిక వాఙ్మయం'.** 1975 లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు జాతి సాహిత్య వైభవాన్ని తెలియజేయడానికి కొన్ని లఘు గ్రంథాలను ప్రచురించాలని ఏపీ ప్రభుత్వం వారు నిర్ణయించుకున్నారు. ఈ బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారికి అప్పజెప్పారు. అందులో భాగంగానే ఈ 'కథానిక వాఙ్మయం' గ్రంథం వెలువడింది. నలభై ఎనిమిది పుటల ఈ చిరు పొత్తము వెల రెండు రూపాయలే కానీ, ఇందులోని విశేషాలను మాత్రం వెలకట్టలేము.

పోరంకి దక్షిణామూర్తి గారికి తెలుగు భాషా, సాహిత్యాలపై ముఖ్యంగా కథానిక ప్రక్రియపై గాఢమైన అధ్యయనాసక్తులు ఉన్నాయనడానికి ఈ గ్రంథ ఆరంభ వాక్యాలే నిదర్శనం. **"తెలుగు దేశం కథలకు కాణాచి. ప్రపంచంలో ఏ భాషకూ తీసిపోని కథా సాహిత్యం తెలుగు వాళ్లకుంది. ప్రపంచంలో ఏ భాషకయినా ప్రతిష్ఠ తేగల కథకులు తెలుగుదేశంలో ఉన్నారు"** అంటూ అందుకు నిరూపణగా ఈ గ్రంథ రచనకు పూనుకున్నట్టుగా అనిపిస్తుంది.

కథానిక ప్రక్రియ ఒక ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియగా ఎందుకు భావించవచ్చో మొదటగా పోరంకి వారు బలమైన వాదనే చేశారు. నిడివి తక్కువగా ఉండటం, కథా లక్షణాల్లో ఒకటిగాని, అదొక్కటే కాదు అంటూ శ్రీపాద గారి **'మార్గదర్శి'** కథ అచ్చులో వంద పేజీల పైచిలుకు ఉంది. అయినా అది చిన్నకథే. శాస్త్రి గారు దాన్ని చిన్నకథ అన్నారనే కాదు, చిన్న కథకు కావాల్సిన **'ఏక సూత్రత'** దాంట్లో ఉంది అని కథానికకున్న **'సంక్షిప్తత'** లక్షణానికి విస్తృత అర్థాన్ని, అవగాహనను అందించారు. కథ, కథానిక, షార్ట్‌స్టోరీ అనే పదాల వెనకున్న వ్యత్యాసాలను, సామ్యతలపై స్పష్టతను ఇచ్చారు. వర్తమాన తెలుగు కథను పరిచయం చేసే ముందు భారతీయ సాహిత్యంలో కథా సాహిత్యపు ఆనవాళ్లను, దాని అస్తిత్వాన్ని సాధికారికంగా నిరూపిస్తూ కథావిర్భావాన్ని గురించిన చారిత్రక ఆధారాలు, సాహిత్య గ్రంథాల ఆధారంగా వివరించారు. తెలుగు కథా నిర్వచనాన్ని, లక్షణాలను పరిచయం చేస్తూ సంక్షిప్తతలోంచే ఒక సమగ్రమైన అవగాహనను అందించారు.

ఆధునిక తెలుగు కథకు 1910 కంటే ముందు సి.పి. బ్రౌన్ కాలంలోనే కొన్ని బలమైన అడుగులు పడ్డాయి. బ్రౌన్ దగ్గర పనిచేసిన తాతాచార్లు బహుచమత్కారంగా చెప్పిన కథలను బ్రౌన్ వాటిని **"తాతాచార్ల కథలు"** గా ప్రకటించాడు. అలా సంపుటిగా భద్రపరచడం వల్ల ఆనాటి కథ కథనాల తీరు తెన్నులు అప్పటి వ్యవహారిక భాష ఎలా వుండేదో మనకు అర్థమవుతుంది. తాతాచార్యులు చెప్పిన కొన్ని కథలు కఠినంగా వున్నాయని బ్రౌన్ తాతాచార్ల కథా సంపుటిలో చేర్చలేదు. అలా ఆయన వదిలివేసిన వాటితో పాటు కొన్ని **'అదనపు కథలు'** కూర్చి సమగ్రమైన సంపుటంగా బంగోరే రూపొందించి ప్రచురించాడనే చారిత్రక విశేషాలను ఈ గ్రంథంలో అందజేశారు, బ్రౌన్ కంటే ముందే కల్నల్ మెకంజీ సేకరించిన కైఫియత్తులలో జనబాహుళ్యంలో వ్యాప్తిలో వున్న ఆసక్తికర కథలు వున్నాయనే మరో పరిశోధనాంశాన్ని సైతం ఈ సందర్భంగా మనతో పంచుకుంటూ ఈ గ్రంథాన్ని ఆసక్తికరంగా మలుస్తారు పోరంకి వారు.




మధిర సుబ్బన్న దీక్షితులు గారి **'కాశీ మజిలీ కథ'** లను తెలుపుతూ **'ఈ కథలు చేసిన మేలు మరవరానిది. దేశంలో పఠనాసక్తి పెంపొందడానికి చాలా తోడ్పడ్డాయి'** అంటారు. కందుకూరి వీరేశలింగం గారు రచనల ద్వారా చేసిన సంఘ సంస్కరణ, ఉపదేశాత్మకత విలువైనదిగా ప్రశంసిస్తూనే ఆయన కథా రచనను ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా స్పృహలో ఉంచుకొని పెంపొందించడం మాత్రం జరగలేదు అని గుర్తిస్తాడు. **"పంతులుగారు రాసిన కథలు ప్రయోజనపరంగా ప్రాముఖ్యం పొందాయే తప్ప ప్రక్రియా పరంగా ప్రాధాన్యం పొందలేకపోయాయి''** అని నిర్మొహమాటంగా వ్యాఖ్యానిస్తారు.

ఈ గ్రంథంలో 1910 నుంచి 1975 వరకు ఆరు దశాబ్దాల తెలుగు కథా సాహిత్య గమనాన్ని స్థూలంగా

పరిచయం చేసే ప్రయత్నం చేశారు. తెలుగు కథా వాఙ్మయ చరిత్రలో 1910 సంవత్సరం ఒక సరిహద్దుగా నిలుస్తుందని నిర్ధారించడానికి గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు' కథలో కథానిక లక్షణాలను సమన్వయించి చూపుతారు. **"1910 కి ముందు వెలువడిన కథలన్నీ విషయ ప్రాధాన్యమున్నవే గాని ప్రక్రియా ప్రాధాన్యమున్నవి కాకపోవడం వల్ల ఆధునికుల దృష్టిలో 'తెలుగు కథానిక' అన్నది 1910 లో పుట్టింది"** అని ఒక చర్చాత్మక వాదన చేశారు.

తెలుగు కథా వాఙ్మయంలో వందలాది మంది కథకులు, వేలాది కథలతో సంపన్నం చేశారు. వారందరినీ ఈ లఘు గ్రంథ పరిధిలో ప్రస్తావించడం సాధ్యం కాకపోవచ్చు అంటూ పోరంకి వారు ముందుగానే క్షమాపణలు తెలియ జేస్తూ ప్రముఖమైన వచనలను, ప్రసిద్ధ కథకులను పరిచయం చేశారు. అయినా సరే ఈ గ్రంథంలో తెలుగు కథ సాధించిన గొప్ప లక్ష్యాలను పరిణామాలను, వికాస క్రమాన్ని మంచి ప్రణాళికాబద్ధంగా తెలియజేశారు.

ఈ గ్రంథకర్త రచయితల దృక్పథాన్ని, వారి శిల్ప నైపుణ్యాన్ని, అభివ్యక్తి రీతులను, కథన పద్ధతులను గురించి కొన్ని మౌలికమైన అభిప్రాయాలను వెల్లడిస్తారు. కథను సంక్షిప్తంగా పరిచయం చేస్తూనే కథాసారాంశ అవగాహన, పూర్తి కథాపాఠ్య పఠనానుభూతిని కలిగిస్తారు. కొందరు కథకులను ఒకే ఒక వాక్యంలో పట్టుకుంటారు. **చింతా దీక్షితులు** గారు తెలుగు కథ తొలి నాళ్లలో రోచకమైన రచనలు చేసిన కథకుడిగా పేర్కొంటూ **'వ్యావహారికం ఒడుపులు తెలిసిన ఉత్తమ శిల్పి'**గా ప్రశంసిస్తారు. **శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి** కథలు విశిష్టమైనవిగా ప్రశంసిస్తూనే **'ఆయనకు జీవన విధానంలో ఎన్ని పట్టుదలలున్నాయో రచనా విధానంలో కూడా అన్ని పట్టుదలలున్నాయి'** అంటూ శ్రీపాద కథా దృక్పథ మూలాలు వారి జీవితానుభవాల్లోంచి తొంగిచూస్తాయనే సత్యాన్ని విడమరిచి తెలుపుతారు.

**గుడిపాటి వెంకటాచలం** గారి సంచలనాత్మక భావాలను గురించి పోరంకి వారు సానుకూలంగా పరిచయం చేశారు. చలం కాలంలో వారి రచనలపై కొందరి వ్యతిరేకతను తెలుపుతూ, ఆయన రచనల్ని ఒకపక్క కొందరు బూతుల బుంగలని ఈసడిస్తున్నా అనేకులు వాటిని ఆచరించారు. చెప్పదలుచుకున్న విషయాన్ని ఆయన చెప్పినంత పవర్‌ఫుల్‌గా, సూటిగా చెప్పగలిగిన వాళ్లు మరొకరు లేరు. వాద ప్రతివాదాలలో ఆయన దిట్ట. ఆయన చెప్పిన అభిప్రాయాలతో అనేకులు ఏకీభవించవచ్చు. కానీ ఆయన విషయమై అప్పటికి ఇప్పటికీ చెప్పుకొనేది ఒకటుంది. అది ఆయన చిత్తశుద్ధి అని చలం సాహిత్య వ్యక్తిత్వాన్ని మూల్యాంకనం చేసి చూపుతారు. **అడవి బాపిరాజు** కథలను విశ్లేషిస్తూ **'ఈయన మాదిరిగా సౌందర్యమూర్తులనూ, కళా పిపాసులను ప్రధాన పాత్రలుగా తీర్చిదిద్దిన రచనలు చేసిన వాళ్లు చాలా అరుదు'** అని ప్రశంసిస్తారు. తెలుగు కథా సాహిత్యంలో తనదైన శైలిని ఏర్పరుచుకున్న **మల్లాది రామకృష్ణ శాస్త్రి** ప్రత్యేకతల్ని వివరిస్తారు పోరంకి. **'గతిస్తున్న తరంలోని రసరమ్య జీవితానికి అద్దంపట్టడంతో పాటు భావుకతకు తగ్గ పలుకుబడి, పలుకుబడికి తగ్గ ఉరవడితో రచనకు జీవం పోస్తాద'**ని మల్లాది కథల్లోని నాడిని పట్టుకుంటాడు. అంతేకాదు **"ఈయన రచన అనువాదానికి లొంగేరకం కాదు. ఈయన పలుకుబడిలోని అందచందాలు చదివి ఆనందించే అదృష్టం ఒక్క తెలుగు వారికే దక్కుతుంది"** అంటూ మల్లాది వారి కథల్ని మళ్లీ వెంటనే చదివించేలా వ్యాఖ్యానిస్తారు. తెలుగు కథకుల్లో **కొడవటిగంటి కుటుంబరావు** గారు చేసిన కృషి విస్తృతమైనది. **"వస్తువులోను, సంవిధానంలోనూ, దృక్పథంలోనూ ఆయన తెచ్చిన మార్పులు తెలుగు కథను పరిపుష్టం చేశాయి"** అని కొ.కు. కథా విశ్వరూపాన్ని చిన్న పేరాలో ఆవిష్కరిస్తారు. **సురవరం ప్రతాపరెడ్డి** గారికి కథకుడిగా శాశ్వత కీర్తి తెచ్చిన 'నిరీక్షణ'కథను పరిచయం చేస్తూ వారి సమగ్ర కథాయానాన్ని వివరిస్తారు. **తెలంగాణ జన జీవితాన్ని కథల్లో విస్తృతంగా చిత్రించాడని** ప్రశంసిస్తారు. **వట్టికోట ఆళ్వారు స్వామి** గారి 'జైలు లోపల' కథల వైశిష్ట్యాన్ని కూడా పరామర్శించారు.

తెలుగు కథకు అంతర్జాతీయ పునరస్కారాన్ని అందించిన **పాలగుమ్మి పద్మరాజు** గారి 'గాలివాన', 'పడవ ప్రయాణం' కథల్లోని శిల్ప విశేషాలను రేఖామాత్రంగా వివరిస్తారు. **రావిశాస్త్రి** గారిని తలచుకుంటూ **"కథకుల కథకుడు అని ఉన్నతంగా వర్ణిస్తూ చిట్టిపొట్టి వాక్యాలతో ఎంత శక్తివంతమైన కథలు రాయవచ్చో ఈయన కథలు నిరూపిస్తాయి"** అని ప్రశంసిస్తారు. **మధురాంతకం రాజారాం** గారు **"అచ్చం శుభవార్త తెచ్చిన బంధువులాంటివాడు", భమిడిపాటి రామగోపాలం** బహుగడసరి, నీలి అనగానే చటుక్కున స్ఫురించేది మందు కాదు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ అన్న పేరు ఇలాంటి ఏకవాక్య ప్రయోగాలతో ఆయా కథకుల కథామూర్తిమత్వాన్ని వర్ణిస్తారు పోరంకి.

ఈ విధంగా తెలుగు కథా సాహిత్యంలో కథక చక్రవర్తులు, మహారాజులు అనదగ్గ **చాసో, కా.రా., పెద్దిభొట్ల సుబ్బరామయ్య, రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, యశోదారెడ్డి, త్రిపురనేని గోపీచంద్, రావూరి భరద్వాజ, సత్యం శంకరమంచి, భాస్కరభట్ల కృష్ణారావు, నగ్నముని, శీలావీర్రాజు, వాకాటి పాండురంగారావు, కరుణ కుమార, బలివాడ కాంతారావు** మొదలైన కథకుల రచనలు పరిచయం చేస్తూ వారి కథన రీతులను స్పృశిస్తారు. ఈ తరం వారికి తెలియని కొన్ని అరుదైన కథకుల పేర్లను, అనేక సాహిత్య విశేషాలను ఇందులో ప్రస్తావించారు. కథానిక ప్రాచుర్యానికి రేడియో ఏవిధంగా తోడ్పడిందో వివరిస్తారు. 1962 లో హైద్రాబాద్ రేడియో కేంద్రం వారు దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి చొరవతో 'ఏకాదశి' అన్న పేరుతో కథక సమ్మేళనం జరిగిందనే విషయాన్ని తెలుపుతారు. రేడియోలో ప్రసారమయ్యే కథల రచనా శైలి ఏవిధంగా వుండాలో సూచన చేస్తారు.

ఈ గ్రంథం పేరుకే లఘుగ్రంథం కానీ ఆరు దశాబ్దాల తెలుగు కథా చరిత్రను కొండ అద్దమందు లాగా కంటే మిన్నగానే చూపించింది. ఆరు దశాబ్దాల కాలంలో కథానిక ప్రక్రియలో చోటుచేసుకున్న విభిన్న పరిణామాలను కూడా చర్చించారు. తెలుగు కథ సమకాలీన జీవితంలోని అనేక సామాజిక పార్శ్వాలను తడుముతూ అనంత వస్తువైవిధ్యాన్ని చూపెట్టిందంటారు. అచ్చమైన తెలుగు జీవితాన్ని, తెలుగు పలుకుబడిని తెలుగు కథ అందించిందని తెలుపుతూ తెలుగు కథకులు తెలుగు కథకు అందించిన స్థాయిని, కొత్త చేర్పులను మదింపు జేస్తారు. మరోవైపు కొందరు కథలు రాయడంలో శిల్పంపట్ల పట్టింపులు లేకపోవడాన్ని, అతి ఆత్మవిశ్వాసాన్ని, మూస ధోరణులను ఖండిస్తూ హెచ్చరిక లాంటి సూచనలు చేస్తారు. తెలుగు కథను ఇతర భాషల్లోకి తీసుకెళ్తున్న అనువాదకుల కృషిని ప్రశంసిస్తారు. విశ్వవిద్యాలయాల్లో కథానిక ప్రక్రియపై అధ్యయనం చేస్తే బాగుంటుందని ఆశిస్తారు. ఇలా తెలుగు కథల ఉత్పత్తితో పాటు విమర్శ కూడా పెరుగుతూంటే తెలుగులో కథానిక ప్రక్రియ బాగా అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తపరుస్తారు. 1975 లో పోరంకి దక్షిణామూర్తి గారు ఆశించినట్లే వారి కల సాకారమైంది. 2020 నాటికి అంటే ఈ మలిదశ ఆరు దశాబ్దాల తెలుగు కథ గొప్ప ప్రజాదరణ పొందిన ప్రక్రియగా ఉన్నత స్థాయికి చేరుకుంది. కథా విమర్శ కూడా విస్తృతంగా వెలువడుతుంది. డా. పోరంకి దక్షిణామూర్తి గారి కథా విమర్శ విశ్వవిద్యాలయాల్లో ప్రామాణిక ఉపయుక్త గ్రంథంగా గౌరవాన్ని అందుకుంది. ఆ వరుసలోనే ఈ **"కథానికా వాఙ్మయం"** అమూల్యమైనది.

# పరిశోధనా దక్షుడు - దక్షిణామూర్తి

**డా॥ ఏలె విజయ లక్ష్మి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 83099 63643




బహుముఖ ప్రతిభతో సాహితీ రంగంలో తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న అరుదైన వ్యక్తులలో డా॥ పోరంకి దక్షిణామూర్తి ఒకరు. కథానిక, నవల వంటి సృజనాత్మక ప్రక్రియలలో తనదైన ముద్ర వేసిన ఈయన గొప్ప భాషాశాస్త్ర పండితుడు. నిఘంటు నిర్మాణకర్త, సంపాదకుడు, అనువాదకుడు, విమర్శకుడు, విలక్షణ పరిశోధకుడు. ఇందుకు నిదర్శనమై నిలుస్తుంది ఈయన **'తెలుగు కథానిక - స్వరూప స్వభావాలు'** అనే శీర్షికతో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం. ఇది కథ మీద పరిశోధన చేసే విద్యార్థులకు ఆకర గ్రంథమై మార్గదర్శనం చేస్తుంది.

**'కథ - సాహిత్య శాస్త్రం'** విమర్శనా వ్యాససంపుటి దక్షిణామూర్తికి కథా సాహిత్యం పట్ల ఉన్న అధికారాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. ఇందులో మొత్తం 13 వ్యాసాలున్నాయి. అందులో ఒకటి ఇంగ్లీషులో ఉంది. వీటన్నింటినీ పరిశీలించినప్పుడు కాల్పనిక సాహితీ ప్రక్రియయైన కథానికకు సాహిత్యశాస్త్ర గౌరవాన్ని కలిగించడానికి ఆయన చేసిన కృషి తేటతెల్లమవుతుంది.

సృజనాత్మక సాహిత్యానికి మూలం భావం. అది విశృంఖలమైనది. దాన్ని ప్రక్రియాబద్ధం చేసినప్పుడు శాస్త్రం అవుతుంది. శాస్త్రానికి నియమ నిబంధనలుంటాయి. సాహిత్య శాస్త్రానికి నియమ నిబంధనలను ఏర్పర్చిన వారిని ఆలంకారికులు అంటారు. భారతీయ ఆలంకారికులలో ప్రథమంగా చెప్పవలసినవాడు నాట్యశాస్త్రాన్ని రాసిన భరతముని.

'కథ - సాహిత్యశాస్త్రం' అనే వ్యాస సంపుటిలో మొదటి వ్యాస శీర్షిక **'కథ - సాహిత్య శాస్త్రం'.** ఇందులో దక్షిణామూర్తి 'కథ' అన్న పదాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వాడిన ఆలంకారిక గ్రంథాలన్నింటినీ పరిశోధించారు. భరతుని నుండీ ప్రారంభించారు తన అన్వేషణను. భరతుడు నాట్యశాస్త్రంలో కథ అన్న మాటను వాడలేదు. కానీ ఆయన నాట్యశరీరంగా చెప్పిన ఇతివృత్తంలోనే (ఇతివృత్తన్తు నాట్యస్య శరీరం పరికీర్తితమ్ - నా.శా. అధ్యా.1) కథ ఉంది అన్నారు దక్షిణామూర్తి. ఆయన తర్వాత దశరూపక కర్త అయిన ధనంజయుడు ఇతివృత్తాన్ని మూడు రకాలుగా (ప్రఖ్యాతం - ఉత్పాద్యం - మిశ్రమం) విభజించి, వివరించాడు. ఈయన ఎక్కడా కథ అన్న పేరును వాడలేదు. మొదటిసారిగా కావ్యాలంకార కర్త అయిన భామహుడు పద్య కావ్య విభజన సందర్భంగా (సర్గ బంధ, అభినేయార్థ, ఆఖ్యాయిక, కథ, ముక్తకాలు) కథను పద్యకావ్యాలలో ఒకటిగా చెప్పాడు. అయితే అప్పటికింకా కథ

వచనరూపాన్ని సంతరించుకోలేదని ప్రాచీన సాహిత్యాన్ని లోతుగా పరిశీలించి చెప్పాడు వ్యాస రచయిత.

సోమదేవుడి పద్యకావ్యమైన కథా సరిత్సాగరం గ్రంథ నామంలోనే కథ ఉన్నది కాని లోపల ఎక్కడా దానికి వివరణ లేదు. కావ్యాదర్శ కర్త అయిన దండి గద్యసాహిత్య వర్గీకరణలో కథను పేర్కొన్నాడు. అయితే నిశితమైన లక్షణం చెప్పలేదు. రుద్రటుడి కావ్యాలంకారంలో లఘుకథ, మహాకథలని కథా భేదాలను చెప్పాడు. కానీ వాటికి లక్షణాలను చెప్పలేదు. ధ్వన్యాలోక కర్త అయిన ఆనందవర్ధనుడు కథా భేదాలైన పరికథ, సకలకథ సర్గబంధం, ఆఖ్యాయిక, కథ మొదలైన కథా భేదాలని చెప్పి వాటిలో కథా, ఆఖ్యాయికా అన్నవి వచనంలో ఉంటాయని తెలిపాడన్నాడు. ఈవిధంగా కథకు శాస్త్ర గౌరవాన్ని ఇవ్వడానికి దక్షిణామూర్తి ఎంతటి పరిశోధనను చేశాడో ఈ వ్యాసం ఎత్తి చూపుతుంది.

హేమచంద్రుడు తన కావ్యానుశాసనంలో కథా ప్రక్రియలోని వైవిధ్యాలను విపులంగా చర్చించి ఆధారాలతో ఎత్తి చూపాడన్నాడు. ఈయన బృహత్కథను గ్రంథనామంగా కాక ప్రక్రియానామంగా పేర్కొన్నాడు అని అన్నారు. సాహిత్య దర్పణకారుడైన విశ్వనాథుడు **"కథాయాం సరసం వస్తు"** అంటూ కథలోని వస్తువు సరసంగా ఉండాలన్నాడు. మొత్తం మీద సంస్కృత ఆలంకారికులు కథలోని రకాలను కొన్నింటిని చెప్పినప్పటికీ దాని లక్షణాలను స్పష్టంగా చెప్పలేదని దక్షిణామూర్తి అభిప్రాయం.

వ్యాస రచయిత సంస్కృత ఆలంకారికులు కథను గురించి చెప్పిన వివరాలతో తృప్తి పడక, ఆధునిక కాలంలో కథా లక్షణాలను చెప్పిన వారిని గురించి అన్వేషించారు. సంస్కృత శాఖ ఆచార్యులు (విశ్రాంత) ప్రొ. నళినీ సాధలే గారి **"కథా ఇన్ సంస్కృత్ పోయిటిక్స్"** అనే సిద్ధాంత గ్రంథాన్ని ఆకరంగా గ్రహించి, ఈ వ్యాసంలో ఉటంకించారు. ఇందులో భాగంగా **'కథా సరిత్సాగర'** కర్త అయిన సోమదేవుడు, **'కాదంబరి'** కర్త అయిన బాణభట్టు చెప్పిన అంశాలను, సోమదేవుడు 'రమ్యా, హృద్యా' అంటూ కథకు చెప్పిన 17 లక్షణాలను ఆమె పరిశోధన గ్రంథం ఆధారంగా తెలిపారు వ్యాసకర్త. చివరగా అగ్నిపురాణం చెప్పిన కథా భేదాలను (ఆఖ్యాయిక, కథ, ఖండ కథ, పరికథ, కథానిక) చెప్పి, వీటిలో మొదటి నాలుగింటిని ఆనందవర్ధనుడు చెప్పాడు. అయితే ఆయన చెప్పిన 'సకల కథ' భేదం అగ్నిపురాణంలో లేదన్నారు. కథానిక గురించి మొదటిగా చెప్పింది అగ్నిపురాణమే అని, అది భారతీయ సాహిత్య మైనందుకు గర్వపడ్డారు వ్యాసకర్త. ప్రొ. నళినీ సాధలేగారు స్వతంత్రంగా కథకు చెప్పిన నిర్వచనాన్ని ఎత్తిచూపారు.

**"కథయా లక్షణం జ్ఞేయం సారత్వేన నిరూప్యతే**
**ఉత్పాద్యం సరసం హృద్యం వస్తు సంకీర్త్యతే కథా" (కథా ఇన్ సంస్కృత్ పోయిటిక్స్, పుట.66)**

రచయిత ఊహలో పుట్టి, రసవంతమయి, హృదయాన్ని ఆకట్టుకునే వస్తువును కథ అంటారు అనేది శ్లోకార్థం.

ఎంచుకున్న అంశానికి న్యాయం చేయడం కోసం ఎంతటి లోతుకైనా వెళ్ళగలిగిన సామర్థ్యం, పరిశోధనా దక్షత దక్షిణామూర్తిలో ఉన్నాయని ఈ వ్యాసం ఋజువు చేస్తుంది.

**"సాహిత్య శాస్త్రంలో కొన్ని కథారూపాల ప్రస్తావనలు"** అనే వ్యాసంలో దక్షిణామూర్తి సంస్కృత ఆలంకారికులు తమ లక్షణ గ్రంథాలలో ప్రస్తావించిన కథారూపాలైన ఆఖ్యాయిక, కథ, ఖండకథ, నిదర్శనం, పరికథ అనే ఐదు కథారూపాలను వివరించారు.

ఆఖ్యాయిక గురించి చెబుతూ దీని గురించి మొదటగా భామహుని కావ్యాలంకారంలో, తర్వాత దండి కావ్యాదర్శంలో, వామనుని కావ్యాలంకార సూత్రాలలో, రుద్రటుడి కావ్యాలకారంలో, ఆనంద వర్ధనుని ధ్వన్యాలోకంలో, అగ్నిపురాణంలో, మమ్మటుని కావ్య ప్రకాశంలో, హేమచంద్రుని కావ్యానుశాసనంలో ప్రస్తావించడం, యథోచితంగా లక్షణాలను చెప్పడం కనిపిస్తుందని ఆయా గ్రంథాల ఆధారంతో చెప్పారు.

ఆధునిక కాలంలో నళినీ సాధలే గారు తమ గ్రంథంలో వివిధ సాహిత్య రూపాలను హేతుబద్ధంగా వర్గీకరించి సాహిత్యాన్ని స్థూలంగా మూడు శీర్షికల కింద విడదీసి **1. దృశ్య రూపకాద్యభినేయం 2. శ్రవ్యసర్గ బంధాది వర్ణ్యం 3. అఖ్యేయ ఆఖ్యాయికాది గద్యం** అని అన్నారన్నారు. వీటిలో ఆఖ్యాయిక, కథ అన్నవి అఖ్యేయి వర్గంలోవి అనీ, రెండూ గద్యంలోనే రాస్తారని చెప్పారు. వీటిలో కథను **"ఉత్పాద్యం సరసం హృద్యం వస్తు కథా"** అని ఆమె నిర్వచించారన్నారు. కల్పితమూ, రసవంతమూ, హృదయాకర్షకము అయిన వస్తు కథనం కథ అని దాని భావం.

**కథ** గురించివివరిస్తూ ప్రాచీన సంస్కృత లాక్షణికులు పద్యంలో గాని, గద్యంలో గాని రెండింటిలో గాని కలిపి గాని రచించిన కావ్యాన్ని ప్రాచీన కథగా పరిగణించారు. కాలక్రమంలో ఈ పదం గద్యకథనాన్నే సూచించడానికి పరిమితమయ్యింది. అనేక సందర్భాల్లో ఇది చిన్నగా ఉండేదే కానీ సందర్భానుసారంగా దీర్ఘకథను సూచించడానికి కూడా ఈ మాట వాడారు. భరతముని ఆదిగా ఆలంకారికులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దీని గురించి అనేక సందర్భాలలో ప్రస్తావించారని సోపపత్తికంగా వివరించాడు వ్యాసకర్త.

**కథానిక** గురించి చెప్తూ అగ్నిపురాణం మాత్రమే ప్రస్తావించిన కథాత్మక వచన ప్రక్రియ ఇది అంటూ అగ్నిపురాణంలో కథకు చెప్పిన లక్షణాలను తెలిపారు.

**"భయానకం ముఖతరం గర్భేచ కరుణోరసః**
**అద్భుతోకన్తే సుక్లుప్తార్థా నోదాత్తా సా కథానికా"**
**(అగ్నిపురాణం 337 అధ్యాయం 20 శ్లో)**

దీని ప్రకారంగా భయానకం, కరుణం, అద్భుతం అనే మూడు రసాలు కథానికలో ఉంటాయని చెప్పి, బహుశః ప్రపంచంలోనే కథానికకొక స్పష్టమైన నిర్వచనమిచ్చిన ఘనత అగ్నిపురాణానికే దక్కుతుందని గర్వంగా చెప్పారు దక్షిణామూర్తి.

ఈ సందర్భంగా కథానిక గురించి నళినీ సాధలేగారు వివరించిన అంశాలను ప్రస్తావించారు. ఆమె కథను మహాకథ – లఘుకథ అని రెండుగా విభజించారు. లఘుకథలోని ఒక భేదమే కథానిక. అది పశు పక్ష్యాదులకు సంబంధించినదని ఆమె తెలిపింది. అప్పుడు కథాసరిత్సాగరం కథలన్నీ ఈ కోవకు చెందుతాయని దక్షిణామూర్తి భావించారు.

ఇంకా ప్రొ.సాధలే చెప్పిన సకల, ఖండ, అంతర, ఉపాంతర, పరికథలను గురించి వివరించారు. **సకలకథ :** ఏ విధమైన మార్పులు లేకుండా స్వయం సమగ్రంగా ఉండేది. **ఖండకథ :** ఆద్యంతాలు ఇతర కథలతో ముడిపడి ఉండేది. **అంతర కథ :** వేరొక కథా మధ్యంలో సందర్భవశంగా చెప్పిన స్వయం సమగ్ర కథ. **ఉపాంతర కథ :** అంతర కథ మధ్యలో చెప్పిన స్వయం సమగ్ర కథ. **పరికథ :** ఒకే కేంద్రం చుట్టూ తిరుగుతూ ఉండి, చక్రం ఆకుల్లాగా చిన్నచిన్న కథలను పుట్టించే ప్రధానకథ. అగ్నిపురాణ కర్త చెప్పిన పరికథ ఆనందవర్ధనుడు చెప్పిన పరికథ కంటే భిన్నమైనదని, అందులో వస్తువు ప్రధానమయి రసాన్ని అణచివేస్తుందని తెలిపాడు వ్యాసకర్త. వీటన్నింటితో పాటు నళినీసాధలే మరో కథా భేదాన్ని చెప్పారు. అది **ఆముఖ కథ.** దీనికి ప్రధాన కథకు సూటిగా సంబంధం ఉండదు. ఉ॥ కథసరిత్సాగరంలో శివపార్వతుల ఉపోద్ఘాతం. ఇందులో **నిదర్శనం** అనే కథాభేదాన్ని హేమచంద్రుడు చెప్పాడు. దీన్ని గద్యంలో గాని, పద్యంలోగాని రాయవచ్చని, పశుపక్ష్యాదుల, ఇతతర ప్రాణుల ప్రవర్తన ద్వారా కార్యాకార్యాలను నిర్ణయించే సాహిత్య ప్రక్రియ అని ఇందుకు పంచతంత్ర గ్రంథాన్ని ఉదాహరణగా చెప్పాడన్నారు.

ఈ వ్యాసంలో మొదటి వ్యాసంలోని అనేక విషయాలు పునరుక్తమయ్యాయి. అయినప్పటికీ వ్యాసకర్త కథను గురించి విస్తృత సమాచారాన్ని అందించటంలో కృతకృత్యులయ్యారు.

**'కథాత్మక వచన సాహిత్యం'** అనే వ్యాసాన్ని నాలుగు భాగాలుగా దక్షిణామూర్తి విభజించారు. మొదటి భాగంలో నవల కథలను వచన సాహిత్య ప్రక్రియలుగా నిర్ధారించి, వాటి పూర్వోత్తరాలను చెప్పారు. భారతీయ ఆలంకారికులు సాహిత్యశాస్త్రంలో కథను ప్రస్తావించిన వివరాలు తెలిపి నళినీ సాధలే గారు కథను గురించి సంస్కృత ఆలంకారికులు చెప్పిన విషయాలను క్రోడీకరించి చెప్పిన విషయాలను వివరించారు. సాధలే గారు పరిశోధనలో కథను గురించి సంస్కృత ఆలంకారికులు పెద్దగా పట్టించుకోలేదు. కథను గురించి ఏదో సందర్భవశంలో చర్చించటమే తప్ప ప్రత్యేక చర్చ లేదు. కథా లక్షణాలు చాలావరకు అనుమాన ప్రమాణం మీదనే తెలుసుకున్నవి. అయితే ప్రాకృత, అపభ్రంశ భాషల్లో కథారచన జరిగిన సంగతి వారు చర్చించారు అని ఆమె చెప్పారని దక్షిణామూర్తి తెలియజేశారు.

సాధలేగారు **'కథాకారుల దృష్టిలో కథ'** అన్న శీర్షికలో బాణభట్టు, కాదంబరిలో, హర్షచరిత్రలో, సోమదేవుడు కథా సరిత్సాగరంలో కథను గురించి చెప్పిన 17 లక్షణాలను ఆమె సిద్ధాంత గ్రంథం ఆధారంగా చూపారీ వ్యాసకర్త.

రెండవ భాగంలో అగ్నిపురాణ నిర్వచనానికి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి వివరణతో స్పష్టం చేశారు. తరువాత అగ్నిపురాణం ప్రతిపాదించిన నిర్వచనం యథాతథంగా ఆధునిక కథకు వర్తించదు. కాబట్టే అంటూ ఆయన తన సిద్ధాంత గ్రంథంలో ప్రతిపాదించిన **"ఏకాంశ వ్యగ్రమయి స్వయం సమగ్రమయిన కథాత్మక వచన ప్రక్రియ కథానిక"** నిర్వచనాన్ని చెప్పారు.

**"కథాత్మక వచన సాహిత్యం"** అనే వ్యాసంలో మొదటగా వచన సాహిత్య ప్రక్రియయైన నవల పుట్టుపూర్వోత్తరాలను, వికాసాన్ని వివరించారు. నరహరిసెట్టి గోపాలకృష్ణయ్య గారు మొదలుకొని కందుకూరి, చిలకమర్తి వంటివారు నవలలు రాయడానికి, అవి రావడానికి గల నేపథ్యాన్ని వివరించారు. అప్పటి సాంఘిక, రాజకీయ పరిస్థితుల ప్రభావం, ఆనాటి నవలలమీద ఎంతగా ఉందో చర్చించారు. అదే ధోరణిలో కథానికను కూడా వివరించారు.

నవల గురించి చెబుతూ కందుకూరి రాజశేఖర చరిత్రను, సమకాలికులు, దానిమీద చేసిన విమర్శలను చర్చించారు. అలాగే ఉన్నవ, మాలపల్లి గురించి, విశ్వనాథ 'చెలియలికట్ట', వేయిపడగలు మొదలైన నవలల ఆవిర్భావాలను, నేపథ్యాలను, వాటి మీద వచ్చిన విమర్శలను చర్చాపూర్వకంగా పరిచయం చేశారు. పండితుల మధ్య జరిగిన వాగ్వాదాలను తెలిపారు. విశ్వవిద్యాలయాల స్థాయిలో నవలపై వచ్చిన సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేశారు.

తర్వాత కథ ఆవిర్భావ వికాసాలను, దానిమీద వచ్చిన విమర్శను వివరించారు. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారి కథానిక వ్యాసం (1936, ఆగస్టు ప్రతిభ) సుప్రసిద్ధమయినది అని చెబుతూ ఆయన అందులో అగ్నిపురాణ నిర్వచనాన్నే ఎత్తి చూపి, కథానికకు ఉండవలసిన బాహ్యాభ్యంతర లక్షణాలను వివరించారని తెలిపారు. 'కథానిక' అన్న పేరును ఆయనే పెట్టారు. అదే సరి అయినదని ఆ తర్వాత సాహితీవేత్తలు గుర్తించారని అన్నారు. బులుసు, తల్లావజ్ఝల, పాలగుమ్మి, శొంఠి కృష్ణమూర్తి మొ॥ ప్రసిద్ధులైన పండితులు కథానిక మీద రాసిన విమర్శనా వ్యాసాలను వివరించారు. విశ్వవిద్యాలయ స్థాయిలో కథానిక మీద వచ్చిన సిద్ధాంత గ్రంథాలను పేర్కొన్నారు. ఈ సందర్భంగా, తాను **'తెలుగు కథానిక – స్వరూప స్వభావాలు'** అన్న సిద్ధాంత గ్రంథం అన్నింటికంటే భిన్నమైనదని ఈ గ్రంథానికి లక్ష్యం తెలుగు కథానికల చరిత్రను వివరించడం కాదు, కథానికను ప్రక్రియా పరంగా విశ్లేషించడం అన్నారు.

కథానిక సంబంధించిన వికాసాన్ని, రచయితలు, సంస్థలు చేస్తున్న కృషిని వివరించారు. సమాజంలోని వాదాలు, సిద్ధాంతాలు సాహిత్యంలోనూ వస్తాయి, పోతాయి. సాహిత్యం నిలుస్తుంది. మానవతా మహత్తు నిలుస్తుంది అన్నారు.

**భారతీయ కథా ప్రస్థానం** అనే వ్యాసంలో దక్షిణామూర్తి మూడు లక్షల సంవత్సరాల కిందట ఏర్పడిన మనుష్యజాతి ఇటీవల నాలుగయిదు వేల సంవత్సరాల కిందటి వరకు మూగబోయి ఉన్నదని ఎవ్వరూ అనలేదు అంటూ ప్రపంచ కథా సాహిత్యంలో భారతదేశానికే అగ్రప్రస్థానం ఉంది అన్నారు. ఋగ్వేదం ఋక్కులను ఉటంకిస్తూ ఆదిమ భావకుడు ఋగ్వేదంలోనే ఉన్నాడు. అతని అనుభూతే కథాబీజం అన్నారు.

**"అపతే తాయవో యథా నక్షత్రాయం త్యక్తుభిః**
**సూరాయ విశ్వచక్షసే (ఋగ్వేదం)**

(చోరుల కార్యకలాపాలకు అంధకారం అనుకూలమైంది. కాబట్టి చుక్కలనే దొంగలు మింటిని ఆక్రమించుకొని ఉన్నారు. ఇంతలో పొద్దుదొర జాడ తెలిసింది. అతని రక్షకభట గణం అల్లదే వస్తున్నది. దాన్నే చూసి 'చుక్కదొరలు' మెల్లగా జారుకుంటున్నారు.) ఈ ఋక్కులో కథాబీజం ఉంది అని అభిప్రాయపడ్డారు దక్షిణామూర్తి.

19వ శతాబ్ది కడుపటికి జరిగిన పరిశోధనలలో ప్రపంచ కథలన్నిటికీ జనకస్థానం భారతదేశమేనన్న సిద్ధాంతం అనేకమంది అంగీకరించారని తెలిపారు. యూరప్, చైనా, టిబెట్, మంగోల్, ఇండోనేషియా దేశాల కథా వాఙ్మయం మీద భారతీయ ముద్ర ఉందంటూ బెన్ఫీ, కోహ్లర్ వంటి పరిశోధకులు నిరూపించారన్నారు. ఇండోనేషియాలో ప్రాచుర్యం పొందిన కథలు అనేకం. అవి యూరప్ కథలతో కంటే భారతీయ కథలతో దగ్గర సంబంధం ఉన్నాయి. జావా, సుమత్రా, బోర్నియో, సెలబెస్, ఫిలిప్పైన్స్ దేశాలలో కథల్లో భారతీయ ముద్ర కనిపిస్తుందన్నారు. బేతాళ, శుక సప్తతి కొన్ని మార్పులతో మంగోల్‌లకు పరిచయమయ్యాయి. భారతీయ కథాకథన సంప్రదాయం ప్రాచ్య పాశ్చాత్య దేశాల మీద ప్రభావం చూపింది అని, ఇందుకు పాశ్చాత్య పండితుల కృషి దోహద పడిందని తెలిపారు.

**"తెలుగు కథానిక – ప్రారంభదశ"** అనే వ్యాసంలో దక్షిణామూర్తి వచన సాహిత్య ప్రక్రియల్లో కథానిక విలక్షణమైనదని ప్రారంభించి, కథ వేరు, కథానిక వేరు అని నిర్ధారించి, గురజాడ, ఈ ప్రక్రియకు ఆద్యుడని తేల్చి, మొదటి కథ ఏది అన్న అంశంపై వచ్చిన వాద వివాదాలను వివరించారు. తర్వాత అగ్నిపురాణం ఆదిగా చెప్పిన కథాలక్షణాలు తెలిపారు. అగ్నిపురాణం చెప్పిన అంశాలలో రెండింటికి కథానికలో అధిక ప్రాధాన్యం ఉన్నది. ఇందులో **1. సంక్షిప్తత 2. అద్భుతమైన ముగింపు**. ఇందులో సంక్షిప్తత ముఖ్యం అన్నారు.

అమెరికా కథానిక రచయితలలో వాషింగ్టన్ ఇర్వింగ్ ప్రథముడని, అతని కథానికలకు ప్రత్యేక లక్షణం ఉందని వివరించారు. కేథరిన్, పౌలింగ్‌పో కథానిక రచయితల్లో అగ్రగాములు అని, 'పో' కథానిక రచనకు లక్షణ నిర్దేశం చేస్తూ **'సత్య నిరూపణమే కథకు పరమ ప్రయోజనం అన్నాడని'** అన్నారు. కథానిక ఆరంభదశలో కృషి చేసిన ఎందరో పాశ్చాత్య కథకులను, కథానిక మీద వచ్చిన విమర్శను పరిచయం చేశారు ఈ వ్యాసంలో దక్షిణామూర్తి.

తాను చెప్పిన నిర్వచనంలోని **1. ఏకాంశ వ్యగ్రత 2. స్వయం సమగ్రత** అనేవి కథానికకు ప్రధాన లక్షణాలని అన్నారు. ఈ రెండు లక్షణాలను బట్టే ఏ రచన 'కథానిక' అవునో కాదో నిర్ణయించుకోవాలి. ఈ సందర్భంగా శ్రీపాద, చింతా, మాడపాటి వంటి రచయితల రచనలను పరిశీలించి వివరించారు.

కథానికలో వస్తువును ప్రసిద్ధులైన కథానిక రచయితల రచనల ఆధారంగా వివరించారు. వీరిలో గురజాడ ఆదిగా కాళీపట్నం వరకున్న ఎందరో రచయితల రచనలున్నాయి. అలాగే కథానిక శిల్పం గురించి చలం, కుటుంబరావు, బుచ్చిబాబు వంటి కథకుల రచనల ఆధారంగా వివరించారు. కథాశిల్పం ఎత్తుగడ మొదలు ముగింపు వరకు వివిధ అంగాల్లో వివిధ రీతులలో కనిపిస్తుంది.

భాషా శైలులను వివరిస్తూ ఒకప్పుడు భాష పట్ల ఉన్న ఆంక్షలు ఈనాడు లేవు. పాత్రోచితంగానూ సందర్భోచితంగాను భిన్న భిన్న మాండలిక రూపాలలో రచించి కథకులు కథానికలను రాణింప చేస్తున్నారని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు.

ఈ వ్యాసంలో దక్షిణామూర్తి ఉద్యమానికి మూలం ఆవేశం. అది కవిత్వానికి దగ్గరి చుట్టం. కాబట్టి స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎక్కువగా కవిత్వం వచ్చింది. అందులో కథానిక మసక మసకగా కనిపిస్తుంది అన్నారు. అయినప్పటికీ కనుపర్తి వరలక్ష్మమ్మ గారి 'కుటీర లక్ష్మి', 'ఐదుమాసముల యిరువది దినములు', బందా కనక రామలింగేశ్వర రావు 'గుక్కెడు నీళ్ళు', 'విజయ' అనే కలం పేరుతో పి.వి. నరసింహారావు రాసిన 'గొల్ల రామవ్వ', వేలూరి శివరామశాస్త్రి రాసిన 'వెలి', సురవరం ప్రతాపరెడ్డి 'సంఘాల పంతులు', గోపిచందు 'బస్సు ఆగిపోయింది', కొడవటిగంటి 'దీపావళి' మొదలయినవి ఉద్యమ స్ఫూర్తితో వచ్చినవి. ఈ కథలన్నింటినీ విశ్లేషణాత్మకంగా పరిచయం చేశారు వ్యాసకర్త.

ఈ సందర్భంలో జ్వాలాముఖి రాసిన **"తెలుగు కథలపై ఉద్యమాల ప్రభావం"** అన్న వ్యాసంలోని విషయాలను ఉటంకించారు. **"జాతీయోద్యమ ప్రభావం కథావాఙ్మయం మీద అంతగా పడలేదు"** అన్న జ్వాలాముఖి మాటల్ని ఎత్తిచూపారు. కథలు రాసేవాళ్ళు తక్కువ, ఆ రోజుల్లో కథానికను ప్రచురించే పత్రికలూ తక్కువే... వాటిల్లో 'భారతి', కృష్ణా పత్రిక ప్రముఖమైనవి. ఏడాదికి సుమారు అరవై డెబ్బై కథలు అచ్చయితే గొప్ప. ఈ కారణం వల్ల స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎక్కువగా కథానికలు రాలేదన్నారు.

**'టెక్నికల్ ఆస్‌పెక్ట్స్ ఆఫ్ షార్ట్ స్టోరీస్'** అనే వ్యాసంలో దక్షిణామూర్తి మాట్లాడే మనుషులందరికి కథలు చెప్పడం వచ్చునని, ఇది అనాదిగా మనుషులకు సంప్రదాయంగా అలవడింది అన్నారు. ఆంధ్రదేశంలో మాలదాసరి, పిచ్చుకుంట్ల మొదలైన కులాల వారికి కథ చెప్పడం జీవనాధార వృత్తి అన్నారు. వీళ్లు జానపద ఐతిహాసిక, పురాణ కథలతో బాటు సమకాలీన సమాజం నుండి స్వీకరించిన కథల్ని కూడా చెబుతుంటారని, కథ గొప్పగా చెప్పడమన్నది వారి వ్యక్తిగత నైపుణ్యమని తెలిపారు. కథ చెప్పే విధానం చాలవరకు ప్రపంచమంతా ఒకేరకంగా ఉంటుంది, అంతేకాదు వాటికి సామ్యం కూడా కనిపిస్తుంది. ప్రశ్నోత్తరమాలిక కథాశిల్పం వాటిల్లో ఒకటి. ఉదా : అనగనగా ఒక రాజు ఆ రాజుకు ఏడుగురు కొడుకులు.. Once upon, there was a King.. ఈ విధానం తెలుగుతో బాటు ఇతర భాషల్లోనూ ఉంది అన్నారు. ఈ సందర్భంగా బీరేంద్ర భట్టాచార్య నరేటివ్ ఆధారంగా అస్సామీ నర్సరీ రైమ్స్‌లో కూడా ప్రశ్నోత్తర విధానం ఉందని ఎత్తి చూపారు. అందులో అందరికీ చిర పరిచితమైన "Flower! Flower! Why dont you bloom? మొదలైనవి ఉన్నాయి.

కథ చెప్పడంలో మరో పద్ధతి **"నేతి నేతి వాద పద్ధతి".** ఇది కాదు, అదికాదు అని చెప్పడం. ఇందుకు ఉదాహరణ – కాలులో ముల్లుదిగిన కోతికథ. ఇందులో మరో పద్ధతి తనను తాను తర్కించుకుంటూ సాగే పద్ధతి. ఇందుకు ఉదాహరణగా **"పేరు మరచిన ఈగ కథ"** ను చెప్పారు.

ఈ కథన పద్ధతులన్నీ వేద పురాణ ఉపనిషత్తుల నుండి అరువు తెచ్చుకున్నవి. బృహత్కథ, పంచతంత్రం, హితోపదేశం మొదలైన గ్రంథాలు కథన శిల్పంలో వైవిధ్యాలను తెలుపుతాయి అన్నారు వ్యాసకర్త.

ప్రొ. నళినీ సాధలే సిద్ధాంత గ్రంథం ఆధారంగా, సోమదేవుడు కథాసరిత్సాగరంలో చెప్పిన "రమ్యా, హృద్యా...' అనే 17 లక్షణాలను వివరించారు. అగ్నిపురాణం చెప్పిన కథా నిర్వచనం ఆధారంగా "త్రి డిమెన్షియల్ ఎనాలిసిస్ ఆఫ్ షార్ట్ స్టోరీ" అనే శీర్షికలో కథానిక లక్షణాలు తెలిపారు.

ఇవి మూడు రకాలు. 1. Thematic 2. Formatic 3. Technical. వీటిలో మొదటిదానిలో కథాబీజం – కథావస్తువు – ఇతివృత్తం; రెండవదానిలో ఎత్తుగడ – నడక – విషమస్థితి – ముగింపు; మూడవదానిలో పాత్ర – సంఘటన – సంఘర్షణ – సన్నివేశం – కథనం చేరుతాయన్నారు

ఈయన కళానైపుణ్యాన్ని టెక్నిక్‌గా చెప్పి సాహిత్యంలో దాన్నే శిల్పం అని అంటామన్నారు. ఈ వ్యాసంలో కథాశిల్పం గురించి వివరిస్తూ, అది కథలో ఒకచోట కేంద్రీకరించి ఉండదు అని, వస్తు విన్యాస, పాత్రచిత్రణ, సంఘటన కల్పన, సన్నివేశ చిత్రణ, కథనం, వర్ణనం, శీర్షిక మొదలైన కథాంగాలన్నింటిలో ద్యోతకమవుతుంది అన్నారు. కేవలం శిల్ప జ్ఞానం రచయితను గొప్ప కథకుణ్ణి చేయదు కానీ కథకులకు కథాశిల్ప జ్ఞానం తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది అని అభిప్రాయపడ్డారు వ్యాసరచయిత.

**'స్వాతంత్ర్యానికి పూర్వం తెలుగు కథానిక నిర్మాణం, పరిణామం'** అనే వ్యాసం **'ప్రతి కథానికా కథే కాని ప్రతి కథా కథానిక కాదు'** అన్న విషయాన్ని సమగ్రంగా నిరూపించడానికి రాసింది అని చెప్పవచ్చు. ఇందులో కథకు కథానికకు మధ్య ఉన్న తారతమ్యాన్ని ప్రసిద్ధ రచయితల కథల ఆధారంగా నిరూపించారు.

కథానిక గురించి చెబుతూ ఒకచోట హఠాత్తుగా మొదలయి చకచకా సాగుతూ, అత్యవసరమైన పాత్రలనే ప్రవేశ పడుతూ, అవసరమయినంత మేరకే మాట్లాడిస్తూ, అవసరమైన మేరకే వర్ణిస్తూ, ఏకసూత్రత పాటిస్తూ సాగేది ఆధునిక కథానిక అన్నారు.

శిల్ప నైపుణ్యానికి తోడు కథాకథనానికి రచయిత ఎంచుకున్న భాషలో కూడా ఆధునికత (సమకాలికత) కథానికకు ముఖ్యం. ఇవన్నీ గురజాడ కథల్లో కనిపిస్తాయి అన్నారు. ఈ సందర్భంలో ఏది మొదటి కథ అన్న విషయాన్ని చర్చించారు.

పానుగంటి, మాడపాటి, ప్రేమచంద్ రచనలను పరిశీలించి వాటిల్లో శిల్పపరంగా చెప్పుకోదగిన విశేషాలు లేవన్నారు. వీరు కావ్యశైలిలో రాశారు అన్నారు.

తెలుగు కథకుల్లో శ్రీపాద విశిష్ట రచయిత అని ఆయన కథల ఆధారంగా వివరించారు. అలాగే చింతా, వేలూరి రచనలు విశ్లేషించారు. చలం గురించి ఉటంకిస్తూ గతానుగతికమయిన సమాజానికి మింగుడు పడని తీవ్రభావాలను కథావస్తువుగా ఎంచుకుని శక్తిమంతమయిన శైలిలో రచనలు చేసి ప్రతిభాశాలి అని పొగడారు.

విశ్వనాథ, అడవి బాపిరాజు, సురవరం, కనుపర్తి వరలక్ష్మమ్మ, భమిడిపాటి, దేవులపల్లి కథలను ప్రస్తావించారు. కథారచనలో వారి ప్రత్యేకతను వివరించారు. అచ్చమయిన చిక్కని తెలుగు నుడికారానికీ, పాండితీ స్ఫూర్తికీ కథన నైపుణ్యానికి పెట్టింది మల్లాది అని ప్రశంసించారు.

వస్తువులో నవ్యత్వం, సంవిధానంలో ప్రయోగదృష్టి, దృక్పథంలో సమకాలికత్వం, శైలిలో సారళ్యం మేళవించిన కథలలో సాహిత్య సుసంపన్నం చేశారు కొడవటిగంటి కుటుంబరావు అన్నారు. పాలగుమ్మి, ఇల్లిందుల, బుచ్చిబాబు మొదలైన రచయితల రచనా పద్ధతిని సునిశితంగా పరిశీలించి వ్యాఖ్యానించారు. క్రమానుగతంగా కథావస్తువులో వైవిధ్యం పెరిగింది. శిల్పంలో నైశిత్యం ఏర్పడింది. భాషకు సారళ్యం అలవడింది. నిమ్నస్థాయుల వారి జీవితాల్లోకి కష్టసుఖాలను వారి మాటల్లోనే చెప్పే ప్రయత్నాలు జరిగాయి. వివిధ

ప్రాంతీయ వర్గ మాండలికాలకు సాహిత్య గౌరవం లభించింది. కథాకథన శిల్పంలో రకరకాల ప్రయోగాలు జరిగాయి అన్నారు.

**కథానికా సమీక్షల్లో ప్రమాణాలు** శీర్షికతో రాసిన ఈ వ్యాసం సాహిత్య విద్యార్థులు తప్పక చదువవలసింది. ఇందులో సమీక్షల్లోని లోతుపాతుల గురించి సమగ్రంగా చర్చించారు. రచయితల మీద అనుగ్రహ వీక్షణాన్ని చూపించే సమీక్షకులు, మొహమాటంతో సమీక్షలురాసే వాళ్ళు, స్థాలీపులాక న్యాయం లేదా రచనలో ఏదో అంశాన్ని పట్టి చూపేవాళ్ళు, వ్యక్తిగత అనుబంధాలతో వీరవిహారం చేసేవాళ్లు... అందరినీ కొంత హాస్యధోరణిలో ఎత్తిచూపారు దక్షిణామూర్తి.

సంగీత స్వరాల్లోలాగే సమీక్షకుల్లో వాది, అనువాది, సమవాది, వివాది ఉంటారన్నారు. ఇందులో వాది – సాహిత్యం పుట్టిందే తన వాదాల కోసమన్నట్లు, తామనుకున్నది అక్కడ లేకుంటే ఆ రచన పనికిమాలిందని తేల్చే ధోరణిలో ఉంటారు. ఇలాంటివాళ్ళ నమ్మకం ముదిరితే **'సాహిత్య ఉగ్రవాదం పుట్టుకొస్తుందని'** వ్యాసకర్త భయపడ్డారు.

సమీక్షలో నిజాయితీ ఉన్నప్పుడు, విమర్శలో మర్యాదను అతిక్రమించనపుడు, పాఠకుడే కాకుండా రచయిత హర్షిస్తాడు అని అభిప్రాయ పడ్డారు వ్యాసకర్త. సమీక్షకులు రచయిత ఉద్దేశించిన విషయం ఏమిటి? విషయవిన్యాసం చేసిన తీరు ఏమిటి? చెప్పదలచిన విషయానికి, చెప్పిన తీరు ఎంతవరకు నప్పింది? కూర్పు ఎక్కడ బలంగా ఉంది. ఎక్కడ బలహీనమయ్యింది, చదివించే గుణం, భాషా శైలి ఎట్లా ఉన్నది అన్న ప్రశ్నలను మనస్సులో ఉంచుకొని అంశాలను నిశితంగా పరిశీలించాలి అని అభిప్రాయపడ్డారు.

కథ విషయానికొస్తే ... కథ ఎలా మొదలైంది? ఎలా నడిచింది? ఎక్కడ మెలికపడింది? ఎక్కడ పట్టు బిగిసింది? ఎలా పట్టు వీడింది? ఎలా ముగిసింది, చివరికి మొత్తం కథ ప్రసరించే ప్రభావం ఏమిటి? అన్నది చూడాలి. పాత్రలు, సంఘటనలు, సంఘర్షణలు, పాత్రల సంవాదాలు, రచయిత ఎంచుకున్న వస్తువుకు ఎంతవరకు సహకరించాయి అన్నదానిమీద దృష్టి పెట్టాలి. అందువల్ల కథానిక పాఠకుడిలో కలిగించిన స్పందన, అనుభూతి మంచి కథకుండే ప్రమాణాలను వివరించాలి అన్నారు. సమీక్ష, పుస్తకం కొనడానికి ప్రేరణనివ్వాలి అని అభిప్రాయ పడినారు.

**'ఇందిరా కథనం'** అనే వ్యాసంలో ఓగేటి ఇందిరాదేవి కథాసంకలనం **"నాలుగు పేటల చంద్రహారం"** అనీ, అందులో చారిత్రకాలు / పౌరాణికాలు ఉన్నాయన్నారు. అద్యతన భూతకాలికాలు / ఆధునికాలు, సంపుటిలోని 25 కథల్ని పరిశీలించి సారాన్ని చాలా క్లుప్తంగా, సంక్షిప్తంగా సమగ్రంగా వివరించారు. ఆధునిక కాలంలో స్త్రీ సమస్యల పరిష్కారం పట్ల ఆమెకు అత్యంత శ్రద్ధాసక్తులు ఉన్నాయని, ఆమెకున్న సాహిత్య వైదుష్యం, భాషా సారళ్యం ఆమె కథలలో కనిపిస్తుందని, మంచి కథలు రాసినందుకు ఆమెను అభినందించారు.

**'దువ్వెన'** అనే వ్యాసంలో విపుల పత్రికలో ప్రచురించిన గుయన్‌సాంగ్ అనే వియత్నాం రచయిత రాసిన 'దువ్వెన' కథానికను విశ్లేషిస్తూ వస్తురీత్యా, పాత్రచిత్రణ రీత్యా, సన్నివేశ కల్పన రీత్యా, పరస్పర మానవ సంబంధాల ప్రాముఖ్యం రీత్యా హృదయాన్ని అలరించే కథానిక 'దువ్వెన' అని విశ్లేషణ పూర్వకంగా నిరూపించారు.

**కథానికా పతాక శతజయంతి** అనే వ్యాసం తెలుగు కథానిక శతజయంతిని పురస్కరించుకొని రాసినది. ఇంతకుముందు వ్యాసాల్లో కథను గురించి ఈయన చెప్పిన విషయాలు ఈ వ్యాసంలో పునరుక్తాలయ్యాయి. కథానిక ఆరంభమైన నాటికి, నేటికి ఎంతో అభివృద్ధి చెందిందని, అది వస్తువైవిధ్యంలో, నిర్మాణ శిల్పంలో, భాషా శైలుల్లో కనిపిస్తుందని అన్నారు. ప్రపంచంలోని ఏ భాషా సాహిత్య రచనలకూ తీసిపోని కథానికలు తెలుగులో వస్తుండడం ఆనంద కరమని, ఈ ప్రక్రియకు మహోజ్జ్వలమయిన భవిష్యత్తు ఉందని అభిప్రాయపడ్డారు.

ఈ వ్యాస సంపుటిలో ఆరంభ వ్యాసాల్లో కథను గురించి, తరువాతి వాసాల్లో కథానికను గురించి చాలా విపులంగా తెలియజేశారీ వ్యాసకర్త. ఇంగ్లీషులో రాసిన వ్యాసంలో కథానిక శిల్పాన్ని సోపపత్తికంగా విశదీకరించారు. ఓ కథా పరిశోధకునిగా కథను గురించి వివిధ సందర్భాలలో రాసిన వ్యాసాలు ఇవి. అందువల్ల చెప్పిన విషయాన్నే మళ్ళీ మళ్ళీ చెప్పడం కనిపిస్తుంది. కథానికలు రాస్తున్న, పరిశోధిస్తున్న వాళ్ళు, దానిని గురించి తెలుసుకోవాలని ఆసక్తి ఉన్నవాళ్ళు తప్పక చదవాల్సిన వ్యాస సంపుటి **"కథా – సాహిత్య శాస్త్రం'.** విస్తృతమైన విషయాన్ని కుప్తీకరించి చెప్పడం ఎలాగో ఈ వ్యాస సంపుటి ద్వారా నిరూపించారు డా. పోరంకి దక్షిణామూర్తి.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

# నిజమైన మనిషి కోసం 'చంద్రవంక'

**డా. వెల్దండి శ్రీధర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్. ఫోన్ : 9866977741

**'కథానిక స్వరూప స్వభావాలు'** మీద సాధికారికమైన పరిశోధన గ్రంథాన్ని వెలువరించిన డా. పోరంకి దక్షిణామూర్తి విద్యార్థి దశ నుండే కథలు, సాహిత్య వ్యాసాలు రాస్తూ వచ్చిన సాహిత్య కళాజీవి. డెబ్బై ఏళ్ల తన సాహిత్య జీవితంలో సుమారు 40 పుస్తకాలు రచించారు. నవలలు, వ్యాసాలు, నిఘంటు నిర్మాణం, అనువాదాలు, జీవిత చరిత్రలు ఎన్ని రాసినా కథానిక మీద వారికున్న మక్కువ ఎక్కువ. తన పరిశోధనలో భాగంగా అగ్నిపురాణంలోని 337వ అధ్యాయం 20వ శ్లోకంలో 'కథానిక' నిర్వచనం ఉందని చెప్పి భారతీయ కథాసాహిత్య చరిత్రను వెయ్యేళ్ల వెనక్కి తీసుకువెళ్లారు. **'ప్రతి కథానిక కథే, కాని ప్రతి కథా కథానిక కాదు'** అని కథానిక మీద విస్పష్టమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చిన పోరంకి తన జీవిత కాలంలో సుమారు నలభై కథానికలు రాశారు. అవి **1. భక్తుల కథలు (రెండు సంపుటాలు) 2. చంద్రవంక** పేర పుస్తకాలుగా వెలువడి విశేషమైన కథాభిమానుల ఆదరణను పొందాయి.

చంద్రవంక కథానిక సంపుటిలో 30 కథానికలున్నాయి. ఇవన్నీ 1956 నుండి 1995 మధ్య రాయబడిన కథానికలు. 1971 నుంచి 1975 దాకా పోరంకి కథానిక రచన మీద ప్రత్యేక దృష్టి పెట్టినట్టు కనిపిస్తుంది. చాలా కథానికలు ఈ మధ్యకాలం లోనే రచింపబడ్డాయి. తెలుగు నేల మీది మూడు ప్రాంతాల మాండలికాలలో మూడు నవలలు (వెలుగు వెన్నెల గోదావరి – కోస్తాంధ్ర, ముత్యాల పందిరి – తెలంగాణ, రంగవల్లి – రాయలసీమ) రాసిన పోరంకి ఈ కథానికా సంపుటిని కూడా మూడు ప్రాంతాల మాండలికాలను వాడుతూ రాసిన కథానికలతో తీసుకు వచ్చారు. ప్రాంతాలు వేరైనా, మాండలికాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటేననే సంకేతాన్ని ఇవ్వడం కోసం కావచ్చు ఈ రకమైన ప్రయోగాలు చేశారు.

కథకు, కథానికకు మధ్య ఉన్న సన్నని విభజనరేఖను ఎంతో చాకచక్యంగా పట్టుకున్న పోరంకి ప్రతి కథను నగిషీ చెక్కినట్టు చెక్కుకుంటూ పోయారు. వస్తువు ఎన్నికలో, దాన్ని కథగా మలిచే తీరులో, వాడే భాషలో, వాక్య విన్యాసంలో, పాత్ర చిత్రణలో, సంఘర్షణ, సన్నివేశ రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధపెట్టి రాసిన కథలు ఇందులో ఉన్నాయి. 1965–1995 మధ్య ఈ మూడు దశాబ్దాలలో రాసిన మిగతా తెలుగు కథా రచయితలకన్నా భిన్నంగా పోరంకి అట్టడుగు వర్గాల కథలు, ప్రధాన స్రవంతి నుండి అంచులకు నెట్టివేయబడినవారి కథలే ఎక్కువ రాశారు. ఏ వర్గాల వైపు నిలబడాలి? ఎవరి జీవిత సమస్యల్ని ఎత్తి చూపాలి? అనే విషయంపైన స్పష్టత ఉన్న రచయితే ఇలా రాయగలరు.

ఎవరైతే ఊరుమ్మడి సమస్యలన్నీ తనవే అనుకుంటాడో, ఎవరికైతే ఎక్కువ నలిగిన జీవితం ఉంటుందో, తోటి మనిషి దుఃఖాన్ని, సంతోషాన్ని ఎవరైతే అతి దగ్గరగా చూసి వాటి పట్ల సానుకూలంగా స్పందిస్తాడో అతడు గొప్ప కథా రచయిత కాగలడు. దీనికి తార్కాణంగా నిలిచే కథలు **'చంద్రవంక'** సంపుటిలో అనేకం ఉన్నాయి. మనిషన్నప్పుడు పుట్టామా, పెరిగామా, పొట్టపోసుకోవడానికి ఏదో పని వెలగబెట్టామా, చచ్చిపోయామా అని కాదు హృదయం పెరగాలి అంటారు రచయిత




ఇందులో. **"తిండి సరిగా లేక బక్కచిక్కిన పిల్లలు రోజూ పాలు తాగకపోతే ఎలా? ఇంటి పనులతో ఎప్పుడూ సతమతమవుతూ ఉండే ఆడవాళ్ళు ఎప్పటికీ చదువుకోకుండానే ఉండిపోతే ఎలా? కాయకష్టం చేసేవాళ్ళకు మనం రాత్రిపూట అయినా చదువు చెప్పకపోతే ఎలా? వాళ్ళ తిండితిప్పల గురించీ, ఆరోగ్యం గురించీ తెలియజెప్పకపోతే ఎలా? ఇవన్నీ నా సొంత సమస్యలే అనుకున్నాను. ఇవన్నీ నేను చెయ్యవలసిన పనులే అనుకున్నాను"** అంటాడు వెంకటసుబ్బయ్య **'పలకరింపు'** కథలో. మనం ఒక్కరమే కాదు. ఈ భూమి మీద ఇంకెంతో మంది మనతో పాటు బతుకుతున్నారు. వాళ్ళు కూడా మనలాగే సుఖసంతోషాలతో బతకాలంటే వాళ్ల కోసం మనం ఏమైనా చేయాలి అని చేసి చూపిస్తాడు వెంకటసుబ్బయ్య.

**"కడుపు నిండా తిండి లేని వాళ్ళూ, తినేది సరైనది కానివాళ్ళూ, ఒంటికి చాలిన బట్టలు లేనివాళ్ళు, తలదాచుకునే గూడు లేని వాళ్ళు, ఆరోగ్యం లేని వాళు**

ౄ, చదువు లేనివాళ్ళు, బాగుపడని వాళ్ళు, బాగుపడే బాట దొరకని వాళ్ళు, ఇంకా ఇందరుండగా వాళ్లకు లేని సౌఖ్యాలూ, సౌకర్యాలూ, విలాసాలూ అనుభవించే హక్కు నాకెక్కడిది? నాలాగే పుట్టిన మనుషులందరికంటె నా ఎక్కువేముంది? ఒంటెత్తు బతుక్కీ సోమరితనానికీ నాకున్న అర్హత ఏమిటి? వాళ్లు చేసుకున్న పాపమేమిటి?" అని ప్రశ్నిస్తుంది **'జొను మరి'** కథలో కరుణామయి. ప్రతి వ్యక్తీ ఇలా ప్రశ్నించుకుంటే ఈ లోకం సామ్యవాద లోకంగా మారడానికి ఎంతో సమయం పట్టదు. కాని ఎవడి స్వార్థపు వలయంలో వాడు సంచరిస్తున్న కాలంలో అలాంటి లోకం ఊహకు కూడా అందదు.

ఒకనాటి సమాజ స్వరూపమంతా ఈ 'చంద్రవంక'లో తొంగిచూస్తుంది. సమాజ సౌభాగ్యం కోసం కుటుంబాన్నైనా వదిలేసి సామాన్య ప్రజలకు తనకు తోచినంత సహాయం చేసే ఆదర్శం, అమ్మాయి పెళ్లి చేయడం కోసం ఒక కన్న తండ్రి పడే ఆవేదన, కోరినంత కట్నకానుకలను డిమాండ్ చేసే పరాన్నజీవులకు బుద్ధిచెప్పడం, కిడ్నాప్‌కు గురైన సందర్భంలో స్త్రీ పదర్శించాల్సిన ధైర్య సాహసాలు, ఎదుటివాడి సమాధి మీదే మన అభివృద్ధి పునాది లేవాలనుకునే నీచత్వం, ఏకాకిగా మారిపోయిన బాల్యానికి ఆదుకునే తోడు దొరకడం, తాగుడుకు బానిసలుగా మారిన బాధ్యతా రహిత జీవితాలు, నిరుద్యోగం, ప్రూపుల కష్టాలు, మోసపోయిన అక్కాచెల్లెళ్ల జీవితాలు, తెలంగాణ వాగు ఊసులు, భారతీయ సంస్కృతి, వరద భీభత్సం, భార్యాభర్తల అనురాగం, గ్రామపు గొడవలు, సాక్ష్యాలు, కోర్టు తీర్పులు, పుష్పలావికల జీవిత సుగంధం, దేశసేవ చేసే సైనికుని కుటుంబ కష్టాలు, రాయలసీమ కరువు దృశ్యాలు, గ్రామ కక్ష్యలు, మాంత్రిక ద్రవ్యాల మీది ఆసక్తి.. ఇలా సమాజాన్ని అన్ని కోణాల్లో ఎక్స్‌రే తీసి రాసిన కథలివి.

చాలా కథలు సమాజ స్థితిగతుల్ని ఎత్తి చూపేవే కాని ఈ సమస్యకిదే పరిష్కారమని చెప్పే కథలు కావు. ఇందులోని ఎక్కువ కథలు కేవలం ఒకే సమస్యని లేదా ఒకే సంఘటనను ఆధారంగా తీసుకొని రాసినవి కావు. ప్రతి కథలో అంతర్గతంగా అనేక సమస్యలను, సంఘర్షణలను ఏకరువు పెట్టిన కథలు. అనేక రకాల పాత్రలు వాటి భిన్న మనస్తత్వాలు మనకొక మినీ థియేటర్‌ను చూపిస్తాయి.

ఈ కథల్లో డా. పోరంకి ప్రదర్శించిన వాక్య ప్రయోగాలను, ఆయా మాండలికాల మాధుర్యాన్ని మరిచిపోలేం. ఏ వస్తువును ఏ ప్రాంత నేపథ్యంలో నడిపించాలి? ఏ భాషలో రాయాలి? అనే విషయంగా రచయితకు చాలా స్పష్టమైన అవగాహన ఉన్నది. అందుకే ఏ కథ కూడా అసహజంగా లేదు. ఏ కథ ఎలా కుదురుకోవాలో అలాగే కుదురుకొని పాఠకునికి సరికొత్త జీవిత కలశాన్ని చేతికిస్తుంది.

**'చలిపాటు'** కథానికలో రెండు కథలు సమాంతరంగా నడుస్తుంటాయి. శిల్పపరంగా ఇదొక ప్రయోగం. **'ఏడుపాయల దొరసాని'**, **'పడక్కుర్చీ'**, **'పోతేపోనీ నాకేం పట్టింది'**, **'చిత్రలత'** కథలు శిల్పపరంగా ఒక ఎత్తుకు ఎదిగిన కథలు. ప్రతి కథానిక ఏదో ఒక టెక్నిక్‌లో రాసిందే అయినా ఏవో శిల్పపరమైన మార్మిక రహస్యాల్ని చెప్తుతున్నట్టుగా ఉన్నాయి.

చాలా పాత్రలు మనల్ని జీవితకాలం వెంటాడుతాయి. మంగయ్యశాస్త్రి, వెంకట సుబ్బయ్య, రాజలింగయ్య, మాలిని, కరుణామయి, మల్లేశం, కార్తవీర్యుడు, సీత, రంగయ్య, మార్గరెట్, జానకి, కిష్టయ్య, ఆనందరావు, మిలటరీ అన్నయ్య చెల్లెలు, పూలమ్మే పెన్న, శివన్న, నఫీసా లాంటి పాత్రలు మనకు నిత్య జీవితంలో ఎన్నోసార్లు ఎదురుపడుతాయి. వాళ్ల జీవితం ఎందుకింత దుర్భరంగా ఉందో, జీవిక కోసం వాళ్లు ఎందుకింత పెనుగులాడుతున్నారోనని మన హృదయం చలించిపోతుంది.

రచయిత అన్ని వర్గాల ప్రజల జీవితాల మీద 'దుర్భిణి' వేసి చూసినట్లుగా కనిపిస్తుంది. ఈ సంపుటిలో ఉన్న ఏకైక ముస్లిం కథ 'చిత్రలత'. ఇందులోని ప్రధాన పాత్ర నఫీసా. ఆమె జీవితం చుట్టూ పరుచుకున్న చీకటిని కథకుడు అత్యంత ప్రతిభావంతంగా అక్షరీకరించారు. ఈ సంపుటిలో చోటు చేసుకున్న నవలిక అనదగ్గ కథానిక **'జొరొరా!'**

ఈ సంపుటిలో ఇమడని లేదా విలక్షణ కథలు రెండున్నాయి. అవి 1. ప్రేమసుధ 2. కంకణాలతల్లి.

**'ప్రేమసుధ'** కథ జాన్ కాలియర్ రాసిన **'లవ్ ఓషన్'** అనే కథను అనుసరించి రాసిన కథ. ఇదే పోరంకి రాసిన తొలి కథ కూడా. ఒక ఆయుర్వేద వైద్యుడు కొన్ని వశీకరణ ద్రావకాలను అమ్ముతుంటాడు. వాటి పట్ల ఆకర్షితుడైన ఒక యువకుని కథ. **'కంకణాల తల్లి'** కథ మెకంజీ సంకలనం చేసిన ఒక కైఫీయత్‌ను ఆధారంగా చేసుకొని రాసినది. ఇదొక రకంగా జానపద సాహసగాథ. 'కంకణాల తల్లి' అనే గ్రామం పొందికను చెప్పే కథ. ఈ రెండు కథలు ఈ సంపుటిలో కెల్లా భిన్నమైన కథలు.

డా. పోరంకి వారి సంభాషణ చాతుర్యాన్ని, వ్యంగ్యాన్ని, ధ్వనిని, కథానికల్లో అక్కడక్కడ ప్రయోగించిన ఉపమానాలను, కవిత్వాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

ఈ కరోనా కాలానికి పనికి వచ్చే, మనిషి స్వీయ తప్పిదాలను ఎండగట్టే రచయిత ముందుచూపుకు ఆశ్చర్యపోతాం. **"న్యాయం, ధర్మం, నీతి, నియమం ఏవీ లేకుండా బరితెగించి ప్రవర్తించడం లేదూ? అందుకే వచ్చింది ఈ విపరీతం! అందుకే వచ్చింది ఈ ప్రళయం! లోకంలో ధర్మం ఎప్పుడు నశిస్తుందో అప్పుడే వినాశకాలం దాపురిస్తుంది. మహా ప్రళయం వచ్చి అంతా తుడిచిపెట్టుకుపోతుంది. పోనీండి! అంతా నాశనమై పోనీండి! ప్రపంచమే భ్రష్టమైన తరువాత**

**ఇంక ఏం ఉంటేనేం, లేకపోతేనేం?.. కొత్తనీరు వచ్చి పాతనీటిని కొట్టేస్తుంది. ఆ వెల్లువలో మనుషులు కొట్టుకుపోవచ్చు. వృక్షాలు ఒరిగిపోవచ్చు. భవంతులు కూలిపోవచ్చు. ఒక్కొక్క జాతి భూస్థాపితమే అయిపోవచ్చు. కనీ వినీ ఎరగనంత విషాదం ప్రపంచాన్ని ముంచెత్తవచ్చు... ఒకచోట నాశనమైనది మరొక చోట కొత్త జన్మ ఎత్తుతుంది. దాని రూపంలో మార్పు రావచ్చు. కాని అదే చైతన్యం. ఎప్పటికీ ముందుకు సాగుతూ ఉంటుంది. ఒకచోట రాలిన విత్తు ఇంకొక చోట కొత్తగా మొలకెత్తడం చూడలేదూ?"** అని అంటాడు 'చంద్రవంక' కథానికలో మంగయ్యశాస్త్రి. పొంగులెత్తుతున్న 'చంద్రవంక' వరదలో మునిగిపోయి ప్రాణాలు వదులుతున్న ఆఖరి క్షణాల్లో మంగయ్య శాస్త్రి **"వ్యవస్థ ఏదయినా నాకు బెంగలేదు. వ్యక్తి నిటారుగా నిలబడగలిగితే చాలు! జీవిత విధానం ఎలా మారినా నష్టం లేదు. విలువలు మాత్రం నశించనియ్యకు తండ్రీ!"** అని కోరుకుంటాడు. ఇదే ఒక రకంగా రచయిత ఈ సంపుటి ద్వారా అందించే సందేశం లేదా ఆశించే మార్పు.

వస్తు స్వీకరణలో, దాన్ని నిర్వహించిన తీరులో శ్రద్ధ వహించిన డా. పోరంకి ఎందుకో ఇందులోని కథలకు సరైన పేర్లను పెట్టడంలో విఫలమయ్యారనే చెప్పాలి. నిజానికి కథానిక రాయడం ఒక ఎత్తు అయితే దానికి సరైన శీర్షికను పెట్టడం ఒక కళ. సాధారణంగా కథ సారాన్ని తెలిపే విధంగా, పాత్ర ప్రాధాన్యతను సూచించే విధంగా, కథానిక కేంద్ర బిందువు ఆధారంగా కథానికకు పేర్లను పెడుతుంటారు. ఈ సంపుటిలోని నాలుగైదు కథానికలకు మినహా మిగిలిన కథానికలకు అలాంటి పేర్లు పెట్టలేకపోయారు. చాలా కథానికలకు పేర్లు చాలా పేలవంగా ఉన్నాయి. తద్వారా పాఠకుడు కథపట్ల ఆకర్షితుడు కాలేదు. అంతేకాదు కొన్ని కథానికల ఎత్తుగడలు కూడా నీరసంగా ఉన్నాయి.

ఊరు పట్ల మమకారం, మనిషి జీవితం పట్ల ఒక 'మనాది', రోజు రోజుకూ క్షీణించిపోతున్న మానవీయ విలువల పట్ల ఆరాటం, నిజమైన మనిషిని మనముందు నిలబెట్టాలనే పోరాటం అన్నీ ఈ కథానికల సంపుటిలో కనిపిస్తాయి. ఏ కథానికా అచేతనంగా ముగిసిపోదు. ఏదో రాయాలన్న ఉబలాటం కొద్దీ రాసిన కథానికలు కావివి. సమాజం పట్ల పూర్తి బాధ్యతతో రాసిన కథానికలు. అగ్నిపర్వతంలా మండుతున్న సమాజం ఉపరితలం మీద నిలబడి దాని లోతుల్లోని లావాను మన గుండె గోడల మీద ప్రవహింపజేసే కథానికలివి. మనిషి జీవితం, సమాజం ఎన్ని పొరలు పొరలుగా ఉంటుందో అన్ని పొరలు ఈ కథల్లో ప్రతిబింబిస్తాయి. ఒక్కో కథానికా తరంగం ఒక్కో జీవిత సముద్రాన్ని పాఠకుడి మది నిండా పరుస్తుంది. ఇందులో మునకలు వేసి లోతులకు వెళ్ళి అడుగులు ముట్టిన వారికి మాత్రమే 'చంద్రవంక' ఉధృతి బోధపడుతుంది.

# రాజకీయ నవల 'నీడలూ - జాడలూ'

**డా. బంధకవి దీనావతి,** ఫోన్ : 998 962 1179




డా. పోరంకి దక్షిణామూర్తిగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు భాషా సాహిత్యానికి సంబంధించి వివిధ ప్రక్రియల్లో విశేషంగా కృషి చేసారు. వీరి సిద్ధాంత వ్యాసం "కథానిక స్వరూప స్వభావాలు". వీరు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేటు పట్టా పొందారు. తెలుగు మాండలిక పదకోశం నిర్మాణంలో నిఘంటు నిర్మాణంలో భాగం కావటమే కాక, భాషాశాస్త్రంపైన అనేక వ్యాస సంపుటాలు వెలువరించారు. ఇంగ్లీషు, హిందీ భాషలనుంచి సుమారు 40 గ్రంథాలవరకు అనువదించారు. ఇందులో "ఒక యోగి ఆత్మకథ" పరమహంస యోగానందగారి జీవిత చరిత్ర చాలా ప్రసిద్ధి చెందింది. ఇది స్వేచ్ఛానువాదం. చదువుతుంటే ఎక్కడా అనువాదమన్న భావం రాదు. అలాగే కొన్ని కథలు, నవలలూ రచించారు. అందులో ముఖ్యమైనవి ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలకు చెందిన మూడు మాండలికాలలో రచించిన నవలలు. గోదావరి (కోస్తా) మాండలికంలో రచించిన 'వెలుగూ వెన్నెలా గోదారీ', తెలంగాణ మాండలికంలో రచించిన 'ముత్యాల పందిరి', రాయలసీమ మాండలికంలో రచించిన 'రంగవల్లి' పాఠకుల విశేషాదరణ పొందాయి. ఈ నవలలోని పాత్రలన్నీ వాటి వాటి మాండలికాల్లోనే మాట్లాడుతాయి. సంభాషణలు, పద ప్రయోగాలు, యాస అన్నీ అత్యంత సహజంగా వుండి పాఠకుల నాకట్టుకొంటాయి. ఈ విధంగా వ్రాయాలంటే కుగ్రామాలకి, చిన్న పల్లెటూర్లకు వెళ్ళి వారితో మమేకమై వారి జీవన విధానం, భాషా ప్రయోగాలు, వారి వ్యవహారిక భాష జీవన విధానం సమగ్రంగా పరిశీలించి వ్రాయాలి.

వీరి ప్రయోగాల్లో వందశాతం సఫలీకృతులయ్యారు. కనుకనే నవలలెంతగానో పాఠకాదరణ పొందాయి.

ప్రస్తుత నవల **నీడలూ జాడలు** విషయానికొస్తే ఇది ఒక రాజకీయ చారిత్రక నవల. సుమారు రెండున్నర దశాబ్దాల పాటు సాగిన ఇతివృత్తం. దేశంలో ముఖ్యంగా ఆంధ్రరాష్ట్రాలలో తెలుగు మాట్లాడే ప్రజలలో ఏర్పడిన రాజకీయ పరిణామాలు ఇందులో సంగ్రహంగా చర్చించబడ్డాయి. నవల రెండో ప్రపంచ యుద్ధ పరిసమాప్తితో ప్రారంభమయి ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం కొన్ని సంవత్సరాలకి ముగుస్తుంది. ఈ రెండున్నర దశాబ్దాలలో భారతదేశంలో జరిగిన సంపూర్ణ స్వరాజ్య ఉద్యమం, దేశానికి స్వాతంత్ర్యం లభించడం, పాకిస్థాన్ విడిపోవడం. భారతదేశంలో సుమారు ఐదువందల స్వతంత్ర సంస్థానాలు భారతదేశంలో విలీనమవడం, తెలంగాణాలో రజాకార్ ఉద్యమం, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడం, ఉమ్మడి మద్రాసు నుంచి విడివడి కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడటం, తరువాత తెలుగు మాట్లాడే వారందరూ ఒక రాష్ట్రంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హైదరాబాదు రాజధానిగా ఏర్పడటం, మొదలయిన రాజకీయ చారిత్రక విశేషాలు ఈ నవలలో కథా గమనానికి అవసరమున్నంతవరకు ఆయా సందర్భాలలో సంగ్రహంగా చర్చించటం జరిగింది.

ఈ నవలా నాయకుడు రంగారావు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసే నాటికి చిన్న కుర్రాడు. తండ్రి లక్ష్మీనారాయణది తూర్పు గోదావరి జిల్లాలోని మారుమూల గ్రామం. ఆయన గాంధీజీగారికి పరోక్ష శిష్యుడు. బాగా చదువుకున్నవారు. బహుగ్రంథ పఠిత. నిత్యం పత్రికలు చదివి రాజకీయ పరిస్థితుల్ని దేశ పరిస్థితుల్ని బాగా ఆకళింపు చేసుకున్నవారు. అటువంటి తండ్రి నీడలో పెరిగినవాడు రంగడు. లక్ష్మీనారాయణగారికి ఆర్థిక, రాజకీయ, తత్త్వశాస్త్రాలు అభిమాన విషయాలు. వీటికి సంబంధించిన పుస్తకాలు ఆయన చదవడమే గాక కొని పెట్టుకున్నారు. లక్ష్మీ నారాయణగారు రంగడు ఏ ప్రశ్న వేసినా దానికి వివరంగా సమాధానం చెప్పేవారు. అది రంగడికి ఎంతవరకు అర్థమవుతుందనే ప్రశ్న పక్కనపెడితే పిల్లలకి కాస్త లోకజ్ఞానం అలవడి తమదైన విధానంలో కొంతలో కొంత ప్రపంచ జ్ఞానం అలవరచుకొనే అవకాశం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయం. లక్ష్మీనారాయణగారు గ్రామంలో ఏ పదవులూ చేపట్టక పోయినా తన శక్తి మేరకు గ్రామస్థులకి ఆనాటి దేశ పరిస్థితుల్ని వివరిస్తూ వారిలో చైతన్యం తీసుకు వచ్చే ప్రయత్నం చేసేవారు. ఆయనింట్లో బడి, గ్రంథాలయం, ఆసుపత్రి ఏర్పాటు చేసి ఆయనే స్వయంగా పిల్లలకి చదువు చెప్తూ రోగులకి తనకి తెలిసిన హోమియోపతి వైద్యం చేస్తుండేవారు. వారు ఒకసారి కాంగ్రెసు సభలకి కాకినాడ వెళ్లి అక్కడి అనాథ శిశు సంరక్షణాలయం నుంచి రెండేళ్ల రంగణ్ణి తెచ్చి పెంచుతున్నారు. ఆంధ్రదేశంలో పరిస్థితులిలా వుంటే తెలంగాణా పరిస్థితులు మరో విధంగా వున్నాయి.

స్వాతంత్ర్యానంతరం నిజాం సర్కార భారతదేశంలో విలీనమవడానికి అంగీకరించలేదు. కాశిం రజ్వీ నాయకత్వంలో రజాకారు ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులవి. భారతదేశంలో హైదరాబాదు సంస్థానం కలవాలని దానికి రహస్యంగా ప్రజల్ని చైతన్యం చేసేవారు కొందరుండేవారు. అలాంటివారిలో ఒకరు పద్మారావు. ఇతను 'దివిటీ' అనే పత్రికను రహస్యంగా ముద్రించి పంపిణీ చేస్తూ తన వ్యాసాల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి వారిని తమ లక్ష్యం వైపు కార్యోన్ముఖుల్ని చేసే ప్రయత్నం చేసేవాడు. పద్మారావు స్నేహితుడు రాజయ్య పద్మారావు ముద్రించిన పత్రికలని రహస్యంగా ముఖ్యులకి చేరవేస్తుండేవాడు. పద్మారావు భార్య సుశీల. కుమార్తె అరవింద. ఈ దివిటీ పత్రిక చదివిన లక్ష్మీనారాయణగారు ఉత్తేజితులై పద్మారావుగారికి ఉత్తరం వ్రాస్తే వారిద్దరికీ పరిచయం ఏర్పడుతుంది. రజాకారు ఉద్యమంలో పద్మారావు ఇల్లు, ముద్రణాలయం చివరికి పద్మారావు దహనమవుతారు. రాజయ్య భార్య వారి చేతిలో మరణిస్తుంది. రాజయ్య స్నేహితుడి భార్య అయిన సుశీలను అరవిందను తీసుకొని హైదరాబాదు చేరుకొని అక్కడ వారిద్దరికీ ఒక ఉపాధి ఏర్పరచి వారి బాధ్యత తీసుకుని స్నేహానికి సార్థకతనిస్తాడు.

ఇక్కడ రంగారావు కాకినాడలో కాలేజీలో ఇంటరులో చేరతాడు. అక్కడ రాష్ట్ర రాజకీయాలలో శ్రద్ధ పెంచుకుని చదువుని నిర్లక్ష్యం చేస్తాడు. ఆ సమయంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టిశ్రీరాములు దీక్ష సాగుతుంటుంది. దాని గురించి ప్రజల్ని చైతన్యపరచడానికి సభలూ సమావేశాలు నిర్వహిస్తుంటాడు రంగారావు. అలాంటి సభకి వచ్చిన లక్ష్మీనారాయణగారు రంగారావుకి జీవితంలో ఏదైనా సాధించాలంటే లక్ష్యం ఉండాలని ఒకసారి ఒక లక్ష్యం ఏర్పరచుకుంటే దాని సాధనకి కృషి చెయ్యాలని సున్నితంగా హెచ్చరిస్తారు. అప్పటికే చదువుని నిర్లక్ష్యం చేసిన రంగారావు ఇంటరు ఫెయిలవుతాడు. తండ్రి హెచ్చరిక అర్థం చేసుకున్న రంగారావు చదువుమీద దృష్టి పెట్టి ఇంటరు పూర్తి చేసి ఉద్యోగార్థమై హైదరాబాదు చేరతాడు. అక్కడ పూర్వ పరిచయస్థుడు, ప్రస్తుత రాజకీయవేత్త అయిన రాజయ్య ద్వారా బేంకు ఉద్యోగం సంపాదిస్తాడు. సుశీల అరవిందల్ని కలుసుకుంటాడు. బేంకులో రకరకాల మనస్తత్వాలు కలిగిన సహోద్యోగుల ద్వారా చాలా విషయాలు తెలుసుకునే అవకాశం లభిస్తుంది. అరవింద రంగారావులు పరస్పరం ఆకర్షితులవుతారు.

బేంకులో పనిచేస్తున్న వారిలో జోగారావు రంగారావుకి సన్నిహితుడవుతాడు. అతని ప్రోద్బలంతో సాయంకళాశాలలో చేరతాడు. పుస్తకాలు పత్రికలు చదివి తన జ్ఞానాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తాడు. ఈ ప్రయత్నాల్లో తండ్రిని చూడడానికి వెళ్లలేకపోతాడు. ఆయన చూడాలని వుంది రమ్మని వ్రాసినా

వెళ్లలేకపోతాడు. తండ్రి మరణిస్తాడు. ఆఖరి చూపు కూడా దక్కదు. తల్లి పల్లెటూరు విడిచి రాలేనంటుంది. బేంకు ఉద్యోగంలో ఇమడలేక ఒక పత్రికలో సబ్ ఎడిటర్‌గా చేరతాడు. అక్కడ పని చేస్తుండగానే అరవిందను వివాహం చేసుకొమ్మని రాజయ్య అడుగుతాడు. కాని రంగారావు అంగీకరించడు. **"నా జిజ్ఞాసకు అనుగుణమైన పనిని చేసుకొనడానికి తగిన అవకాశం రావాలి. నా జీవితం నాకు అమూల్యమైంది. నా భవిష్యత్తు గ్రహించగలిగినప్పుడు కాని నేను కోరిన యీ మార్పుకి అర్థం మీకు కనిపించదు. ఒకళ్లని తృప్తి పరచడానికి నేనే పని చెయ్యను. చెయ్యలేను. నా వ్యక్తిత్వం ఒక్కడ వికసిస్తుందో ఆ దూర తీరాలని చేరుకోవడం నా ఆశయం"** అని నిర్మొహమాటంగా చెప్పి రాజయ్య మాటను తిరస్కరిస్తాడు.

ఈ మాటల వల్ల రంగారావు వ్యక్తిత్వం ఎంత స్థిరమైందో మనకి తెలుస్తుంది. అతనిలో ఏదో సాధించాలనే తపన దాని సాధనకి వివాహం అడ్డంకి అనే ఒక భావన అతన్ని అంత కఠినంగా మాట్లాడడానికి ప్రేరేపించింది. అరవింద మనసు కష్టపెడుతున్నానని తెలుసు. అయినా తన అభిప్రాయం స్పష్టంగా చెప్పడానికి వెరవడు.

ప్రెస్సులో పని చేస్తున్నప్పుడే **"ప్రపంచ రాజకీయాలు- మానవ శ్రేయస్సాధన"** అనే పుస్తకం వ్రాసి ప్రచురిస్తాడు. ఆ పుస్తకం చదివిన బేంకు స్నేహితుడు రంగారావు ప్రవృత్తికి సరిపోయే ఉద్యోగం రాజకీయ విషయాల మంత్రిత్వ శాఖలో స్పెషలు రిక్రూట్‌మెంట్‌కి ఉద్యోగాలకి దరఖాస్తులు పంపమంటున్నారంటూ అన్ని పనులు దగ్గరుండి పూర్తి చేయించి రంగారావు చేత దరఖాస్తు చేయిస్తాడు. ఢిల్లీలో వ్రాత పరీక్ష ఇంటర్వ్యూ అయ్యాక రంగారావు కొన్ని కొత్త ప్రదేశాల్ని సందర్శిస్తాడు. ఆ సందర్భంగా జోధ్‌పూర్‌లో వున్న మేనమామ కూతురు సరస్వతి, ఆమె భర్త ఆనందరావు, మూడు సంవత్సరాల వారి కుమార్తెను చూస్తాడు. సరస్వతి ఇంతవరకూ వివాహం ఎందుకు చేసుకోలేదని రంగారావుని ప్రశ్నిస్తుంది. ఆ సందర్భంగా సమాధానం చెప్తూ **"నా దృష్టిలో సమాజంలో ఏ వ్యవస్థకయినా ఆర్థికపరమైన పటిష్ఠత ఉండి తీరాలి. వివాహం వ్యవస్థ అయినందువల్ల దానికి అవసరమైనంతగా ఆర్థిక సుస్థిరత ఉండి తీరాలి".**

**"నాకు కనీసపు తృప్తి కలగడానికి అవి అడ్డు రాకుండా వుంటే చాలు"** అందువల్లే వివాహం చేసుకోలేదు. నేనింకా ఏ ఉద్యోగంలోనూ స్థిరపడలేదని చెప్తాడు. తన చుట్టూ ఉన్న పరిస్థితులు తనను స్థిరపడనివ్వలేదని చెప్తాడు. రంగారావు తన మనస్సుకి నచ్చని విషయాలలో రాజీ పడలేడు. అందువల్లే బేంకు ఉద్యోగంలో గాని పత్రికలో గాని నిలకడగా పనిచేయలేకపోయాడు. భారత పాకిస్థాన్ యుద్ధంలో తన ఆత్మీయులైన సరస్వతి కుటుంబం మరణించటం కళ్లారా చూస్తాడు. వారి దగ్గర ఉన్న సమయంలో ఆ దంపతుల మధ్య ఉన్న అన్యోన్యత ఆత్మీయత చూసి తన మనస్సూ వివాహం గురించి ఆలోచిస్తోందనుకుంటాడు. హైదరాబాదు తిరిగి వచ్చాక లాల్‌బహదూర్ శాస్త్రి మరణం గురించి తెలిసి చలించిపోతాడు. ఆ సమయంలోనే రాజకీయ వ్యవహారాల శాఖలో ఆఫీసరు పోస్టుకు సెలక్టయినట్టు ఆర్డరు వస్తుంది.

రంగారావు అనాథ అయినా ఉన్నతుడయిన లక్ష్మీనారాయణగారి ప్రాపకంలో పెరిగి ఉన్నత వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటాడు. మనసు చంపుకుని అడుగడుగునా రాజీపడి బ్రతకలేని మనస్తత్వం కలిగిన వ్యక్తి. అతని జీవితంలో తారసపడిన వ్యక్తులు కాకినాడలో ఇంటరులో చేరినప్పుడు పరిచయమైన 'సీమా' ముస్లిముల అమ్మాయి. ఆ అమ్మాయి పట్ల ఆకర్షితుడవుతాడు. కాని తండ్రి లక్ష్యం లేని జీవితానికి విలువలేదని హెచ్చరించడంతో తనది వ్యామోహం ఆకర్షణే గాని ఇంకేం కాదని తెలుసుకుంటాడు. మేనమామ కూతురు సరస్వతిని చేసుకోమన్నప్పుడు తనకో స్థిరత్వం ఇంకా ఏర్పడలేదని అందువల్ల అప్పుడే వివాహం చేసుకోలేనంటాడు. అరవింద పట్ల తనకున్నది నిజమైన ప్రేమే అయినా ఆర్థికంగా స్థిరపడకుండా వివాహం చేసుకోవడం సమంజసం కాదనుకుంటాడు. బేంకులో ఉద్యోగం చేస్తున్నప్పుడు సహోద్యోగులు ఒకొక్కరిది ఒకొక్క తీరు. జోగారావు ఇందులో ముఖ్యుడు. రంగారావు సాయం కళాశాలలో చేరి పై చదువు చదవడానికి కారకుడు. అలాగే బేంకు ఉద్యోగం మానేసి పత్రికాఫీసులో చేరి రచనలు చేస్తున్నా ఏదో తపనతో బాధపడుతున్న రంగారావుకి రాజకీయ వ్యవహారాల ఆఫీసులో ఉద్యోగం సరియైనదని భావించి అతనితో గడువులోపు అప్లికేషన్ పెట్టించడం వ్రాత పరీక్షకి ప్రిపేర్ అయ్యేవరకు వెంటవుండి పనులు చేయిస్తాడతనితో. ఢిల్లీ ఉద్యోగానికి ప్రేరణ ప్రోత్సాహం అంతా జోగారావే. పెళ్లి పట్ల మనసు మళ్లడానికి కారణం సరస్వతి, ఆమె భర్త ఆనందరావు.

ఈ నవల రంగారావు ఢిల్లీ ఉద్యోగానికి అరవింద సమేతంగా బయలు దేరడంతో ముగుస్తుంది. ఢిల్లీ వెళ్లే విమానంలో కూర్చున్న రంగారావు అంతరాంతరాలలో వెలుగుల్ని వెతుక్కుంటూ అనుకుంటాడు. **"ఎక్కడో పుట్టాను, ఎక్కడో పెరిగాను. ఎలాగెలాగో జీవించాను. ఎన్ని వెలుగులనో గుండెల్లో ప్రోది చేసుకున్నాను. ఎన్ని చీకట్లనో చీల్చుకొని వచ్చాను. గత కాలపు నీడ నుంచి భవిష్యత్తుకు జాడ వెతుక్కుంటున్నాను. కాలావధి తెలియని ఈ మహీయాత్రలో ఇరుకు ఇరుకు సందుల్లోంచి విశాల ప్రపంచంలోకి విస్తరిస్తూ సాగుతోంది జీవితం ఇంకా ఇంకా ముందుకు."**

ఈ నవలలో డా. పోరంకి సంభాషణలు శైలీ అత్యంత సహజంగా ఉంటాయి. నవలలో హాస్యం చమక్కు సున్నితంగా ఆహ్లాదకరంగా వుంటుంది. పద్మారావు కూతురు అరవింద, స్నేహితుడు రాజయ్య వీర్ని సంభాషణలు స్వచ్ఛమైన తెలంగాణా మాండలికంలో సాగుతాయి. దక్షిణామూర్తి గారు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేశారు. రంగారావు బ్యాంకు ఉద్యోగం చేసే రోజుల్లో బ్యాంకు లోపలి వ్యవస్థని

వ్యక్తుల్ని పని విభాగాల్ని గురించి వివరంగా వ్రాయడానికి వారి అనుభవాలు ఉపయోగపడి వుంటాయి. అలాగే పత్రికాఫీసు విషయాలు. తెలంగాణ పల్లెల్లో ఆనాడు అమలులో వున్న ఆర్థిక వ్యవస్థ "భిక్షం" గురించి చాలా వివరంగా రాశారు. అన్ని వృత్తులలో వున్న వారు పరస్పరం ఏవిధంగా ఒకరి మీద ఒకరు ఆధారపడి వుండేవారో వివరంగా తెలియజేశారు. ఆనాటి రాజకీయ సాంఘిక పరిస్థితులు జీవన విధానం ప్రజా చైతన్యం గురించి, ఆనాటి రాజకీయ నాయకుల గురించి, వారి వ్యక్తిత్వాల గురించి ఈ నవలలో సందర్భానుసారంగా వివరించారు.

ప్రతి మనిషి ప్రయాణం ముందుకు సాగాలంటే గత కాలపు నీడలలో నుంచి భవిష్యత్తుకు జాడలు వెతుక్కుంటూ సాగవలసిందే.

# నవల 'నివేదన' విశేషాలు

**డా. ఐ.వి. కాంతలక్ష్మి**

విశ్రాంత అధ్యాపకులు, ఫోన్ : 9490 9935 32

పోరంకి దక్షిణామూర్తి గారు బహుముఖీనమైన ప్రజ్ఞా పాటవాలు గల ప్రసిద్ధ రచయిత. నవలలు, కథలు, విమర్శలు, పీఠికలు, ఆధ్యాత్మిక తాత్త్విక రచనలు ఇత్యాదిగా ఎంతో వైవిధ్యం గల బహు గ్రంథ రచయిత. వారి పీఠికలు సైతం స్వతంత్ర గ్రంథ రచనల స్థాయిలో ఉంటాయన్నది ప్రసిద్ధం. దక్షిణామూర్తిగారిలో ప్రత్యేకకోణం భాషాశాస్త్రంపై అభినివేశం. ప్రవృత్తికి తగిన వృత్తి లభించడం తెలుగు భాషాపరమైన పరిశోధనాత్మకమైన కృషి చేయడం వారికి సిద్ధించిన సార్థకత. తెలుగు భాష ప్రత్యేకతకు, విశిష్టతకు మూలమైన వివిధ మాండలికాల వన్నెచిన్నెలు వారిని బాగా అలరించాయి. ఫలితంగా తెలుగులోని మాండలికాలలో నవలలు రచించారు. ఫలితంగా అవి కూడా వారికి ప్రతిష్ఠను చేకూర్చాయి.

సాధారణంగా నవలలకై వారు ఎన్నుకున్న ఇతివృత్తాలను పరిశీలిస్తే సాధారణ తెలుగు కుటుంబాల వ్యవస్థకు దర్పణంగా భాసిస్తాయి. మనం మనుగడ సాగిస్తున్న మనదైన సమాజం పట్ల స్పృహను, అవగాహనను సూక్ష్మంగా పరిశీలించి విశ్లేషించడము రాజకీయ, చారిత్రక, సామాజిక వ్యవస్థలను, దేశ కాలానుసారంగా సంభవించే పరిణామాలను పురస్కరించుకొని తార్కికంగా, మానవతా దృక్పథంతో కథావస్తువును అల్లడమూ వారి నవలలలో చూస్తాం. ఇతివృత్తం సర్వసామాన్య ధోరణిలో ఉండడంతో ఆయా పాత్రల చిత్రణము కూడా అదేవిధంగా వాస్తవికమైన పద్ధతిలోనే సాగుతుంది.

ఇటువంటి సరళిలో సాగిన ఒక చక్కని నవల నివేదన. ప్రస్తుత పరిశీలనము ఈ నవల గురించే. ఇది పరిమాణంలో చిన్న నవల. కానీ కథావస్తు నిర్వహణము, అనుశీలనము అతి లోతైనవి. ఈ ఇతివృత్తము ప్రతీ ఒక్కరికీ సుపరిచితమైనదే. అనుభవంలో ఉన్నదే. మనం మనుగడ సాగించే సమాజం, దాని తీరుతెన్నులు, వైఖరులు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పద్ధతులు, అనుభూతులు, సమస్యలు, సంఘర్షణలు యిత్యాదిగా అందరమూ చూసి జీవిత స్వరూపమే దక్షిణామూర్తిగారు తమ నవల నివేదనలో ఆవిష్కరించారు. దీనికి తగినట్లే అందలి పాత్ర వైఖరి. ఇది కథ అనుకుంటే దానికి నాయకుడు – ఒక వ్యవస్థ చిత్రీకరణం అనుకుంటే దానికి చెందిన ప్రతినిధి – ఇందులోని శంకరం పాత్ర. ఇతడు గొప్ప గొప్ప సాహసాలు చేసే, ఉద్యమాలు నడిపే నాయకుడు కాడు. ఆదర్శాలు పాటించి సంస్కరణలు నిర్వహించిన ఆచరణశీలి కాడు. ప్రేమాభిమానాలు, అనుభూతులు, స్పందనలు, అనుబంధాలు, ఉద్రేకాలు, ఉద్వేగాలు కలబోసిన మనిషి. మనసున్న మనిషి. ఆలోచనలు, తర్కవితర్కాలు, స్వీయాభిప్రాయాలు పదును పెట్టే మెదడు. ఒకప్రక్క ఆశలు నిరాశలు కావడం, నమ్మకాలు వమ్ముకావడం, అనుకున్నవి సాధించలేకపోవడం, ఏదో చేయాలన్న తపన, ఏమీ చేయలేని నిస్సహాయత, నిస్పృహ వీటితో సతమతమౌతూనే సాగిపోయాడు. సంఘర్షణల ప్రభావం ఒకప్రక్క క్రమశిక్షణ నైతిక విలువల పేరిట కన్నతండ్రి విధించిన కఠిన నిబంధనల శృంఖలాల మధ్య జీవితము – శంకరం ఎదుర్కొన్న జీవన స్వరూపము. తప్పకుండా తనదే అనుకున్న మామయ్య కూతురు కామేశ్వరిని బాల్యం నుండీ తానే పెంచిన ఆశలు త్రుంచివేస్తూ అహంకార దర్పాలకు దాసుడై తన మేనమామ తన కూతురును మరొకరికిచ్చి వివాహం జరిపిస్తే తాను మౌనంగా సహించవలసి వచ్చింది.

తాను కామేశ్వరి పరస్పరం ఇష్టపడ్డారు. ఇరు కుటుంబాలవారు చుట్టాలు పక్కాలు గ్రామస్థులు అందరూ ఔనంటూ స్థిరపరచారు. కానీ వివాహం చేసే సమయానికి మేనమామ, తన తండ్రి మధ్య పంతాలు, మాట పట్టింపులు కారణంగా ఆత్మీయుడైన మామయ్య మాట తప్పాడు. తన కూతురి మనస్సును, అభీష్టాన్ని మేనల్లుడు శంకరం యోగ్యతని ప్రక్కకు నెట్టేసి వెంకటరావు మరొకరితో వివాహం జరిపించి, బావగారిపై పంతం నెగ్గించుకున్నానని తృప్తి చెందాడు. విర్రవీగాడు. కాని ఎదురులేని విధి వైపరీత్యం కొద్దికాలానికే కుమార్తె కామేశ్వరి సౌభాగ్యాన్ని తుడిచివేసింది. ఇన్నాళ్ళు తన బ్రతుక నేర్చిన తెలివితేటలతో తన జీవితాన్ని సమర్థవంతంగా, సానుకూలంగా చక్కబరచుకున్నానన్న గర్వం భంగపాటుతో క్రుంగిపోయి తన శక్తి సామర్థ్యాల గర్వాహంకారాల వైఫల్యానికి కుమిలి పోయాడు, సిగ్గుపడ్డాడు వెంకటరావు.

క్రూరమైనవి, మానవత్వాన్ని పరిహసించేవి అయిన కొన్ని సాంఘిక దురాచారాలు సంఘంలో బలంగా వేళ్ళూనుకొని నిలచిపోయాయి.

సుకుమారులు, ముగ్ధలు అయిన యువతులు, బాలికల జీవితాలను, మనస్సులను అతి క్రూరంగా కాలరాచి వేస్తున్నా అదే సంప్రదాయమని మూఢత్వంతో అమానుషంగా పాటించడానికి కన్న తల్లిదండ్రులతో సహా పెద్దలంతా తలొగ్గి సంసిద్ధులయ్యారు. అభం శుభం తెలియని కామేశ్వరికి శిరోముండనం చేయించే ఏర్పాటు చేస్తారు. కామేశ్వరి, తనకు జరిగే తంతుకు నిస్సహాయంగా, నిర్లిప్తంగా అనుభూతులు భావావేశాలు ఉన్నాయా లేవా అన్నట్లుగా స్థాణువుగా మారిపోయింది. ఇది సహించలేక పోయాడు శంకరం. కామేశ్వరి పట్ల అంతర్గతంగా ఉన్న అభిమానము అతణ్ణి నిలవనీయలేదు. సహజంగా తనకు నిరతరం చూస్తున్న వాటిపై గల తార్కికదృష్టి, స్వతంత్రభావాలు, ఆలోచనలతో పదునెక్కిన మెదడు, మనసున్న మనిషి శంకరంలో ఉద్వేగంతో ఒక్క ఉదుటున లేచాడు. ఆ తంతుకు అడ్డుపడ్డాడు. అంతా చెల్లాచెదరు చేసి వెళ్ళిపోయాడు. చిత్రం ఏమిటంటే ఇదంతా చూస్తూ ఉండిపోయిన పెద్దలు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఏ వ్యాఖ్యానమూ చేయలేదు. అంతరాంతరాలలో యీ ఘోరాన్ని చూడనక్కరలేకుండా పోయినందుకు తెలిసీ తెలియని ప్రశాంతతా? ఇదొక ప్రశ్నగా దక్షిణామూర్తిగారు వదలి వేశారు.

ఈ సందర్భంలో కథాగమనానుసారం దక్షిణామూర్తిగారు శ్రీ కందుకూరి వీరేశలింగంగారి, స్త్రీ, బాలికా పునర్వివాహ ఉద్యమం గురించిన ప్రస్తావనను కథాంతర భాగంగా ప్రాముఖ్యం ఇచ్చారు. వారికి ఘోరాతిఘోరంగా ఆచారాల పేరిట స్త్రీలు, బాలికలు బలి అవడాన్ని, దారుణమైన అనుభవాలకు గురి కావడాన్ని ఎంత తీవ్రంగా గర్హించినదీ, అంతటితో ఊరుకొనక వారికి పునర్వివాహాలు జరిపించాలని, వారికి జీవన సౌభాగ్యాన్ని పొందనీయాలని ఆ మహనీయుడు ఘోషించి సమాజానికి కనువిప్పు కలిగించాలనే తీవ్ర పోరాటం సాగించడము తాను స్వయంగా పూనుకొని అట్టి కొన్ని వివాహాలు జరిపించి ఆచరణలో చూపించడము, వారి ఈ అనితర సాధ్యమైన కృషి పోరాటాలను చాలా ప్రశంసించారు. వారి సమకాలీనులు సంప్రదాయ మౌఢ్యంతో యిందుకు తీవ్రంగా వ్యతిరేకించడము వీరేశలింగంగారిపై వ్యక్తిగతంగా అనేక నిందారోపణలు, వ్యతిరిక్తత ప్రదర్శించి వారిని చాలా వ్యథలకు గురిచేయడము వీరేశలింగంగారు తెలుగు జాతికి, భాషా సాహిత్యాలకు, సమాజానికి చేసిన ఎన్నో ప్రశస్తమైన, అభ్యుదయపరమైన మహత్కార్యాలన్నీటినీ చాలా వివరంగా ప్రస్తావించారు. సమకాలికులు ఆయన వల్ల మేలుపొందివారు, సాటి పండితులు సహితం ఆయనను తీవ్రంగా ఖండించడము అనేక మనస్తాపాలకు గురి చేయడము పేర్కొని ఇటువంటి మానవీయమైన పరిణామాలను, సంస్కరణలను వేదశాస్త్ర ప్రమాణాలతో నిరూపించి ఆచరణలోకి తెచ్చిన వీరేశలింగంగారిని చూచి గర్వించవలసిన తెలుగు జాతి కృతజ్ఞతను కూడా చూపించకపోవడం సిగ్గుచేటని తీవ్రంగా గర్హించారు. వాస్తవానికి వీరేశలింగంగారు దక్షిణామూర్తిగారి కాలానికి చెందినవారు కారు. గత శతాబ్దానికి చెందిన ఆ మహనీయుని వ్యక్తిత్వ వైదుష్య ఉద్యమాది ఘనతలకు ఆంధ్రజాతి తరపున తన యీ నవల ద్వారా ఘన నివాళులర్పించారు. తెలుగువారందరి తరపున తాను ఋణం చెల్లించుకున్నారు.

ఇంక ప్రస్తుతాంశం శంకరం విషయానికి వస్తే ఆనాడు అంతగా ఉద్రిక్తుడై ప్రతిఘటించిన తాను కామేశ్వరి పట్ల ఘాతుకం జరుగకుండా అప్పటికి ఆపగలిగాడు కానీ అది కామేశ్వరికి ఎటువంటి శాశ్వతమైన ప్రయోజనాన్ని చేకూర్చలేదు. ఆమెపట్ల




తనకు గల ప్రేమాభిమానాలు, సానుభూతి, శ్రేయోభిలాషలు ఎంతగా ఉన్నా శంకరం ఏవిధంగానూ ఆమె జీవితాన్ని సంస్కరించలేకపోయాడు. ఈ సందర్భంలో దక్షిణామూర్తిగారు గౌరి అనే ఒక యువతి పాత్రను ప్రవేశాన్ని కల్పించారు. ఈమె చదువు సంస్కారాలకు నాగరిక మర్యాదలకు ఏమాత్రం సంపర్కం లేని ఒక శ్రామిక కుటుంబానికి చెందిన యువతి. వయసులో చిన్నదైనా ఆలోచనలలో, మాటకారి తనంలో ప్రౌఢ. శంకరంతో పెద్దగా చనువు లేకపోయినప్పటికీ చొరవగా మాట్లాడి కామేశ్వరి జీవితానికి పరిష్కారం ఏమిటని శంకరాన్ని ప్రశ్నిస్తుంది. మారుమనువుల ప్రసక్తి తెచ్చి అతని మస్తిష్కంలో కొన్ని పార్శ్వాలను తెరుస్తుంది. జన్మతః సహృదయుడు, సున్నిత మనస్కుడు సంస్కరణాభిలాషి అయిన శంకరం గౌరి ప్రబోధంతో ఉత్తేజితుడై కామేశ్వరిని తానే వివాహమాడాలని నిర్ణయించుకుంటాడు. కామేశ్వరికి ధైర్యం చెప్పి ప్రోత్సహిస్తాడు కూడా. తనకు రాపట్టిన దౌర్భాగ్యం వల్ల తనతోడి సంపర్కం ఎవరికీ మేలు చేయదనే మూఢ విశ్వాసంతో కామేశ్వరి తనను తానే కించపరచుకుంటూ బహిష్కరిచుకుంటుంది. ఆదర్శం కోసం ఆవేశపడినప్పటికీ శంకరం ఆచరణలో కృతకృత్యుడు కాలేకపోతాడు.

శంకరం పసితనమంతా చక్కని నిర్మలమైన, సొగసైన పల్లె వాతావరణంలో గడిచింది. అంతే నిర్మలమైన

మనస్సుతో పల్లె జీవితాన్ని, ప్రకృతిని ఆనందంగా ఆస్వాదిస్తూ పెరిగాడు. తండ్రిగారి కచ్చితమైన క్రమశిక్షణా నియతులతో, నిబంధనలతో పెరిగాడు. బాల్య, యౌవన దశలలోనిచ సహజమైన మనస్సు, దాని అభిరుచులు, ఆసక్తులు, ఉల్లాస ఉత్తేజాలు అతణ్ణి సరూపించలేకపోయాయి. తండ్రి పట్ల ఎనలేని గౌరవం ఉన్నా, తాను పోగొట్టుకున్న అనుభూతుల ఒత్తిడి అతనిపై ప్రభావాన్ని చూపించింది. తండ్రి శిక్షణలో ఒత్తిడిలతో నలిగిన మనస్సు బుద్ధి ఎక్కడ స్వేచ్ఛ లభించే అవకాశం ఉందో అక్కడ విచ్చలవిడిగా నడిపించింది. ఈ స్థితిలో శంకరం దిగజార్చుకున్న విలువలు, తప్పిన త్రోవలు, నేర్చిన పాఠాలు, అవగాహనకు వచ్చిన సత్యాలు, అతన్నో సంస్కారవంతునిగానే నిలిపాయి. లభించిన దానితో సరిపుచ్చుకునే మనస్తత్వాన్ని ఇచ్చాయి. ఇది సామాన్య మానవుని కథ. స్థాలీపులాకన్యాయంగా కొన్ని చెప్పగలిగినా యీన కలలో అనేక అంశాలు చక్కని తార్కిక చిత్రణతో ఉంటాయి. నివేదన నవల మనో విశ్లేషణాతమకమైన రచన. ఈనాటి అమ్మమ్మలు, నానమ్మల పసితనాల నాటి ముచ్చట్లు, కుటుంబ వ్యవస్థ, చిత్రణ, మానవీయ సంబంధాలు, అనుబంధాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, అలవాట్లు, అభిరుచులు ఈ నవలలో చక్కగా దర్శనమిస్తాయి. ముఖ్యంగా పురిటి గదిలో అలనాడు చెప్పుకునే ఎన్నెమ్మల్‌ధ లాంటి జ్ఞాపకాలు మురిపిస్తాయి. ఈనాటి యువతకే వినోదంగానూ, కొన్ని ఉత్కంఠభరితంగానూ ఉంటాయి. కొన్ని సూక్తులు మచ్చుకు చూద్దాం. ఎంతో కడుపు శోకం అనుభవించిన ఒక స్త్రీలోని మాతృమూర్తిని గురించిన సూక్తులు:

1. ప్రతి చిన్నవాడిలోనూ తన కడుపున పుట్టిన బిడ్డ పోలికలు చూసుకొనగలిగిన ప్రేమార్ద్ర హృదయ (నివేదన – పుట5) 2. మూర్ఖులు వివేకవంతుల వల్ల నేర్చుకునే దానికంటే వివేకవంతులు మూర్ఖుల వల్ల నేర్చుకునేది ఎక్కువని సామెత ఉంది కదా! (పుట – 13) 3. పెళ్ళిళ్ళనేవి ఎవరి అదృష్టం కొద్దీ వాళ్ళకి జరిగేవే కానీ కొలబద్దలతో విలువలు నిర్ణయించి అతికించేవి కావని ఆయన దృఢనమ్మకం (పుట – 19)అది సరళంగా చెప్తూనే ఎంతో గంభీరమైన, లోతైన, విలువైన సత్యాలు చెప్పే సూక్తులు మరెన్నో!

ఇది దక్షిణామూర్తి గారి స్మృతికి నా 'నివేదన'

# చేనేత వృత్తి : సామాజిక సాంస్కృతిక విశ్లేషణ 'ముత్యాల పందిరి'

**కోడం కుమారస్వామి,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 98483 62803

తెలుగు నవలా సాహిత్యం విభిన్న వస్తు వైవిధ్యాలకు కేంద్రంగా నలిచింది. తెలుగు సమాజాల్లో అస్తిత్వ ఉద్యమాల ప్రభావం ఉనికిలోకి రాకముందే ఉత్పత్తి కులాల జీవన వృత్తుల మీద రచనలు వచ్చినప్పటికీ అంతగా ప్రచారం, గుర్తింపునకు నోచుకోలేదు. మానవ సమాజానికి వలువలు అందించి విలువలతో కూడిన సంప్రదాయాన్ని నేర్పిన ఘనత వస్త్ర శిల్పులదే. బ్రిటీష్ వలస పాలకులను పారద్రోలడానికి జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో స్వదేశీ వస్త్రాలనే ధరించాలని పిలుపునిచ్చిన గాంధీజీకి చైతన్య దీప్తి చేనేత. ఖద్దరు నూలు వడికే చరఖా స్వదేశీ ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధికంగా శ్రామికులు ఆధారపడి జీవిస్తున్న వృత్తి చేనేత రంగం మాత్రమే. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేయూత లభిస్తుందని ఆశించిన చేనేత ఉత్పత్తి వర్గాలకు పాలకులు తీరని నిర్లక్ష్యం, నిరాశను మిగిల్చారు. తెలుగు సాహిత్యంలో అందులో తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన లోకమలహరి చేనేత కార్మికుల వృత్తి జీవితాన్ని 'సంఘం' అనే సాంఘిక నవలలో మొట్ట మొదటిసారిగా చిత్రించారు. అదేవిధంగా పోరంకి దక్షిణామూర్తి 1962లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్గొండ తదితర తెలంగాణ పల్లెల్లో చేనేతవృత్తి మాండలిక పదాల సేకరణ ప్రాజెక్టులో పనిచేసి ఉన్నారు. ఈ క్రమంలోనే అచ్చంపేటలో వనం ముత్యాలు అనే చేనేత కార్మికునితో పరిచయమైంది. అక్కడ గర్కపోసల చీర, గంగసరం చీర, దగ్గులపుటం చీర, కాౘేను చీర... అంటూ రకరకాల చీరల పేరు చెబుతూ **'ముత్యాలపందిరి'** అనే చీర పేరు కూడా చెప్పారు. అక్కడే తనను ఆ చీర పేరు ఆకట్టుకుందని పోరంకి దక్షిణామూర్తి గారు చెప్పారు.

ఆంధ్రప్రభ వారపత్రిక క్రోధినామ సంవత్సర ఉగాది నవలల పోటీల ప్రకటన చేసింది. గతంలో దక్షిణామూర్తి గారు 'వెలుగు వెన్నెలా గోదారి' (1958–59) కోస్తా ప్రాంతీయ జానపద మాండలికంలో రాశారు. తెలంగాణ భాషలో రాయాలనే తపనకు ఆంధ్రప్రభ వారపత్రిక ప్రకటన కార్యాచరణకు పురికొల్పింది. చేనేత పదాల సేకరణకు తెలంగాణ మారుమూల పల్లెల్లో తిరిగిన జీవితం, భాషా అనుభవాలతో పదిరోజుల్లో 'ముత్యాల పందిరి' నవల పూర్తి చేశారు. ఆంధ్రప్రభ వారపత్రిక వారి ఉగాది (1964) పోటీలలో తృతీయ బహుమతిని ముత్యాలపందిరి గెలుచుకొంది. ఆ వారపత్రికలో ధారావాహికగా ప్రచురించారు. 1968లో ఎమెస్కో వారు తొలిసారిగా ప్రచురించినారు. 1969లో ఈ నవల అక్కినేని సారస్వత పురస్కారాల్లో బంగారుపతకం సొంతం చేసుకుంది. 2015, ఏప్రిల్‌లో ఎమెస్కో ద్వితీయ ముద్రణ చేసింది.

**ముత్యాలపందిరి : సంక్షిప్త పరిచయం**

**'ముత్యాలపందిరి'** ఉయ్యాలవాడల ఊడల మర్రి దగ్గర మొదలవుతుంది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన చంద్రయ్య, ముత్యాలు బావా మరదళ్లు. బాల్యం ఆటపాటలతో అల్లుకున్న జీవితం ఆనందంగా సాగుతుంది. ముత్యాలంటే చంద్రయ్యకు ప్రాణం. అంతేస్థాయిలో ముత్యాలు కూడా చంద్రయ్యను ఇష్టపడుతుంది. ముత్యాలు తండ్రి లక్ష్మయ్య గ్రామంలో ఆర్థికంగా బలం కలిగి వుండటమే కాకుండా చేనేత సహకార సంఘాన్ని తన చేతుల్లోకి తీసుకుంటాడు. పట్నం నుంచి వచ్చే అధికారులను తనవైపుకు తిప్పుకొని సంఘాన్ని నష్టాల్లో పడేస్తాడు. భావనారుషి, సుంకులమ్మ కుమారుడు చంద్రయ్య. నిరంతరం కష్టపడి రెక్కాడితేనే డొక్కాడే నిరుపేద చేనేత కుటుంబం భావనారుషిది. చంద్రయ్య మేనమరదలు ముత్యాలు దగ్గరి కొత్త బంగారు ఉంగరాన్ని తీసుకొని ఎక్కడో జారవిడుచుకుంటాడు. తన తండ్రి భానవారుషి కొడతాడనే భయంతో చంద్రయ్య ఇంట్లో చెప్పకుండా పారిపోతాడు. సిల్వేరు నాడెయ్య, ఈదమ్మ అనే ఒక పద్మశాలీ ఇంట్లో ఆశ్రయం పొంది మగ్గం పనులు మొత్తం నేర్చుకుని పనిమంతుడవుతాడు. భావనారుషి కొడుకు వెళ్ళిపోయిన బాధలో అనారోగ్యంతో మంచానపడి చనిపోతాడు. బతుకమ్మ పండగంటే ముత్యాలుకు చాలా ఇష్టం కానీ ఆరోజు బావ గుర్తుకు వచ్చి దిగులుగా కూర్చుంటుంది. తన స్నేహితురాలు కాంతమ్మ బతుకమ్మ ఆట దగ్గరికి తీసుకొని వెళ్తుంది. బతుకమ్మలను నీళ్లలో వేసే క్రమంలో ముత్యాలు కాలుకు నీళ్లలో ఉంగరం తగులుతుంది. చేతిలోకి తీసుకొని చూస్తుంది. తాను బావకిచ్చిన ఉంగరంగా గుర్తించి, సుంకులమ్మకు చూపించి ఏడుస్తుంది. తన కొడుకు తప్పుచేయలేదని, అవమానంతో ఇల్లు వదిలిపోయిండని సుంకులమ్మ బాధపడింది. కొన్నేళ్ల తర్వాత చంద్రయ్యకు ఇల్లు గుర్తుకొచ్చి తన ఊరుకి తిరిగి వస్తాడు. ఊరంతా బాగా మారిపోయి కనిపిస్తుంది. తన ఇంటికి చేరుకోవడంతోనే తండ్రి గురించి తల్లిని ఆరా తీయడంతో, ఆమె ఏమీ చెప్పలేకపోవడంతో చనిపోయాడని తెలుసుకుంటాడు. చంద్రయ్య ఇంటివద్దే సొంతంగా మగ్గం పనులు చేసుకుంటాడు. చంద్రయ్య పనితనం తెలిసినవారంతా ఆయనతోనే చీరలు నేయించుకుంటారు. ముత్యాలు మీద ప్రేమతోని చంద్రయ్య ఆమెకు **'ముత్యాలపందిరి'** చీర నేసి ఇస్తానని అనడంతో, మరదలు నాకెందుకు బావా అని మురిసిపోతుంది. కావుల నుంచి మంచి పత్తి తీసుకొని సుంకులమ్మ వడికి దారం కండెలు చుట్టి కొడుక్కి అందిస్తుంది. చంద్రయ్య అందమైన అల్లికలతో నేయడానికి కాగితం మీద బొమ్మలు దించుకుంటాడు. మాలీపటేల్ భార్య సీతమ్మ కోడలుకు **'కాత్రేనుచీర'** నేయమని చంద్రయ్యను కోరుతుంది. అది పెళ్లి కానివారు నేయరని ఆమెకు చెబుతాడు. ఓ రోజు మాలిపటేల్ భార్య సుంకులమ్మతో మాట్లాడుతూ ముత్యాలుకు పట్నం సంబంధం రాములుతో లగ్గం ఖాయమైనట్లు చెప్తుతుంది. ముత్యాలుకు తనతో పెళ్లి జరిగితే మళ్లీ మగ్గం పనులతో కష్టాలు తప్పా సుఖం ఏముంటదని సుంకులమ్మతో అంటాడు చంద్రయ్య. తన కొడుకు మేనరికం దక్కకపోవడంతో సుంకులమ్మ మానసికంగా అనారోగ్యం పాలయి చనిపోతుంది. ఎట్టకేలకు చంద్రయ్య ముత్యాలపందిరి చీరను నేసుకొని, ముత్యాలు లగ్గమై పట్నం పోతుందని తెలియగానే ఆమెకు చీర ఇవ్వాలని రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా లంబడోళ్ల లఖ్మి కలుస్తుంది. రాములు ముత్యాలును పెళ్లి చేసుకున్న విషయం లఖ్మికి చెప్పడంతో రాములు మోసకారి విషయాలు బయటపెడుతుంది. ఇద్దరూ కలిసి స్టేషన్‌కు వెళ్లేసరికి రైలు కదులుతుంది. చివరకు లఖ్మిని చూసిన రాములు రైలు నుంచి దూకి పారిపోతాడు. చంద్రయ్య, ముత్యాలు కోసం నేసిన 'ముత్యాలపందిరి' చీరను అందిస్తాడు. చివరకు వాళ్లిద్దరు ఒక్కటికావడంతో




నవల ముగుస్తుంది.

**నవలలోని పాత్రలు :**

ముత్యాలపందిరిలో కథా నాయకుడు చంద్రయ్య, నాయిక ముత్యాలు. వీళ్లిద్దరు పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన రక్తబంధువుల పిల్లలు. బాల్య జీవితంలో ఆటపాటలతో కలిసి ఒకరికొకరు అత్యంత స్నేహంగా గడుపుతారు. పెరిగి పెద్దయ్యాక మొదలయిన కష్టాలు, కన్నీళ్లను దాటుకుని చివరకు మనుసులోని ప్రేమను గెలుచుకొని ఒక్కటవుతారు. చంద్రయ్య తండ్రి భావనారుషి, నీతిజాయితీ కలిగిన వ్యక్తిత్వం. ఒకరు అనవసరంగా మాటంటే పడే మనిషికాదు. చేనేత కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న నిరుపేద చేనేత కార్మికుడు. ఆయన భార్య సుంకులమ్మ. భర్త మగ్గం పనిలో తాను భాగం పంచుకుంటూనే ఇంటిపనులు చక్కబెడుతుంది. ఆత్మగౌరవంతో సంసారాన్ని చక్కదిద్దుకొనే ఉత్తమ నేతమహిళామణి. కష్టాల కడలిలో కెరటాల సమస్యలు ఎన్ని వచ్చినా తట్టుకొని జీవిత నావను నడిపించిన కష్టజీవి. కల్లు, చుట్ట తాగడం వల్ల గుండె పాడయిపోతుందని భావనారుషికి నచ్చచెప్పిన సౌమ్య గృహిణి. సుంకులమ్మ తమ్ముడు లక్ష్మయ్య ఉయ్యాలవాడలోనే పుట్టి పెరిగినాడు.

బట్టలు, నూలు వ్యాపారం చేయడంలో తెలివి సంపాదించాడు. మగ్గం పనులు చేయడానికి మనుషులు కరువు అవుతారని ముందే పసిగట్టి పిల్లలు బడికి వెళ్లకుండా విఫలయత్నాలు చేసిన స్వార్థజీవి. చేనేత సహకార సంఘానికి అధ్యక్షుడుగా వున్న తన బావ భావనారుషిని కుయుక్తులతో బాధ్యతల నుంచి పక్కకు తప్పిస్తాడు. తాను చెబితే వినేటువంటి రాములును కార్యదర్శిని చేస్తాడు. సంబంధిత అధికారులను మచ్చిక చేసుకొని ప్రభుత్వ సొమ్మును సొంతానికి వాడుకుంటాడు. మానవీయ సంబంధాల కంటే మనీ సంబంధాల పట్ల అతివిశ్వాసం కలిగిన టక్కరి లక్ష్మయ్య మోసకాడయిన రాములుకు పిలిచి తన బిడ్డ ముత్యాలుతో వివాహం జరిపించి మోసపోతాడు. లక్ష్మయ్య కుయుక్తులకు వంతపాడిన వ్యక్తి సంఘం కిష్టయ్య. భావనారుషి మీద అబద్ధాలతో చేనేత సంఘం అధ్యక్షపదవి నుంచి తప్పించడానికి కారకుడు కిష్టయ్య. తన కులం, వృత్తి, ఊరు వివరాలు తెలియకుండా జాగ్రత్తగా లక్ష్మయ్యకు దగ్గరయిన నక్కజిత్తుల మనిషి రాములు. పట్నంలో తిరిగి ఉన్నతాధికారులతో పరిచయాలు పెంచుకొని పైరవీలు చేయడంలో దిట్ట. లంబడోళ్ల 'లఖీ'ని మోసం చేసిన ఘనుడు. నవలలో చివరాఖరుకు రాములు ముత్యాలును పెళ్లి చేసుకున్నాడని తెలిసిన లఖీ రాకతో రాములు బండారం బయటపడుతుంది. ముత్యాలుతో రైలులో వెళ్తున్న రాములు, లఖీ రావడంతో బండి నుంచి దూకి పారిపోతాడు. పోశయ్య గురువు పిల్లలకు నీతి కథలు చెబుతాడు. ఊళ్లు తిరుగుతూ లోకజ్ఞానం పొందుతాడు. చంద్రయ్యకు కొండలు, గుట్టలు చూపించి చైతన్యం కలిగిస్తాడు.

పోరంకి దక్షిణామూర్తి గారీ నవలలో పాత్రలను ఇతివృత్తానికి అనుగుణంగా తీర్చిదిద్దారు. నవలలోని గ్రామీణ పరిస్థితులకు అనుగుణమైన భావాలను తెలంగాణ భాష ద్వారా చక్కగా చిత్రిక పట్టారు.

**నవల సామాజిక జీవితం**

జీవిత వాస్తవికతను చిత్రించడంలో భాష కూడా ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. తెలంగాణ సామాన్య జనవ్యవహారిక భాషను రచయిత నిర్దిష్టంగా కథనంలో వాడటం మనకు స్పష్టంగా తెలుస్తుంది. ప్రస్తుత తరానికి అవసరమైన తెలంగాణ భాష, సంస్కృతులు 'ముత్యాల పందిరి' నిండా అల్లుకుని ఉన్నాయి. నవలలో ఎంచుకున్న భాషాశైలితో ఇతివృత్తాన్ని సమన్వయం చేయడంలో దక్షిణామూర్తికి క్షేత్రపర్యటన అనుభవం బాగా ఉపకరించిందని చెప్పవచ్చు. **'జీవితానికి ప్రాతినిధ్యం వహించే ప్రయత్నమే నవల ఆవిర్భావానికి కారణం'** (హెన్రీ జెమ్స్) అన్నట్లుగా నవలలో సమకాలీన జీవితంతోపాటు సాంఘికాచార సంప్రదాయాలు కనిపిస్తాయి. సమాజానికి ప్రాతినిధ్యం వహించే పాత్రలు కూడా రచయిత ప్రవేశపెట్టాడు. జీవితానుగుణమైన వాస్తవ సంవాదాలతో ఈ నవల నడుస్తుంది. కథాకథనంలో పూర్తి పల్లెటూరి జనవ్యావహారిక భాష ప్రయోగించడంతో రచయిత తన ప్రత్యేకతను చాటుకున్నారు.

ఉయ్యాలవాడలో ఊడలమర్రి వద్ద పిల్లలు ఆడుకుంటున్న దృశ్యంతో నవల మొదలవుతుంది. చంద్రయ్య తన మేనమరదలు ముత్యాలు కలిసి ఆడుకుంటుంటారు. చంద్రయ్య మేనమామ లక్ష్మయ్య ఉయ్యాలవాడలో పెద్ద బట్టల వ్యాపారి. ఆయన ఇంటిలో గ్రామానికి చెందిన పద్మశాలీల పిల్లలు వివిధ రకాలైన మగ్గం పనులు చేస్తుంటారు. ఆ ఊరిలో మగ్గం పనిమీద జీవించే చేనేత కులాలకు చెందినవారు చాలా మందే ఉంటారు. చేనేత కుటుంబాల పిల్లలకు బడికి వెళ్లి బాగా చదువుకోవాలని చాలా మందికి ఉన్నప్పటికీ తల్లిదండ్రుల ప్రోత్సాహం అంతంతమాత్రంగానే వుంటుంది. ఒకవైపు రెక్కాడితేనే డొక్కాడే పరిస్థితుల్లో చేనేత కుటుంబాలు ఉండి, పిల్లలను కూడా నేతపనుల్లో పెట్టడం కనిపిస్తుంది. కుటుంబంలోని పిల్లల నుంచి వృద్ధుల వరకు తలా ఒకపని చేస్తేనే తప్పా కడుపులకు తిండి దొరకని ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటారు. చంద్రయ్యతోపాటు మిగతా పద్మశాలీల పిల్లలు నర్సయ్య, నాగయ్య, మల్లయ్య, యాదగిరితోపాటు పోలీస్ పటేలు, మాలీపటేలు, పట్వారీల పిల్లలు కూడా బడికి పోతుంటారు. అదే దారిన పోతున్న లక్ష్మయ్య సేటు గమనించి పద్మశాలీ నాగయ్య అనే పిల్లవాని జుట్టుపట్టుకొని కొడుతాడు. కార్ఖానాలో నీవంతు పని ఎవరు చేస్తారని మండిపడుతాడు. పద్మశాలీ కుటుంబాల దయనీమైన పరిస్థితులు రచయిత మన కళ్లముందుంచుతాడు. **"పెద్దోండ్లు కొల్వు సెయ్యాలె. పిల్లగాండ్లకు బువ్వపెట్టాలె. మేం మంచిగ సదువుకొని, యాదన్న కొల్వు సేస్తం. నూర్ల రూపాలొస్తయి. ఈదేమున్నది?"** అని యాదగిరి లక్ష్మయ్యను నిలదీస్తాడు. చేనేత పనులు పద్మశాలీలతోపాటు తొగటవాళ్లు, మాలవాళ్లు, కుర్మలు కూడా ఉన్నరు. దేవాంగులు దసిలి పట్టు నేతపని చేయడం కనిపిస్తుంది. **'సాలోడు సచ్చినా, బతికినా గుంతలనే'** నానుడి ఉన్నట్లుగానే చేనేత కుల వృత్తిని నమ్ముకున్నవాళ్ళకు ఆర్థిక పరిస్థితులు అధ్వాన్నమని రచయిత పరోక్షంగా చెప్పడం గమనించవచ్చు. **'కుల ఇద్దె ఇడిస్తె ఇట్లనే ఉస్కె గంపలు మొయ్యాలె'** (పుట: 18) అంటాడు లక్ష్మయ్య. **'సాలెపన్లె దినమంత కష్టం సేస్తె రూపాయినె వస్తది గాని, కూలీ పన్ల రొండ్రూపాయిలొస్తయి గద!'** అని శాల పోశయ్య ఆవేదన వ్యక్తం చేస్తాడు.

లక్ష్మయ్య ఊర్లో నూరు చేనేత మగ్గాల మీద చీరలు నేపియ్యడమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో పద్మశాలీలకు నూలు అందించి చీరలు నేయిస్తాడు. దీంతో చేనేత కులాల మీదనే వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తుంటాడు. చేనేత పనివారికి తగిన శ్రమ ఫలితం కోసం

చేనేత కార్మికులు అందరూ కలిసి సహకార సంఘం పెట్టుకొని, భావనారుషిని అధ్యక్షుడిగా, కిష్టయ్యను కార్యదర్శిగా ఎన్నుకుంటారు. చేనేత సంఘం నడవడం ఇష్టంలేని లక్ష్మయ్యసేటు సెక్రెటరి కిష్టయ్యను తనకు అనుకూలంగా మలుచుకొని రాములును సెక్రెటరిగా ఎన్నికయ్యేటట్లు లక్ష్మయ్య చక్రం తిప్పుతాడు. పెట్టుబడిదారి స్వభావం కలిగిన లక్ష్మయ్య చేనేత కార్మికుల శ్రమ మీదనే లాభాలు ఆర్జించడమే కాదు, సోసైటీని నిర్వీర్యం చేయడంలో లక్ష్మయ్య కుట్రను రచయిత మన ముందుంచుతాడు. తోబుట్టువైన సుంకులమ్మ భర్త భావనారుషి 'సంఘం'కు అధ్యక్షుడైనప్పటికీ తన ఆర్థిక దోపిడిని సాగించడానికి కుట్రలో భాగంగానే 'సంఘం' సెక్రెటరి కిష్టయ్యను లోబరుచుకొని రాములును కార్యదర్శిగా ఎన్నుకొని సంఘాన్ని తన కనుసన్నల్లో నడుపుకోవడానికి వ్యూహం పన్ని విజయం సాధిస్తాడు. దోపిడీ స్వభావం కలిగిన పెట్టుబడి లాభాలే లక్ష్యంగా సంఘం పనిచేస్తుంది. ఈ దోపిడీ సమాజంలోని కుల సంబంధాలను, రక్త బంధుత్వ విలువలను సైతం విస్మరిస్తుందని నవలలో రచయిత అద్భుతంగా చిత్రించారు.

నవలకు ప్రధాన కథానాయకుడు చెంద్రయ్య. తన మేనమామ కూతురు ముత్యాలంటే అమితమైన ప్రేమను పెంచుకుని కలలు కుంటాడు. చంద్రయ్య తల్లి సుంకులమ్మకు కూడా ముత్యాలును కోడలుగా చేసుకోవాలని మనుసులో వుంటుంది. కానీ తమ్ముడు లక్ష్మయ్య ఆర్థికంగా బాగా ధనవంతుడు కావడంతో పేదింటికి తన బిడ్డను ఇవ్వడానికి మనుసులో ఏనాడు ఆలోచన కూడా రానీయడు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకొని చంద్రయ్య, ముత్యాలుకు తండ్రి చూసిన రాములునే పెళ్లి చేసుకోమని చెప్పిన మౌనంగా తన బాధను దిగమింగుకుంటాడు. కులం, రక్త సంబంధాల కంటే సమాజంలో ఆర్థికంగా బలపడిన వర్గాలు ఏకమవడానికి ప్రయత్నిస్తాయని అర్థం చేసుకోవాలి. **'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే'** (మార్క్స్) నని 'ముత్యాలపందిరి'లో స్పష్టంగా దృగ్గోచరమవుతుంది.

**ముత్యాలపందిరి: సాంస్కృతిక విశేషాలు**

'ముత్యాలపందిరి'లో ఆయా సందర్భాలకు అనుగుణంగా మానవ జీవితంలోని వివిధ సాంస్కృతిక విషయాలను మనోహరంగా రచయిత చిత్రించారు. చంద్రయ్య, ముత్యాలు బాల్య జీవితంలో ఆడుకున్న ఆటలు, పాటలు నవల చిత్రించిన పరిస్థితులనాటికి పాఠకులను తీసుకొని వెళుతాయి. నవల చదువుతున్న ఆసాంతం మన కళ్లముందు ఆ దృశ్యాలు కదలాడుతాయి. మానవ జీవితంలో సంస్కృతీ సంప్రదాయాలకు చాలా ప్రాధాన్యముంటుంది. జీవితమంత విశాలమైన నవలలో రచయిత మానవ జీవితంలో విభిన్న సాంస్కృతిక విశేషాలను రచనలో అక్షరీకరించడం వల్లనే మంచి నవలకు సంపూర్ణత్వం చేకూరుతుందని విమర్శకుల అభిప్రాయం. నవల చదువుతున్న క్రమంలో సంఘటనలు పాఠకులను తమ బాల్య జీవితంలోకి నడిపిస్తాయి. చంద్రయ్య, ముత్యాలు బావామరదళ్ళు. బాల్యంలో ఎవరికైనా ఆటలంటే ఇష్టమేగా మరి.

**'చెమ్మచెక్క చేరడేసి మొగ్గ/ అట్లుపోయంగ ఆరగించంగ,**
**ముత్యాల చెమ్మచెక్క ముగ్గులేయంగ/ రత్నాల చెమ్మచెక్క రంగులెయ్యంగ**
**పవడాల చెమ్మచెక్క పందిరెయ్యంగ/ ముత్తాలు పెండ్లికీ ముందు పోదాం రండి!'**

అంటూ ఆడి పాడే పిల్లల పాటలు ఆకట్టుకుంటాయి. సుమారు అరవై ఏళ్ల కిందటి గ్రామీణ జీవితాన్ని రచయిత దక్షిణామూర్తి గారు మనముందర ఆవిష్కరణ చేశారు. ముత్యాలుకు మేనత్త సుంకులమ్మ తన మేనకోడలును అల్లారుముద్దుగా చేనేత వృత్తి పనులు నేర్పుతుంది. **'ఈడు సూడు బిడ్డా ! మొదాలు ఏమి సెయ్యాలె, రాటం కొనాకు ఎంకయ పీటున్నది గదా! దాని సెవుల్లకెల్లి కదురు పెట్టాలె. కదురు మీద దిండున్నది కదా! రాట్నం మొల్తాడు మీకెల్లి పురి గుంజకోని దిండుకు తొడగాలె. రాట్నం పురి బిర్రు గుంజినంక, కదురు కొనాకెల్లి ఊసె సెక్కాలి'** అంటూ కండెలు పోసే సాంస్కృతిక ఉత్పత్తి జీవిత మూలాల పరిచయం పూసగుచ్చినట్లు రచయిత వర్ణించే విధానం చాలా ఆసక్తికరంగా వుంటుంది.

గ్రామీణ జీవితంలో పనితోనే పాట పుట్టిందనేది నానుడి. జానపదులైన ఉత్పత్తికులాలు శ్రమైక జీవితంలో అలసటను మరచిపోయి ఉల్లాసంగా జీవితాన్ని ఆనందించడానికి నాటి నుంచి నేటి వరకు ఆటపాటలే ప్రధానం. పాఠశాలకు వెళ్తున్న చంద్రయ్య, ముత్యాలు 'కుమ్మరిగూడెం'లో ఒగ్గోలు కథ చెబుతున్న విషయం తెలుస్తుంది. పిల్లలు కథలంటే చాలా ఇష్టపడుతారు. ఒగ్గు కళాకారులు చెప్పే బీరప్ప కథ విని తమ కుటుంబంలో బీరప్ప, నారజముదు పాత్రల్లా ఎవరుంటారో కూడా ముత్యాలు, చంద్రయ్య ముచ్చటలో తెలిసిపోతుంది. ఈ నవలలో ముస్లిం పిల్లలతో కలిసి పతంగుల పండగ నిర్వహించుకోవడం కనిపిస్తుంది. విభిన్న సామాజిక వర్గాల మధ్య మత సామరస్యతా సాంస్కృతిక ఐక్యతను చిత్రించడంలో రచయిత చక్కని తెలంగాణ భాషా భావుకతను ప్రదర్శించారు. చంద్రయ్య ఇంటి నుంచి పారిపోయి వేరే గ్రామంలో పద్మశాలీ కాదయ్య, ఈదమ్మ ఇంటిలో ఆశ్రయం పొందుతాడు. పున్నమ్మ పెండ్లి కార్యంలోని ఎదురుకోళ్లు, లగ్గంపోలు, అరుంధతి నక్షత్ర దర్శనం, 'ఏర్నాల బంది', పదహారు పండగ తదితర విశేషాలను వర్ణించడం పాఠకుడిని ఆకట్టుకుంటుంది. బతుకమ్మ పండగ నవలలో ఒక మలుపును తిప్పుతుంది. ముత్యాలు తన బావకిచ్చిన ఉంగరం బతుకమ్మలు వదిలే నీళ్లకుంటలో దొరుకుతుంది.

చేనేత కులాలు నేసే రకరకాలయిన చీరలను రచయిత పరిచయం చేస్తాడు. **"ఇగ్గో నర్సయ్యా ! 'పూనాకొంగు రాజమాలంచు గద్వాల సీర' ఎన్నడన్న జూసినవా!"** అంటడిగిండు చంద్రయ్య. మగ్గం, కండెలు, రాట్నం, సిట్టెలు, గుమ్మి, పంటె, పోగు, సుంచు, సిగరు, ఊస, బద్దె, లాడెకొమ్ము, లడీలు, లాకలు, పిర్రపట్ట, పాకోడు, అలుక్కుంచె, సరిగుంజ, ఇర్లుకుంచె, ఆసు, పడుగు, దండెం చేనేత శ్రమైక సంస్కృతిలో భాగమైన పనిముట్లు రచయిత చక్కగా వివరించారు. నూలుపున్నం, దీనికి మరోపేరు జంజరాల పున్నం. అన్నివర్గాల ప్రజలు రాఖీపౌర్ణమిగా కూడా జరుపుకుంటారు. చేనేతలో వృత్తి పనిలో తనకున్న అనుభవ జ్ఞానాన్ని చెబుతాడు చంద్రయ్య. గ్రామాల్లో విభిన్న సామాజిక కులాలు తమ సంస్కృతిలో భాగంగా కట్టు, బొట్టు విధానాలు వేర్వేరుగా ఉంటాయనడానికి నవలలో వృత్తి కళానైపుణ్యం వివరిస్తుంది. **కొలికిమొంగి చీర, పచ్చీసుకానల చీర, పగడసారవొల్లె, ఉల్లిపూల చీర, జొన్నలరాశి చీర, దగ్గులపుటం చీర, గర్మెపోసల చీరలు** నేయడం నేర్చుకుంటాడు. పనిమంతుడైన చంద్రయ్య తన మరుదలు ముత్యాలుకు 'ముత్యాలపందిరి' చీర నేయడం పని మొదలుపెడుతాడు. లక్ష్మయ్య తన కుమార్తె ముత్యాలుకు రాములుతో పెళ్లి నిశ్చయమైందని తెలిసినపుడు తన కడుపులోనే ఉద్వేగపు బాధను నింపుకొని తనలాంటి పేదవాడిని చేసుకొని మళ్లీ పద్మశాలీ పని చేసుకోవడం కన్నా ధనం ఉన్నవాడిని చేసుకోవడం మంచిదని తన తల్లిని కూడా సముదాయిస్తాడు. మానవ జీవితంలో సాంస్కృతిక జీవితంలో ఆహారపు అలవాట్లు కూడా ఒక భాగంగా మన గమనించవచ్చు. ఈ నవలలో తెలంగాణ, ఆంధ్ర ఆహారపు అలవాట్లకు సంబంధించిన పుంటికూర, గోంగూర చర్చను రచయిత నలభై ఏళ్ల క్రితమే తీసుకురావడం అభినందించదగిన విషయం. భాషలు వేరయినా మనుషులుగా మనమంతా ఒక్కటేననే భావన కలిగించారు.


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**


**తెలంగాణ భాషా విశేషాలు :**

నవలలో తెలంగాణ జానపద భాష స్వచ్ఛత పాఠకుడికి కళ్ల ముందు కనిపిస్తుంది. తెలంగాణ సమాజంలోని జనవ్యవహారిక భాషను ప్రయోగించడం ద్వారా నవల మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. పోరంకి దక్షిణామూర్తి తెలంగాణ జిల్లాలో చేనేత వృత్తి పదకోశ సేకరణకు చేసిన క్షేత్రపర్యటన అనుభవం ద్వారా పొందిన భాషతోపాటు, చేనేత వృత్తి నైపుణ్యాన్ని చక్కగా వర్ణించారు. మన జీవితాల్లో విస్మరించిన పదజాలం, సంస్కృతి, సంప్రదాయాలు ఆయా సందర్భాల్లోని సంఘటనలు ముందుకు లాక్కెళ్తాయి. **సాల్లె (బడి), ఎంటికలు, కొల్వు, జిట్టెడు, సవుకారు, దప్తరు, తరీక, పుర్సతు, మొబ్బుల, యాష్ట, ఉర్కుడు, పరాకతు, అర్ర, కమాయించు, జల్ది, దునియ, రేల్గాడి, సాలాయన, పోరగాండ్లు, పోరీలు, టక్కరు, ఫికరు, నెత్తి, ఇత్తులు, నాష్ట, కరాబు,** బర్రె పదాలు తెలంగాణ గ్రామీణ జీవభాష నవలలోకి రావడం రచయితకు భాష పట్ల ఉన్న గౌరవంగా గుర్తించాలి. సంస్కృతీ సంప్రదాయాల్లోంచి వచ్చిన భాషను సాహిత్య రచనలో వాడటం అరవై ఏళ్ల క్రితమే ప్రయోగించడం విశేషంగా పరిగణించాలి. **జరసేపు, లగ్గం, యాది, మాలు, గడువ, సత్తు, అగ్గువ, దస్కతు, వన్నె, సౌలతు, దియ్యి, గుబులు, పుంటికూర, తాంబాళం, ఎదురుకోళ్లు, దబ్బదబ్బ, దందలు, శురువు, నియతి, తెస్సగ, తానం, మతులాబు, అలుగు(ముల్లు) తోసలే** పదాలు తెలంగాణ నిఘంటువులోకి ఎక్కించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సాహిత్య రచనలోకి తెలంగాణ భాష, యాసను తీసుకురావడం పట్ల రచయితలు కొత్తగ ఆలోచించాలి. **'శాలోదు సచ్చినా బతికినా గుంతలోనే', కుల ఇద్దెకు సాటిలేదు గువ్వలచెన్నా!, 'సచ్చెదాక సగం గుంత సచ్చినంక నిండు గుంత'** సామెతలు చేనేత జీవిత అనుభవాల నుంచి వచ్చినవే. అందమైన చీరలు నేసినప్పటికీ ఏనాడు కొత్త బట్టలకు నోచుకొని బడుగు జీవుల పడుగుపేకలను వర్ణించడంతో రచయిత వస్తువు పట్ల స్పష్టమైన అవగాహనతో విజయం సాధించాడని చెప్పవచ్చు. నలభై ఏళ్ల కిందటి వాస్తవికతను అవగతం చేసుకొని రచించిన నవల ముత్యాల పందిరి. సమాజంలోని చేనేత వృత్తి జీవితాలను స్థితిగతులను, మానవ సంబంధాలు అర్థిక సంబంధాలుగా బలపడుతున్న స్థితిని మన కళ్లముందు ప్రదర్శించారు. తెలుగు సాహిత్యంలో చేనేత జీవితాల మీద వచ్చిన రెండో నవలగా 'ముత్యాలపందిరి'ని గుర్తించాల్సిన అవసరం ఉంది.

# మాండలిక పద మణిహారం "వెలుగూ వెన్నెలా గోదారీ"

**వడ్కపురం కృష్ణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 96666 02670

సాహిత్య ప్రక్రియ ఏదైనప్పటికీ వస్తు ప్రాధాన్యత అనేది అత్యంత ముఖ్యమైన విషయం. వస్తు ప్రాధాన్యతే సాహిత్య పటిమకు, పాఠకుల ఆదరణకు తొలి మెట్టు. ఇది అన్ని రకాలైన భాషా సాహిత్యాలకు వర్తిస్తుంది. తెలుగు సాహిత్య విషయానికి వస్తే మెజారిటీ పాఠకులను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రాంతాలవారికి ఆమోదయోగ్యమైన ప్రామాణిక భాషలో సాహిత్యం అధిక మొత్తంగా వెలువడింది. కానీ ఒక నిర్దిష్ట ప్రాంతానికి మాత్రమే పరిమితమైన మాండలిక యాస భాషతో సాహిత్య సృజన అంతంత మాత్రంగానే జరిగింది. దీనికి గల కారణాలు ఏవైనప్పటికీ రచయితలు ఈ విషయంపై తగినంత దృష్టి సారించలేదన్న విషయం మాత్రం సుస్పష్టం. కానీ స్వల్ప సంఖ్యలో నవలాకారులు కొంతమంది తెలుగునేలపై ఉన్న మాండలిక భాషను ప్రధానంగా చేసుకుని సరళమైన శైలిలో, పాఠకుల హృదయాలలోకి తేలికగా చొచ్చుకుపోయే వస్తువును తీసుకుని, ఆసక్తి భరితమైన ఇతివృత్తంతో నవలలు రాశారు. అందులో పోరంకి దక్షిణామూర్తి ఒకరు. తూర్పు గోదావరి జిల్లా, ఆలమూరు వాసి అయిన పోరంకి దక్షిణామూర్తి మొట్టమొదటిసారిగా ఈ తెలుగు నేలపై ఉన్న మూడు మాండలికాలను ఆధారంగా చేసుకుని మూడు మాండలిక నవలలు రాశాడు. తెలంగాణ మాండలికంలో ''ముత్యాల పందిరి'', రాయలసీమ మాండలికంలో "రంగవల్లి", తీరాంధ్ర (కోస్తాంధ్ర) మాండలికంలో "వెలుగూ వెన్నెలా గోదారీ"(1962) అనే నవలలు రాసి మూడు మాండలికాలలో నవలలు రాసిన మొదటి వ్యక్తిగా పేరొందారు. ఇందులో "వెలుగూ వెన్నెలా గోదారీ" నవలా రచయిత స్వంత ప్రాంతానికి చెందిన మాండలికంలో రాయబడింది. దీనిని కేవలం వారం రోజుల్లోనే పూర్తి చేశారు. నవల ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, ఉగాది (ప్లవ) నవలల పోటీలో బహుమతి పొందింది. ఉత్తరాంధ్ర మాండలికం, జానపద శైలిలో (1962,డిసెంబర్) వెలువడిన మొట్ట మొదటి నవల.

**నవల సంక్షిప్త పరిచయం :**

నవలను పరోక్ష కథన పద్ధతిలో నడిపించాడు రచయిత. నిరుపేదలైన, వేరు వేరు ప్రాంతాలకు చెందిన రావులమ్మ, ఎంకన్న, రవణయ్య, సీతమ్మ, బధ్రయ్య, సూరమ్మ(సూరి), జగ్గన్నల జీవితాలలో పేదరికం, ముందుచూపులేమి, ఆర్థిక అస్థిరత వల్ల జరిగిన సంఘటనల సమాహారం ఈ నవల. మొదట వేరు వేరు వ్యక్తులుగా, మూడు కుటుంబాలుగా ఉన్న పాత్రలు చివరకు నవల ముగిసే సమయానికి ఒక్కదగ్గరకు చేరుకుంటాయి. రవణయ్య రావులమ్మను పెళ్లి చేసుకోవాలని అనుకుని ఆశపడే యువకుడు. కానీ రవణయ్యకు




ఇతర స్త్రీలతో సంబంధాలు ఉన్నవని భావించిన రావులమ్మ కోపంతో చీదరించుకొని ఒడ్డూ, పొడుగుతో అందగాడైన ఎంకన్నను వివాహం చేసుకుంటుంది. తరువాత రవణయ్య కూడా వేరే ఆలోచన లేక వేరే స్త్రీని వివాహమాడుతాడు. ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే వ్యాపారం చేయాలని పట్నంలో తన ప్రయత్నాలను మొదలు పెట్టి క్రమంగా లాభాలు ఆర్జిస్తాడు. అదే క్రమంలో పట్నంలో తనకు వ్యాపారం చేయడంలో పరిచయమైన బధ్రయ్య, సెరబయ్యాల మూలంగా చెడు వ్యసనాలకు అలవడతూ ఊరికి రాకుండా తన భార్య రావులమ్మను క్రమంగా విస్మరిస్తాడు. భర్తపైనే ఆశలను పెట్టుకుని బతుకుతున్న రావులమ్మ కూడా క్రమంగా అసహనానికి లోనౌతుంది. అదే సమయంలో రవణయ్య భార్య చనిపోవడంతో

దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సమయంలో రావులమ్మ అతనికి చేదోడు వాదోడుగా ఉంటుంది. అతని పిల్లలను తన పిల్లల వలె చూసుకుంటుంది. ఒకానొక సమయంలో రవణయ్యకు తనకు తానుగా లొంగిపోయే వరకు తన ఆలోచన వెళ్తుంది. మరోవైపు వ్యాపారం కొరకు పట్నం పోయిన ఎంకన్న మంచి లాభాలు గడించి చెడు అలవాట్లవైపు మళ్లుతాడు. ఆ క్రమంలోనే బద్రయ్యతో చనువుగా ఉండే వేశ్య సెంద్రకాంతన్ని పొందడానికి వెంపర్లాడుతాడు. తనకు వ్యాపారంలో సహకరించిన బద్రయ్యతో వైరం పెట్టుకోవడానికి కూడా వెనకాడడు.

నవలలో మరో వైపు సమాంతరంగా జరిగే కథ ఇంకాస్త వైవిధ్యంగా ఉంటుంది. రాత్రి సమయంలో గోదావరి పై నావలో తోటి ప్రయాణికులతో ప్రయాణం చేస్తున్న సీతమ్మ ఆమె తల్లికి ఎదురయ్యే సంఘటన సీతమ్మ జీవితాన్ని మార్చేస్తుంది. సీతమ్మ ఒంటిపై నగలకోసం జరిగిన పెనుగులాటలో జరిగిన గొడవలో పడవ తిగబడదుతుంది. దొంగతనానికి పూనుకున్న బద్రయ్య, అమాయకురాలైన సీతమ్మ, దొంగను ఎదిరించిన ముసలయ్య, తప్పా మిగతా వాళ్ళు మొత్తం ఆ ప్రమాదంలో చనిపోతారు. సీతమ్మను కాపాడి, ఆమె అందానికి ముగ్ధుడైన బద్రయ్య ఆమెను వదలుకోవడానికి మనుసొప్పక అక్కడే ఉండి పోతాడు. అందరిని కోల్పోయి ఒంటరైన సీతమ్మతో గోదారొడ్డున హొటల్ పెట్టించి అండగా నిలబడి, ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఆమె ఆదరణను పొందలేకపోతాడు. తన తల్లి చావుకు కారణమైన బద్రయ్యను సహించదు. కానీ జరిగిన మంచీ చెడులన్నింటిలో తన వెంటనే ఉన్న ముసలయ్యను మాత్రం పెద్ద దిక్కుగా భావిస్తుంది సీతమ్మ.

జగ్గన్న, రాజయ్య, సూరమ్మలది మరో గాథ. జగ్గన్న, రాజయ్యలిద్దరు అన్నాదమ్ములు. చిన్నతనంలో రాజయ్య, సూరి (సూరమ్మ) ఇద్దరు ఆటలాడుకుంటూ ఒకరంటే ఒకరు ఇష్టంగా పెరుగుతారు కానీ అనివార్య కారణాల వల్ల జగ్గన్నను చేసుకోవాల్సిన గత్యంతరం ఏర్పడుతుంది. భార్య కావాల్సిన సూరి వదినగా తన ఇంట్లోనే అడుగుపెడుతుంది. ఐనప్పటికీ ఎంతో గౌరవ మర్యాదలతో చూస్తాడు రాజయ్య. శారీరకంగా ధృఢంగా ఉన్న జగ్గన్న పెళ్లి జరిగిన కొద్ది కాలానికి సైన్యంలో చేరి యుద్ధానికి పోతాడు. అట్ల పోయిన అతను ఊళ్ళో ఉన్న భార్యకు ఒక ఉత్తరం ముక్క కూడా పంపలేక పోతాడు. అన్న వస్తాడని ఎన్నోసార్లు ధైర్యం చెప్పి తన అన్నపిల్లలను తన పిల్లల వలె చూసుకుంటాడు రాజయ్య. కానీ వస్తాడో రాడో, అసలు బతికి ఉన్నాడో లేడో తెలియని భర్తకొరకు జరిగిపోయిన ఎన్నో రోజుల ఎదురు చూపుల తరువాత వారు ఊరిలో ఉండలేక రాజయ్య, సూరమ్మ తన ఇద్దరు పిల్లలతో బతుకుదెరువు కొరకు వేరే ఊరికి వెళ్తారు. ఇది జరిగిన కొద్ది రోజులకే యుద్ధంలో కాలును పోగొట్టుకుని తన భార్యా పిల్లలని వెతుక్కుంటూ వస్తాడు జగ్గన్న. భార్య, తమ్ముడు ఊరొదిలి వెళ్లిపోయారనే విషయం తెలుసుకుని సొంత తమ్ముడు, తన భార్యకు మరిదైన రాజయ్యతో లేసిపోయిందనే భావనతో రగిలిపోతాడు జగ్గన్న. కనిపిస్తే చాలు ఇద్దరినీ చంపేయాలనంత కసిని పెంచుకుంటాడు. వారిని ఎలాగైనా వెతికి అంతం చేయాలని పగ బడుతాడు. ఇలా మూడు వేరువేరు చోట్ల తమ జీవితంలో ఎదురయ్యే పరిణామాల వల్ల ఎదుటివారితో పరస్పర ఘర్షణ, అంతర్గతంగా తమలోతాము సంఘర్షణ పడుతున్న పాత్రలు ఒకొక్కటిగా ఒక్కచోటికి చేరుకుంటాయి.

దొంగతనం చేయబోయి సీత తల్లి చావుకు స్వయంగా కారణమైన బద్రయ్యే వ్యాపారం కొరకు పట్నం వచ్చిన ఎంకన్నకు సహాయకంగా, వ్యాపారంలో తొడుగా నిలబడుతాడు. అదే సమయంలో దురలవాట్లను దగ్గరుండి పరిచయం చేస్తాడు. తన భార్యను అనుమానించి శారీరకంగా హింసకు గురిచేసిన ఎంకన్నను వారించిన రవణయ్య, జాలి చూపిన ముసలయ్య, సీత ఇలా అన్ని పాత్రలు ఒక్క దగ్గరకు చేరువవుతాయి. తల్లిదండ్రులు లేక ఆలనాపాలనా కరువై వేశ్యగా మారిన సెంద్రకాంతం తన వారసురాలే అని గుర్తించిన ముసలయ్య దీనంగా రోదిస్తాడు. సీత ఎవరు లేని ఒంటరిగా మిగిలిపోకుండా భార్యను కోల్పోయిన రవణయ్యతో జత కలిపే ప్రయత్నం చేసాదు రచయిత. ఇలా ఒకరితో ఒకరు కలిసి నవల సుఖాంతం అవుతున్న సమయంలో బద్రయ్య సారా వ్యాపారాన్ని పట్టుకునేందుకు వచ్చిన పోలీసులకు అన్నీ తానేనని లొంగిపోయి మిగతా వారందరి జీవితాల్లో వెలుగును నింపిన ముసలయ్య జైలుకు వెళ్లి అందరి జీవితాలకు ఒక అర్థాన్ని చేకూర్చే ప్రయత్నం చేయడంతో నవల ముగుస్తుంది. ఒకానొక పతాక స్థాయిని చేరుకున్న సందర్భంలో నవలలోని అన్ని పాత్రలు కూడా తాము చేసిన తప్పులను గ్రహించి తమను తాము సరిచేసుకునే ప్రయత్నం చేస్తాయి.

**నవలలోని ప్రధాన పాత్రలు**

రవణయ్య, రావులమ్మ, ఎంకన్న, బద్రయ్య, ముసలయ్య, సీతమ్మ, సెరబయ్య, జగ్గన్న, రాజయ్య, సూరి (సూరమ్మ) మొదలైనవి ఈ నవలలో ప్రధాన పాత్రలు.

గడసరి, అందగత్తె అయిన రావులమ్మను పెళ్లి చేసుకోవాలని ఆశపడ్డ రవణయ్య పాత్ర పల్లెటూళ్ళోని సగటు ప్రేమికుడి మనోగతానికి సాక్ష్యంగా నిలుస్తుంది. భార్యను కోల్పోయిన సందర్భంలో కన్నీరుమున్నీరై విలపించినప్పుడు తన పిల్లలు తల్లిలేకుండా ఎలా పెంచి పెద్ద చేయాలి? పిల్లలు ఎన్ని కష్టాలను అనుభవిస్తారో? అని బాధపడుతాడు. కానీ వేరే పెళ్లి గురించే ఆలోచన చేయడు. సగటు తండ్రికి ప్రతీకగా ఈ పాత్రను నిలిపాదు రచయిత.

రావులమ్మ ఆశపడి పెళ్లి చేసుకున్న ఎంకన్న చెడు వ్యసనాలకు అలవడి తనను దూరం చేసుకునే పరిస్థితి వచ్చినప్పుడు రవణయ్య

గురించి ఆలోచించి బాధపడుతుంది. భర్త ఎంకన్న అనుమానించి, రవణయ్యతో అక్రమ సంబంధం అంటగట్టి తీవ్రంగా హింసించినా చేయని తప్పుకు శిక్షను అనుభవిస్తూ మౌనంగా ఉండిపోయి ఎదురు తిరగబడలేని ఎందరో అసహాయ మహిళలకు ప్రతీకగా ఉంటుంది. గతంలో తాన భర్తపై తాను చూపిన అశ్రద్ధే ఇలా జరగడానికి కారణమని తనలో తాను కుమిలిపోతుంది. తన జీవితం ఇలా తయారవడానికి తానే ముఖ్య కారణమని ఆమె తన ప్రవర్తనను తానే నిందించుకుంటుంది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహిళ మనోగతానికి నిదర్శనంగా ఈ పాత్రను మలిచాడు రచయిత.

గొప్పగా బతకాలంటే ఒకరి కింద జీతం ఉండడం కాదు వ్యాపారం చేయాలనే భావనతో, డబ్బులు సంపాదించాలనే ఆశతో వ్యాపారం మొదలు పెట్టిన ఎంకన్న మొదట్లో తన భార్యతో ప్రేమగానే ఉంటాడు. గొప్పింటోళ్లు కట్టుకునే చీరను తన భార్య రవణమ్మకు కానుకగా ఇస్తాడు. కానీ దానిని ఆమె తిరస్కరించిన సందర్భంలో బాధ పడతాడు. అంతా సజావుగా నడుస్తూ డబ్బు గడించిన తరువాత చెడు వ్యసనాలకు అలవడి భార్యను కూడా ఇబ్బందులకు గురి చేస్తాడు. పెద్ద వ్యాపారం కొరకు ఆమె ఒంటిపై ఉన్న నగలు తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తాడు. ఉన్నతంగా బతకాలి, ఆస్తులు కూడబెట్టుకోవాలి, అందరిచేత గొప్పవాడు అనిపించుకోవాలనే మనస్తత్వం గలవారికి ప్రత్యక్ష సాక్ష్యంగా కనిపిస్తుంది ఎంకన్న పాత్ర. భార్యను అనుమానం వల్ల హింసలకు గురిచేసినా స్పృహతప్పిపోయిన సమయంలో ఆమె గురించి ఆలోచించి తను చేసిన పొరపాట్లను సర్దుకునే ప్రయత్నం చేస్తాడు.

సులువుగా సంపాదన ఆర్జించడం కొరకు దొంగతనం చేయబోయి కొంతమంది చావుకు కారణమైన బద్రయ్యది కొంత వైవిధ్యమైన పాత్ర. మొదట నగలు దొంగిలించాలని ఆశపడ్డప్పటికీ అది వీలుకాదు. కానీ సీతమ్మను తనదానిని చేసుకోవాలని ఆమెను ప్రేమిస్తాడు. డబ్బు కాజేసే సందర్భం వచ్చినా ఆమె కొరకు నిజాయితీగా ప్రవర్తిస్తాడు. తన కారణంగా తల్లిని కోల్పోయిన సీతమ్మకు హోటల్ వ్యాపారం పెట్టించి ఒక బ్రతుకుదెరువును చూపిస్తాడు. తనను ఏమీ చేయలేదని తెలిసినప్పటికీ ముసలయ్యకు భయపడుతూ గౌరవాన్ని ఇస్తాడు. సెరబయ్యను ఒక మిత్రునిగానే కాకుండా తనకు అన్ని విషయాల్లో తోడుగా ఉండే వ్యక్తిగా తయారు చేసుకో గలుగుతాడు. వ్యాపారం కొరకు పట్టణానికి వచ్చిన ఎంకన్నకు సహాయకంగా నిలబడుతాడు. వచ్చిన లాభాలను వాటాలుగా మలుచుకునే ఉపాయాలు రచిస్తారు. ధనవంతులు ఎలా గొప్పవారయ్యారో అనే విషయాన్ని కూడా చెప్పుతాడు. తనతో చనువుగా ఉండే వేశ్య సెంద్రకాంతాన్ని వెంకన్న మోహించినప్పుడు కూడా ఆవేశపడక సామరస్య పూర్వకంగా ప్రవర్తిస్తాడు. సారా వ్యాపారం విషయంలో ముసలయ్య జైలుకు పోయే సందర్భంలో అతన్ని వారించి జైలుకు పోవడానికి కూడా సిద్ధపడతాడు. దొంగలా చెడు ముద్రతో పాఠకులకు పరిచయమైనప్పటికీ ఒక మిత్రునిగా, సహాయకునిగా, మంచిచెడులను చెప్పే గురువుగా, అందరి కొరకు పాటు పడే వివిధ కోణాలున్న వ్యక్తిగా బద్రయ్య వ్యక్తిత్వం బయటపడుతుంది. పుట్టుకతో అందరూ చెడ్డవారు కారు. పరిస్థితుల ప్రభావం, చుట్టూ ఉన్న వ్యక్తుల నిర్ణయాలు ఒక వ్యక్తి ఆలోచనాధోరణిని ప్రభావితం చేస్తాయనే విషయం ఈ పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు.

సమాజంలోని అసహాయక, అమాయక ప్రజల మనోభావాలకు ప్రతీక సీత. తల్లిని కళ్ళముందే కోల్పోయి ఐనవారంటూ ఎవరూ లేని వ్యక్తికి ఎంత మనో నిబ్బరం అవసరమో తెలుసు. అటువంటి సందర్భంలో దీనంగా రోదించిన సీతమ్మ వంటి వారిని చూసే ఉంటారు పాఠకులు. తల్లి చావుకు కారణమైన వ్యక్తిని కూడా క్షమించేంత గొప్ప మనసున్న వ్యక్తిగా సీతమ్మ పాత్రను అర్థం చేసుకోవచ్చు. చెడు తిరుగుళ్లకు అలవడిన బద్రయ్యను, సెరబయ్యను ఏ మాత్రం లెక్క చేయదు. ఏ బంధుత్వం లేకపోయినప్పటికీ తన బాధలను ముసలయ్యకు చెప్పుకుని బాధపడుతూ అతన్ని పెద్దదిక్కుగా భావిస్తుంది. ఇక పెద్దమనిషి ముసలయ్య విషయానికి వస్తే తన వయసుకు తగినట్టుగా ప్రవర్తిస్తూ మంచి వ్యక్తిగా ఉంటాడు. అన్యాయం అనిపిస్తే ఎవరినైనా నిలదీసే వ్యక్తిత్వం గలవాడు. బద్రయ్య కోసం వస్తున్న ఎంకన్నకు మందలించే విషయంలో ఆ కోణాన్ని చూడవచ్చు. ఎవరూ లేని సీతమ్మకు చేదోడువాదోడుగా ఉండడం, అవసరమైన సమయాలలో ఆమెకు ఓదార్పుగా నిలవడంతో ఆయన హుందాతనం, మంచి మనసు పాఠకులకు కొంత ఊరటనిస్తుంది.

**నవలలో సామాజిక జీవితం**

సాహిత్యమేదైనా వెలువడిన కాలానికి ప్రతీకగా ఉంటుంది. ఆయా కాలాలు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. సమాజంలో మంచివారు, చెడ్డవారు, తటస్థులు, అమాయకులు, మోసం చేసేవాళ్ళు, మోసపోయేవారు అన్ని రకాల మనుషులుంటారనే భావనను నేరుగా ఉదాహరణలతో చూపించాడు రచయిత. గొప్పవాళ్ళుగా చలామణి అవుతున్న చాలామంది పెద్ద మనుషుల వెనకాల చీకటి కోణాలు దాగి ఉంటాయనే సత్యాన్ని తెలియజేశాడు. అదే విషయాన్ని ఇంకోసారి ప్రతీకలతో సహా చూపించాడు. కొన్ని మోసాలకు నూతన అర్థాలను చూపించాడు. పేద ధనిక వర్గాల మధ్య నడవడికలో ఉండే న్యూనతా భావాలు కనిపిస్తాయి. గ్రామాల్లో ఇరుగు పొరుగు వారు ఆపదల్లో ఉన్నప్పుడు సగటు మనుషులు సహాయకంగా నిలబడే మానవత్వాన్ని, ప్రకృతితో మమేకమయ్యే జీవన విధానాన్ని, కష్టాన్ని నమ్ముకుని బ్రతికే అమాయక పల్లె ప్రజలను, పట్నంలో ఉండే మోసపూరిత మనుషుల మనోభావాలను, ఎవరికివారే అన్నట్టు నడిచే వ్యక్తులను, డబ్బు అవసరం కొరకు ఎంతటికైనా దిగజారిపోయే మనస్తత్వాలను నవలలో చూపించాడు రచయిత.

**పల్లె భాషా చమత్కారాలు – నుడికారాలు**

గ్రామీణులు భాష అంటేనే కొంత హాస్యం, చతురత, చమత్కారం, సామెతలను కలిగి ఉంటాయి. రచయిత మాండలిక భాషను ఎంచుకుని నవల రాసాడు గనుక సహజంగానే ఆయా నుడికారాలు వచ్చి చేరాయి. సందర్భానుసార భాషను ఉపయోగించాడే తప్పా ఎక్కడ కూడా ప్రయోగాత్మకంగా పదజాలంగానీ, సామెతలనుగానీ వాడినట్టు కనిపించదు. సాధారణంగా గ్రామాల్లోని ప్రజలు కులాలు మతాలకు అతీతంగా ఒకరిని ఒకరు ఏదైనా వరుసలు పెట్టి పిలుచుకుంటారు. వరుసల్లో ఉండే తేడాలను బట్టి మాటల్లో గౌరవం, సరసాలు, చతురతలు, కోపం మొదలైన భావలు ఉంటాయి. సందర్భాన్ని బట్టి అప్పటికప్పుడు సంభాషణలు ఆశ్చర్యకరంగా ఉండడం గమనించవచ్చు. రచయిత మారుమూల పల్లె ప్రాంతానికి చెందినవాడు గనుక ఆయా సందర్భాలలో అసంకల్పితంగానే నుడికారాలు దొర్లాయనిపిస్తుంది.

వయసులో ఉన్న వరుసైన స్త్రీ, పురుషుల మధ్య జరిగే సరస సంభాషణ ఎదుటి వ్యక్తిపై ఉన్న ఇష్టాన్ని, సుముఖతను తెలుపుతూ ఉండే మాటలను రచయిత నవలలో పాత్రోచితంగా కలిపించడం సరిగ్గా కుదిరినట్టు కనిపిస్తుంది.

**"మాటాడితే ముత్తాలు రాలతాయేంటే పిల్లా?"**

**ముత్తాలు కావు మావా, నీ మూతి పళ్ళు రాల్తాయి"** కొంత చమత్కారం, కొంత సిగ్గూ, సరసం కనిపించే ఈ మాటలు సందర్భానుసారంగా అప్పటికప్పుడు దీటుగా సమాధానం ఇవ్వడం చూస్తే వారికున్న సృజనాత్మకత ఏమిటో తెలుసుకోవచ్చు.

వెటకారం, విముఖత, గౌరవం ఇలా అన్ని భావాలు ఒకే మాటలో చెప్పగలగడం మరో ప్రత్యేకత. ఒక పెద్దమనిషి అడిగిన ప్రశ్నకు రావులమ్మ పాత్రతో పలికించిన మాటలు చూస్తే అర్థమవుతుంది.

**"నీకు పెళ్ళెప్పుడే రావీ?"**

**"లగ్గంనాడు రెత్తిరండయ్య!"** పెద్ద మనుషుల మాటకుమాటగా సమాధనమివ్వడం కొంత అసౌకర్యంతో కూడుకున్న విషయం. గౌరవంతో కూడిన సమాధానం మాటను రక్తి కట్టించకపోవచ్చు. కానీ కాస్తంత వెటకారం కలగలిసినప్పుడు మాత్రం ఆ సమాధానం హాస్యాస్పదంగా, ఉల్లాసంగా, ప్రశ్నించలేని దెప్పి పొడుపులా తయారవుతుంది. ఆ మాట పాఠకుని పెదాలపై చిరువునవ్వుతో పాత్రకున్న సమయస్ఫూర్తికి ఆశ్చర్య పోవాల్సిందే. ఇలా సందర్భానుసారంగా చిన్న చిన్న ఛలోక్తులు పాఠకులు ఉల్లాసంగా చదివేందుకు తోడ్పడే విధంగా రచయిత దృష్టి సారించినట్టు కనిపిస్తుంది. పాత్ర హుందాగా ప్రవర్తించాల్సిన ప్రతీ సందర్భంలో రచయిత సామెతలను, నీతి వాక్యాలను పలికించాడు. చెప్పదలుచుకున్న విషయానికి మరింత బలాన్ని చేకూర్చే విధంగా, ఆలోచింపజేసే రీతిలో ఆయా సామెతను, నీతి వాక్యాలు ఉండడం గమనించవచ్చు.

నీచుల పట్ల నిజాయితీగా వ్యవహరించడం కొన్నిసార్లు స్వయంకృతాపరాధం కిందే లెక్క అవుతుంది అని చెప్పే సమయంలో **"మోసాన్ని మోసంతోటి లొంగదియ్యాల!", "సిగురికి నిలిసే దెప్పుడూ నిజవేరా"** అంటూ పోలిక చెప్పాల్సి వచ్చినప్పుడు **"కాకి ముక్కుకి దొండపండు కందంట్రా?"** అని, కొత్తపాతల కలగలుపును నచ్చజెప్పే ప్రయత్నంలో **"కొత్తో యింత, పాతో రోత"**ని, పొగడ్త సందర్భంలో...

**"ఆ కత్తికి రెండెంపులా పదునే!"** అంటూ, అసహనంతో నిందార్థకంగా విమర్శలు చేయాల్సి వచ్చినప్పుడు **"కరిసే కుక్కకు కడద్దం, "బలుసాక్కూడా పిరవయిపోయింది!"** అంటూ వాపోవడం; ఆడవారి మనోగతాన్ని కనుగొనలేని పరిస్థితిలో **"ఆడోళ్ళ మనసులు సిక్కుదారాల్లాంటియేవో!"** అంటూ, వారి గొప్పదనాన్ని వివరించే క్రమంలో **"సిరొత్తే దాంతోనే రావాల! తుడిసిపోయినా దాంతోటే పోవాల!"** అని, వారిని బాధ పెట్టే సందర్భంలో విచారించాల్సి వచ్చినప్పుడు **"కట్టుకున్న పెళ్ళాన్ని కట్టంపెట్టి నువ్వేం పాంకుంటావు?"** అని భార్యను కష్టపెట్టకూడదనే విషయాన్ని తెలుపుతూ, మనుషుల్లో మంచితనం, నీతి, నిజాయితీ కరువైతే, స్వార్థం, సంకుచిత భావజాలం ఎక్కువైతే మేలు జరగదని చెప్తూ, **"మనుసుల మంచితనం కుళ్ళిపోతే పగ అవుతాది"** అని, పగ అనేది పరోపకారం గురించి, పక్కవారి సౌఖ్యం ఏమాత్రం పట్టించుకోదనే భావనను పాత్రలచే పలికించాడు రచయిత. ఇలా ఒక్కొక్క సందర్భంలో రచయిత ఉపయోగించిన ఛలోక్తులు, సామెతలు, నీతి వాక్యాలు నవలకు వన్నె తెచ్చే అలంకరణగా కనిపిస్తాయి.

**ప్రకృతి వర్ణన**

మాండలిక భాషలో, జానపదుల శైలిలో నవలను నడిపించాలని అనుకున్నాదు గనుక అసంకల్పితంగానే ప్రకృతిని వర్ణించాడు. సహజ సుందరమైన ప్రకృతికి ఉత్తరాంధ్ర మాండలికం, పల్లె ప్రజల శైలి కలగలిసి పోవడంతో ప్రకృతి విశేషాలు మరింత అందంగా కనిపిస్తాయి. నదీ పరిసర వాతావరణ పరిస్థితితో నేరుగా అనుబంధం లేకపోయినప్పటికీ పాఠకులు నిజమైన అనుభూతిని పొందగలుగుతారు. ప్రతీ సందర్భం ప్రత్యక్షంగా తన కళ్ళెదుట జరుగుతున్న భావానికి లోనౌతారు. నవలలో జరిగే కథ గోదావరి పరీవాహకంలో జరుగుతూ ఉండడం వల్ల రచయిత గోదావరి అందాలను లోతైన దృష్టితో వర్ణించాడు.

**"సిన్న సిన్న కెరటాలు ఆరిందాల్లా ఒచ్చి యిసుక మీద పడి యిరిగిపోతున్నాయి"** గోదారి చాలా తక్కువ సమయాలలో ఉధృతంగా

ప్రవహిస్తుంది. మిగతా సమయాల్లో ఎక్కువ నిలకడగా ప్రవహిస్తుంది. నిలకడైన గోదారి అలలు వచ్చి ఒడ్డును తాకుతున్న దృశ్యాన్ని చెప్పిన తీరుతో ఆ అలలు పాఠకుల అందరి కళ్ళకు లీలగా కనిపిస్తాయి. ప్రవాహంలో గోదారి అలల గలగల చప్పుళ్లను గుర్తిస్తూ .. **"గలగల గోదారి గజ్జి లోయిస్తా ఉన్నాది!"** అని అలలను గజ్జలతో పోల్చాడు. నీళ్లపై తేలుతూ వేగంగా ముందుకు సాగే పడవ అంచులను తాకే నీటిని వర్ణిస్తూ **"గలగల్లాడతా గోదారి పడవ అంచుల్ని ముద్దెట్టుగుంటున్నాది"** అని విడదీయరాని బంధంలా చెప్పాడు. పడవలో దోపిడీ సమయంలో జరుగుతున్న గొడవ, భయానక పరిస్థితిని, యథార్థ పరిస్థితుల అలజడి పాఠకునికి సూక్ష్మంగా అర్థమవ్వడం కొరకు రాస్తూ **"పడవోల్లో దీపం బుడ్లు బయం బయంగా వొనుకుతున్నాయి"** అన్నాడు. గాలికి దీపం రెపరెపలాడుతుంది. అదే దృశ్యాన్ని అక్కడున్న సందర్భంలో జొప్పించి ఒకవైపు గొడవ, మరోవైపు చల్లటి గాలి రెండింటికి సరిపోయేట్టుగా దీపం వణుకుతుందని చెప్తూ రచయిత చేసిన వర్ణన అందంగా కనిపిస్తుంది. నదితో పాటు వెన్నెల అందాలను కూడా వర్ణించాడు. ప్రవహిస్తున్న నదితో పాటు వెన్నెలను గురించి చెప్తూ **"గోదార్ని సూసి సవుద్రవేోనని బయపడి, సెందురుడు మబ్బు లెనకాతల దాగున్నాడు"** మబ్బుల తెప్పలు అడ్డుపడి చంద్రున్ని కనుమరుగు చేయడం వల్ల చీకటి ఏర్పడదని నేరుగా చెప్పకుండా పరోక్షంగా అలంకార ప్రాయంగా చెప్తూ మరో సందర్భంలో కూడా ఇదే భావం వచ్చేట్టు **"సలేసింది కాబోలు సందమామ మబ్బుల దుప్పటి కప్పుకు తొంగున్నాడు"** అంటూ వర్ణించాడు రచయిత. అలాగే పౌర్ణమి నాటి వెన్నెలను చాలా మంది కవులు, రచయితలు మనోహరంగా చెప్పారు. నవలలో నిండు వెన్నెల అందాలను చెప్తూ **"రేతిరి అంతా పాలవోన కురుస్తున్నట్టున్నాది"** అన్నట్లు విస్తరించిన తెల్లటి వెలుగును పాలతో పోల్చాడు. సన్నివేశం రక్తి కట్టించాల్సిన ప్రతీచోట చుట్టూ ఉన్న వాతావరణాన్ని, ప్రత్యేకంగా ప్రకృతిని ఆసరాగా తీసుకున్నాడు రచయిత. ఆ విషయంలోని సంఘటనాత్మకత పాఠకుడికి ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చేవిధంగా తరువాత ఘట్టం ఎలా ఉండబోతుందో అనే ఆతురతను కలిగించాడు రచయిత. ఇలా సందర్భానుసార ప్రకృతి వర్ణన నవలకు మరింత అందాన్ని చేర్చింది.

**సాంస్కృతిక విశేషాలు - సామాజిక స్థితిగతులు**

ఆయా కాలాలలో వెలువడ్డ సాహిత్యం నాటి సమాజ జీవన గమనాన్ని, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను కలగలుపుకుంటుందనే విషయం తెలిసిందే. నవలలో మాండలిక భాష, గ్రామీణ నేపథ్యం ప్రధాన ఉద్దేశ్యంకావడం వల్ల ఎక్కువగా సాంస్కృతిక, ఆర్థిక విషయాలు, గ్రామీణ ప్రాంత సంబంధబాంధవ్యాలు కనిపిస్తాయి. గ్రామీణ ప్రాంతానికి చెందిన సగటు మహిళల ఆలోచనా ధోరణికి రావులమ్మ, సీతమ్మ పాత్రలు సాక్ష్యాలుగా కనిపిస్తాయి. భర్త ఎన్ని విధాల కష్టాలకు గురి చేసినప్పటికీ అణిగిమణిగి ఉండే భావజాలం నాడు ఎంత తీవ్రంగా ఉండేదో తెలుసుకోవచ్చు. అప్పుడప్పుడే ఆధునికీకరణ జరుగుతున్న పరిస్థితులు కూడా నవలలో కనిపిస్తాయి. రోజువారి కూలీగా బతకడం కన్నా పొరుగు వారి విధంగా వ్యాపారం చేసి డబ్బు సంపాదించుకోవాలనే ఎంకన్న ఆలోచనా ధోరణితో నాటికే ఆధునికీకరణ, వ్యాపార దృక్పథం, మారుమూల లంక గ్రామాలకు కూడా విస్తరించాయని అర్థమవుతుంది. ధనవంతులు, వ్యసన పరులు, జూదరులు వేశ్యా గృహాలకు వెళ్ళే అలవాట్లు ఎలా ఉండేవే తెలుస్తుంది. ఎంకన్నను ట్రాఫిక్ విషయంలో తిప్పలు పెట్టిన పోలీసు ద్వారా పోలీసులు నేడే కాదు నాడు కూడా వసూళ్ళకు పాల్పడేవారనే విషయం అర్థమవుతుంది. గోదారి మీదుగా వచ్చీపోయే పడవల రేవు ప్రాంతంలోని ప్రయాణీకుల సౌకర్యం కొరకు చిన్నచిన్న హోటల్స్ నాటి నుండే ఉన్నాయని అర్థం చేసుకోవచ్చు.

నవలాకారునిగా దక్షిణామూర్తి గారు తెలుగు నవలా సాహిత్యంలో శాశ్వత గుర్తింపుని తెచ్చుకున్నారు. మాండలిక భాష ప్రధానంగా చేసుకుని ఈ నవలను రాశారు. కానీ అక్కడక్కడా ప్రామాణిక భాషా పదాలు అసంకల్పితంగానే వచ్చి చేరినట్టు గమనించవచ్చు. మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందినవాడు, పైగా తన స్వంత మాండలికం కావడం వల్ల ఆ భాషలోని సాంద్రత స్పష్టమవుతుంది. 1962 జన్మించిన దక్షిణామూర్తి 1993లో ఈ నవలను రాసాడు. ఈ మధ్య ఆయన జీవితం ప్రామాణిక భాషతోనే ఎక్కువ ముడిపడి ఉంది. ఈ విషయం సాహిత్యకారులకు తెలిసిందే. ఆ కారణం మూలంగానే అక్కడక్కడా అసలైన మాండలిక పదాలకు బదులుగా ప్రామాణిక, వ్యవహారిక పదాలు వచ్చి చేరాయి. **లేకపోయినా - లేపోయిన, మామని - మావని, ఏమయింది - ఎవయింది, కనిపించినది - కాపడ్డాది, ఇద్దరమూ - ఇద్దరామూ, నిద్రపోయినట్లు - నిదరోయినట్టూ** ఇలా చాలా తక్కువ ప్రామాణిక పదాలు కొన్ని వచ్చి చేరాయి. నవల మొదట్లో వేరువేరు వ్యక్తులకు సంబంధించిన జీవితం వేరువేరు భాగాలుగా వచ్చి పోతుండడం, తరువాత ఏం జరుగుతుందో అనే ఉత్సాహ, ఉత్కంఠ భరిత ముగింపు లేకపోవడం, అన్ని కాలాలకు తగిన వస్తువు కాకపోవడం నవల పూర్తిస్థాయి ఆదరణ పొందకపోవడానికి కారణమని చెప్పవచ్చు. అక్షర జ్ఞానమున్న పాఠకులందరూ నవలపై పూర్తి అవగాహనకు రాకపోవడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నవి. స్వంత మాండలిక ప్రాంతం వారికి ఈ నవల అత్యంత చేరువవుతుంది. ఎంచుకున్న మాండలిక భాషాపరంగా దక్షిణామూర్తి నూరుశాతం సక్సెస్ అయ్యారు. అలాగే మిగతా రెండు మాండలికాలతో కూడా నవలలు రాసి ఆ ప్రాంతాలకు చెందిన కవులకు, రచయితలకు ఆదర్శంగా, ప్రేరణగా, మార్గదర్శకంగా నిలిచాడు.

ఒకప్పుడు గ్రాంథిక భాష నుండి వ్యవహారిక భాషలో సాహిత్యం రావడానికి చాలామంది రచయితలు చేసిన కృషి మూలంగా నేడు చదువులైనా, సాహిత్యమైనా అన్ని వర్గాల ప్రజలను చేరింది. అలాగే దక్షిణామూర్తి గారి లాంటి వారు మూడు మాండలిక భాషల్లో కూడా సాహిత్య సృజన చేసి ఆయా ప్రాంతాలకు చెందిన కవులను, రచయితలను ప్రోత్సహించినట్లైంది. కారణంగానే తెలంగాణా, రాయలసీమ మాండలికం లోనూ నవలలు, కథలు, కవిత్వం విరివిగా వెలువడింది. ఆ యా ప్రాంతాల వారు తమ సొంతమైన భాషలో వచ్చిన సాహిత్యాన్ని ప్రేమతో ఆహ్వానించారు.

పొట్లపల్లి రామారావు, వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి రంగాచార్య, చెరబండరాజు, పాకాల యశోదారెడ్డి, దేవరాజు మహారాజు, వెల్దుర్తి మాణిక్యాలరావు, అల్లం రాజయ్య మొదలైనవారు తెలంగాణ మాండలికాలల్లో సాహిత్యాన్ని వెలువరిస్తే; రావిశాస్త్రి, పురిపండా అప్పలస్వామి, బలివాడ కాంతారావు, కెఎన్‌వై పతంజలి, కాళీపట్నం రామారావు, వంగపండు ప్రసాదరావు, అట్టాడ అప్పలనాయుడు ఉత్తరాంధ్ర మాండలికంలో; మధురాంతకం రాజారాం, కేతు విశ్వనాథ రెడ్డి, నాగప్పగారి సుందర రాజు, బండినారాయణ స్వామి, చిలుకూరి దేవపుత్ర, కె. కేశవరెడ్డి, నామిని సుబ్రమణ్యం నాయుడు, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, కె.సభా, పులికంటి కృష్ణారెడ్డి మొదలైనవారు రాయలసీమ మాండలిక భాషలో సాహిత్య సృజన చేశారు. ఈ సందర్భంలో వారిని గుర్తు చేసుకోడం సమంజసమని నా అభిప్రాయం.

ఆధునికీకరణ, ప్రపంచీకరణ ద్వారా నేడు భాషలు అంతరించిపోతున్న తరుణంలో మాండలిక భాషలో రాసి ఉన్న సాహిత్యం భవిష్యత్‌తరాలకు వారసత్వంగా అందించబడుతుంది. ఆ విధంగా మాండలిక భాషతో పాటు దానిని ఒక నవల రూపంలో గ్రంథస్థం చేసిన దక్షిణామూర్తి గారి పేరు కూడా శాశ్వతంగా నిలుస్తుంది.


















# అరచేతి అద్దంలో 'దక్షిణామూర్తి'

**ఆచార్య సూర్యా ధనంజయ్,** అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 984 910 4187

తెలుగు సాహిత్య ప్రపంచంలో పరిచయం అక్కరలేని నిరంతర సృజనాచైతన్య దీప్తి డా॥ పోరంకి దక్షిణామూర్తి. వీరు బహుముఖ ప్రజ్ఞావంతులు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ, తెలుగు, పి.జి.డిప్లొమా ఇన్ లింగ్విస్టిక్స్ చదివిన దక్షిణామూర్తి ఉద్యోగ జీవితాన్ని, రచనా వ్యాసంగాన్ని రెండు కళ్ళులా భావించారు. తెలుగు అకాడమీ ఉపసంచాలకులుగా, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులుగా, తెలుగు సలహా సంఘం అధ్యక్షులుగా వారందించిన సేవలు, విధి నిర్వహణలో చూపిన నిబద్ధత ఎందరికో ఆదర్శంగా నిలిచింది.

ఉద్యోగ జీవితంలో ఎట్లా అయితే ఉన్నత వ్యక్తిత్వాన్ని చాటుకున్నారో, సాహిత్య రచనలోనూ అటువంటి ఉత్తమ గ్రంథాలనే అందించి సవ్యసాచిగా పేరొందారు దక్షిణామూర్తి. ఆధునిక తెలుగు సాహిత్యమే ప్రధానంగా వచన కవిత్వం, వచన రచన, విమర్శల పునాదులపై నిర్మించబడింది. ఆ వచన సాహితీ భవంతి నిర్మాణంలో కొన్ని విలువైన, అందమైన ఇటుకలు డా. దక్షిణామూర్తివే. కథ, నవల, వ్యాసం, కథానిక వంటి విభాగాల్లో వీరి కలం అద్భుతంగా రాణించింది. వీరి తరం సమకాలికుల్లో దక్షిణామూర్తికొక ప్రత్యేకత ఉంది. అదే పదబంధ కోశాలు, నిఘంటువులు రూపొందించడం. వీరు నిఘంటువులను, వృత్తిపద కోశాలను నిర్మించి కొన్నింటిని పరిష్కరించి విశిష్టతను చాటుకున్నారు. అంతేకాదు అనువాదాల్లోనూ అడుగిడి ఇంగ్లీషు, హిందీ భాషల నుండి తెలుగులోకి నలబై గ్రంథాలు అనువదించి తెలుగువారికి అందించారు. ఇంతటి ప్రతిభామూర్తిలోని మరొక పార్శ్వమే **'పీఠికా రచన'**. చక్కని పదచిత్రాలతో, భావ ప్రకటనలతో వారు రాసిన పీఠికలు నేటి తరానికి దిక్సూచి వంటివి.

తెలుగు సాహిత్యంలోని అనేక ఇతర ప్రక్రియల వలె 'పీఠిక'ల ప్రక్రియ కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావంతోనే తెలుగులోకి వచ్చింది. ఇది విమర్శలో ఒక భాగమే. పాశ్చాత్యులు రాసిన ఆంగ్ల రచనలకు ముందు దాని గురించి కొంత Intro గా ప్రముఖులతో సందేశం రాయించేవారు. క్రమంగా అది తెలుగులోకి ప్రవేశించింది. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వంటి భాషా పరిరక్షకుల కృషి వలన క్రిటిసిజమ్‌కి అనుబంధంగా ఇది ప్రాచుర్యం పొందింది.

పీఠికలు సాహిత్యంలో ఒక భాగమే. అయితే పీఠికా సాహిత్యం మీద విస్తృత చర్చలు మాత్రం జరగట్లేదు. ఇతర ప్రక్రియలకు ఇచ్చిన ప్రాధాన్యత పీఠికలకు ఇవ్వకపోవడం వలన విలువైన విషయాలు విస్మృతిలోకి వెళ్ళే ప్రమాదం ఉంది. కాబట్టి పీఠికల ప్రస్తావన వచ్చినప్పుడు పీఠికల పూర్వాపరాలని కొంత తడుముకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవతారిక, భూమిక, నివేదన, యోగ్యతాపత్రం, ప్రవేశిక అన్న పదాలు పీఠికలకు పర్యాయ పదాలుగా, సమానార్థకాలుగా చలామణిలో ఉన్నాయి. **"గ్రంథం మొదట రాసిన మాట దాని పుట్టు పూర్వోత్తరాలే పీఠిక"** అని శబ్ద రత్నాకరం తెలుపుతుంది. ప్రాచీన సాహిత్యంలోని అవతారికలు, నాటకాల్లోని ప్రస్తావనలు పీఠికల మరో రూపాలే.




పీఠిక గ్రంథ సారాన్ని పరిచయం చేసి, గ్రంథపఠనానికి ప్రేరణ కలిగిస్తుంది. పాఠకునికి, రచనకి మధ్య వారధిగా నిలుస్తుంది. ఒక్కొక్కసారి పీఠిక శీర్షికని బట్టి పాఠకునిలో ఆసక్తి మొలకెత్తుతుంది. శ్రీశ్రీ మహా ప్రస్థానం కావ్యానికి చలం 'యోగ్యతా పత్రం' అనే పీఠిక రాసి ఆసక్తిని పెంచారు. డా. సి.నారాయణరెడ్డి, అద్దేపల్లి రాంమోహనరావులు తెలుగులో అత్యధిక పీఠికలు రాశారు. ఇప్పుడు పోరంకి దక్షిణామూర్తి వారి వారసత్వాన్ని నిర్విఘ్నంగా కొనసాగించి పలు గ్రంథాలకు అమూల్యమైన పీఠికలెన్నో రాశారు. పీఠికా ప్రపంచాన్ని మరింత విస్తృతం చేశారు.

డా. పోరంకివారు తన సాహిత్య ప్రయాణంలో వివిధ కవులకు, రచయితలకు వారి వారి పుస్తకాలపై రాసిచ్చిన పీఠికల సమాహారమే **"అరచేతి అద్దంలో"** సంపుటి. వీరు సుమారు డెబ్భైఅయిదుకు పైగా పీఠికలు రాశారు. వాటిల్లో నలబై పీఠికలను ఈ గ్రంథంలో చేర్చి పుస్తకంగా 2013లో వెలువరించారు. దీనిని నిత్య

సాహితీ దీపధారి 'పోతుకూచి సాంబశివరావుగారికి' అంకితం చేశారు. 1960 దశకం నుంచి సాహిత్యాన్ని చిలికిస్తున్న కవి, రచయిత, విమర్శకులు, నిఘంటుకారులు, అనువాదకులు అయిన దక్షిణామూర్తి ఈ గ్రంథంతో పీఠికాకారులయ్యారు. అనేక దశాబ్దాల పాటు నిర్విరామ అక్షరసేద్యం చేస్తున్న వారి రచనా వ్యాసంగాలు ఈ తరానికెంతో ఆదర్శం, స్ఫూర్తిదాయకం.

ఈ గ్రంథానికి 'అరచేతి అద్దంలో' అనే శీర్షిక చాలా ఆకర్షణీయంగా, విలక్షణంగా ఉంది. ఇందులోని వ్యాసాలు చదివిన తర్వాత ఇదెంతో సమంజసమైన శీర్షిక అనిపించింది. ఈ గ్రంథం వెలువడి ఎనిమిది సంవత్సరాలు అయినప్పటికీ దీనిలోని భాషా పరిమళం ఇంకా తాజాగానే ఉంది. ఈ పీఠికా సంపుటిలోని వ్యాసాలు కథానికలపై, కథా సంపుటాలపై, నవలలపై, వ్యాస సంపుటాలపై, చిన్న కథలపై, ఆంగ్ల కవితా సంపుటిపై ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం కథలు, కథానికలు, నవలలపై రాసినవే ఉన్నాయి. ఇందులో ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క తీరు నిర్మాణం, శైలి, రూపం, వస్తువులుంటాయి. పరిమాణంలోనూ భేదాలుంటాయి. కథానిక, కథ కంటే కొద్ది తక్కువ పరిమాణంలో ఉంటుంది. చిన్న కథ కొద్ది పరిమాణంలో మాత్రమే రూపుదిద్దుకుంటుంది. అయితే వీటన్నింటి ముందుమాటలు, పీఠికలు వేరువేరు పరిమాణాల్లో ఇవ్వకుండా ఒకేలా రాయడంలో దక్షిణామూర్తి విశాలత్వం వెల్లడవుతుంది. విమర్శలో ఒక చిన్న వాక్యం గురించి కూడా పుటలకొలది విశ్లేషణ చేయవచ్చు. పెద్ద గ్రంథాన్ని కొన్ని పంక్తుల్లోనే సారాన్ని చెప్పవచ్చు. అందుకు భాష మీద పట్టు, భావ వ్యక్తీకరణలో క్లుప్తత, విశ్లేషణ సామర్థ్యాలు ప్రధానమని వీరి పీఠికలు తెలుపుతున్నాయి.

పోరంకివారి పీఠికలు చాలా సూటిగా, స్పష్టంగా పుస్తకం యొక్క ఆత్మావిష్కరణ చేసేవిగా ఉన్నాయి. దానిలోని ఏ పీఠికా వ్యాసాన్ని స్పృశించినా ఇదే విషయం మనకు వెల్లడవుతుంది. సూక్ష్మంలో మోక్షం అన్నట్లుగా రెండు మూడు పుటల్లోనే ఎంత పెద్ద గ్రంథాన్ని గురించైనా విశ్లేషణ చేయడం వీరి ప్రత్యేకత. ఒకేసారి ఇందులోని పీఠికలన్నీ ఏకబిగిన చదివినా పాఠకునిలో ఏమాత్రం విసుగు అనిపించదు. పీఠికలు చదువుతున్నంతసేపు నూతనోత్తేజం పాఠకునిలో జనిస్తుంది.

ఈ పుస్తకంలోని మొదటి పీఠిక కాళూరి హనుమంతరావుగారు రచించిన **'రామాయణ సమాలోచనం – ఇతర రచనలు – కదంబం'** అన్న గ్రంథానికి రాసినది. రెండవ పీఠిక డా. రాంబాబు కథానికలపై రాసిన **'వస్తు శిల్పాల కలనేత కళాకృతులు డా. రాంబాబు కథానికలు'.** రాంబాబుగారు మౌలికంగా కథారచయిత. అంతకు మించి కథానిక ప్రియులు. ఆ ప్రియత్వమే ఆయన్ని పత్రికా రచయితగా, సంపాదకుడిగా చేసింది అన్నారు దక్షిణామూర్తి.

రాంబాబు కథానికల సంపుటిలో కొత్త కథలు, వినూత్న కథలు, సరికొత్త కథలు వంటివి ఉన్నాయనీ మరింత వినూతనంగా వెల్లడి చేశారు దక్షిణామూర్తి. ఇదే సందర్భంలో ఇరవై సంవత్సరాల క్రితం రాంబాబు 'సముద్రం' సంపుటానికి విశ్వవిద్యాలయం పురస్కారం వచ్చిన విషయాన్ని గుర్తుచేసి రచయిత గౌరవాన్ని పెంచారు. వీరి కథలు హృదయాన్ని కదలిస్తాయనీ, హృదయాన్ని కదిపేవి కొన్ని, కుదిపేవి కొన్ని అని చెప్పి ఆ సంపుటిపై పాఠకునికి మరింత అభిలాషను పెంచారు దక్షిణామూర్తి.

**'కథానికా కల్పవల్లిక సుమా, ఈ రాధిక!'** ఇది శ్రీమతి టి. శ్రీవల్లీ రాధిక కథా సంపుటం **'తక్కువేమి మనకూ'** గ్రంథానికి రాసిన పీఠిక. ఇందులో సౌందర్యం, లోభం, సత్యం, తక్కువేమి మనకు వంటి కథలను చర్చించారు పీఠికా రచయిత. ఈ సందర్భంలో దీనిలోని కథల ప్రయోజనాన్ని, లక్ష్యాన్ని, రచయిత్రి ప్రతిభను, హృదయాన్ని ఆవిష్కరించారు. **"ఇందులోని కథలన్నీ వ్యక్తులను, సమాజాన్ని, పరమార్థాన్ని అవగాహన చేసుకోవడానికి, మానవత్వపు విలువలను ఆదరించడానికి, పెంచడానికి చక్కగా ఉపకరించేవి"** అని దక్షిణామూర్తి చెప్పడం గ్రంథ ఔచిత్యాన్ని పెంచింది.

**'గురిదీపంలో నారీమణి'**.. ఇది నరసింహదేవర ఉమామహేశ్వర శాస్త్రి గారి **'సీత'** అనే పౌరాణిక నవలకు రాసిన పీఠిక. ఈ నవల పౌరాణిక నవల ఎలా అవుతుంది? ఇందులోని కల్పితాంశాలేవి? సీత పాత్ర మొదలైన అంశాలను ప్రధానంగా చర్చించారు దక్షిణామూర్తి. సహజంగా నవలలోని వస్తువుని బట్టి ప్రఖ్యాతం, ఉత్పాద్యం, మిశ్రమం అని సాహిత్యంలో విభజించుకుటారు. అయితే సీత నవల కల్పితమని (ఉత్పాద్యం) తేల్చి చెప్పారు దక్షిణామూర్తి. వారి అభిప్రాయానికి బలాన్నిచ్చే వివరణ ఇస్తూ **"కల్పన లేనిది నవల కాదు. దీనికి ప్రధాన మూలం వాల్మీకి రామాయణం"** అనే నవలా రచయిత మాటలని ఉదహరించి **''తెలుగు నవలను ప్రబంధమనేవారు అప్పట్లో. ఇప్పుడు నవలలనే అంటున్నాం. నవలలే రాస్తున్నాం. నవల సృజనాత్మక ప్రక్రియ కాబట్టి ఒక వాస్తవ జీవితాన్ని తీసుకొన్నా కూడా ఎంతో కొంత కల్పన ఉండక తప్పదు"** అని విస్పష్టంగా చెప్పారు. ఈ నవలలో సీతాదేవిని రచయిత అందంగా వర్ణించాడనీ, ప్రాచీన కాలంలో వాల్మీకి కూడ అయోనిజ, అప్రతిమ అని కీర్తించాడని ఆమె రూప లావణ్యాన్ని చెబుతూనే సీతాదేవి సంఘర్షణని గుర్తించాలని సూచించారు. సీత వేదనకి గౌరవం ఇచ్చి దీనిని రామాయణం కాదు **'సీతాయనం'** అనాలని ధైర్యంగా చెప్పారు దక్షిణామూర్తి.

**'జాతి కథకులు శ్రీపాద'** అని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి **'చిన్న కథలు'** అనే మొదటి సంపుటానికి రాసిన పీఠిక ఇది. పదిపుటల్లో రాయబడిందీ పీఠిక. ఎంతో విలువైన సమాచారం ఈ వ్యాసంలో ఉంది. ముఖ్యంగా శ్రీపాద చిన్న కథలకు సంబంధించిన ఎన్నో విషయాలు దీంట్లో అమరి ఉన్నాయి. శాస్త్రిగారు రాసిన చిన్నకథలు మొత్తం డెబ్బైఐదు. వీటిలో అరవై అయిదు సాంఘిక కథలు. పది

చారిత్రక కథలు. ఈ కథల్లో పందొమ్మిదింటిని 'పూలదండ' పేరుతో ఒక సంపుటిగా కూర్చి 1925లో ప్రచురించారని గుర్తుచేశారు దక్షిణామూర్తిగారు.

**"లోలోపలి చీకటి వెలుగులు"** ఇది శైలజామిత్ర గారి కథానిక సంపుటానికి 1994లో పీఠికను రాస్తూ **"చీకటి తెరలు కప్పిపెట్టిన వెలుగు రవ్వలను ఏరుకోమంటాయి, కోరుకోమంటాయి శైలజ గారి కథలు"** అన్నారు దక్షిణామూర్తి. సమకాలీన సమస్యల విషయంలో స్పష్టమైన అవగాహన ఏ కవులకైనా ఉండాలంటారు వారు.

**"తెలుగు కథకు సరస్వతీ పూజ"** అనే శీర్షికతో శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిగారి **'తులసి దళాలు'** కథా సంపుటికి రాసిన పీఠిక ఇది. ఇందులో దాదాపు 108 కథానికలున్నాయి. సరస్వతీదేవి గారి సాహిత్య కృషిని, సాంఘిక, సామాజిక సేవను ఈ సందర్భంగా గుర్తుచేశారు దక్షిణామూర్తిగారు. ఈ కథా సంపుటిని వెయ్యి నిండు పున్నముల వెలుగులో దర్శించిన జీవితాన్ని గుండెలతో పలికించిన కథల కూర్పు అనీ, వారి కథన నైపుణ్యానికి, వస్తు వైవిధ్యానికి ఇవి మచ్చుతునకలనీ అన్నారు. అంతేకాదు ఆమె కథల్లో ప్రధానంగా ఆకట్టుకునే అంశం వస్తు వైవిధ్యం. అందులో ఒక్కొక్క కోణంలోంచి వెలుతురు ప్రసరిస్తుంది. ఆ వెలుగులో రచయిత జీవన దర్శనం సాక్షాత్కరిస్తుందని అనడంలో సందేహం లేదు.

ఇంకా **'అరచేతి అద్దంలో'** ముచ్చటైన ముద్దమందారం అనే శీర్షికతో డా.ఆర్.ఎం.వి. రాఘవేంద్రరావుగారి **'జీవన విహంగాలు'** కథానికల సంపుటానికి రాసిన పీఠిక **"కంటికి రెప్పవయి – మింటను చుక్కవయి ఓ త్యాగధనుడా! ఆత్మబంధో! అందుకో నివాళి – జనకోటి శతకోటి హృదయ దీపావళి!"**. కాటూరి రవీంద్ర – త్రివిక్రమ్ రాసిన కార్గిల్ కథలు కూడా ఉన్నాయి. **'చతుర నవలలు'** సి.ఎన్.రావు సంపుటానికి **'చతుర రచయిత చైతన్య స్ఫూర్తి'** అనే శీర్షికతో పీఠిక రాశారు దక్షిణామూర్తిగారు.

**దక్షిణామూర్తి దృక్పథం**

ఏ ఇజాలకు, ఎటువంటి నైజాలకు బందీకాని మనస్తత్వం, దృక్పథం దక్షిణామూర్తిది. **అరచేతి అద్దంలో** అనే ఈ పీఠికా సంపుటిలో ఈ విషయం వెల్లడవుతుంది. నలభై పీఠికల్లో ఎక్కడా ఆత్మస్తుతి కానీ, అనవసరపు పొగడ్తలు కానీ తారసపడలేదు. వారికి ఎంతోకాలంగా పరిచయం ఉన్నవారి గురించి రాసేటప్పుడు కొత్తవారి గ్రంథాలను గురించి రాసేటప్పుడు వారి కలం ఒకేలా స్పందించింది. చెట్టుకన్నా కాయ ముఖ్యం అనుకునే స్వభావం దక్షిణామూర్తిగారిది. పుస్తకాన్ని సమీక్షించేప్పుడు సమీక్షకుడు ఎట్లా అయితే నిష్పక్షపాతంగా విమర్శ చేస్తాడో పీఠికా రచనలో దక్షిణామూర్తి అట్లనే స్పందించారు.

గ్రంథాన్ని చూసే దృష్టికోణం కూడా వీరి రచనలో గమనించవచ్చు. ఏదైనా గ్రంథాన్ని దాని వృత్తంలోనే విశ్లేషణ కేంద్రీకృతం అయ్యేలా రచన చేస్తారు వీరు. ఒక గ్రంథాన్ని ఇంకోదానితో పోల్చి తార్కికంగా చూడడం కన్నా చదివే పుస్తకంలోని వస్తువు, పరిధి, ఇతివృత్తాలను ఆకళింపు చేసుకొని పీఠిక రాయడాన్నే ఇప్పుడు ఇష్టపడుతారు దక్షిణామూర్తి. ఒకవిధంగా ఇది ఉత్తమ మార్గమనే చెప్పాలి. ఒక గ్రంథాన్ని మరొక దానితో పోల్చడం కంటే ఆ రచనలో ఆచరించదగ్గవి ఏంటి, ఆదర్శాలేంటి, లోటుపాట్లేంటో గుర్తించడం ముఖ్యమే కదా! దీనిలోని కొత్త చిగుళ్ళు, రాజుగారు మీకేమవుతారు, ఏ ముక్కకా ముక్కే చెప్పుకోవాలి. విలక్షణమైన శీర్షికలలో ఉన్న పీఠికలు ఇదే విషయాన్ని తెలుపుతున్నాయి.

**భాష – శైలి**

ఇతర ప్రక్రియలతో పోల్చితే పీఠికల భాషాశైలి ప్రత్యేకంగా కనిపిస్తుంది. కవిత్వంలో ఉపమానాలు, వర్ణనలలో అందమైన పదాల అల్లికలుంటాయి. విమర్శ వ్యాసంలో, పీఠికా రచనలో అటువంటి శైలికి ఆస్కారం తక్కువ. కథ, నవలా రచనలలో పరిమాణం పెద్దదిగా ఉంటుంది. కాబట్టి కొన్ని సందర్భాల్లో సాగదీత చేస్తారు రచయితలు. పీఠిక తక్కువ పుటలలో పూరించాల్సిన ప్రక్రియ. దీనిలో సాగదీయతకు అవకాశం ఉండదు. నేరుగా విషయాన్ని రాయాల్సి ఉంటుంది.

డా. పోరంకి దక్షిణామూర్తి అదే చేశారు. విశ్లేషించదలచుకున్న గ్రంథాన్ని గురించి ఒక్క అనవసరపు వాక్యం కూడా లేకుడా చర్చించారు. తన భావనలకు పెద్దపీట వేయకుండా గ్రంథరచయిత కోణాన్ని గ్రంథంలోని విషయాన్ని పాఠకుల ముందుంచడానికే అధిక ప్రాధాన్యతనిచ్చారు.

'తెలుగు కథకు సరస్వతీపూజ' అనే పీఠికలో ఈ సంవత్సరోత్సవ శోభకు మణిముకురం, అష్టోత్తర శత దళాలతో అంటూ సంస్కృత పదాలను ప్రయోగించారు. దీర్ఘపదాలతో గంభీరత చూపారు. 'తెలుగు మాండలిక పదాలు' అనే స్వీయ రచన పీఠికలో మహాశయం, భాష స్వరూప నిరూపణ, సర్వ సమగ్ర స్వరూపం, మధుర గంభీర నాదం, ప్రయోగ వైచిత్రి, మమతా ఉద్భుతాలు వంటి గాఢత కలిగిన పదాలతో శబ్ద వైచిత్రిని కనబరిచారు. అక్కడక్కడా ఇట్లాంటి పదాలు కనిపించినవి కానీ, మొత్తానికి మాత్రం సరళపదాలతోనే ఇందులోని పీఠికలను రాశారు దక్షిణామూర్తి.

డా. దక్షిణామూర్తి పోరంకి **'అరచేతి అద్దంలో'** పీఠికా సంపుటాన్ని సార్థక నామధేయ గ్రంథంగా తీర్చిదిద్దారు. ఏవిధంగా అయితే అద్దం ఎదురుగా ఉన్నవాటిని యదావిధిగా ప్రతిబింబం రూపంలో చూపెడుతుందో దక్షిణామూర్తి వివిధ కవుల రచనల్లో ఉన్నదేంటో చూపించారు. పీఠికా గ్రంథ పరిష్కరణ, ప్రచురణలకు అనుబంధంగా అభివృద్ధి చెందిన ప్రక్రియ అయినప్పటికీ దీనికంటూ ప్రత్యేక అస్తిత్వం, ప్రయోజనం, లక్షణం ఉన్నాయనీ తన రచన ద్వారా తెలిపారు దక్షిణామూర్తి. ఈయన రాసిన పీఠికలను చదివినట్లైతే ఆ గ్రంథం ఆసాంతం చదివిన అనుభూతి పాఠకునిలో కలుగుతుందని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

# ఉన్నది ఉన్నట్లుగా చెప్పే దక్షిణామూర్తి సమీక్షలు

**డా. పి. వారిజా రాణి,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 970417 9975

ఒక రచనను సమగ్రంగా చదివి, ఆ రచనలోని వస్తు–శిల్పాలను ఆకళింపు చేసికొని, దాని లోతును గ్రహించి, గుణ–దోషాలను బేరీజు వేస్తూ, క్లుప్తంగా పాఠకుడికి రచనను పరిచయం చేయడమే సమీక్ష. పఠితకు రచనపైన సమగ్రమైన అవగాహనను కల్పించేది విమర్శ. సమీక్ష విమర్శలో ఒక భాగం. ఆ రచనను చదవాలనే ఆసక్తిని రేకెత్తించే విధంగా క్లుప్తంగా గ్రంథాన్ని, దాని ప్రక్రియాపరమైన, వస్తుగతమైన, శిల్ప సంబంధమైన విశేషాలను వ్యాసరూపంలో రచించేదే సమీక్షావ్యాసం.

ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారితో వివిధ పత్రికలు సమీక్షా వ్యాసాలు రాయించి ప్రచురిస్తాయి. అవి సాహిత్యానికి సంబంధించినవి లేదా మరే ఇతర అంశానికి సంబంధించినవి కూడా కావచ్చు. ప్రధానంగా ఈ సమీక్షకులకు పత్రికారచనలోని నియమ నిబంధనలు, రచనాపద్ధతి, రాసే భాష పైన, విషయంపైన అవగాహన ఉండాలి.

స్పష్టత, క్లుప్తత లేదా సంక్షిప్తతతో ఆసక్తికరంగా రాయగలగటం, నిర్మమత, నిష్పాక్షికత, పారదర్శకత, సంయమనం, ఆవేశరాహిత్యం వంటివి ఉత్తమ సమీక్షకులకు ఉండవలసిన ప్రధాన లక్షణాలు. పోరంకివారు ఆ లక్షణాలను నిరూపిస్తూ అందుకు లక్ష్యప్రాయంగా, ఆదర్శనమూనాగా ఈసమీక్షాసంపుటాన్ని నిలిపారు. మంచి వ్యాసం రాయడం ఎంత ప్రధానమో? దానికి మంచి శీర్షిక పెట్టడం కూడా అంతే ప్రధానమైన అంశం. పోరంకివారు **"ఉన్నది ఉన్నట్లు"** అని పేరు పెట్టడంలోనే గ్రంథం తీరుతెన్నుల్ని, ప్రక్రియా స్వభావాన్ని, తన హృదయాన్ని చెప్పకనే చెప్పారు.

పోరంకి దక్షిణామూర్తిగారు కథలు, నవలలు, అనువాద గ్రంథాలు, వ్యాస సంపుటాలు, పీఠికలు, సమీక్షలు, విమర్శలు ఇలా అన్ని ప్రక్రియలనూ అలవోకగా చేపట్టి సఫలీకృతులైనారు. గొప్ప పరిశోధకులు. ముఖ్యంగా వ్యాసాలు రాసే సందర్భంలో వారి కచ్చితమైన అభిప్రాయాలను, ఆయా రచనల్లోని తప్పొప్పులను ఎత్తి చూపటానికి ఎక్కడా మొహమాటం కనిపించదు. కచ్చితత్వం లోపించదు. వ్యంగ్యంగా, సునిశితంగా, సున్నితంగా దోషాలను ఎత్తి చూపుతారు. అదే ఒక విమర్శకుడికి, సమీక్షకుడికి ఉండవలసిన ఉత్తమగుణం. ఆ కారణంగానే వారు ఎన్నో గ్రంథాలకు విలువైన పీఠికలను వెలువరించారు. ఎన్నో సమీక్షలను సంతరించారు. పోరంకి దక్షిణామూర్తి గారు **"ఉన్నది ఉన్నట్లు"** అనే శీర్షికతో కొన్ని పత్రికలలో రాసిన పుస్తక సమీక్షలను గ్రంథరూపంలో ప్రచురించారు. ఆ శీర్షికను చూస్తేనే వారి సమీక్షా రచనల్లోని కచ్చితత్వం అర్థమౌతుంది.

ఈ గ్రంథంలో 2001 ఏప్రిల్ నుండి 2011 అక్టోబర్ వరకు అంటే ఒక దశాబ్ద కాలంలో వివిధ పత్రికలకు వారు ఆయా సందర్భాల్లో రాసిన 102 సమీక్షావ్యాసాలు ఉన్నాయి. ఇవి సాహిత్యంలోని వివిధ ప్రక్రియలకు సంబంధించినవి. ఇందులో కథా సంపుటాలు, నవల, కవిత్వం, భాష, వ్యాస సంకలనాలు, అనువాద రచనలు.. ఇలా విభిన్నాంశాలకు చెందిన రచనల సమీక్షా వ్యాసాలు ఉన్నాయి. ఈ వ్యాసాల్లో వారి నిబద్ధత, కచ్చితత్వం, లోతైన వివేచన, నిష్పాక్షిక వైఖరి వ్యక్తమౌతుంది. ఒక రచనను పాఠకులు చదవాలా లేదా అనేది ఇలాంటి సమీక్షల ద్వారానే సాధ్యమౌతుంది. స్థాలీపులాకన్యాయంలా, సమీక్షకులు గ్రంథ పరిచయం మాత్రమే కాకుండా, వివేచనాత్మకంగా, అందులోని తాత్త్వికతను దర్శించి, అది పాఠకులకు పరిచయం చేసి, పఠనాసక్తిని రేకెత్తించగలిగితే ఆ రచన పదేళ్ళపాటు నిలుస్తుంది. సమీక్షకుడు, ఒక కవి లేదా రచయితకు మరియు పాఠకుడికి మధ్య ఒక మార్గదర్శిగా ఉంటాడు. ఒక దిక్సూచిలా నిలుస్తాడు.

ఈ గ్రంథంలో కథ, నవల, కవిత్వం, భాష, వ్యాసం, అనువాదం, ఆధ్యాత్మికం – ఇలా వైవిధ్యభరితమైన 102 సమీక్షా వ్యాసాలు చోటు ఉన్నాయి. వీటిల్లో కొన్నింటిని స్మరించుకొందాం.

**కథా సమీక్షలు**

జీడిగుంట రామచంద్రమూర్తి రాసిన కథలసంపుటి **"అమూల్యం".** ఈ సంపుటిలోని కథలను గురించి సమీక్షిస్తూ, దానిలో "అమూల్యం" అనే మంచికథను పరిచయం చేసారు.

'అమూల్యం' కథలో వృద్ధ దంపతులున్నారు. ఉద్యోగపుటూళ్ళో ఉన్న కొడుక్కి తల్లి దగ్గరినుంచి ఒక ఉత్తరం వస్తుంది. తాను చనిపోయాక తండ్రిని ఎలా చూసుకోవాలో రాస్తుంది తల్లి. అదే రోజున మామగారు రాసిన ఉత్తరం కోడలికి అందుతుంది. తాను పోయాక అత్తగారిని ఎంత ఆదరణగా చూడాలో రాసాడాయన. ఈ రెండు ఉత్తరాలూ చదివిన కొడుకు, **"భార్యాభర్తల బంధం ఎంత ఆత్మీయంగా, మరెంత గాఢంగా ఉండాలో కూడా అర్థమైంది"** అంటాడు. ఉత్తరాలు రెండూ ఆల్బంలో అతికించి తరతరాలుగా భద్రపరచుకోవలసినవి అని భార్యకు చెబుతాడు. **"భార్యాభర్తల మధ్యా, తల్లిదండ్రులూ పిల్లల మధ్యా ఉండవలసిన అనురాగాలూ**

**ఆత్మీయతలూ అనుబంధాలూ సడలిపోతున్న ఈ యాంత్రిక యుగంలో ఇలాంటి ఉత్తరాలు ఎంతో అమూల్యమైనవి"** అంటాడు. **"ఆర్ద్రత నింపుకొన్న అందమయిన కథ ఇది"** అని ఒక వాక్యంలో ఈ కథను సమీక్షించారు దక్షిణామూర్తిగారు. (63)

బొంబాయి వాస్తవ్యులు, ఉన్నతోద్యోగంలో క్షణం తీరిక లేకున్నా, మాతృభాషపై మమకారంతో వీలు చిక్కినప్పుడు తెలుగులో కథలు రాస్తారు అంబల్ల జనార్దన్. వారు రాసిన **"బొంబాయి కథలు"** అనే పేరుతో రాసిన కథాసంపుటాన్ని పరిచయం చేస్తూ, **"బొంబాయిలోని తెలుగువారి జీవితాలను, కొన్ని సంఘటనలను, పరిస్థితులను, ప్రదేశాలను నేపథ్యంగా తీసుకుని రాసిన కథలకు తోడుగా ఆంధ్రప్రదేశ్ నేపథ్యంలో రాసినవి కూడా చేర్చి, మొత్తం 26 కథలతో కూర్చిన కదంబం ఇది"** అని పరిచయం చేసారు. ఐతే దక్షిణామూర్తిగారు ఎక్కడ ఎలాంటి లోపాలు ఉన్నా కూడా, సూటిగా చెప్తారు. **'వీడిన మబ్బులు'** కథలో ఉదాహరించిన మంత్రభాగంలోని తప్పులను మలిముద్రణలో సవరించడం మంచిది అని చెప్పారు.

మళ్ళీ చివరి వాక్యాల్లో **"తాము గమనించిన వ్యక్తులను, పరిస్థితులను వైలక్షణ్యాలను చిన్న చిన్న కథలుగా మలచడం జనార్దన్ గారి ప్రత్యేకత. సంభాషణల్లో అక్కడక్కడ చేసిన మాండలిక ప్రయోగాలు పాఠకులను మురిపిస్తాయి"** అని ప్రశంసించారు.

ప్రసిద్ధ కథా రచయిత భరాగో (భమిడిపాటి రాజగోపాలం) రాసిన **"ఇట్లు మీ విధేయుడు"** కథా సంపుటిని సమీక్షిస్తూ, అందులోని కథలను పరిచయం చేసారు. ఈ సంపుటి పేరుతో రచించిన "ఇట్లు మీ విధేయుడు" కథను పరిచయం చేస్తూ, **"అన్నిటిలోనూ తాతగారి మాట ప్రకారమే చేసే మనవడు, ఆయన చెప్పిన మంత్రిగారి మనుమరాల్ని కాకుండా, తనకు నచ్చిన పిల్లను ఇంటికి తెచ్చి పరిచయం చేస్తాడు. పైగా... నాక్కావలసింది – పెళ్ళామా? మొగుడా?"** అంటాడు. ఇక తాతగారేమంటారు? (45) అని కథా పరిచయాన్ని ఇంత క్లుప్తంగా ఒక తాతా మనవళ్ళ సంభాషణతో చిన్న కథాసారాన్ని సూక్ష్మంలో మోక్షంలా చూపించారు. ఇలా సరైన చోట సరైన ఉదాహరణలతో కథా సమీక్ష ఎలా చేయవచ్చో చూపించారు.

దువ్వూరి శారదాంబ స్మారక పోటీ కథలుగా ఎంపికయిన ఇరవై ఐదు కథల కూర్పు **'కథామహల్ 2000'**. ఈ కథా సంకలనాన్ని దక్షిణామూర్తిగారు సమీక్షిస్తూ, బి.వి. రమణరావు రచించిన **'మచ్చలేని మనిషి'** కథలో ఒక అల్లుడికి, అతని ఇంట్లో ఉన్న అత్తగారికి బొల్లి మచ్చలు ఉన్న కారణంగా, తన ఇంటికి వచ్చే అతిథుల కంటికి ఆమె కనబడటం ఇష్టంలేదు. తన భార్యకు ఆ విషయం ఫోన్లో చెప్పగా భార్య అతని అభిప్రాయాన్ని ఖండించడమే కాకుండా, అవసరమైతే ఈ కారణంగా భర్తతో తెగతెంపులు చేసుకోవడానికి కూడా తాను సిద్ధమేనని చెప్తుంది భార్య అని వివరించారు. మరో కథను పరిచయం చేస్తూ, **"వివిధ కాలాల్లో జీవించిన భగవద్భక్తుల హృదయానుభూతులను ఏకసూత్రానికి చేర్చిన విలక్షణ పౌరాణిక కథామేళనం 'ఒకనాడు యశోదగారింట..' (జి. రామకృష్ణశాస్త్రి). ఇలాంటి ప్రయోగం ఇంతకుముందెవరూ చేసినట్టు కనిపించదు"** అని ప్రశంసించారు. ఇలా కథలోని సారాన్ని ఇంత చిన్నగా మూడు ముక్కల్లో భావం, సారం చేడకుండా వివరించిన తీరు ఆకట్టుకుంటుంది. (61,62 పుటలు)




**"కాదేదీ కథకనర్హం"** సమీక్షావ్యాసంలో, డి. కామేశ్వరి రాసిన కథలసంపుటిని సమీక్షించారు. రెండు భాగాలుగా అమర్చిన ఈ సంపుటిలోని కథలపేర్లు (కుక్కపిల్ల, అగ్గిపుల్ల) చూస్తే శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'ఋక్కులు', ఖండికలోని 'కాదేదీ కవితకనర్హం' అనడం గుర్తుకు వస్తుంది. 'ఋక్కులు' ప్రేరణతో రావిశాస్త్రి రచించిన కథలు గుర్తుకు వస్తాయి. కానీ వీరిద్దరి దృక్పథాలు వేరు. **"వస్తువు ఉపయోగానికి వ్యతిరేకమయిన అర్థం వచ్చేటట్లుగా రాయడానికి పూనుకొన్నవి కామేశ్వరి కథలు."** మాటవరసకు, **"కుక్కపిల్ల విశ్వాసానికి మారుపేరే అయినా తిండి పెట్టకపోతే ఏ విశ్వాసమూ నిలవదు"** అని, రచయిత్రి ఒక నిర్దిష్ట ప్రయోగంగా ఈ కథలను రచించిందని, రచయిత్రి దృక్పథాన్ని విప్పిచెప్పారు.

అలాగే ముగింపు వాక్యాల్లో **"వ్యక్తిగత సమస్యలనయినా, సామూహిక సమస్యలనయినా చిత్రించేటప్పుడు కొందరు రచయితలు తరచుగా ఒక జాతిని గురించో, వర్గాన్ని గురించో సాధారణీకరణ వ్యాఖ్యలు చేసే చాపల్యానికి లోనవుతూ ఉంటారు – సాహిత్యేతర ప్రయోజనాలవల్లా, విషయప్రచార ప్రభావాల వల్లా తాము చేపట్టినది సాహిత్యకళ అన్న**

**సంగతీ మరచిపోతూ ఉంటారు. అది తప్పు. ఒక వ్యక్తిలోని మంచిచెడ్డలను బట్టి, ఆ వ్యక్తి మగవాడయితే మొత్తం మగజాతినీ, ఒక సమూహం/వర్గం వాడయితే ఆ మొత్తం సమూహాన్నీ ఒక గాట కట్టేసి తీర్పుచెప్పడం పరిణతిని సూచించేది కాదు కదా!"** అని సున్నితంగా విమర్శించారు. **"శక్తిమంతమైన ఇతివృత్తాలను చాలా ఆవేదనాభరితంగా రాయగల ఈ రచయిత్రి"** అభినందనీయురాలు అని ప్రశంసలు కూడా చేసారు.

**"కథానిక - కమామీషూ"** అనే వ్యాసంలో ఘండికోట బ్రహ్మాజీరావు అభిరుచిని బట్టి అప్పుడప్పుడూ చదివిన కథానికల రచనాశిల్పాన్ని గురించి రాసిపెట్టుకున్న నోట్సును పుస్తక రూపంలోకి తెచ్చారు. ఇది రచయితలకు ఉపయోగపడుతుందనే సదాశయంతో 'రజని' సంస్థ ద్వారా ప్రచురింపజేశారు. దీన్ని సమీక్షించిన విధానం చూస్తే, కొన్ని లోపాలను సూటిగా చూపడమే కాకుండా సున్నితమైన హాస్యం, వ్యంగ్యాలను మేళవించి ఎలా సమీక్షించవచ్చో తెలుస్తుంది. **"ఈ పుస్తకంలో విషయసూచికా, క్రమమూ లేకపోయినా వివిధ శీర్షికలనూ ఉపశీర్షికలనూ లెక్కపెడితే ఏబై పైచిలుకు ఉంటాయి. వాటిలో పునరుక్తమైన శీర్షికలు (వాక్యాలూ, పేరాలు కూడా) లేకపోలేదు."** (పుట151 )

**"రజని ప్రత్యేక శిక్షణలో తెలియజెప్పే కొన్ని ప్రత్యేక సూచనలు గ్రహించిన వారు ఘండికోటవారి రచన చదివి తికమక పడకండి. రచనలో ఎంతో అనుభవం కలిగిన బ్రహ్మాజీరావుగారి నుంచి కొత్త రచయితలు నేర్చుకోవలసినదెంతో ఉంది"**, అంటూ ప్రచురణకర్తలు, సందేహాలు ఏమి కలిగినా 'రజని' (మామిడికుదురు) చిరునామాకు రాయమన్నారు అని సున్నితంగా విమర్శించారు దక్షిణామూర్తిగారు.

కథానిక స్వరూప స్వభావాలను గురించి విలువైన సిద్ధాంతగ్రంథాన్ని రచించిన దక్షిణామూర్తిగారు అవకాశం ఉన్న ప్రతి సందర్భంలో విలువైన మంచి విషయాలను, అభిప్రాయాలను, సూచనలను అందిస్తూ, గొప్పకథలను, కథకులనూ కథన రీతులనూ ప్రశంసించారు. వారి అభిప్రాయాలను పాఠకులతో పంచుకున్నారు.

**"హాలికులు కుశలమా!"** అనే వ్యాసంలో మధురాంతకం రాజారాంగారి కథల సంపుటిని సమీక్షిస్తూ ఇలా అంటారు **"మంచి రచయిత మానవ సంబంధాలనే ప్రధానంగా ద ృష్టిలో పెట్టుకుంటాడు. సమాజంలోని మంచితనాన్ని కమ్మతెమ్మెరలా ప్రసరింపజేస్తాడు. కళ్యాణ కింకిణిలా ఆలపింపజేస్తాడు. తాను వెలిగించిన దీపాలలా కాంతి వెదజల్లుతాడు. ఒకానొక జీవిత సన్నివేశం పట్ల, ఒకానొక వ్యక్తిపట్ల తన హృదయంలో కలిగిన స్పందనను అట్లాగే పాఠకుడి హృదయంలోకి బట్వాడా చేస్తాడు గొప్ప రచయిత. తన అనుభూతిని మాటల మాధ్యమం ద్వారా పాఠకుడికి అందిస్తాడు. అంతకంటే గొప్ప సాహిత్యశిల్పం మరొకటి ఉండదని నిరూపిస్తాడు, విశ్వసిస్తాడు. అటువంటి మంచి కథారచయిత శ్రీ మధురాంతకం రాజారాం"** అంటూ కథాశిల్పం విషయంలో అమూల్యమైన వారి విశ్లేషణను అందించారు. ఇదే పోరంకి దక్షిణామూర్తిగారి ప్రత్యేకత.

బుచ్చిబాబుగారి సంస్మరణార్థం ఒక్కొక్క ప్రముఖ రచయితల కథాసంపుటాలను ప్రతి ఏటా ప్రచురిస్తున్నారు డా॥వేదగిరి రాంబాబు గారు. వాటిలో ఐదవ కథాసంపుటం **"మనోవ్యాధికి మందుంది".** ఇందులో ఇరవై ఎనిమిది కథలున్నాయి. రచయిత్రి శివరాజు సుబ్బలక్ష్మిగారు (బుచ్చిబాబు గారి శ్రీమతి). రచయిత్రిని పరిచయం చేస్తూ, **వీరి చిత్రకళారచన, కథానికా రచన వీరి దాంపత్యానికి వన్నెకూర్చిన సమానాభిరుచులు. ఇది అరుదయిన విశేషం. ఇద్దరికిద్దరూ సౌహార్ద సింధువులు కావడం కళారచనకన్నా గొప్ప విశేషం** అని చెప్పారు. ఈ సంపుటిని సమీక్షిస్తూ **"మంచి కళాకారుణ్ణో? శాస్త్రవేత్తనో ఉపేక్షించడం కాని, విస్మరించడం కాని, అపచారమనిపించుకున్నట్లయితే ఆ ప్రమాదం తప్పించినవాడు పుణ్యాత్ముడనిపించుకుంటాడు"** అన్నారు ఈ సందర్భంలో. కథలను సమీక్షిస్తూ, రచయిత్రి అత్యంత హృదయవిదారకంగా చిత్రించిన గొప్ప కథ **'పోస్టు చెయ్యని ఉత్తరం'.** బయటి ప్రపంచ రీతులూ లోపలి కంపన ప్రభావాలూ సుబ్బలక్ష్మిగారి చేతిలో చక్కని కథలుగా రూపొందాయి. **'కావ్యసుందరి'** కథలోనూ, **'కథలు చెప్పే గౌరి'** వంటి కథలోనూ సున్నితమైన హాస్యం ఉంది. **'మూతపడని కన్ను, కథలు చెప్పే గౌరి కథల్లో** అక్కడక్కడ వర్ణనలు కనిపిస్తాయి. చక్కని తెలుగు నుడికారానికి వీరి రచన పెట్టింది పేరు అని చెప్తూ, **'వంచాళింపు, కామాటం, ఓంద్రింపు, పాలదాలి, ఆపుకారా, సోజ్జం, గడేగారు'** వంటి ప్రయోగాలను ఉదాహరణగా చూపించారు. ఈ వ్యాసంలో చివరగా, జరుక్ శాస్త్రిగారన్నట్లు, **"ఇవి మనిషి మనసులోంచి వచ్చిన కథలు"**. రచయిత్రిగా సుబ్బలక్ష్మిగారి స్వీయవ్యక్తిత్వాన్ని ఉన్నతంగా నిలిపే ఈ కథలు తప్పకుండా చదవదగినవి అంటారు.

ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉంది. ఇందులో కథా సమీక్షలు దాదాపు 29 వరకూ ఉన్నాయి. ఇక ఇతర ప్రక్రియలకు సంబంధించిన సమీక్షలను కూడా ఒకసారి క్లుప్తంగా పరిచయం చేస్తాను.

ఈ సమీక్షావ్యాస సంపుటిలో నవలా సమీక్షలు తక్కువే ఉన్నాయి. వాటిలో ప్రధానమైన కొన్నింటిని స్పృశిస్తాను. **'మంగళ సూత్రము'** అబ్బూరి రామకృష్ణారావు గారు రాసిన నవల ఇది. రచయితను పరిచయం చేస్తూ బహుముఖ ప్రజ్ఞావంతులైన అబ్బూరివారు తొలితరం భావకవుల్లో ప్రఖ్యాతులు. వారు అపరాధ పరిశోధక నవల (మంగళ సూత్రము), కొన్ని కథలు కూడా రాసారు. అప్పట్లో వారి భాషా, శైలి అంతా గ్రాంథికం. పాత్రల సంభాషణలు కూడా

గ్రాంథికంలోనే నడిచాయి. శైలి ఏదైనా వారి కథల్లో చదివించే శక్తి బాగుంటుంది. ముప్పైఅధ్యాయాల వరకూ లభించిన 'మంగళ సూత్రాలు' నవల వేశ్యావృత్తిని స్వీకరించిన రత్నవల్లికి సంబంధించిన కథ. ఆమెదొక వింత ప్రవృత్తి. రామమూర్తి అనే సరసుడితో ఆమె పెడసరంగా మాట్లాడటంతో కథ మొదలౌతుంది. చివరి అధ్యాయంలో ఆమె **"రత్నవల్లి భాగ్యము లంతరించిన మాట నిజమే. నీపై ఆ పగ మాత్రమట్టే నిలిచియున్నది. మరచిపోకుము"** అని రామమూర్తిని హెచ్చరిస్తుంది. కథ మాత్రం సశేషంగానే ఉండిపోతుంది.

ద్వారకా అనే రచయిత రాసిన **"పల్లె పిలిచింది"** అనే నవలను సమీక్షిస్తూ **"ఒక వ్యక్తి పూనికతో, పల్లెప్రజల్లో చైతన్యం కలిగిన వాళ్ళ కలిసికట్టుగా పనిచేసి కోరిన ఫలితాన్ని సాధించినట్లు తెలిపే నవల ఇది''** అంటూ నవలలోని ఇతివృత్తాన్ని పరిచయం చేసారు. తమిళనాడు సరిహద్దులో ఉన్న జంబాడ అనే మారుమూల పల్లెకు హెడ్‌మాస్టర్‌గా వచ్చిన ప్రసాద్, అక్కడి పరిస్థితులను చూసి నిరాశపడి, అక్కడ నివసించకుండా, పని చేయకుండానే హాజరు పుస్తకాల్లో సంతకాలు పెట్టి అప్పనంగా జీతం తీసుకుంటాడు. ఆ తర్వాత అతనిలో క్రమంగా మార్పు వచ్చి ఆ పల్లెలోనే మకాం పెట్టి, ఆ ఊరిని అన్ని రకాలుగా బాగుచేసి, మరో ఊరికి బదిలీపై వెళ్ళిపోతాడు.

ఒక పల్లెటూరి వాస్తవ పరిస్థితులను సహజంగా చిత్రిస్తూ, సామూహిక కృషితో కార్యసాధన చెయ్యవచ్చుననే సత్యాన్ని రచయిత ఈ నవల ద్వారా నిరూపించారు. రచయిత ఆశావాది కావడం మాత్రమే కాకుండా, ఇది రచయిత తొలినవల కావడాన్ని మెచ్చుకోదగిన విషయంగా దక్షిణామూర్తిగారు భావించారు. అంతేకాకుండా వీరి రచనాశైలి చక్కగా చదివిస్తూ, సరిహద్దు ప్రాంతపు మాండలికంలోని పలుకుబళ్ళు సంభాషణల్లో చక్కగా వినిపిస్తాయని ప్రశంసించారు.

ఇలా కొన్ని మాత్రమే నవలా సమీక్షలు ఉండగా, దాదాపుగా అన్నీ కేవలం కేవలం ఇతివృత్తాన్ని పరిచయం చేసినవిగానే ఉన్నాయి. చర్చించుకోదగిన విలువైన విషయాలు కానీ ఆ ప్రక్రియకు సంబంధించిన అంశాలు కానీ కనబడలేదు.

**హాస్యం :**

ఈ గ్రంథంలో మనను ఆకర్షించే వ్యాసం, **"కదిలే రైల్లో కథాకళి".** దర్భా బాబూరావుగారు రేడియోలో చేసిన కొన్ని హాస్య ప్రసంగాలను సంపుటీకరించి ప్రచురించిన ఈ కథాకళిలో పన్నెండు రకాల మెదలికలు చూపించారని చెప్పారు. ఈ సందర్భంలో హాస్యం గురించి మంచి విషయాలను ప్రస్తావించారు. వ్యాసం ప్రారంభంలోనే **"హాస్యమంటే ఇష్టంలేనివాళ్ళెవరు? అలాంటి సరుకు తమకు సుతరామూ పట్టనట్టు బిగుసుకుపోయే యమగంభీర్రావులు కూడా ఒక్క ఛలోక్తి వినగానే కిసుక్కున నవ్వక తప్పదు, గొంతుముడి వదులు చేసుకోకా తప్పదు. మరీ పెద్దమనుషుల జాబితాలో వాళ్ళయితే కట్టుడు పళ్ళవో, బంగారప్పళ్ళవో తళతళలు ఒక్కసారి చూపించి దాచేసుకుంటారు. కనీసం ముసిముసిగానయినా మురుస్తారు. ఛలోక్తులతో చమత్కారంగా మాట్లాడేవాళ్ళూ, రాసేవాళ్ళూ అందరినీ ఆకర్షిస్తారు. నరాలు పట్టుకుని పోయినవాళ్ళకి కూడా ఆరోగ్యాన్ని పంచిపెడతారు. అందుకే నవ్వు నాలుగిందాలా మేటి!"** అని చమత్కారమైన పదాలతో వ్యాసాన్ని రచించి హాస్యాన్ని చొప్పించారు.

తెలుగులో హాస్యరచనలు తక్కువే అని కొందరు అనుకొన్నా, మన పెళ్ళిళ్ళూ, పండుగ పబ్బాల వేడుకల్లో పదిమందీ కూడిన చోట హాస్యం వెల్లివిరుస్తుందని, సుతిమెత్తని వేళాకోళాలు, వెటకారాలూ, వెక్కిరింతలు, ఎత్తిపొడుపులు, పరాచకాలు, సరసాలు వగైరాలన్నీ హాస్యంలోని రకాలేనని చెప్పారు. మన రచయితలూ హాస్యప్రియులే అయినా, కొందరు ఆ సంగతి బయట పెడతారు, కొందరు పెట్టరు. కొందరు మనను మురిపిస్తారు, కొందరు వాళ్ళే మురుస్తారు... అంతే తేడా అంటూ తెలుగు వారి హాస్యరీతులను, వ్యక్తీకరణ పద్ధతులను చక్కగా విశదీకరించారు. (193)

**వ్యాసం :**

వ్యాస సంకలనాలపైన దాదాపు పదిహేను వ్యాసాలున్నాయి. వీటిలో కొన్ని ఆధ్యాత్మికానికి సంబంధించినవి, మరికొన్ని వివిధ సాహిత్యపరమైన అంశాలకు సంబంధించినవి.

పొత్తూరి వేంకటేశ్వరరావుగారు రచించిన **"చింతన"** వ్యాస సంకలనాన్ని పరిచయం చేస్తూ, **"లౌకిక విషయ సంగ్రహణల్లో నిపుణులే కాక మౌలికమైన నిగూఢ ఆధ్యాత్మిక సంపత్తిని ఆధారపీఠం చేసుకున్నవారు పొత్తూరి వారు. భావంలో స్పష్టత, భాషలో సరళత ఆయన రచనావ్యాసంగ రథానికి అందంగా అమరిన ప్రగతి చక్రాలు"** అని వ్యాస రచయిత ఐన పొత్తూరి వేంకటేశ్వర రావుగారి వ్యక్తిత్వాన్ని, రచనాశైలిని ప్రశంసించారు. వారు ఎంతో నిగ్రహంగా, నిష్పాక్షికంగా ఈ సంకలనానికి ఎన్నటికీ విలువ తరగనివీ, వన్నె తగ్గనివీ, మనస్సునలరింపజేసేవీ అయిన ఇరవై ఆరు వ్యాసాలను ఎంతో కష్టపడి ఏర్చి, కూర్చారు. అని వ్యాసాలు ఆధ్యాత్మిక కాంతిని అన్ని దిక్కులా ప్రసరింపజేస్తాయి అనడంలో ఎలాంటి సందేహంలేదని చెప్పారు.

మరొక వ్యాస సంపుటి **"మాతృసంహిత".** గుంటూరు జిల్లా, జిల్లెళ్ళమూడి అమ్మ అనసూయాదేవి విశిష్ట వ్యక్తిత్వం, వారి జీవిత విశేషాలు, వారు చేసిన మౌలిక బోధనల సమాహారం. 'మాతృశ్రీ' పత్రిక సంపాదకులు కొండముది రామకృష్ణ నెలనెలా రాసిన సంపాదకీయాలు, గ్రంథ పీఠికల సమాహారమే ఈ మాతృసంహిత.

**'అన్ని నేనులు నేనైన నేను'** అనీ, **'దేవుడు కూడా నా బిడ్డే'** అనీ

చెప్పగల అద్వైతమూర్తిగా, 'కారుణ్య కేతనం'గా 'అమృత కలశం'గా 'అందరికీ అమ్మ' అనిపించుకున్న అనసూయమ్మ సుమారు ఆరు దశాబ్దుల కాలం చేసిందంతా **'మాతృయాగం'**, ఆమె ఇంటిపేరు 'అందరిల్లు' అని నిరూపిస్తుంది ఈ గ్రంథం అని అంటారు పోరంకి వారు. పాతకాలపు ముత్తైదువలా కనిపించే అమ్మ భావాలు సంప్రదాయానికి ఎంత భిన్నంగా ఉంటాయో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది అంటారు వారు. అమ్మ గురించి స్పష్టమైన అవగాహన ఏర్పడటానికి ఈ గ్రంథం బాగా ఉపకరిస్తుందని భావించారు.

**"అవతార తత్త్వ వివేచన"** అనే మరో వ్యాస సంకలనం కొత్తపల్లి వీరభద్రరావు రాసినది. భగవదవతారాలను గురించి వీలున్నంత విపులంగా చెప్పడానికి పూనుకొన్న గ్రంథం ఇది. మతాల తత్త్వశాస్త్రాల తులనాత్మక అధ్యయనంపట్ల విశేషమైన ఆసక్తి ఉండి, భారతీయ సంస్కృతి ఏకాత్మకతకు విశ్రుత వ్యాఖ్యాతలైన వీరభద్రరావుగారి రచన కావడమే ఈ గ్రంథ విశిష్టత. ఎంచుకొన్న ఏ విషయాన్నైనా సాధికారికంగా చెప్పగల ప్రముఖ విద్వాంసులైన వీరిద్వారా, దాదాపు వైష్ణవ విజ్ఞానసర్వస్వం అనిపించేటట్లుగా రూపొందిన ఈ గ్రంథం తప్పకుండా చదివి భద్రపరచుకోదగినది అని పోరంకివారు అభిప్రాయం వ్యక్తం చేసారు.

**ఆత్మకథాకావ్యం**

స్వేచ్ఛకు మారుపేరు పక్షి. పక్షిలా ఎగరలేని మనిషి మనసు విప్పిన రెక్కలతో ఊహాకాశంలో విహరిస్తాడు. మనిషి సాగించే మనుగడ తీరుతెన్నులను నిశిత పరిశీలనకు పెట్టే ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారి కావ్యం **'సుపర్ణ'**. దీన్ని **'ఒక పక్షి ఆత్మకథాకావ్యం'** అన్నారు రచయిత.

**"మనిషి వెంట తిరుగుతూ / బ్రతుకంటే ఏమిటో తెలుసుకోవాలనే / మనన ప్రక్రియ"** ఆ పక్షికి మనిషితనాన్ని ఇచ్చింది. దాని అనుభవాల కథాంశమాలిక దాని మాటల్లో కావ్యరూపు దాల్చింది. అది మాటలు నేర్చిన పక్షి కదా! దాని పక్షంలో **"ఈ కథ యొక అంతరంగ మథనం"**(26) అని కావ్య పరిచయం చేసారు. 14 ఖండికలు గల ఈ కావ్యంలో, పిల్లపక్షి అండగర్భంలో నుంచి లోకంలోకి తొంగిచూసినప్పటి అనుభూతి కథనంతో మొదలవుతుంది. ఒక పక్షి ఆత్మకథను చెప్తూ, ఉదాత్తమైన చక్కని కవిత్వంలో సమకాలీన సామాజిక, రాజకీయ, లౌకిక విషయాలను రంగరించిన శ్రీకాంతశర్మ అభినందనీయులు. కవిగా ఆయనను పైమెట్టున నిలిపిన 'సుపర్ణ' కావ్యం సంతోషంగా చదవదగ్గది అని సమీక్షించారు.

ఇంకా ఈ గ్రంథంలో కవిత్వం, నాటకం, జీవితచరిత్ర, ఆత్మకథ, యాత్రలు, ముచ్చట్లు, వైజ్ఞానికాంశాలు, అనువాద రచనలు, సిద్ధాంత గ్రంథాలు, విమర్శలు, భాషకు సంబంధించిన సమీక్షావ్యాసా లున్నాయి. వాటన్నిటినీ పరిచయం చేసుకోవడానికి ఇక్కడ సాధ్యం కాదు.

**సమీక్ష కేవలం ఒక పుస్తకం లేదా విషయ సమీక్షలా కాకుండా, ఎన్నో విలువైన విషయాలను, అమూల్యమైన అభిప్రాయాలను, విపులమైన విశ్లేషణలను అందిస్తూ, రచనల్లోని గొప్పదనాన్ని ప్రశంసిస్తూనే, లోటుపాట్లను, గుణదోషాలను ఎత్తి చూపుతూ, విలువైన సూచనలు, సలహాలు, విశ్లేషణలను విమర్శనాత్మకంగా పాఠకులకు అందించగలిగేది.** పోరంకి దక్షిణామూర్తిగారి సమీక్షావ్యాస సంపుటిలో ఈ అంశాలన్నీ ఉన్నాయి అని చెప్పడం అతిశయోక్తి కాదు.

సుప్రసిద్ధ పరిశోధకావతంసులు, కథ, నవలా రచయిత, ఎన్నో వ్యాస సంకలనాలు, అనువాద గ్రంథాల రచయిత, వృత్తిపదకోశాల నిర్మాణం, నిఘంటు నిర్మాణాల్లో ఎంతో అనుభవం కలిగినవాకె పోరంకి దక్షిణామూర్తిగారు. వారి సమీక్షావ్యాస సంపుటిలో ఆ అనుభవం, వారి అంతరంగం, ఔన్నత్యం, రచనలోని నిష్పాక్షిక ధోరణి సుస్పష్టంగా వ్యక్తమౌతుంది. వారిప్పుడు మనమధ్య లేకపోవచ్చు కానీ వారి రచనలెప్పుడూ మనకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

**గాఢమైన అధిభౌతిక జ్ఞానమున్నవారు ఆత్మచైతన్యాన్ని లోతుగా తరచి, ఆత్మకు ఉన్న దివ్యశక్తితో, చెడ్డతనపు జాడలన్నింటినీ తమ జీవితాల్లోంచి తుడిచేస్తారు. దేవుడిలో ఐక్యం కావడానికి ఉన్న అడ్డంకులన్నిటినీ ఈ విధంగా నశింపు చేయడం యోగమార్గం. ఇది ఊహాత్మకం కాదు; శాస్త్రీయమైనది. యోగం, దేవుణ్ణి చేరే మార్గాల్లోకెల్లా ఉన్నతమయినది. యోగం ద్వారా మీరు ప్రతికూల భావనలనన్నిటినీ విడిచి పెట్టేసి చైతన్యపు చరమ స్థితులను సిద్ధింపజేసుకుంటారు. యోగం ఆధ్యాత్మ శాస్త్రజ్ఞుడి మార్గం. ఇది సర్వమూ సైద్ధాంతిక శాస్త్రం; సంపూర్ణ శాస్త్రం. మీలోకి మీరు నిజాయితీగా చూపు సారించి మీరేమిటో తెలుసుకోడం, ఇంకప్పుడు మీ సమస్త ఆత్మబలంతోనూ మీలో ఉన్న చెడును నశింపు చేసుకోడం నేర్పుతుంది యోగం. చెడును కాదన్నంత మాత్రాన సరిపోదు. దానికి ఎంత పట్టుదల కావలసి ఉన్నప్పటికీ ఆధ్యాత్మ శాస్త్రజ్ఞుడు ఎన్నడూ నిరుత్సాహపడడు. భగవంతుడు తనకిచ్చిన బలాన్ని అతిక్రమించేటంత అజేయమైన కష్టమేదీ లేదని అతనికి తెలుసు.**

**(విజయానికి ఒకదారి కనుక్కోడం ఎలా - శ్రీశ్రీ పరమహంస యోగానంద)**

# పోరంకి వారి తెలుగు మాండలికాలు

**డా. శ్రీరంగాచార్య,** పూర్వ ప్రిన్సిపాల్, పాలెం ఓరియంటల్ కళాశాల. ఫోన్ : 929 945 1266

ఆంధ్రప్రదేశ ప్రభుత్వం చొరవతో ఎంతో భవిష్యత్తునూహించి ఏర్పాటు చేసిన 'తెలుగు ఎకాడమీ' అనే సంస్థను ప్రారంభం నుండీ ఇప్పటికీ చూస్తున్నాను. అధికారుల రాకపోకలు సామాన్యమనిపించే ప్రభుత్వం సంస్థల వలెనే తెలుగు ఎకాడమీ మనుగడ సాగిస్తున్నది. దీని ప్రారంభంలో డైరక్టర్లు, భాషా విషయ పరిశోధన పద్ధతి తెలిసి, గౌరవించినవారు కావటం వల్ల సంస్థలో పనిచేయటానికి వివిధ రంగాల్లో నిష్ణాతులైనవారినే నియమించి చక్కని కార్యక్రమాలను 'అక్షర రూపం'గా మనకందించగలిగినారు. అది వారి చిత్తశుద్ధి. సంస్కారం. మొదటి సంవత్సరాల్లో నేను ఎకాడమీకి తరచుగా వెళ్లి పెద్దలైన మిత్రులను చూచి వారు చేసే పనులను గమనిస్తూ, పరిశోధన ఇట్లా వుండటం మంచిదనుకునేవాణ్ణి. అప్పట్లో పోరంకి దక్షిణామూర్తి, బూదరాజు రాధాకృష్ణ, రమాపతిరావు (మంజుశ్రీ) తరువాత ముకురాల రామరెడ్డి, నీలా జంగయ్య మొదలైనవారు ఎకాడమీలో నిత్య కార్యక్రమవ్యగ్రులై అంకితభావంతో పనిచేస్తుండేవారు. వీరందరితోనూ నాకు వ్యక్తిగత పరిచయ భాగ్యం వున్నందున చర్చలు జరిపేవాళ్లం. అదొక సాహితీ యజనశాల. ఆ రోజులు వేరు.

ముఖ్యంగా ఎకాడమీ వారు వేసిన నిఘంటువులు – వివిధ పదకోశాలు – జిల్లాల మాండలికాలు – సాహిత్య కోశాలు – జనరంజక గ్రంథాలు – ఇట్లా ఆనాటి ప్రతికృతి సాహితీలోకంలో ప్రత్యుపకృతిగానే నిలువటం పరిశోధకుల పట్టుదల కొక ప్రతీక. ప్రతిభా పరిణద్ధమూర్తులైన వీళ్లల్లో ఒకరు పోరంకి దక్షిణామూర్తిగారు. (1935 – 2021) ఆయన చేసిన పిహెచ్.డి పరిశోధన – **'కథానికా సాహిత్యం'** గూర్చి అని చాలామందికి తెలియకపోవచ్చు. కారణమేమంటే ఆయన గొప్ప అనువాదకుడు. సాహిత్య సృజనశీలి. అప్పటి ఆంధ్రప్రదేశంలోని మూడు ప్రాంతాల మాండలికాలను గమనించి వాటిని గుదిగ్రుచ్చి మూడు నవలలను రచించిన ప్రథమ రచయితగా ఖ్యాతినందిన పోరంకివారు ఎకాడమీ వారి పదకోశాల కెన్నిటికో రూపకర్త. నిరంతర పరిశోధకుడు, ఆయన శబ్దవేది. లోతుకు దిగి రూపాన్వేషణ చేసిన నిఖార్సయిన పరిశోధకుడు.

భాషనెప్పటికీ **'మాండలికం'** అనవద్దనేవాడు. ఆ పదానికి అర్థం వేరు. అంతా తెలుగే. అందరు మాట్లాడే ప్రతి మాటా ప్రామాణికమే అనేది ఆయన అభిప్రాయం. ఈ విషయంలో గురుస్థానీయులైన భద్రిరాజు వారితోనూ వాదించేవాడు. మనది ప్రామాణిక భాష. కాలగమనంలో మార్పు తప్పనిసరి. నిరంతర జలప్రవాహం గల వాగులో మొదట ముడిరాయిగా వున్నదే కాలం గడిచిన తర్వాత నునుపైన గుండ్రాయి (రాయి) గా మారినట్లే మన భాష మారుతుంది.




దాన్ని మాండలికం అనటం తగదు. అట్లా అయితే నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథాదుల భాషను ఏ మాండలికంలో పరిగణించగలం అనేది ఆయన గాఢమైన పరిశీలనా దృక్పథం. ఇట్లా వాదించటం ఆయన నైజగుణం. ఇది సాహిత్యంలో మిత్రులను, శత్రువులను సమానంగా సంపాదించుకున్న పట్టుదల గల 'మనీషి'.

అప్పటి ప్రభుత్వం 2012 డిసెంబర్ 27,28,29 తేదీల్లో జరిపిన 4వ ప్రపంచ తెలుగు మహాసభల నిమిత్తం వీరు **'ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాండలికాలు'** అనే ఒక లఘు గ్రంథాన్ని (మోనోగ్రాఫ్) రచిస్తే దాన్ని తెలుగు ఎకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం తరపున ముద్రించింది. ఆనాడు వారి పరిధికనువుగా ముద్రణలో 110 పుటలున్న ఈ పుస్తకం విశేష విషయ భరితం.

గ్రంథారంభ 'ప్రవేశిక'లో వీరు ఆనాడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు వివిధ ప్రాంతాల తెలుగును గూర్చి చెప్పిన అమూల్య విషయాన్ని

తెల్పటం బహుధా ప్రశంసనీయం. తెనుగు భాష చక్రవర్తుల రాజ్యాంగాలను నడిపించింది కాని ఏ ఒక్కరికీ పరాన్నభుక్కు కాలేదనే విషయాన్ని నొక్కి వక్కాణించినారు. మొత్తం 5 అధ్యాయాలున్న ఈ చిన్నపుస్తకం భాషను గూర్చి శాస్త్రీయమైన మౌలిక విషయాలను పాఠకులైన వారికి పరిచయం చేస్తుంది. తరువాత మాండలికాల గూర్చి పరిశోధనా రీతిలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ, తెలుగు ఎకాడమీ వారు చేసిన కృషిని తెలిపి, అనంతర కాలంలో కేవలం మాండలికాలను గూర్చి పరిశోధన చేసిన వివిధ విశ్వవిద్యాలయాల వారి జాబితానీయటం, తర్వాత తెలుగు భాష సమగ్ర స్వరూప నిరూపణ కొరకు మాండలికం అనేది ఎట్లా దోహదం చేస్తుందో – సంక్షేపంగా వివరించిన వీరి పరిశోధనాత్మక కృషి కొండ యద్దమందు కొంచమై యున్నట్లున్నదీ లఘు రచన.

లేఖనం ప్రాచీనత మొదట్లో ఎట్లున్నది, అనంతర పరిణామం, తాటాకు (వీరు తాటేకు అన్నారు) వ్రాతలు మొదలైన వాటిని గూర్చి ఇంతకు ముందు పెద్దలు తెల్పిందేయైనా వీరి వివరణ నూతన రీతిలో సాగింది. మాండలికాన్ని గూర్చి తెల్పుతూ భాషా వ్యవహారంలోని వైవిధ్యం మాండలికత అని తెల్పి, మండల, మాండలిక, మాండలికత పదాల అర్థభేదలను వివరించినారు. (ఈ మాండలికాన్నే మన గిడుగు వారు మాండలీయకం అన్నారట). మాండలిక పదాలు ఎక్కడివక్కడే వాడుకలో వుంటాయి. కొన్ని ఇతర ప్రాంతాల వారికి అర్థం కావు. మూర్తిగారు వివిధ ప్రాంతాలలో సేకరించిన వివిధ పదాలను ఒక్కోవైపు ఎట్లా వాడుతారో అనేది ఒక జాబితా యిచ్చినారు. దీనిలో వ్యవసాయం, కూరగాయలు, కొన్ని వాడుక పదాలున్నాయి. ఇంగ్లీషు, ఉర్దూ భాషల ప్రభావం వలన తెలుగు ఎట్లా విలీనమయిందో వివరించిన పదాలు వింతగా వున్నాయి. అట్లే మనం నిత్యం వ్యవహరించే పదం 'అన్నం'. ఇది సంస్కృతం. దీని తెలుగు **'కూడు, తిండి, బువ్వ'** మొదలైనవి. ఐనా **'అన్నం'** మనలో జీర్ణమై మిగిలిన పదాలను దూరంగా వుంచుతున్నదంటారు. **రావటం లేదు - వస్తలేదు, రావట్లేదు, రాదు** అని ఒకే అర్థం వచ్చే వివిధ రూపాలను తెల్పినారు. ఇంకా **'రుణం'** పదం. ఇది **'ఋణం'** సంస్కృతం. దీన్నే ఔత్తరాహులు **'రిణం'** అంటారు. **క్రిష్ణ – కిషన్** వలె ఋషి పదం కూడా ఇట్లే మార్పు చెందింది అంటారు – అజాదిగా మాట్లాడే **'ఎక్కడ', ఉడుత'**ల వివరణ **అచ్చు లులూ** లు, అనుస్వార ఉచ్చారణకు అరసున్న పెట్టడం, **'మామ'**ను **'మావఁ'** అనేటప్పుడు. ఇక్కడ 'మ'కారాన్ని మనం ముక్కుతో అనుస్వార ధ్వని 'వ'ను అరసున్న కలిపియే పలుకటం ఆనవాయితీ అయింది.

భాషలో పద పరిపూర్తి క్రమభంగం కాకూడదు. ఉదా. **'తెలుగు'** పదం. దీన్ని **గు-లు-తె** అన్నా **లు-గు-తె** అన్నా అర్థమే లేదు గదా! అందుకే చిన్న పదమైనా స్పష్టమైన ఉచ్చారణ అవసరం గదా! వ్యవహారంలో **చాప, చేప** వున్నాయి. **పలుకు**లో తేడా అనిపించక పోయినా ఈ రెండూ భిన్నార్థ పదాలు. అందుకే భాషోచ్చారణ విషయంలో జాగ్రత్త అవసరం అని సూచిస్తున్నారు. ఇట్లా ఇది లఘుకృతియైనా విశేష విషయాన్వితం, ఒక ప్రకరణమంతా – వివిధ జిల్లాల్లో వివిధ వృత్తుల వారితో ఇంటర్వ్యూ చేసి వారి ఉచ్చారణ మాండలికాలను రికార్డు చేయటం ఒక రికార్డే.

శ్రీ దక్షిణామూర్తిగారు పరిశోధనాధ్వనీనులై వివిధ మార్గాల్లో పయనించిన ఫలం. ఈ గ్రంథం ప్రతి ప్రకరణంలోను తెలుస్తున్నది. ఇప్పటి పరిశోధకులు – తెలుగు ఎకాడమీ వంటి సంస్థలు – వారు సూచించిన పద, మాండలిక కోశాల నిర్మాణరీతులను గ్రహించటం చాలా మంచిది. వారు వివిధ రీతుల గ్రంథరచన చేసినప్పటికీ, ఏ పుస్తకానికి ఆ పుస్తకమే ప్రత్యేకం. దానిలో ఈ **'తెలుగు మాండలికాలు'** చేరుతుంది.

**ఇతరులు ఎలా ఉండాలని మీరు అనుకొంటారో దానికి మీరొక దృష్టాంతంగా నిలవండి. నిబ్బరం పోగొట్టుకోడానికి మీరు మొగ్గు చూపి ఎదురుదాడికి దిగుతున్నట్లయితే లేదా కటువుగా మాట్లాడుతున్నట్లయితే; పిల్లలను మీరు నిష్కారణంగా తిడుతున్నట్లయితే; మీరు బెదురుకొని, కలవరపడుతూ, అరుస్తూ, నిర్దయగా మాట్లాడుతున్నట్లయితే – మిమ్మల్ని మీరు మార్చుకోండి! మీ చుట్టూ ఉన్నవాళ్ళను మార్చడానికి అదే ఉత్తమ పద్ధతి. అది చెయ్యడం కష్టమే కాని చెయ్యగలుగుతాం. తనను తాను, గౌరవం పొందే వ్యక్తిగా, ఆదర్శప్రాయుడిగాను, మాటకు విలువ ఉన్న వ్యక్తిగాను తయారు చేసుకోడానికే ప్రతి ఒక్కరూ కృషిచెయ్యాలి. అతను నిజమయిన వివేకంతోనూ, అవగాహన తోనూ మాట్లాడాలే తప్ప కోపంతో, బెదురుతో, అసూయతో లేదా తనను నొప్పించినప్పుడు ఎదురు దెబ్బ తియ్యాలన్న కోరికతో ఎన్నడూ మాట్లాడకూడదు.**

**(శ్రీశ్రీ దయామాత)**

# పోరంకి దక్షిణామూర్తి - విద్యాసంబంధ రచనలు

**డా. వి. జయ ప్రకాశ్,** ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఫోన్ : 955000 2354

తెలుగు సాహిత్య చరిత్రలో రచయితగా, వ్యాసకర్తగా, అనువాదకుడిగా విశిష్టస్థానాన్ని పొందిన డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి పాఠ్యపుస్తక రచయితగా కూడా కీలకమైన పాత్రను నిర్వహించారు. తెలుగు అకాడమీ కోర్సులకు సంబంధించిన **'తెలుగు ఉన్నతవాచకం',** ఆరో తరగతి తెలుగు పాఠ్య పుస్తకం **'తెలుగు వాచకం'**, అనియత విద్య స్టేజ్ – 2 పాఠ్య పుస్తకం **'చదువుకుందాం పదండి'** అనే విద్యాసంబంధమైన మూడు పాఠ్య పుస్తకాలను డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి రచించారు. వాటి గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

**1. తెలుగు ఉన్నత వాచకం (తెలుగు అడ్వాన్స్‌డ్ రీడర్)**

తెలుగు భాష రాని ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ రకాల కోర్సుల ద్వారా తరగతులు నిర్వహించి తెలుగు భాషను నేర్పించడం తెలుగు అకాడమీ విధుల్లో ఒకటి. ఈ కార్యకలాపాల్లో భాగంగా **"పరిచయ కోర్సు", "ఉన్నత కోర్సు"** లను అకాడమీ నిర్వహించేది. ఒక్కొక్క కోర్సు కాలవ్యవధి నాలుగు నెలలు (48 పిరియడ్లు). పరిచయ కోర్సులో ఉత్తీర్ణులయినవారు లేదా ఆ కోర్సుతో సమానమైన భాషా పరిజ్ఞానం కలవారు ఉన్నత కోర్సులో చేరవచ్చు. ఆ ఉన్నత కోర్సు కోసం 16 పాఠాలతో ఒక వాచకాన్ని రూపొందించారు పోరంకి దక్షిణామూర్తి. ఆయన అప్పటికే తెలుగు అకాడమీలో పరిశోధనాధికారిగా పనిచేస్తున్నారు. తెలుగు అకాడమీ **'తెలుగు ఉన్నత వాచకం'** 1986లో తొలిసారి, 1989లో రెండోసారి ముద్రించింది.

ఈ వాచకం తెలుగురాని, తెలుగేతరులైన అధికారులకు భాషను నేర్పించేందుకు ఉద్దేశించినది. పాఠ్య పుస్తక లక్ష్యానికి అనుగుణంగా పాఠాలు కూర్చారు. తెలుగు భాషా నిర్మాణాన్ని, ఆధునిక తెలుగు లేఖన రూపాలను పరిచయం చేయడం, నేర్పడం ప్రధానంగా కనిపిస్తుంది. వీటితోపాటు తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలు, ఆచార్య వ్యవహారాలు, పత్రవ్యవహారాలు, ప్రభుత్వ పాలనా భాష వంటి అంశాలకు సంబంధించిన పాఠాలు చేర్చారు.

గ్రామ వర్ణనను పరిచయం చేస్తూ **"కొత్త ఊరు",** యాత్రా స్థలం **"శ్రీశైలం",** వినాయక చవితి పండగ, తెలుగు సామెతలు, ఆధునిక కవితలో భాగంగా సి.నారాయణరెడ్డి **'మార్పు నా తీర్పు'**, పత్రికలకు సంబంధించి **'పాఠకుల ఉత్తరాలు, సురవరం ప్రతాపరెడ్డి, ఉస్తాద్ అల్లా ఉద్దీన్ ఖాన్ జీవిత చరిత్రలు'** వీటితోపాటు.. అధికార భాషా సంబంధమైన లేఖలో భాగంగా **'దరఖాస్తు, కార్యాలయ లేఖ, అధికార భాష, వీలునామా, టెండర్ నోటీసు, ప్రాచీన కావ్యశైలిని పరిచయం చేస్తూ సుమతి, వేమన పద్యాలు'** పాఠ్యాంశాలుగా ఉన్నాయి. సుమారు 2500 పదాలతో తెలుగు – ఇంగ్లీషు పదకోశాన్ని అనుబంధంగా అందించారు. ఇలా అధికారుల దైనందిన జీవితంలో ఉపయోగపడే అంశాలతోపాటు తెలుగువారి సంస్కృతిని, సాహిత్యాన్ని పరిచయం చేసేలా పాఠ్యంశాలు రూపొందించారు.

ప్రతి పాఠంలో ముఖ్యాంశాలపేరుతో భాషాంశాలను గురించి ప్రత్యేకంగా చర్చించారు. వాటితోపాటు ప్రతి పాఠంలో నాలుగైదు అభ్యాసాలు ఇచ్చారు. దీంట్లో పాఠ్యాంశాలతో పాటు అభ్యాసాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. తెలుగు భాష నిర్మాణ పద్ధతుల గురించి ప్రత్యేకంగా ప్రతి పాఠంలో అభ్యాసాలు కూర్చారు.




- సంభాషణలో పదాలు మారే తీరును.. మీంచి – మీదినుంచి – మీది వైపు నుంచి
- 'అయినప్పటికీ' అనే పదబంధంలోని 'అప్పటికీ' అనే రూపాన్ని చేర్చి కొత్త పదబంధాలను సృష్టించవచ్చు.

  చెప్పిన + అప్పటికీ = చెప్పినప్పటికీ,
  ఉన్న + అప్పటికీ = ఉన్నప్పటికీ
- నామవాచకాలకు కొన్ని సహాయక క్రియలు చేర్చి క్రియా రూపాలు వాడతారు.

  అభిషేకం – చేయు, దర్శనం – చేసుకొను
- చిలుకలు – చిలుకలను : చిలుకల్ను, చిలకల్ని – రూపాలు ఏర్పడే విధానాన్ని కూలంకషంగా చర్చించారు.
- పిల్లలు – పిల్లలను : పిల్లల్ను – పిల్లల్ని వంటి రూపాల్ని పరిచయం చేశారు.

– పంపండి – పంపవలసిందిగా, రాయండి – రాయవలసిందిగా వంటి పద ప్రయోగాలు చర్చించారు. ఈ విధంగా భాషాంశాలలో లోతైన జ్ఞానాన్ని పొందేలా అభ్యాసాలు కూర్చారు.

ఇంకా.... దస్తావేజుల రచన, సంభాషణ – లక్షణాలు, రచన, లేఖా లక్షణాల గురించి సవివరంగా చర్చిస్తూ పరిచయం చేశారు. ఇలాంటి పాలనపరమైన భాషాంశాలతోపాటు.. కీర్తిశేషులయ్యారు, తోకముడుచుకొను, నీ వేషాలు నా దగ్గర సాగవు, పంచేంద్రియాలు, మాండలిక భేదాలు, ప్రమాణభాష వంటి జాతీయాలకు, పదబంధాలకు వివరణ అందించారు. తెలుగు వారి కాలాలు.. ఎండాకాలం, వానాకాలం, శీతాకాలం.. రుతువులు, నెలలు. పరిచయం చేశారు.

ఈ పుస్తకం విద్యార్థులు సొంతంగా చదువుకునేది కాదు. తప్పనిసరిగా ఉపాధ్యాయుల సహకారంతో చదువుకోవాలి. అందుకే ప్రతిపాఠం చివర, ఆ పాఠానికి సంబంధించి ఉపాధ్యాయులు విధిగా చేయాల్సిన అంశాలను తెలుపుతూ సూచనలు సవివరంగా అందించారు. అన్ని పాఠాలకు ఒకే రకమైన సూచనలు కాకుండా ప్రతి పాఠానికి ప్రత్యేకంగా సూచనలు అందజేశారు. వేమన పద్యాలకు సంబంధించిన పాఠానికి ఇచ్చిన **'అధ్యాపకులకు సూచనలు'** చూస్తే ఎంత ముందుచూపుతో, జాగ్రత్తగా సూచనలు చేశారో తెలుస్తుంది. ***'వేమన కాలంలో సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢవిశ్వాసాలు, మోసాలు, మాయలు విద్యార్థులకు చెప్పి, వాటిని వేమన విమర్శించిన తీరు వివరించండి. ఆయన రాసిన పద్యాలను బట్టి సంఘ విమర్శకుడిగా, యోగిగా, లోక హితాభిలాషిగా వేమన వ్యక్తిత్వం ఎంత గొప్పదో వాళ్ళకు తెలపాలి. వేమన పద్యాలుగా ప్రచారంలో ఉన్నవన్నీ ఆయన స్వయంగా చెప్పిన పద్యాలని చెప్పలేమని, ఇటీవలి కవులు కూడా కొందరు (ఉదా: దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు) వేమన పేరుమీదుగానే కొన్ని పద్యాలు చెప్పారని సూచించాలి. వేమన పద్యాలను సేకరించి సిపి బ్రౌన్ ఇంగ్లీషులోకి అనువదించాడు. ఆ పద్యాలు చదువమని విద్యార్థులను ప్రోత్సహించాలి. వాడుక భాషకూ ప్రాచీన కావ్యభాషకూ ఉన్న తేడాలు ఈ పాఠంలో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. వెనకటి పాఠంలో చెప్పినవి చాలు.'***

తెలుగేతర ప్రభుత్వోద్యోగులకు తెలుగుభాషను, తెలుగు సంస్కృతిని, పాలనా వ్యవహారాలను పరిచయం చేసేదిగా వాచకాన్ని రూపొందించారు. పాఠాల అమరికలోనూ, పరిచయం చేయడంలోనూ ఆలోచనాత్మకంగా, వ్యవహరించినట్లు అర్థమవుతుంది.

**2. తెలుగు వాచకం – ఆరో తరగతి**

అప్పటి వరకు పాఠ్యపుస్తకాల్లో భాష వ్యవహార భాషకు భిన్నంగా ఉండేది. దీనివల్ల దైనందిన భాషకు, పాఠ్యపుస్తకాల భాషకు వ్యత్యాసం బాగా పెరుగుతూ వచ్చింది. దాంతో విద్యార్థులు అటు పాఠ్యపుస్తక భాషపై, ఇటు వ్యవహారిక భాషపై పట్టును సాధించలేక పోయారు. పాఠ్యపుస్తకభాషలో తమ భావాలు వ్యక్తం చేయలేక పోయేవారు. చివరికి ప్రభుత్వం చొరవ తీసుకొని వాడుకభాషలో పాఠ్యపుస్తకాలు ప్రచురించడానికి నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 1983లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు భాష పాఠ్య ప్రణాళికను రూపొందించింది. దాన్ని అనుసరించి ఆరో తరగతి తెలుగు వాచకాన్ని రూపొందించారు పోరంకి దక్షిణామూర్తి. ఆ పాఠ్య పుస్తకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణగా 1985లో తొలి ముద్రణ పొందింది.

పాఠ్యపుస్తక చరిత్రలో వ్యవహారిక భాషలో పాఠ్యపుస్తకాలు రూపొందించాలని నిర్ణయించడం కీలక పరిణామం. ఆ దిశలో మొదటిసారి పాఠ్యపుస్తకాన్ని రూపొందించడం చాలా క్లిష్టతో కూడుకున్న అంశం. అయినప్పటికీ ఆ క్లిష్టతను విజయవంతంగా అధిగమించారు దక్షిణామూర్తి. ఆయన సాహితీవేత్త, భాషాశాస్త్ర రంగంలో విశేష అనుభవం కూడా ఉండటంతో పాఠ్యాంశాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఆరో తరగతి విద్యార్థుల స్థాయిని అనుసరించి అన్ని పాఠాల్లో చిన్నచిన్న వాక్యాలే ఎక్కువగా కనిపిస్తాయి. దాంతో విద్యార్థులు సొంతంగా వాక్యనిర్మాణ పద్ధతులు నేర్చుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పాఠ్యపుస్తకాలు వ్యవహారిక భాషలో ఉన్నాయి కాబట్టి అన్ని ప్రాంతాలవారికీ సుబోధకంగా ఉండేలా పాఠాలు ఉన్నాయి. అక్కడక్కడా మాండలిక పదాల వస్తే అవి అందరికీ అర్థమయ్యేలా వివరణ అందించారు.

ఇందులో మొత్తం 15 పాఠాలున్నాయి. డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి **'తెలుగు జాతి మనది'** గేయం ప్రాంతీయ ఐక్యమత్యాన్ని పెంపొందిస్తుంది. **'పట్టుదల ఉంటే కానిది లేదు'** పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలుపుతుంది.

**'బాలవీరులు'** సాహస బాలల గురించి తెలియజేస్తుంది. శ్రీ వసంతరావు వేంకటరావు రచించిన **'నిజమా?కలా?'**

సైన్స్‌పై అవగాహన కలిగిస్తుంది. పంచతంత్రం కథ **'హాయిగా ఉండాలంటే'** స్నేహం విలువను తెలుపుతుంది. **"ఇంకొంచెం ముందుకు వెళ్లు"** ప్రకృతిపై అవగాహన కలిగించేలా, తార్కికబుద్ధి అలవరిచేలా పట్టుదలతో ఉత్సాహంగా పనిచేస్తే కలిగే ప్రయోజనాలను తెలియజేస్తుంది. హరి ఆదిశేషువు రచించిన **"తెలుగుదేశమిది చూడర బాబూ"** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని చారిత్రక ప్రదేశాలు, కట్టడాలు, ప్రాజెక్టులను, పుణ్యక్షేత్రాలను పరిచయం చేస్తుంది. కోడి రామమూర్తి రచించిన **'ఇనుప కండలూ ఉక్కు నరాలూ'** శారీరక దారుఢ్య ప్రాధాన్యాన్ని గురించి తెలుపుతుంది.

ఇంకా అన్ని మతాలు ఒక్కటేనని తెలిపే **'అంతా ఒక్కటే'**, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించే బోయిభీమన్న రచించిన **'కొత్తదారి'**, లలిత కళలపై అభిరుచిని పెంపొందించే **'అందంలో ఆనందం'**, ప్రకృతి అందాలను పరిచయం

చేసే కవికొండల వెంకటరావు రచన **'గడ్డిపూలు'**, భారతీయ సంగీత ప్రపంచంలో ధ్రువతారగా వెలిగిన ఉస్తాద్ అల్లాఉద్దీన్ ఖాన్ జీవితచ చరిత్ర, **'ఆటవిడుపు పద్యాలు'** పేరుతో సుమతి, వేమన శతక పద్యాల పరిచయం చేశారు.

పాఠాలన్నీ వ్యవహారిక భాషలో, సులభశైలిలో సాగాయి. అభ్యాసాలకు సంబంధించి ప్రశ్నలు మాత్రమే కనిపిస్తాయి. విద్యార్థులకు బోధించాల్సిన వ్యాకరణాంశాలు, కవి పరిచయాలు, ఇతర విషయాలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. రచయిత సూచనల ఆధారంగా ఉపాధ్యాయుడు ఆయా అంశాలను విద్యార్థులకు బోధించాలి. ఈ విధానంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకంగా కనిపిస్తుంది.

**3. అనియత విద్య "చదువుకుందాం పదండి" స్టేజ్ – 2**

చాలా మంది విద్యార్థులు అనేక కారణాలవల్ల పాఠశాల విద్యకు దూరమవుతున్నారు. అలాంటి వారికి అనియత విద్య ద్వారా చదువుకునే అవకాశం కలిగించింది ప్రభుత్వం. అనియత విద్యకోసం ప్రత్యేకంగా పాఠ్యపుస్తకాలు రూపొందించారు. ఇందులో అనియత విద్య స్టేజ్ – 2 **"చదువుకుందాం పదండి"** అనే పాఠ్యపుస్తకాన్ని హరి ఆదిశేషువుతో కలిసి రచించారు పోరంకి దక్షిణామూర్తి. ఆ పుస్తకాన్ని రాష్ట్ర విద్యా శిక్షణా పరిశోధనా సంస్థ 1983లో (ప్రథమ ముద్రణ) ప్రచురించింది.

ఇందులో 14 పాఠాలు ఉన్నాయి. కథలు, గేయాలు, సంభాషణ, పద్యాలు, వ్యాసాలు వంటి విభిన్న పాఠాలతో పాఠ్యపుస్తకం రూపొందించారు. పాఠాలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఈ పాఠ్యపుస్తకం అనియత విద్య కోసం ఉద్దేశించినది కాబట్టి భాష చాలా సరళంగా ఉంది. మొదటిపాఠమే **"చెప్పుకోండి చూద్దాం"** అంటూ పిల్లలకు పాఠ్యపుస్తకంపై ఆసక్తి కలిగించేదిగా ఉంది. **'తోకలేని పిట్ట'** పాఠంలో లేఖా రచనా పద్ధతులను గేయం రూపంలో వివరించారు. **"ఓ మేన బావ / రాత్రిబడిలో నేను / చదువుకుంటున్నాను / మొదటి పుస్తకమయితే / మొత్తంగా చదివాను / ఇప్పుడిక రెండోది / మొదలు పెట్టాను / చకచకా నా చదువు / సాగిపోతూ ఉంది / నువ్వు చూశావంటే / వింతపడిపోతావు.."** అంటూ గోపన్న రాసిన ఉత్తరం గురించి తన మేనబావ వాళ్ళ అమ్మకు చెప్తూ.. **"గోపన్న రాశాడు / చదవవే అమ్మ / బండ మొద్దబ్బాయి / గోపన్న ఇప్పుడు / రాత్రి బడికిపోయి / చదువుతున్నాడంట / సెలవులకు రమ్మంటు / జాబు రాశాడు"** ఇలా సాగుతుంది గేయం.

ఈ విధంగా పాఠ్యపుస్తకంలోని అన్ని పాఠాలు విజ్ఞానదాయకంగా, సరళమైన భాషలో విద్యార్థులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

**పాఠ్యపుస్తకాల్లో పోరంకి ముద్ర:**

పాఠ్య పుస్తక రచనకు సంబంధించి సంపాదక మండలి, అధికారగణం ముందుగా ఒక చట్రాన్ని రూపొందిస్తారు. రచయితలు ఎవరైనా ఆ చట్రానికి లోబడే రచనలు చేయాలి. ఒక రకంగా చూస్తే రచయితకు అసలు స్వేచ్ఛ ఉండదు. కానీ ఈ మూడు పాఠ్యపుస్తకాలు పరిశీలించినప్పుడు, పోరంకి దక్షిణామూర్తి ఆ చట్రంలో కూడా పూర్తి స్వేచ్ఛతో రచనలు చేసినట్టు కనిపిస్తుంది. తన రాసిన పాఠ్యపుస్తకాల్లో ఇతర కవులు రాసిన పాఠాలు చాలా తక్కువగా ఉన్నాయి. సింహభాగం రచయిత రాసిన పాఠాలే కనిపిస్తాయి.

పోరంకి దక్షిణామూర్తి స్వయంగా చేయితిరిగిన రచయిత. అపరిమతమైన భాషా జ్ఞానం సొంతంచేసుకున్నవాడు. అందుకే పాఠ్యాంశాల రచనలో ఈ ప్రభావం కనిపిస్తుంది. ప్రతి పాఠంలో సరళమైన భాషతోపాటు పాఠ్యాంశాలలకు తనదైన నూతన భావాలు జోడిస్తాడు.

తెలుగు ఉన్నతవాచకం **'బ్యాంకులో'** అనే పాఠంలో పోరంకిలోని ఆధునిక భావాలు కనిపిస్తాయి. అందులో మగవాళ్ళతో సంబంధం లేకుండా ఆడవాళ్ళకు ప్రత్యేకంగా బ్యాంకు అకౌంట్ ఉంటే బావుంటుందని బ్యాంకు మేనేజర్ అంటాడు. నేడు చాలా బ్యాంకులు మహిళలకు ప్రత్యేకంగా అకౌంట్ ఆఫర్ చేస్తున్న సందర్భాన్ని మనం చూస్తున్నాం. ఒక పోరంకి ఒక రచయితగా భవిష్యద్దర్శనం చేయగలిగాడు అనిపిస్తుంది. అలాగే తెలుగు ప్రాంతాల పరిచయం, వైజ్ఞానిక దృష్టి, సాహస వీరుల పరిచయం, ఆటవిడుపు పద్యాలు.. ఇలా కొన్ని పాఠ్యాంశాలు మూడు పుస్తకాల్లో కూడా కనిపిస్తాయి. అన్ని పుస్తకాల్లో ఒకే రకమైన పాఠ్యాంశాలు చోటుచేసుకోవడం వెనక రచయిత దృక్పథం ప్రస్ఫుటమవుతుంది.

బోధనాభ్యసన ప్రక్రియలో కీలకమైనవాడు ఉపాధ్యాయుడు. పాఠ్యపుస్తకానికి, విద్యార్థులకు మధ్య జ్ఞానవారథిగా నిలబడతాడు. నేడు ఉపాధ్యాయుడి స్థానం కేవలం ఫెసిలిటేటర్ స్థాయికి పరిమితమయింది. విద్యార్థుల స్వీయ అభ్యసనానికి ప్రాధాన్యం పెరిగింది. పోరంకి రాసిన పాఠ్యపుస్తకాల్లో ఉపాధ్యాయుడి పాత్ర కీలకంగా కనిపిస్తుంది. పాఠ్యాంశం ద్వారా బోధించాల్సిన అదనపు అంశాల గురించి **'ఉపాధ్యాయుడికి సూచనలు'** ద్వారా తెలియజేశారు. ఆ సూచనలను అనుసరించి ఉపాధ్యాయుడు తాను జ్ఞానాన్ని సముపార్జించుకోవడంతోపాటు, తన శక్తిమేరకు విద్యార్థులకు ఆ జ్ఞానాన్ని పంచే అవకాశం ఉంటుంది.

ప్రతి పాఠ్యపుస్తకంలో, ప్రతిపాఠంలో ఆధునిక భావాలు, భాషా సరళత, ప్రతి వాక్య నిర్మాణంలో జాగురూకత, విద్యార్థులకు ఏదో కొత్తది, అవసరమైంది చెప్పాలని, వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలనే తాపత్రయం కళ్లకు కదుతుంది. పోరంకి దక్షిణామూర్తి సాహితీవేత్తగా ఎంత ప్రఖ్యాతి పొందారో పాఠ్యపుస్తక రచయితగా కూడా అంతే ఆదరణీయుడు.

# మన వాయుసేన

**కాశీ భార్గవ శర్మ,** Ex IAF, Seargent ఫోన్ : 9652 90 86 55




**లెఫ్టినెంట్ కల్నల్ సి.ఎల్. ప్రౌడ్‌ఫుట్** 1976లో రచించిన **"మన వాయుసేన"** అనే పుస్తకాన్ని శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారు తనదైన రచనాశైలిలో తెలుగులోకి అనువదించారు. ఆయన అనువాదం సరళి నచ్చి, మెచ్చి నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియావారు దాని ప్రచురణకు పూనుకోవడం, తెలుగువారమైన మనము చాలా గర్వించదగ్గ విషయము.

శ్రీ దక్షిణామూర్తిగారి అనువాదం చాలా సరళమైన భాషలో అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో ఉంది. ఓ చిన్నపాటి నవల మాదిరిగా, దృశ్యం కనులకు కట్టినట్లు చాలా బాగా వ్రాసారు.

1965లో **"భారతీయ వాయుసేన"** పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వేసిన ఎత్తుగడలు, వాడిన యుద్ధవిమానాలు, అప్పటి పైలట్లు చూపించిన ధైర్య సాహసాల గురించి, దేశ సరిహద్దుల్ని మన సైన్యం ఎంత ఓర్పుతో, ఎన్ని కష్టాలను ఎదుర్కొంటూ కాపాడుతూ వస్తున్నదో, అందుకు మన భారతీయ వాయుసేన సైన్యానికి ఏవిధంగా సహాయకారిగా ఉ ంటుందో పూసగుచ్చినట్లు వ్రాసారు.

శ్రీ దక్షిణామూర్తిగారు ఆరోజుల్లో వాయుసేనలో ఉపయోగించిన యుద్ధ విమానాల గురించి ప్రస్తావిస్తూ, ఆరోజుల్లో టెక్నాలజీ అంతంత మాత్రమే. కాబట్టి పైలట్స్ మాన్యుయల్ ఆపరేషన్స్ పైననే ఆధారపడి విమానాల్ని నడిపేవారు. ఇప్పుడున్నట్టు బటన్ నొక్కితే సెకండ్స్‌లో బాంబ్ గాని, రాకెట్ గాని శత్రుస్థావరాలను నేలమట్టం చేయగల సత్తా ఉన్న టెక్నాలజీ అప్పట్లో లేదు. అయినా కాని మన వాయుసేన పైలట్స్‌కి ఉన్న ధైర్య సాహసాలు చాలా గొప్పవని, నాట్ (Gnat) లాంటి చిన్న విమానాలతో స్క్వాడ్రన్ లీడర్ ట్రెవార్‌కీలర్ వంటి కమాండర్ నాయత్వంలో గగనతలంతో మన **"భారతీయ వాయుసేన"** అందుకున్న విజయాలను గురించి చాలా గర్వంగా వ్రాసారు దక్షిణామూర్తిగారు.

మొదటి ప్రపంచ యుద్ధ సమయం నాటికి, యుద్ధ విమానాలు సైజులో చిన్నవి, ఫ్యూయల్ కెపాసిటీ తక్కువ. బాంబులను, రాకెట్లను మోసే లోడ్ కెపాసిటీ కూడా చాలా తక్కువగానే ఉండేవి. ఈ రకంగా మూర్తిగారు అప్పటి యుద్ధవిమానాల గురించి మనకు ఒక అవగాహన వచ్చేవిధంగా వివరించారు. ఆవిధంగా మరో మెట్టు ఎక్కుతూ, రెండో ప్రపంచ యుద్ధంనాటికి యుద్ధ విమానం అనేది ఒక శక్తివంతమైన యంత్రంగా ఎలా మారిందో, వాటిలో వివిధ రకాలైన ఫైటర్స్, బాంబర్స్, ఎయిర్‌క్రాఫ్ట్, అవి క్యారీ చేసే మిస్సైల్స్, కేసెస్ గైడెడ్, హీట్ సీకింగ్ మిస్సైల్స్‌లాంటి వాటి గురించి కూడా ప్రస్తావించారు.

**"భారతీయ వాయుసేన"** అక్టోబర్ 18, 1932న ఏర్పడింది. బ్రిటిష్‌వారు పరిపాలించిన 200 సం॥ల కాలంలో భారతీయ సైనికులతో చక్కటి సైన్యాన్ని తయారు చేసారు అని శ్రీ దక్షిణామూర్తి గారు వ్రాశారు. అది ముమ్మాటికీ నిజం. ఆ 200 సం॥ల పాలనలో వాళ్ళు ప్రవేశపెట్టిన ఎన్నో మిలటరీ రూల్స్ & రెగ్యులేషన్స్ ఇప్పటికీ మన సైన్యంలో ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి.

1939లో ప్రపంచ యుద్ధం తరువాత, భారతీయ వాయుసేన గొప్పగా పనిచేసినందుకుగాను ఎన్నో సేవా పతకాలు, క్రాస్‌లు మరియు యుద్ధంలో గెలుపొందడానికి వాళ్ళు చేసిన సేవకుగాను గౌరవ చిహ్నంగా భారతీయ వాయుసేనకు 'రాయల్' అనే పదం చేర్చి **"రాయల్ ఇండియన్ ఫోర్స్"** అని పేరు పెట్టారు. అది చాలా గర్వించదగ్గ విషయంగా దక్షిణామూర్తిగారు వివరించారు.

భారతీయ వాయుసేన గొప్పతనాన్ని తెలియజేసే మరో అద్భుత ఘట్టం శ్రీ దక్షిణామూర్తిగారు చెప్పిన లేహ్, లద్దాక్ లో వాయుసేన చేసిన ఫ్లయింగ్ ఆపరేషన్స్. లేహ్ అక్కడి ప్రధాన నగరం, జమ్ము& కశ్మీర్ రాష్ట్రంలో అన్నింటికంటే విశాలమైన ప్రాంతం లద్దాక్. లేహ్

నగరం సముద్రమట్టానికి దాదాపు 11000 అడుగుల ఎత్తున ఉంది. ఈ పట్టణాన్ని రక్షించడానికి మన సైన్యాలు అహర్నిశలు శ్రమిస్తున్నాయి. అప్పట్లో సైనికులకు కావలసిన ఆయుధ సామగ్రి, ఆహారం వగైరాలు చేర్చడానికి సరైన మార్గం వుండేది కాదు. రోడ్డు ద్వారా యితే ఎన్నో రోజులు పట్టేదట. ఆ సమయంలో వాయుసేనకు చెందిన పైలట్ మహేందర్ బాబా ధైర్యం చేసి అంత ఎత్తైన ప్రదేశంలో అప్పటి **"డకోటా ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్"**ను దింపడానికి ముందుకు వచ్చాడట. అతను చేసిన సాహసాన్ని, సప్లయిలను అందచేసిన విధానాన్ని, గాయపడిన సైనికులను తిరిగి తీసుకొచ్చిన విధానాన్ని ఒక సినిమా ఫక్కీలో శ్రీ దక్షిణామూర్తిగారు వివరించడం ఒక అద్భుతం.

1962 అక్టోబర్‌లో చైనా సైన్యం, ఈశాన్య సరిహద్దు ఏజెన్సీ 'నీఫా' ప్రాంతంలో ఉన్న భూభాగంపై హఠాత్తుగా దాడి చేసిన విధానాన్ని, అప్పుడు అక్కడ గాయపడిన సైనికులను, సివిలియన్స్‌ను **'భారతీయ వాయుసేన'** హెలికాప్టర్ స్క్వాడ్రన్ ఎంత కష్టపడి, ఎంతో చాకచక్యంతో గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించిందో, ఆహార పదార్థాలను, ఆయుధాలను జారవిడిచిన విధానాన్ని కన్నులకు కట్టినట్టుగా వ్రాసారు దక్షిణామూర్తిగారు.

**'భారతీయ వాయుసేన'** ప్రపంచంలోని ప్రముఖ దేశాలతో పోటీపడుతూ, తన యుద్ధ నైపుణ్యాన్నీ, సాంకేతికతను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఉంటుంది. "The more you sweat in peace less you bleed in war" అనేది యూనిఫాం వేసుకున్న ప్రతి ఒక్క సైనికుడిని ప్రభావితం చేసే వాక్యం అని చెపితే, మనదేశంలో సైన్యం ఒక్క యుద్ధం సమయంలోనేకాకుండా శాంతిసమయంలో కూడా చాలా కష్టపడుతూ ఎన్నోరకాల తర్ఫీదులు (Technical trainings) పొందుతుంటారు. భారతీయ వాయుసేనకి సంబంధించి పైలట్లు హైదరాబాదులోని **'దుండిగల ఎయిర్‌ఫోర్స్ అకాడమీ'**లో శిక్షణ పొందుతారు. అక్కడ శిక్షణలో భాగంగా యుద్ధంలో గెలుపు అనేది అదృష్టం వల్ల వచ్చేది కాదు, దానికోసం ఎడతెరపి లేకుండా శ్రమించాల్సి వస్తుందని తెలుపుతూ, యుద్ధమేఘాలు కమ్ముకుంటే ఎలా ఉంటుందో, అలాంటి పరిస్థితులను PAD (Passive Air Diffence) ద్వారా ప్రతి ఒక్క సైనికుడికి అవగాహన వచ్చేలాగా తర్ఫీదు ఇస్తారు అని వ్రాసారు. అది ఈనాటికి చాలా కఠినంగా అమలు చేస్తున్నారు మన ఆర్మ్‌డ్ ఫోర్స్‌లో.

**'భారతీయ వాయుసేన'**లోని పలురకాల యుద్ధ విమానాల గురించి ప్రస్తావిస్తూ, మొదటి ప్రపంచ యుద్ధం నుండి రెండవ ప్రపంచ యుద్ధం వరకు విమానాల తయారీలలో, సాంకేతికతలో ఎంత అభివృద్ధి జరిగిందో చూచాయగా చెప్పారు. యుద్ధవిమానాలు చాలా చాలా మార్పులు చేర్పులకు గురి అయ్యాయి. ఎయిర్‌ఫోర్స్‌లో ఫైటర్, బాంబర్ మరియు ట్రాన్స్‌పోర్ట్ అని మూడు రకాలుగా ఉన్నాయి. Canberra A/C నుంచి MIG - 21 వరకు జరిగిన వివిధ మార్పులు శ్రీ దక్షిణామూర్తిగారు కూలంకషంగా వ్రాసారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే 20-21 శతాబ్దంలో విరివిగా వివిధ దేశాలలో ఉపయోగంలోకి వచ్చిన పైలట్ లెస్ ఎయిర్‌క్రాఫ్ట్ అదే Un maned Arial Vehicle గురించి ఆరోజుల్లోనే అంటే 1976 ఆప్రాంతంలోని శ్రీ దక్షిణామూర్తిగారు ప్రస్తావించడం. అది చాలా అద్భుతమైన విషయం.

ఇంకో విషయం ఏమిటంటే, యుకె, యుఎస్ఎ, రష్యా, చైనా, ఫ్రాన్స్ లాంటి అగ్రరాజ్యాలతో మన వాయుసేన బలాన్ని పోల్చుకోవడం, పోల్చడం తప్పు అని శ్రీ మూర్తిగారు అన్నారు. కాని మన 'వాయుసేన' పని చేయవలసిన ప్రపంచ భాగాల్ని, మనతో యుద్ధానికి తలపడే అవకాశమున్న శత్రువులను దృష్టిలో పెట్టుకొని చూసినట్లైతే, మిగతా ఏ దేశానికి తీసిపోనిది, నిర్భేద్యమైనదిగా గర్వంగా చెప్పుకోవచ్చు అని శ్రీ దక్షిణామూర్తిగారు బల్లగుద్ది చెప్పారు. సాహసవంతులైన మన యువ పైలట్లు గాలిలోను, నేర్పుగల టెక్నీషియన్స్ నేలమీద ఎవరి విధులను వారు కర్తవ్యనిష్ఠతో, స్వార్థంలేని దేశభక్తితో నెరవేరుస్తూ ఉంటే భారతీయ వాయుసేన 'జెండా' ఎప్పటికీ రెపరెపలాడుతూ ఎగురుతూ ఉంటుంది అని శ్రీ దక్షిణామూర్తిగారు నొక్కి వక్కాణించారు.

శ్రీ దక్షిణామూర్తిగారు చివరగా 'భారతీయ వాయుసేన'లో అత్యంత ధైర్య సాహసాలను చూపించిన కొంతమంది పైలట్ల వీరోచిత గాథలను వివరిస్తూ వారిని **'ఆకాశవీరులు'** అని సంబోధించి ఈ పుస్తకానికి మరియు భారతీయ వాయుసేనకు మంచి అభిప్రాయాన్ని కలిగించారు. 1971 పాకిస్తాన్ యుద్ధంలో వింగ్ కమాండర్ సెఖేల్ సివియన్ పార్కర్‌కు **"మహావీర చక్ర"** లభించింది. అలాగే వింగ్ కమాండర్ హరిచరణ్‌సింగ్ మంగేల్‌కు "మహావీర చక్ర" లభించింది. తూర్పురంగంలో బంగ్లాదేశ్ విముక్తి సమయంలో వింగ్ కమాండర్ స్వరూప్ కృష్ణకౌల్ ఎలా విమానంలో ఫోటోలు తీసి ఆపరేషన్ విజయవంతం అయ్యేట్టుగా, పాకిస్తాన్ విమానాలు తోక ముడిచి పారిపోయేట్టుగా చేసిన సాహసానికి వీరత్వానికి గాను "మహావీర చక్ర అవార్డు" ఇవ్వడం జరిగిందని వివరించారు.

భారతీయ వాయుసేకు సంబంధించిన ఈ పుస్తకం వాయుసేన పనిచేస్తున్న విధానంపై సామాన్యులకు ఒక అవగాహన కల్పిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.
















(డా॥ పోరంకి దక్షిణామూర్తి గారు వేరు వేరు సాహిత్య సమావేశాల్లో,

సాహితీ వేత్తలతో పాల్గొన్న చిత్రమాలిక)

# ఆధ్యాత్మిక గ్రంథానువాద శైలికి ప్రామాణిక మార్గదర్శి డా॥ పోరంకి

**గురిజాల రామశేషయ్య,** విశ్రాంత అధ్యాపకులు, ఫోన్ : 703 267 9471




కీ.శే. డా. పోరంకి దక్షిణామూర్తిగారు కథానికా రచయితగా, పరిశోధకునిగా, నవలా రచయితగా, మాండలిక నవలా ప్రక్రియా రచయితగా, భాషా విశేషాల పరిశోధకునిగా సుప్రసిద్ధులు. తెలుగు అకాడమీలోని ఉద్యోగ బాధ్యతలు వారికి ఇందులోని కొన్నింటికి మరింత దోహదపడినవి.

ప్రతి వ్యక్తికి ముఖ్యంగా చదువరికి కొన్ని కొన్ని మౌలిక ఇష్టాలుంటాయి. దక్షిణామూర్తిగారి భాషాభివ్యక్తిశీలత సుస్పష్టమైనది. ప్రామాణికమైనది. సమకాలీన ప్రయోజనాలకు అనుకూలమైనది. ఇది ఏ రచయితకైనా అవసరమే. దీనికి ఇష్టాలతో పని ఉండవచ్చు, ఉండకపోనూ వచ్చు. నేను పైన పేర్కొన్న మౌలిక ఇష్టం దక్షిణామూర్తిగారి వాక్య పరిశీలనకు, వాచ్య విధాన పరిశ్రమకూ అంటే రచనాశైలికి సంబంధించినది. ఒక భాషా వ్యక్తి తదితర భాషా వాక్యాన్ని విన్నప్పుడు ఆ భాష కొంత తెలిసి ఉంటే తన భాషలోనికి అనువదించుకుంటాడు. ఇది సహజం. "Rama is a good boy" అని వినగానే “రాముడు ఒక మంచి బాలుడై ఉన్నాడు” అని అర్థం చేసుకుంటే తప్పులేదు కాని అది ఇంగ్లీషు భాషావాక్య వ్యాకరణ విధేయంగా తు.చ. తప్పని అనువాదం అవుతుంది. కొంచెం నవ్వు కూడా తెప్పిస్తుంది. “రాముడొక మంచి బాలుడు” అంటే రాముడు అనే బాలునిపట్ల విన్నవారికి కలిగే ప్రేమ రామునికి మరింత పేరు తెచ్చిపెట్టి వాణ్ణి గొప్పవాణ్ణి చేసే అవకాశం కల్పిస్తుంది. భాషయొక్క ఎంత గొప్పతనం ఈవిధంగా కొంతైనా తెలుసుకోవచ్చు.

ఇక ప్రస్తుతానికి వస్తే డా. పోరంకి దక్షిణామూర్తిగారు ఇంగ్లీషునుండి తెలుగులోనికి అనువాదం చేసిన గ్రంథాలలో అతి ప్రశస్తమైనది – ఒక యోగి ఆత్మకథ. ఈ గ్రంథం : పరమహంస యోగానంద జీవితచరిత్ర. క్రియాయోగ సంప్రదాయ ప్రసిద్ధుడై అమెరికాలో ఆశ్రమాన్ని స్థాపించి, ఆంగ్ల మాధ్యమంలో ప్రపంచాన్ని ఆధ్యాత్మిక భావ కర్పూర దీప పరిమళాలతో వెలిగించిన భారతీయ మహాయోగి : పరమహంస యోగానందగారు. తన కాలంలోని దేశ విదేశాల మహా మహా పురుషులను ప్రభావితం చేసిన మహాయోగి యోగానంద.

ఆంగ్లంలోని గ్రంథాన్ని **'ఆధ్యాత్మిక పరిమళము'** సెడని తీరులో తెలుగుభాష లోనికి అనువదించిన దక్షిణామూర్తిగారు తెలుగువారికి ముఖ్యంగా క్రియా యోగానుయాయులకు ప్రాతఃస్మరణీయులైనారు, చరితార్థులైనారు. చదివిన చదువులు తనను మురిపించుట సరే! పరిసర జనావళిని మురిపించుట మరీ సరే!! అందుకే కృతశ్రములు ఇతరులను కృతార్థులను చేయుటకే వివిధ దేవాలయములు, జ్ఞానాశ్రమములు, ధ్యానాశ్రమములు స్థాపించి ఆధ్యాత్మిక విలువల వ్యాప్తికి ప్రయత్నిస్తారు.

డా. పోరంకి దక్షిణామూర్తిగారు ఇంకెన్నెన్నో ఆధ్యాత్మిక గ్రంథాల అనువాదం చేసినను మనం ఇప్పుడు ముచ్చటించుకొనవలసిన గ్రంథము : మాతా అమృతానందమయి ఉపదేశామృతం – 2 వ సంపుటం. మాతా అమృతానందమయి దేవి “అమ్మ”గా సుప్రసిద్ధురాలు.

'అమ్మ' – 'అమృతం' రెండూ ఒకటే. 'అ'తోనే ప్రారంభం. కన్న అమ్మే పాలిచ్చి గోరుముద్దలు తినిపించి తర్వాత భాష నేర్పిస్తుంది. కనుక జ్ఞానామృతం కూడా కన్న అమ్మ చలవే అన్నా సమంజసమే కాని : మాతాపితరుల తర్వాత “గురుశ్రేణి” ఒకటి మన చదువు సంధ్యల నిచ్చెనమెట్లకు విధానపరమైన ఆవశ్యకత. అయితే లౌకిక విద్యలెన్నియైనా పొట్టకూటికే! కండబలం పెంపుకే! మనసు నిండాలంటే కొంతవరకు “కళలు” సహకరిస్తాయి. కానీ కీర్తి తదితర ప్రలోభాలతో అవి కూడా అశాంతిని కలిగించినా ఆశ్చర్యపడకూడదు. అందుకే **'ఆత్మ'** ప్రసక్తి వరకు వెళ్లితే తప్ప మానవ జన్మకు గణ్యతను మించిన ధన్యత ఒనగూడదు! అందుకే ఓం శాంతిః శాంతిః శాంతిః అనేది : త్రితాప దూరమైన సత్యబోధన మార్గ గమ్య స్వరం!!

ఆధ్యాత్మికత “శాంతి” తీరాలకు చేర్చే గొప్ప నౌక. ఆటుపోటులెన్ని పెచ్చరిల్లినా – సునామీలెన్ని తలలెత్తినా ఆత్మనిశ్చయ బలంతో భాతరదేశం ప్రపంచానికి ఎలుగెత్తి వెలుగెత్తి బోధించిన జ్ఞానం ఆధ్యాత్మిక పరిపూర్ణతయే! భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలన్నీ ఆత్మానుభూతికి దోహదకరాలు. భక్తి పరమ సుఖమార్గం! ఆశ్రయిస్తే దొరికే రక్షణ 'భక్తిమార్గ' సంబంధమైనది.

**మాతా అమృతానందమయి** 1953లో కేరళకు చెందిన తీరప్రాంతంలోని ఒక మారుమూల పల్లెలో జన్మించింది. అతి చిన్నవయసు చిన్న అమ్మాయిగా ఉన్నప్పటినుంచే సముద్రతీరంలో ఎన్నో గంటల పాటు ధ్యానంలో మునిగిపోతూ ఉండేది. అంతేనా! మేలుకున్నదంటే భక్తి గీతాలల్లుకునేది. **“అంత లేత వయసులో పాడుకున్న సొంతగొంతు : తన నునులేత**

**గుండె మోగిన పాటలైనా "అమృతానందమయి"గా "అమ్మగా" పరిణమించిన ప్రౌఢిమను ప్రకటించే దారిదీపాలైనాయవి"** అనడం అతిశయోక్తి కానేకాదు. పూవు పుట్టగానే పరిమళిస్తుందంటామే – అందుకిదే ప్రత్యక్షంగా మనమధ్య ఉన్న 'అమ్మ'గా సజీవ వ్యక్తి సాక్ష్యం. ఏమి భాష? ఏమి భావం? ఏమి ఆత్మ? ఏమి అనుభూతి? ఇదంతా లోక సహజ లౌకిక వర్తనులకు దురవగాహమైన అంశం. ఎప్పుడు? మొదట మొదట్లో తమ తమ మనస్సు రాగద్వేషాల ఊయలలో ఊగిసలాడిన బ్రతుకైనప్పుడు! కొంచెం నిలకడ చిక్కితే అందరూ "ఆత్మశాంతి" కోసం వెంపర్లాడే జీవులే!

పైకి ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఆంతర సత్యం మలిగే దీపం కాదు! ఇందుకు అరుణాచలం చేరిన 'మైదానం చలం'గారు మహోదాహరణం! ఇంకెందరో ప్రసిద్ధ వ్యక్తుల ఉదాహరణలెందుకు? శతాబ్దాల క్రిందటి గౌతముడెందుకు గడప దాటినాడు? ఇక చాలు!!!

**"అమ్మ" జీవన సరళినీ – బోధనా రవళినీ సూక్ష్మంగా పరిశీలిస్తే:**

ద్వైతాద్వైత విశిష్టాద్వైత త్రిమతాచార్యుల బోధనాసారమూ – ఆచరణ విధానమూ ఎంత సులభసుందరంగా మన మనసున నిలిచేవిధంగా 'అమ్మ' తెలియపరచిందో తెలిసిపోతుంది. ఈ తెలిసిపోవటానికి సంబంధించి ఎన్ని సందర్భాలనైనా ఈ గ్రంథానువాదం నుండి ఎత్తి చూపవచ్చు. అయితే ఒక్కమాట! అనువాద గ్రంథం లక్ష్యం రచయిత సూచించిన విధానాల పరంగా ఎట్లా ఉన్నా పాఠకునికి మూలగ్రంథం చదవాలనే కోరికను పుట్టించటం మాట – భాషాపరంగా ఆ పాఠకునికి మూల గ్రంథభాష తెలిసినప్పుడే ఇది ప్రసక్తాంశమవుతుంది – ఏది ఎట్లున్నా మూలగ్రంథం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఏదో అది అనువాదం ద్వారా స్థూలంగానైనా తెలిసిపోవాలి. అంటే మూలగ్రంథం చదవకపోయినా ఫరవాలేనిపించాలి.

డా. పోరంకి దక్షిణామూర్తిగారు కాకలు దీరిన ఆంగ్లానువాద రచయిత కనకనూ; తెలుగు ప్రాంతపు అన్ని జిల్లాల మాండలికాల పోవడులూ ఎరిగినవాడు కనుకనూ; మీదు మిక్కిలి ప్రామాణిక తెలుగుభాష కోసం ఏర్పడిన తెలుగు అకాడమీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన అధికారి కనుకనూ వీరి ఆంగ్లానువాద ధోరణులను ఆదర్శంగా తీసుకోవచ్చును. ఇక ఆధ్యాత్మికతా సారం ఒంట పట్టించుకున్న వంశ చరిత్ర – వ్యక్తిగత శిక్షణ చరిత్ర గలిగిన వ్యక్తి గనుక వీరి అనువాదం తెలుగు ఆధ్యాతిక విదులకు విందు వంటకమేనని చెప్పాలి. ఇందుకు ఉదాహరణకు మీకు నేను ఈ గ్రంథం నుండి **"ఆధ్యాత్మికత – లౌకికత"** అనే భాగం నుండి ఈ దిగువ కొంత సమాచారాన్ని పొందుపరుస్తున్నాను.

**– : ఆధ్యాత్మికత – లౌకికత :–**

**(మాతా అమృతానందమయి)**

ఆధ్యాత్మిక జీవనాన్ని విడిచి లౌకిక జీవనానికి తిరిగి వెళ్లినట్లయితే కలిగే ఫలితం : బయటా లోపలా కూడా బాధ అనుభవించడం. ఆధ్యాత్మిక చింతనలకు పూనుకొన్న మనస్సు, మళ్ళీ లౌకిక విషయాల్లో సంతోషం పొందలేదు; అశాంతే దానికి ఫలితం. ఆధ్యాత్మిక సాధనల వల్ల శరీరం చుట్టూ ఏర్పడ్డ సుసూక్ష్మ పరివేషం, ఇష్టదైవమూ ఆ దైవాన్ని పరివేష్టించి ఉన్న దేవతలూ : కారుణ్యంతో మామూలు అడ్డంకుల కన్నా, బాధల కన్నా రెట్టింపు నొప్పిని కలుగజేస్తారు; అతను ఆధ్యాత్మిక జీవనానికి తిరిగి రావాలని వారు కోరడమే ఇందుకు కారణం. ***ఆ సంఘర్షణ భగవంతుడి అసంతుష్టికి ఫలితం కాదు. అదొక వరం!*** ఇంకా ఎక్కువ సంపదనూ సుఖాన్నీ ఇచ్చినట్లయితే సాధకుడి అహంకారం పెద్దగా పెరిగి అతను తప్పులు చేస్తాడు. అతను మళ్ళీ మళ్ళీ పుట్టవలసి ఉంటుంది. దీన్ని నివారించడానికీ అతని మనస్సును ప్రపంచం నుంచి మళ్ళించడానికి భగవంతుడు ఈ బాధ కలిగిస్తాడు.

కొద్దిపాటి ఆధ్యాత్మికత తాలూకు నిజమయిన రుచిని అనుభవించిన మనస్సు లౌకిక విషయాల్లో సుఖం పొందజాలదు. ఒకడు, తాను ప్రేమించిన అమ్మాయిని కాక మరొకరిని పెళ్ళి చేసుకున్నట్లయితే అతను భార్యతో సుఖంగా ఉండలేడు; అతని మనస్సు, తాను ప్రేమించిన అమ్మాయి మీదే ఉంటుంది కాబట్టి. ఆ మాదిరిగానే, ఆధ్యాత్మికతవైపు మళ్ళిన మనస్సు భౌతిక పరిధిలో సంతృప్తి పొందజాలదు.

"మీరొక అడవి జంతువును పెంచుతున్నట్లయితే అది పారిపోకుండా ఉండేలాగ ఎల్లవేళలా కనిపెట్టుకొని ఉండాలి. దాన్ని విడిచి పెట్టేటట్లయితే దాని వెంబడే ప్రతిచోటికీ వెళ్తూండాలి. లేకపోతే అది పారిపోతుంది. దానికి అన్నం పెట్టేటప్పుడు, అది తినడం పూర్తి అయ్యేవరకు దాని దగ్గరే ఉండాలి. మీకు శ్రమ తప్పడమనేదే ఉండదు. కాని తోటకాపరి అయితే గేటు దగ్గర ఉండి, ఎవరూ పూలు కోసుకుపోకుండా కాపలా కాస్తూ ఉంటే చాలు! అతను పూల సువాసన ఆఘ్రాణించి ఆనందించగలడు కూడా. అదే విధంగా మీరు లౌకిక జీవనాన్ని అనుసరించేటట్లయితే మీ మనస్సు ఎల్లప్పుడూ ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. అది ఎన్నడూ నిలకడగా ఉండదు. అలా కాకుండా, ***ఆధ్యాత్మికత, జీవన సౌందర్యాన్నీ, సుగంధాన్నీ మీరు అనుభవించడానికి అనుమతిస్తుంది. అలజడి ఉండదు, ఇబ్బంది పెట్టడమూ ఉండదు. మీ ప్రారబ్ధం మూలంగా బాధ కలిగినప్పటికీ కూడా, మీ శరణాగతి వల్ల అదొక బాధగా అనుభవంలోకి రాదు. ఆ బాధ కూడా ఒక విధమయిన దైవానుగ్రహమే; అది మిమ్మల్ని శాంతిస్థితికి ఉద్ధరించడానికి చెయ్యి అందిస్తుంది."***

విజ్ఞులైన తెలుగు పాఠకులు ఈ పై భాగాన్ని చదివినప్పుడు మూలగ్రంథం స్పృహను పొందనే పొందరని నేను నిశ్చయంగా చెప్తున్నాను. "... కొత్తగా తెలియటంతో వాళ్ళ ముఖాలు ప్రకాశించాయి" ఈ వాక్యాన్ని డా. పోరంకి దక్షిణామూర్తిగారి అనువాదానికి తప్పనిసరిగా అనువర్తింపజేసుకోవచ్చును. డా. పోరంకి దక్షిణామూర్తిగారు మౌలిక రచయితగా, అనువాద రచయితగా రెండంచుల "వ్రాతకలం". వారికి ఇదే నా అక్షర నివాళి!!

# తెలుగులో శ్రీ పోరంకి ఆర్యమిషన్ గీత

**ఆచార్య కసిరెడ్డి,** విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా తెలుగు శాఖ. ఫోన్ : 98669 56250

**"తనలోనే ఉన్న ఆత్మజ్ఞాన రూపమయిన రత్నాన్ని తెలుసుకోకుండా ఎల్లప్పుడు తనను గురించిన మరపులో పడి ఉంటున్నాడు. శ్రీమద్భగవద్గీతలో చర్చించని విషయమంటూ లేదు. భగవద్గీతా మహాగ్రంథం సమస్త శాస్త్రాల సారం. ఇందువల్లనే మహాత్ములు గీతను సర్వశాస్త్రమయి అన్నారు. ఈ గ్రంథంలో ఏ సంప్రదాయాది (ధార్మిక మతాది) ఆలోచనా లేదు ఈవిధంగా గీత ఏ ధర్మానికీ లేదా సంప్రదాయానికీ విరోధి కూడా కాదు. అయినప్పటికీ గీతాకృపను పొందగలగడం అందరికీ చాలా కఠినం." (పుట.107)**

ఈ వాక్యాలు ఆర్యమిషన్ గీతలోని క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ వ్యాఖ్యానంలోనివి. పశ్చిమ బెంగాల్లోని (ప్రస్తుతం బంగాల్), కలకత్తా (కోల్‌కతా)లో వెలసిన ఆర్యమిషన్ ఇన్‌స్టిట్యూషన్‌వారు ఈ ఆర్యమిషన్ గీతను వంగభాషలో (బంగ్లాలో) ప్రచురించారు. ప్రతి అధ్యాయానికి చివర 3,4,5 పేజీల వ్యాఖ్యానముంటుంది. 1883-85 మధ్యలో ఈ వ్యాఖ్యానం యోగిరాజ శ్రీశ్యామాచరణ లాహిరిగారు చేశారు. దానిని 1886 ప్రాంతంలో వారి శిష్యులు యోగాచార్య శ్రీ పంచానన భట్టాచార్యగారు సంకలనం చేసి వెలుగులోకి తెచ్చారు. యోగి నిహిత లేదా యోగి రాజ నిహిత అని వ్యాఖ్యానానికి పేరు పెట్టారు. గ్రంథంపైనా ప్రతి అధ్యాయం శ్లోకాల తర్వాత ఉన్న వ్యాఖ్యానంపైనా ***"యోగిరాజ శ్రీ శ్యామాచరణ లాహిరీ గారి ఆధ్యాత్మిక వ్యాఖ్య"*** అని ఉంటుంది.

బాంగ్లా (బెంగాలీ) భాషలోని ఈ ఆర్యమిషన్ గీతను శ్రీవత్సగారు 2004లో హిందీలోకి అనువదించారు. సుప్రసిద్ధ తెలుగు రచయిత, కథానికా పరిశోధకులు డా. పోరంకి దక్షిణామూర్తిగారు ఈ హిందీ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. ఆ అనువాదం తొలి కూర్పు 2009 జనవరిలో ఆర్యమిషన్ ఇన్‌స్టిట్యూట్ కలకత్తావారు ప్రచురించారు.

నిజానికి బెంగాలీలో ఇది మౌఖిక వ్యాఖ్యానం. యోగిరాజ శ్రీశ్రీ శ్యామాచరణ లాహిరీ బాబాగారు చేసిన ప్రసంగాలను ఎప్పటికప్పుడు నోట్సుగా వ్రాసుకొని, వ్యాసాలుగా మార్చి, అవి ప్రచురించారు. వారే తొలి ప్రకాశకుల విజ్ఞప్తి వ్రాశారు.

**"గీత అనేది ఏదో కథ గాక వాస్తవమయిన ఒక యోగ క్రియా సంబంధ గ్రంథం. అందువల్లనే ప్రతి ఒక్క అధ్యాయం చివరా యోగశాస్త్ర శబ్దాన్ని ప్రయోగించడం జరిగింది. గీతకు ఈ ఆధ్యాత్మిక వ్యాఖ్య ముఖ్యోద్దేశ్యం ఆత్మకర్మ లేదా ఆత్మజ్ఞాన పిపాసువులయిన సాధికా సాధకుల్లో సాధన పట్ల నిష్ఠా సద్భావనమూ కలిగించడం; సర్వ సాధారణ జనుల ఎదుట దీన్ని ప్రచారం చేయడానికి కాదు. సర్వ సాధారణులకు లేదా అక్రియాన్వితులకు (క్రియాయోగ దీక్ష తీసుకోని వారికి) ఇది హానికారకం కాగలదు" (పు. iii)**

ఈ వ్యాసంలో మొదట ఉటంకించిన వాక్యాలు, ఈ పై వాక్యాలు పరిశీలిస్తే ఇది గీతాధ్యయనశీలురైన సాధారణ పాఠకులకు ఉద్దేశించిన వ్యాఖ్యానం కాదనిపిస్తుంది. ఆత్మరతులు కావడానికి మానసికంగా సంసిద్ధులయిన క్రియాయోగ సాధకులకు సాధకులకు ఉద్దేశించి చెప్పినది (వ్రాసినది).




ఇది ఆర్యమిషన్ గీత అనీ, 1883 నుంచి 1885 వరకు మధ్యలో యోగిరాజ లాహరీ బాబాగారు క్రియా పరావస్థలో కూర్చుండి, తమ అనుభవంతో యోగనిహిత వ్యాఖ్యను చేశారని పరిచయంలో వివరించారు. అదేవిధంగా అనేక బెంగాలీ పదాలను హిందీలో వాడుకొన్నారని చెప్పారు. మరి తెలుగు అనువాదంలో ఆ పదాలు వాడినట్లు లేదు. పైగా తెలుగు అనువాదకులైన డా. పోరంకి దక్షిణామూర్తిగారు, అనువాదంలోని తమ అనుభవాలను గానీ, గ్రంథగత విశేషాలను గానీ పేర్కొనలేదు.

బహిర్ముఖీ ప్రాణాయామ్ అంటే నిరంతరంగా సాగే ఊపిరి - శ్వాస అనీ, అంతర్ముఖీ ప్రాణాయామ్ అంటే గురువు ద్వారా ప్రాప్తమయిన ప్రాణ కౌశలం వంటి ఓ యేదెనిమిది అర్థాలనిచ్చారు. మూల వ్యాఖ్యాత శ్రీ లాహరీ బాబాగారు ఈ గీతా వ్యాఖ్య తాత్పర్యమిది అని ఇలా వివరించారు.

**"ఏ సాధకుడయినా సాధన మొదలు పెట్టినప్పుడు అతని మనస్సులో నానా రకాల ప్రశ్నలు తల ఎత్తుతాయి. ఆత్మజ్ఞానం కలిగిన మీదట ఆ ప్రశ్నలకు సమాధానాలు వాటంతట అవి వస్తాయి. ఆ**

**మీమాంసనే గీతతో రూపకాల (Symbols) ద్వారా తెలపడం జరిగింది. __అర్జునుడి__ (పంచ తత్త్వాలతో రూపొందిన మన శరీరంలో నాభిచక్రం, అంటే మణిపూరక చక్రం దగ్గర ఉన్న అగ్ని లేదా తేజస్సు) జిజ్ఞాసకు __*శ్రీకృష్ణ భగవానుడి*__ (ఆజ్ఞాచక్రంలో ఉన్న కూటస్థ చైతన్యం) ద్వారా మీమాంసా పూర్వకంగా నిరూపణ చేయడమే గీతా తాత్పర్యం...." (పుట. vi)**

మానవ శరీరంలోనే శ్రీకృష్ణార్జునులున్నారని పైవిధంగా సంకేతించి షట్చక్రాల సంకేతాలతో గీతా తాత్పర్యాన్ని ఒక యోగశాస్త్రంగా తెలుసుకోవాలంటారు. పైగా శ్రీకృష్ణుడు, అర్జునుడు, రథం, ధ్వజం, అర్జునుడి అస్త్రం ధనస్సు, పాండవపక్షం, కౌరవ పక్షం.... తదితర పదాలకు ఆధ్యాత్మిక సాంకేతిక (రూపక) అర్థాలిస్తారు.

ఇవి ఒకవిధంగా యోగి అరవిందుల గీతా వ్యాఖ్యానంలోని ఆధ్యాత్మిక – సాంకేతిక (పారిభాషిక) అర్థాల్లా ఉంటాయి. ఎవరూ ఈ అర్థాల్ని ఊహించలేరు. యోగి అరవిందులవి వినూత్న ఆధ్యాత్మిక సాంకేతికార్థాలే! ఈ లాహిరీ బాబాగారి గీతా వ్యాఖ్యానంలోనివి అంతే!

శ్రీకృష్ణుడు = చైతన్య కూటస్థం (ఆజ్ఞా చక్రం)

అర్జునుడు = తేజస్వంతమయినా మనస్సు (సాధకుడు)

రథం = మానవ దేహం; దీనిలోని ఇడా, పింగళ నాడులు (ఊపిరి తీసుకొని విడిచే నాడులు) రథానికి పూన్చిన రెండు గుఱ్ఱాలు. రాత్రి పగలూ అన్నవి రెండు రథచక్రాలు....

ధ్వజం = దీనిలోని హనుమంతుడు ప్రాణానికి ప్రతీక

అర్జునుడి అస్త్రం ధనుస్సు = మానవ దేహంలో ఉన్న మేరు దండం (వెనుబాము)

పాండవ పక్షం = పంచ భూతాల (నిప్పు, గాలి, నింగి, నేల, నీరు) సహితమైన ఐదు చక్రాలకు (మూలాధారం, స్వాధిస్థానం, మణిపూరం, అనాహతం, విశుద్ధాక్షం, సాత్త్విక సంకేతాలు

కౌరవ పక్షం = మనుష్యుడి మనస్సుకు కలిగే నూరు వికారాలు

ఈవిధంగానే ఆయా పాత్రలకు రూపకార్థాలు (సంకేతాలు) చెప్పారు బాబాగారు. యుధిష్ఠిరుడు – ఆకాశ తత్త్వం, భీముడు – వాయుతత్త్వం, కర్ణుడు – విశ్వాసం, పాండవులు – పంచతత్త్వ సమూహం, కుంతి – శక్తి, భీష్ముడు – ధర్మకర్మ భయం, ధృతరాష్ట్రుడు – అహంకారంతో కూడిన మనస్సు, దుర్యోధనుడు – దుర్మతి లేదా వికారయుక్తమయిన మనస్సు, దుశ్శాసనుడు – కామ విషయం, అభిమన్యుడు – ఉత్సాహం... ఇలా గీతలో వచ్చిన అన్ని నామాలకు రూపకార్థాలు (ఆధ్యాత్మిక సంకేతార్థాలు ఇచ్చారు వ్యాఖ్యాతలు).

విషాదయోగంలో 4వ శ్లోకం నుండి 37వ శ్లోకం వరకు రెండు మూడు వాక్యాల్లో పరమార్థమేదో తెలియజేశారు.

**శ్రీకృష్ణ రూప కూటస్థం నుంచి అనుభవం కలగడమే వాస్తవిక మయిన సమాధానం. నిజానికి, సాధన తాలూకు ముఖ్యోద్దేశ్యం ఇంద్రియాలను అదుపులో ఉంచుకోడమే కాని వాటిని నాశనం చేయడం కాదు. కాని అజ్ఞాని అయిన జీవుడు, సాధన చేయడం వల్ల తన ఇంద్రియాలు నశించిపోతాయన్న మాటను సులువుగా నమ్మేశాడు (4-37).**

ఇలాంటి వాక్యాలతో సాంఖ్యయోగానికి ఎనిమిది పుటల వ్యాఖ్యానం, మోక్ష సన్యాస యోగానికి పది పుటల వ్యాఖ్యానం ఉంది. విషాద యోగానికి ఒకటిన్నర పుటయే. మిగతా 15 యోగాలకు మూడు నాలుగు పుటలకు మించి లేదు.

సర్వ సాధారణంగా కర్మ జ్ఞాన భక్తి షట్కాలుగా (6+6+6 = 18) భగవద్గీతను అధ్యయనం చేస్తారు. ఆత్మ, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం, దైవాసుర గుణాలు, మోక్షం, సాత్త్విక – రాజస – తామసాలు, ధర్మరక్షణ, దుష్టశిక్షణ, యోగం, ఆసనం, విశ్వాసం, ధ్యానం, ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని, సాధన, భయం, నిర్భయం, శాంతి, స్థితప్రజ్ఞ, నిష్కామ కర్మ, అనన్యభక్తి, శరణం, శరణాగతి, శ్రద్ధ, సంశయాత్మ, విధి, శాస్త్రం.... ఇలా వందల విషయాల గురించి లౌకిక – పారమార్థిక అర్థాలు గ్రహిస్తారు. విషాదం నుండి బయటపడి విజయపథాన పయనించాలనే గీతాధ్యయన శీలురు ఆలోచిస్తారు.

కాని యోగిరాజ శ్రీ శ్యామాచరణ లాహిరీ గారి ఈ ఆర్యమిషన్ గీత ఆధ్యాత్మిక వ్యాఖ్య ఉద్దేశం వేరు. జీవుడు దేవుడైపోవాలి. ఆత్మ పరమాత్మను చేరాలి. లౌకిక జీవితంలో ఉన్నా మనస్సును శూన్యం చేసుకోవాలి. భౌతిక బంధాలతో ఉన్న సంగత్వాన్ని పరిత్యజించి సాధన చేయాలి.

సాధికా సాధకులు సాధన ఎలా చేయాలని చెబుతూ గురుబోధ తప్పదంటారు. ఆ బోధ ద్వారా సాధకులు అనుకొన్నది సాధిస్తారు.

**"ఈశ్వర ప్రాప్తే మానవ జీవనానికి సారం. ఎల్లప్పుడూ యోగస్తుడయి ఉండటమే చరమావస్థ. గీతలో తెలిపిన సాధనా ప్రణాళికను, అంటే ఆత్మకర్మను చెయ్యడం వల్ల మాత్రమే భగవత్ ప్రాప్తి కలుగుతుంది" (64-65)**

ఈ పై వాక్యాలు చివరిదైన మోక్ష సన్యాస యోగంలోనివి. గీత ఈ ఆశయంతోనే ఆవిర్భవించిందని గట్టిగా పాఠకులు విశ్వసించే విధంగా ఈ వ్యాఖ్యానం చేశారు. చివరి శ్లోకం ద్వారా అందించిన సందేశం చూద్దాం!

**"కూటస్థ చైతన్య రూపుడయిన కృష్ణుడు, యోగారూఢ తేజోరూపుడయిన సాధకుడూ (అర్జునుడు) ఉన్నచోట సమస్త ప్రకారాల ఐశ్వర్యమూ దానంతట అదే ఉపస్థితమయి ఉంటుంది".**

**"యోగి అయిన సాధకుడూ (ధనుర్ధరుడయిన పార్థుడు) పరబ్రహ్మ (యోగీశ్వర శ్రీకృష్ణుడు) సంపూర్ణంగా స్థిరులయి ప్రాపంచికమయిన సమస్త బంధాలనూ ఖండిచేటప్పటి అవస్థకు పేరు మోక్షం; ఇదే ఆత్మకర్మకు పరావస్థ.**

డా. పోరంకిగారి ఈ అపూర్వ అనువాదంలో ఆధ్యాత్మిక రంగానికి సంబంధించిన ఎన్నో కొత్త పదాలు లభిస్తాయి. తెలుగులో ఆ పదాలు ప్రచలితం కావాలంటే, గీతా ప్రచారకులు ఆధ్యాత్మిక దృష్టితో ఈ యోగతత్త్వ శాస్త్రాన్ని పనిగట్టుకొని చెప్పవలసి ఉంటుంది.

# క్రియాగీత - యోగసాధనా కరదీపిక

**డా. డి. కామేశ్వర రావు,** అధ్యాపకులు, సినీ ఆధ్యాత్మిక రచయిత, ఫోన్ : 984879 9648

పోరంకి దక్షిణామూర్తిగారి విలక్షణ రచనలలో **'క్రియాగీత'** ఒకటి. ఇది యోగసాధనా క్రియకు సంబంధించిన పుస్తకం. ఇందులో క్రియాయోగపరమైన 11 శ్లోకాలకు విశ్లేషణాత్మక వివరణ ఉంది. అందులో మొదటి ఏడు శ్లోకాలు భగవద్గీత నుండి గ్రహింపబడినవి. వాటికి లోకంలో **'సప్తశ్లోకీ గీతా'** అన్న పేరు వాడుకలో ఉంది. మిగిలిన నాలుగు శ్లోకాలలో రెండు **'సామవేదీయ యోగచూడామణి'** ఉపనిషత్తు నుండి గ్రహించినవి కాగా, తక్కినవి కఠోపనిషత్తు, కువలయానంద స్వాములవారి **'గోరక్ష శతకం'** నుండి ఎంపిక చేసుకొన్నవి. ఈ క్రియాగీత పుస్తకం యోగిరాజ శ్రీ శ్యామాచరణ లహరీగారు తమ శిష్యులు ప్రణానందుల ద్వారా ప్రచారంలోకి తెచ్చిన క్రియాయోగానికి సంబంధించిన ఆధ్యాత్మిక వ్యాఖ్యకు తెలుగు అనువాదం.

యోగిరాజ శ్రీ శ్యామాచారణ లహరిగారు క్రియాయోగ సాధనలో మేరునగ సమానులు. సాధకులందరికీ వారు ప్రాతః స్మరణీయులు. వారు తమకు అనుభవయుక్తమైన క్రియాయోగ పరంగా ఎంతో ప్రాశస్త్యాన్ని, ప్రాముఖ్యాన్ని, వైశిష్ట్యాన్ని కలిగి ఉన్న 11 శ్లోకాలను తీసుకొని తమ శిష్యులలో ముఖ్యులైన శ్రీ ప్రణవానందుల వారికి అర్థవ్యాఖ్య సహితంగా వివరించి భావితర క్రియా సాధకులందరికీ ఉపయుక్తంగా ఉండాలన్న భావనతో దానిని గ్రంథంగా ప్రచురించమని అనుమతినిచ్చారు. 1894లో యోగిరాజులవారు తమ భౌతిక రూపాన్ని విడిచిపెట్టారు. అయితే వివిధ కారణాల వల్ల ప్రణవానందగారు తమ జీవితకాలంలో గ్రంథ ప్రచురణను చెయ్యలేకపోయారు. 1918లో శరీర త్యాగం చేసిన శ్రీ ప్రణవానందగారు 1952లో పునర్జన్మను పొంది తమ పూర్వజన్మ సంస్కారం ద్వారా పిన్నవయసులోనే ఇల్లు వదలి హిమాలయాలకు చేరి అక్కడ రహస్య ప్రదేశంలో దివ్యసాధనలో మునిగిపోయారు. వారు గత జన్మలో వదలివేసిన క్రియాయోగ సాధనా శ్లోక పుస్తక ప్రచురణను ఒక క్రియావంతుని ద్వారా లోకానికి అందించారు. దానికి 'క్రియాగీత' అని నామకరణం చేశారు. అనేక భాషలలోకి అనువాదం పొందిన ఈ బాంగ్లా మూల పుస్తకం తెలుగులో పోరంకి దక్షిణామూర్తి గారి ద్వారా వెలుగులోకి వచ్చింది.

క్రియాగీత వివరణలో పోరంకివారు ప్రణాళికాబద్ధమైన శైలిని అనుసరించారు. మొదట మూల శ్లోకం, పిదప దాని అర్థాన్ని వివరించి, అటుపిమ్మట దాని వ్యాఖ్యను విపులంగా రచించారు. ఆ వ్యాఖ్యాభాగానికి వారు **'కూటస్థ అనుభవం'** అని ఉపశీర్షికను పెట్టారు. తత్త్వపరంగా ఈ పదం ఎంతో విస్తృతమైనది, విశిష్టమైనది, సమున్నతమైనది కూడా... యోగసాధకులందరి అంతిమలక్ష్యాన్ని సూచించే పదం ఇది. సాధన యొక్క గమ్యస్థానం ఇది. మనస్సు అనేది ఒక శక్తివంతమైన అదృశ్య పదార్థం. అది అనుభూతులకు నిలయం. జ్ఞానేంద్రియాలకు అందనిది. జ్ఞానేంద్రియాలను ఉపయోగించుకొని వివిధానుభూతులను కలిగిస్తూ ఉంటుంది. ఎన్నో కోరికలు, ఊహలు, భావాలు, ఆరాటాలు, తాపత్రయాలు అన్నిటికీ ఆధారం మనస్సే.




నిరంతరాయంగా నిర్విరామంగా అలలతో అల్లకల్లోలంగా ఉండే సముద్రంలాగా ఈ మనఃకార్య కలాపాలన్నిటి ద్వారా నిత్య సత్య నిశ్చల జ్ఞేయ తత్త్వమైన పరబ్రహ్మను జీవి చేరుకోలేకపోతున్నాడు. అనంత స్వరూపుడు, విశ్వాతీతుడు అయిన చైతన్యబ్రహ్మలో జీవులన్నీ ఒక భాగం. సముద్రంలో ఎగసిన కెరటం తిరిగి ఆ సముద్రంలోనే లీనమయ్యే విధంగా పరబ్రహ్మ నుండి పుట్టిన జీవకోటి తిరిగి ఆ బ్రహ్మలోనే కలిసిపోతుంది. అయితే ఈ సత్యాన్ని తెలుసుకొనినీయకుండా సకలేంద్రియాకర్షితమైన మనస్సు పరిపరి విధాలుగా జీవులను దారి మళ్ళిస్తూ ఉంటుంది. ఈ భౌతిక వలయంలోనే కొట్టుమిట్టాడేట్లు చేస్తుంది. అటువంటి మనస్సులో చెలరేగే వివిధానుభూతులు లేకపోతే మనస్సుకు అస్తిత్వం ఉండదు. అలా మనస్సు అస్తిత్వ రహితంగా ఉంటే జీవికి చైతన్యరూపుడైన పరమాత్మను చేరుకోవడానికి సాధనమే క్రియాయోగ సాధన. మనస్సును దాటివెళ్ళిన తరువాత ఉన్నదంతా చైతన్య స్వరూపమే. ఆ చైతన్య స్వరూప పరబ్రహ్మ దర్శనంతో జీవిలో కలిగే అనిర్వచనీయమైన అనుభవమే **'కూటస్థ అనుభవం'.**

పరబ్రహ్మకు **'కూటస్థుడు'** అని పేరు. భగవద్గీతలో అనంతరూపుడైన పరబ్రహ్మను కూటస్థ శబ్దంతో వివరించడం గమనించవచ్చు. భక్తియోగంలోని **".... కూటస్థమచలం ధ్రువమ్"** (గీత : 12-3) అన్న మాటల ద్వారా ఈ విషయాన్ని గ్రహించవచ్చు. **'పాంచభౌతిక శరీరంలో సూక్ష్మరూపంలో ఉండి జీవుడిని నడిపించేవాడు, ఏ కాలంలోనూ పరిణామం చెందకుండా ఉండే మూలప్రకృతి స్వరూపుడు'** అని ఈ కూటస్థ శబ్దాన్ని వివరించుకోవచ్చు. **"కూటేన నిశ్చలత్వేన తిష్ఠతీతి కూటస్థః"** అని కూటస్థ శబ్ద వ్యుత్పత్తి. ఎటువంటి వికారాలు, ఆకారాలు లేకుండా నిశ్చలంగా ఉండే ఆత్మతత్త్వమే ఈ కూటస్థ శబ్దం యొక్క భావం. **ఈ భౌతిక ప్రపంచ ప్రభావంతోను, సంయోగంతోను సంభవించే చంచలమైన అనేక ఇంద్రియానుభూతుల నుండి మనస్సును దూరంగా ఉంచి సుఖదుఃఖాతీతమై ఉండే చైతన్యశక్తియే ఈ కూటస్థ శబ్దానికి అర్థం.** అటువంటి ఆత్మరహస్యాన్ని గురించి సాధన చేసినప్పుడు జీవుడు ప్రశాంత చిత్తుడవుతాడు. అతని మనస్సు **'నిస్సంకల్పస్థితి'**ని చేరుకొంటుంది. ఆ స్థితిలోనే ఆత్మ దర్శనమవుతుంది. అటువంటి సాక్షాత్కారం కోసం సాగించేదే క్రియాయోగం. **"తపః స్వాధ్యాయ ఈశ్వర ప్రణిధానేన క్రియాయోగః"** అని రాజయోగ సూత్రాలలో పతంజలి చెప్పిన విషయం చాలా ప్రధానమైనది. తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వర ప్రణిధానం అనే ఈ మూడు ప్రక్రియల సంపూర్ణ సంగమమే క్రియాయోగం. ఆ యోగం ద్వారానే ఆత్మ సాక్షాత్కారం సంభవిస్తుంది. ఆ సాక్షాత్కారమే మోక్షం. ఆ స్థితిని సాధించడానికి సాధనామార్గం **'ఓంకార మంత్రోచ్చారణ'**. శరీర వ్యాయామం, మనో నిగ్రహం, ఓంకారం మీద ధ్యానం కలిపి క్రియాయోగమవుతుంది.

క్రియాగీత గ్రంథం ఈ ఓంకార వివరణతోనే ప్రారంభమవుతుంది. ఓంకారమనే ఏకాక్షర సహాయంతో చేసే ధ్యానం వల్లనే జీవుడు పరమగతిని పొందుతున్నాడని వివరించడం జరిగింది. **"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ...పరమాంగతిమ్"** (గీత.8-13) అన్న భగవద్గీతలోని అక్షర పరబ్రహ్మ యోగంలోని శ్లోకంతో ప్రారంభమైన ఈ పుస్తకంలో ఈ శ్లోకానికి చాలా విపులమైన చర్చ చేశారు పోరంకివారు. అయితే గీతలో ఈ శ్లోకానికి ముందున్న ...

**"సర్వద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ**
**మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణమ్...."**
**(గీత. 8-12)**

అన్న శ్లోకంతో సమన్వయించి వివరించుకోవాలి. విశ్లేషించుకోవాలి. అర్థం చేసుకోవాలి. అనుభవాన్ని పొందాలి. అప్పుడే ఈ ఓమిత్యేకాక్షరం బ్రహ్మ అన్నది స్పష్టమౌతుంది. ఇంద్రియాలన్నిటినీ గట్టిగా నియంత్రించి, మనస్సును ఆత్మస్థానీయం చేసి, ప్రాణవాయువును బ్రహ్మరంధ్రంలో స్థాపించి, ఏకాగ్రచిత్తంతో ఓంకారాన్ని ఉచ్చరిస్తూ శరీర త్యాగం చేసినప్పుడు పరమగతి లభిస్తుందని పై రెండు శ్లోకాల అర్థం. అక్కడ పతంజలి వివరించిన శరీర వ్యాయామం, మనో నిగ్రహం, ఓకాంరోచ్చారణ అన్న విషయాలు స్పష్టం అవుతున్నాయి. క్రియాగీతలోని అన్ని శ్లోకాలకంటే ఈ శ్లోకానికే రచయిత అత్యంత సుదీర్ఘమైన వివరణను ఇవ్వడం గమనిస్తే యోగసాధనలో ఓంకార ప్రాముఖ్యత ఎంతటిదో అర్థం అవుతుంది. ఈ శ్లోకాన్ని విస్తృతరీతిలో విశ్లేషించడానికి పోరంకివారు ప్రశ్నోత్తరాల మార్గాన్ని ఎంచుకోవడం ఒక ప్రత్యేకత. ఇందులో అయిదు ప్రశ్నలను తనకు తానే సంధించుకొని వాటికి నిరూపణాత్మకంగా సమాధానాలను సాధించడం ద్వారా పఠితకు విషయం అర్థం కావడానికి ఒక సులువైన మార్గం లభించిందని చెప్పవచ్చు.

**'జీవుడు బ్రహ్మస్వరూపుడే అయితే ఇంత దుఃఖం ఎందుకు పొందుతున్నాడు'** అన్న మొదటి ప్రశ్న ద్వారా ప్రకృతి తాను వేరనే భేదభావం వల్ల దుఃఖ భాజనుడవుతున్నాడని చెప్పి, **'దాన్ని తొలగించుకొనే ఉపాయం ఏంటి...;'** అన్న రెండో ప్రశ్నకు గురూపదేశంతో పొందే క్రియాయోగ దీక్ష అని వివరించిన విధం ఎంతో విశిష్టమైన జ్ఞానమార్గాన్ని సూచిస్తోంది. అలాగే మూడవ ప్రశ్నకు సమాధానంగా షట్చక్రాల వివరణ, తద్వారా ఆనందసిద్ధి కలిగే విషయం వివరించారు రచయిత. నాల్గవ ప్రశ్నలో పరమాత్మపై ప్రాణం స్థిరమైనట్లు ఎలా నిర్ధారించుకోవాలో వివరించగా, జ్యోతిర్మయ బ్రహ్మపదం గురించిన అయిదవ ప్రశ్నకు ఇచ్చిన వివరణ ద్వారా పరమాత్మ తత్త్వాన్ని భూతద్దంలో చూపించినట్లుగా విపులీకరించారు. ఈ ప్రశ్నలు సమాధానల వెనుక రచయితకు వేదోపనిషత్పురాణ శాస్త్ర విషయాలలో గల అభినివేశంతో పాటు పఠితకు అర్థమయ్యే విధంగా చెప్పడంలో రచయిత బోధనా పటిమ ప్రస్ఫుటమౌతోంది.

ఇక రెండవ శ్లోకం భగవద్గీతలోని విశ్వరూప సందర్శన యోగం నుండి గ్రహించబడింది. **'స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా... సిద్ధ సంఘాః'** (గీత 11-36) అన్న శ్లోకంలో హృషీకేశుని కీర్తనంవల్ల, మాహాత్మ్యం వల్ల అపరిమిత ఆనంద ప్రాప్తి కలుగుతుందని, రాక్షస గణాలు దిగంతాలు పారిపోతాయని వివరించిన చోట త్రిగుణాధీనమై ఉన్న మనస్సు వల్ల జీవులు రాక్షసగుణాన్వితులై ఉటారని, అటువంటి స్థితి నుండి విముక్తుడు కావాలంటే పరమాత్మను కీర్తించడమే చక్కని మార్గమని చెప్పడంలో పోరంకివారి ఆధ్యాత్మిక జ్ఞానంలోని లోతు స్పష్టమౌతుంది. సద్గురువు నుండి ప్రాప్తించిన క్రియాసాధన వల్ల నాలుక, పెదవులు, కళ్ళు, మనస్సు, ప్రాణం స్థిరమైనప్పుడే వాస్తవిక కీర్తనం అవుతుందని చెప్పి ఓంకార క్రియాదుల వల్ల కలిగే యదార్థ లాభాన్ని స్పష్టీకరించారు.

భగవద్గీతలోని క్షేత్రక్షేత్రజ్ఞ విభాగ యోగంలోని **'సర్వతః ప్రణిపాదం తత్ సర్వతో... తిష్ఠతి'** (గీత.13-14) అన్న శ్లోక వివరణ క్రియాగీతలోని మూడవ శ్లోకం.. ఈ శ్లోకంలో **'సత్-అసత్'**ల గురించి

చెప్పడం జరిగింది. జగము నిండా, సర్వలోకాల్లో, బ్రహ్మరూపంలో వ్యాపించి ఉన్న పరమాత్మను సాధకుడు కేవలం క్రియాయోగ సాధన చేసిన మీదట మాత్రమే తెలుసుకొనగలుగుతున్నాడని వివరించడం జరిగింది. ఆ సత్యస్వరూపాన్ని క్రియా యోగసాధన ద్వారా ఎలా తెలుసుకుంటారో, దానికొరకు సాధకులు ఎలా గుణాతీత స్థితిని పొందుతారో, ఆ క్రమంలో ఆత్మ కర్మ చేసేవాడికి బ్రహ్మవిష్ణు శివులు అంటే సృష్టి, స్థితి లయాల వాస్తవ జ్ఞానం ఎలా ప్రాప్తమౌతుందో విశదీకరించబడింది. అందుకోసం గురువు యొక్క బోధనలు ఎలా దోహదపడతాయో తెలుపబడింది. పరమాత్మ జ్ఞానం కోసం కూటస్థ బ్రహ్మ ఉపాసన చేసి అజ్ఞానాన్ని పోగొట్టుకోవాలని ఈ శ్లోక వివరణ ద్వారా రచయిత బోధించారు.

క్రియాసాధనా యోగం ప్రాప్తించిన పిదప సాధకుడు సర్వ విషయాలను ఆ పరమాత్మగానే గుర్తిస్తాడు. సమస్తాన్ని ఆ పరమాత్మలోనే దర్శిస్తాడు. చివరకు ఆ పరమాత్మను తనలోనే చూస్తాడు. ఆ 'కవి' తత్త్వాన్ని తనలోనే వీక్షిస్తాడు. కవి అన్నవాడు ఎప్పటికప్పుడు కొత్త అనుభవాలను, అనుభూతులను ప్రకటిస్తూ ఉంటాడు. అలా ఎప్పటికప్పుడు కొత్త అనుభవాలను ఇవ్వడం ఆ పరమాత్మకు మాత్రమే సాధ్యమైన అంశం. ముక్తావస్థను పొందిన సాదకుడు అటువంటి నిత్య నూతనమైన అనిర్వచనీయమైన అనుభవాలను అనాయాసంగా సాధించుకొంటాడు. సామాన్యులు పంచభూతాలను బాహ్యంలో చూస్తుంటారు, కాని యోగులు అయిదు తత్త్వాలను సూక్ష్మంగా రంగుల రూపంలో చూస్తారు. ఆ రంగుల సూక్ష్మ తత్త్వాలను గుర్తించిన యోగులకు భూత వర్తమాన భవిష్యత్కాల జ్ఞానం అలవడుతుంది. యోగులను త్రికాలజ్ఞులు అని అనడానికి కారణం ఇదే...! ఈ విషయాలన్నీ భగవద్గీతలోని అక్షర పరబ్రహ్మయోగం నుండి గ్రహింపబడిన క్రియాగీతలోని నాలుగవ శ్లోకమైన **'కవిం పురాణమనుశాసితారం....'** (గీత. 8,9)లో చర్చించారు రచయిత. ఈ శ్లోకం ద్వారా సాధకుడు పొందే ముక్తావస్థ గురించి స్పష్టీకరించడం గమనించవచ్చు.

**'ఊర్ధ్వమూల మథశ్శాఖామ్... స వేదవిత్'** (గీత. 15-1) అన్నది క్రియాగీతలోని అయిదవ శ్లోకం. ఇందులో సాధకుడు తెలుసుకోవలసిన, తెలుసుకొన్న వాస్తవిక జ్ఞానం గురించిన వివరణ ఉంది. వేదాదులు ఆకులుగా ఉండి వేళ్ళు పైకి ఉన్న చెట్టును గురించి తెలుసుకోవడమే వాస్తవిక జ్ఞానం. సాధకుడికి అనంతానుభవం కలిగిన పిదప ద్వైతాతీత స్థితిని చేరుకొన్నాక, అహం బ్రహ్మాస్మి అవస్థను పొందుతాడు... అది తెలుసుకోవడానికి ఈ శరీరమనే వృక్షం ఎలా ఆధారమైందో ఈ శ్లోకంలో స్పష్టంగా చెప్పబడింది.

సాధనా ఫలాన్ని పొందిన సాధకుడు సమస్త జీవుల్లోను తానే ఉన్నానన్న అనుభవాన్ని పొందుతాడు. పుస్తక పఠనావగాహనల ద్వారా కేవలం బాహ్య లేదా ప్రాపంచిక లేదా వాచిక జ్ఞానం లభిస్తుంది. కాని బ్రహ్మజ్ఞానం మాత్రం సాధనానంతరమే సాధ్యమౌతుంది. నిజబోధ రూప ప్రకాశాన్ని పొంది సాధకుడు ఎల్లప్పుడూ బ్రహ్మరూపంలో ఆనందిస్తూ ఉంటాడు. అటువంటి బ్రహ్మ గురించిన వివరణ ఈ క్రియాగీత పుస్తకంలో ఆరవది అయిన **'సర్వస్య చాహం హృది... వేద విదేవ చాహమ్'** (గీత. 15-15) అన్న శ్లోకం ద్వారా వివరించబడింది. ఈ శ్లోకం ద్వారా ప్రాపంచిక ఆసక్తి నుండి సాధకుడు పూర్తిగా విముఖుడై నిత్యబ్రహ్మంలో ఉండిపోయి వేదాంతిగా రూపాంతరం చెందే క్రమాన్ని పోరంకివారు చాలా స్పష్టంగా విశదీకరించారు.

**'మన్మనా భవ మద్భక్తో...... మత్పరాయణః'** (గీత. 9-34) అన్నది ఏడవ శ్లోకం. ఇది భగవద్గీతలోని **రాజవిద్యా రాజగుహ్య యోగం** నుండి ఇందులో **'నన్ను పూజిస్తూ నాకు నమస్కారం చేస్తూ నాకు భక్తులైనవాళ్ళు నన్ను పొందుతారు...'** అని పరమాత్మ చెప్పిన విషయం ప్రధానం. అలా పరమాత్మను పొందడానికి సాధకుడు వివిధ క్రియాయోగ సాధనా మార్గాలను ఎంచుకొని ఫలితాన్ని సాధించినప్పుడు పూర్ణజ్ఞాన ప్రకాశంలో ఉన్న సాదకుడికి ప్రాపంచికానుభవం సమసిపోతుంది. ఆ విషయాన్ని వివరిస్తూ సాధకునికి వివిధ భూమికల ద్వారా ఏయే అంశాల భేదనం జరుగుతుందో పోరంకివారు ఈ వ్యాఖ్యద్వారా స్పష్టం చేశారు. ఇది అత్యంత ప్రధానమైన, ఎరుగవలసిన, పొందవలసిన జ్ఞానం. **'ఆసక్తి నాశనమే ముక్తి'** అని చెప్పి ఆ ఆసక్తి ఎప్పుడు, ఎలా సమసిపోతుందో స్పష్టం చేశారిక్కడ రచయిత. పరిశీలిస్తే ఈ శ్లోక వివరణ ఆరవ శ్లోకానికి కొనసాగింపుగా కనిపిస్తోంది.

పరమాత్మను దర్శించాలంటే రేచక, పూరక, కుంభకాలను ప్రణవంతో కలిపి పన్నెండు సంఖ్యలో సాగుతూ అనుష్ఠించాలన్న విషయాన్ని **'రేచక పూరకశ్చైవ.... ద్వాదశ సంయుతః'** అన్న ఎనిమిదవ శ్లోకం వివరణలో ప్రకటించారు. ఈ శ్లోకం 'సామవేదీయ యోగ చూడామణి ఉపనిషత్తు' 9101) నుండి గ్రహించబడింది. ఇందులో కూడా ఆరు, ఏడు శ్లోకాలలో చెప్పబడిన సాధకుడి స్థితినే వివరిస్తూనే సాధనలో ప్రదానమైన రేచక, పూరక, కుంభకాల గురించి చాలా విస్పష్టంగా రచయిత విశదీకరించారు. దీనితోపాటు పన్నెండు క్రియలతో ప్రాణాయామం చేయడం గురించి ప్రత్యేకంగా పేర్కొనడం జరిగింది. **'సర్వం బ్రహ్మమయం జగత్....'** అన్న వాక్యానికి విస్తృత వివరణతో స్పష్టమైన రూపం ఇచ్చినట్లుగా గమనించవచ్చు.

కఠోపనిషత్తులోని **'అరణ్యోర్ నిహతో... మనుష్యేభిరగ్నిః'** (కఠో. 2-1-8) అన్నది ఈ పుస్తకంలోని తొమ్మిదవ శ్లోకం. ముందు శ్లోకాల కూటస్థ అనుభవాలలో చెప్పిన అనేక విషయాలు ఈ శ్లోక వివరణలో కనిపిస్తాయి. శరీర రూపమయిన కట్టెలో సర్వజ్ఞ ప్రకాశ స్వరూప బ్రహ్మ ఎలా విరాజిల్లుతున్నాడో వివరిస్తూనే ఆ జ్యోతి స్వరూపుని మథనం ద్వారా పొందే అనుభవం గురించి చెప్పబడింది. అలాగే

మనోమయ బ్రహ్మ గురించిన ప్రస్తావన కూడా ఈ శ్లోక వివరణలో కనిపిస్తోంది.

**'హకారేణ బహిర్యాతి... జీవో జపతి సర్వదా'** అన్న **'సామవేదీయ యోగచూడామణి ఉపనిషత్తు'** (31)లోని శ్లోకం పదవది. హకారంతో బయటకు వచ్చి, సకారంతో లోపలికి వెళ్ళే హంస గురించి ఇందులో చాలా స్పష్టంగా చెప్పబడింది. జీవునికి సూచనగా వివరించబడే హంస విషయంతో పాటు ప్రాణాయామాల అభ్యాసం గురించి కూడా ఈ శ్లోక వ్యాఖ్యలో వివరణ ఉంది. ఆ అభ్యాసం ద్వారా శాశ్వత ముక్తిని హంస ఎలా పొందుతుందో సూచనప్రాయంగా రచయిత వివరించారు.

కువలయానందస్వామివారు రచించిన గోరక్ష శతకంలోని **'సతతం ఘంటికా మధ్యే... ధ్యాత్వానందమయోభవేత్'** (83) అన్న శ్లోకంతో ఈ క్రియాగీత ముగుస్తున్నది. ఇందులో నాసికాగ్రంపై ధ్యానం నిలిపే సాధకుడు పొందే ఆనంద ప్రస్తావన స్పష్టంగా కనిపిస్తోంది. ఈ శ్లోక కూటస్థ అనుభవంలో క్రియాయోగానికి అంతిమావస్థ, నిర్వికల్ప సమాధి స్థితి గురించి పోరంకి వారు వివరిస్తూ సాధకుడు వివిధ దశలలో పొందే పరిణతిని కూడా రేఖామాత్రంగా స్పృశించారు.

క్రియాగీత అన్న పుస్తకం యోగసాధకుల జ్ఞానార్జనకు ఒక చక్కని కరదీపిక. క్రియకు ఎప్పుడూ విషయజ్ఞానం, విషయావగాహన చాలా అవసరం. ఏది ఏమిటి...? ఏది ఎందుకు...? ఏది ఎలా...? అన్న విషయాలను తెలుసుకొన్నపుడు దానికి సంబంధించిన క్రియను అత్యంత ప్రతిభావంతంగా సాగించి, ఫలితాన్ని అద్భుతంగా సాధించడానికి ఆస్కారం ఉంటుంది. అటువంటి మార్గంలో రచించబడినదే ఈ క్రియాగీత. ఈ పుస్తకం పోరంకి దక్షిణామూర్తిగారి ఆధ్యాత్మిక జ్ఞానానికి, యోగసాధనలో వారికున్న అభినివేశానికి, సాధకులను ఉత్తేజితం చేసే గురుతత్త్వానికి ఒక ప్రకాశవంతమైన దర్పణంలాంటిది అని చెప్పటం అతిశయోక్తి కాదు. యోగసాధకులకు జ్ఞానాన్ని అందించే మార్గదర్శక దిక్సూచి అనడం నిర్వివాదాంశం.

# అదొక్కటీ తెలుసుకో చాలు

**డా. జె. భారతి,** అధ్యక్షులు, తెలుగుశాఖ, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 94404 94409




**బ్రహ్మ సత్యం జగన్మిథ్య.** సత్యమైన బ్రహ్మం నుండి మిథ్య అయిన జగత్తు ఆవిర్భవించింది. బ్రహ్మాన్ని, జగత్తును వేరు చేసి చూపించే లోక సాధారణమైన ఈ మాటలు వినే జిజ్ఞాసువుకు మొదటగా వచ్చే ప్రశ్న సత్యమైన దానినుండి అసత్యమైనది ఏర్పడటం ఏమిటి అనేది. జగత్తు అంతా బ్రహ్మం ఆవరించి ఉంది అంటున్నప్పుడు ఏకకాలంలో సత్యాసత్యాలు రెంటికీ మనుగడ ఎలా సాధ్యం అనే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. ఈ ప్రశ్నలకు సమాధానం వెతకడానికి జిజ్ఞాసువు చేసే ప్రయత్నమే సాధన. ఆ ప్రశ్నలకు సమాధానంగా రెండు లేవు ఉన్నది ఒక్కటే. అదొక్కటి తెలుసుకో చాలు అని చెప్పే గురువు దొరికితే సాధకుడి ఆధ్యాత్మిక ప్రయాణం లేక సాధన ఒక గాడిలో పడుతుంది. కాని గురువు లభించడం అంత సులభం కాదు.

మానవజన్మ ఎత్తిన ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ఆ ఒక్కటి ఏమిటి? ఏ ఒక్కటి తెలుసుకుంటే మానవ జీవిత పరమార్థం సాధింపబడుతుంది? ఆ విషయాలను వివరించిన వివిధ ఆధ్యాత్మిక గ్రంథాల గురించి, ప్రబోధించిన ఆధ్యాత్మికవేత్తల గురించి, ఒకే గ్రంథం ద్వారా తెలుసుకోవడం జిజ్ఞాసువులకు, సాధన ప్రారంభదశలో ఉన్నవారికి ఎంతో ఉపయుక్తం. ప్రజోపయోగమైన అటువంటి గ్రంథమే **'అదొక్కటి తెలుసుకో చాలు'**. రచయిత పోరంకి దక్షిణామూర్తిగారు. ఆయన అనేక సందర్భాలలో చేసిన ఆధ్యాత్మిక ప్రసంగ పాఠాలు, వివిధ పత్రికలలో వ్రాసిన వ్యాసాలు, పలు ఆధ్యాత్మిక గ్రంథాలపై చేసిన సమీక్షలు, గ్రంథపీఠికలు అన్నింటినీ గుదిగుచ్చి జిజ్ఞాసువులైన పాఠకుల చేతికి జపమాలగా అందించారు. ఒక్కో వ్యాసమూ ఒక్కో రుద్రాక్ష. సంఖ్య మీద దృష్టి పెట్టి రుద్రాక్ష తిప్పేవారికి జపఫలితం దక్కదు. భగవంతుని పైన దృష్టి

పెట్టగలిగే వారికి రుద్రాక్షతో పనిలేదు. అలాగే వ్యాసాంతర్గత సమాచారాన్ని తన సాధనకు ప్రేరణగా గ్రహించే సాధకుడు సత్ఫలితాలు పొందగలడు.

1935లో జన్మించిన దక్షిణామూర్తిగారు తాను రచించిన మొదటి ఆధ్యాత్మిక వ్యాసం (ఆది శంకరుల గురించి) 1953లో ప్రచురితమైందని ఈ గ్రంథం తొలిపలుకులో చెప్పుకున్నారు. కథకుడుగా, విమర్శకుడిగా, అనువాదకుడుగా సాహితీలోకంలో లబ్ధప్రతిష్ఠులైన దక్షిణామూర్తిగారు 20 ఏళ్ల వయసులోపే ఆధ్యాత్మిక రచన చేయటం ఆశ్చర్యమనుకుంటే 1973లో ఆంధ్రప్రతికలో త్రైలింగస్వామిని గురించి వ్రాసిన వ్యాసం తరువాతే తన మిగిలిన ఆధ్యాత్మిక సంబంధ రచనలు, ప్రసంగాలు వచ్చాయని చెప్పటం అంటే మొదటి ఆధ్యాత్మిక వ్యాసం తరువాత 20 ఏళ్లకి కానీ రెండవది వ్రాయకపోవటం ఇంకా ఆశ్చర్యకరం.

త్రైలింగస్వామి 300 ఏళ్లు జీవించిన యోగి పుంగవుడనీ, వారణాసి వీధుల్లో నడిచే విశ్వేశ్వరుడిగా కొలవబడ్డ ఈయన తెలుగువాడనీ, రామకృష్ణ పరమహంస, శ్యామచరణ్ లాహరీ వంటి యోగులకు గురుస్థానీయుడనీ, బెంగాలీయులు ఈయన కథను చలనచిత్రంగా రూపొందించినారనే అద్భుతమైన విషయాలు వివరించిన వ్యాసంతో ఆరంభమైన ఈ గ్రంథంలో ప్రస్తావించబడిన ప్రతి ఒక్క విషయమూ సంపూర్ణంగా ఎలా తెలుసుకోవాలి అనే కుతూహలాన్ని కలిగిస్తూ చదివింపచేస్తుంది.

**నేనెవ్వరు** అన్నది ఒక్కటి తెలుసుకో చాలు అన్న భగవాన్ రమణుల ఉద్బోధను వ్యాసరూపంగా వివరించి, వ్యాస శీర్షికనే గ్రంథనామంగా ఉంచి తాను భగవాన్ రమణుల మార్గానుసారినని చెప్పకనే చెప్పారు రచయిత. ఈ గ్రంథంలో ఆధ్యాత్మిక వ్యాసాలు – 1, సభా ప్రసంగ పాఠాలు – 4, ఆధ్యాత్మిక గ్రంథ పీఠికలు – 7, ఆధ్యాత్మిక గ్రంథ సమీక్షలు – 17, ఆకాశవాణి ప్రసంగాలు – 13, ప్రముఖులకు వ్రాసిన లేఖలు – 3 సంకలించబడ్డాయి. పూలదండలో దారంలాగా ఈ వ్యాసాలన్నిటిలో ఉన్నది ఒక్కటే అనే భావం అంతస్సూత్రంలా ప్రవహించింది.

గురుబోధ లేకపోయినా హృదయబోధతో తానెవ్వరో గ్రహించిన భగవాన్ రమణులు **'నేను కానిదల్లా తొలగించుకుంటూ పోతే మిగిలేది నేనే, తెలిసేది నేనే, ఉన్నది నేనే'** అంటూ ఆత్మ విచారాన్ని ఉపదేశించారు. ఆత్మ విచారమంటే 'నేను'కు మూలమేదో కనుక్కోవటం అనీ, వేదకాలం నుంచి వేషకాలం వరకు మహామహులు చెబుతూ వస్తున్నది అదే అనీ (పు.26-27) మూర్తిగారు వివరించారు. **"సృష్టి ఒక అద్దం. దాంట్లో ముందు నిన్ను నువ్వు చూసుకో. ఆ తరువాత ప్రపంచాన్ని నీలో చూసుకో"** (పుట.28) అంటూ రమణుల ప్రబోధాన్ని క్రోడీకరించి అందించారు. భగవంతుడి తల్లిగా గుర్తింపు పొందిన రమణుల తల్లి పూర్వజన్మలో చేసుకున్న పుణ్యమేమో తెలియదు కాని ఈ జన్మలో చివరి రోజుల వరకు ఆవిడ ప్రత్యేకంగా సాధించిన అర్హత ఏమీ ఉన్నట్టు కనిపించదు (పు.79) అంటూ భగవాన్ రమణులు తల్లి అవసాన సమయంలో తన ఆత్మశక్తిని ఆమెలోకి ప్రవేశపెట్టి ఆవిడ ప్రాణశక్తిని నిలువరించి జన్మరాహిత్య స్థితికి చేర్చిన విధానాన్ని ప్రత్యేక వ్యాసంలో ఆసక్తికరంగా మనసుకు హత్తుకునేలా వివరించారు మూర్తిగారు. భగవాన్ రమణులు ఇతర యోగులను కలిసిన సందర్భంలో వారిమధ్య మౌన సంభాషణా ప్రసారం జరిగిన విధానం గురించి వివరించిన వ్యాసాలు కూడా పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

**'ఆధునిక తత్త్వవేత్తలు – సామాజిక దృక్పథం'** అనే వ్యాసం విషయంలోనూ, విస్తృతిలోనూ ఈ గ్రంథంలో ప్రత్యేకమైనది. బ్రహ్మం, నేను అనే ద్వంద్వస్థితి నుండి 'నేనే బ్రహ్మం' అనే స్థితికి చేరుకునే క్రమంలో సమాజానికి కొంతదూరం జరిగినా ఆ స్థితికి చేరిన తరువాత తమ జ్ఞానంతో ప్రజలను ప్రభావితం చేసి సమాజాభివృద్ధికై కృషి చేసిన ఆధునిక తత్త్వవేత్తల సామాజిక మార్గదర్శనాన్ని ఈ వ్యాసంలో విపులీకరించారు. **'రాజా రామమోహన్‌రాయ్ ఆధునిక ఉపనిషత్ ద్రష్ట', 'వివేకానందుడు భారతీయ చిదాత్మకొక మానవాకృతి'** 'ఈయన ప్రతి పలుకూ గడదేరిన మగటిమి కొక భేరినాదం' వంటి ఉత్తేజపూరితమైన వ్యాకాలతో దయానంద సర్స్వతి, రామకృష్ణ పరమహంస, భగవాన్ రమణులు, జిడ్డుకృష్ణమూర్తి, పరమహంస యోగానంద, గాంధీజీ మొదలైన తత్త్వవేత్తల మార్గాలను అనుశీలించారు.

**మహా మనస్వి కారుణ విలాసం** అనే వ్యాసం వ్యాసభారత ఆశ్రమపర్వంలో వ్యాసమహర్షి కురుక్షేత్ర సంగ్రామంలో చనిపోయిన వీరులు, బతికి వచ్చినట్లుగా ప్రదర్శించి గాంధారి మొదలైన స్త్రీలకు సంతోషం కలిగించిన ఘట్టాన్ని, వ్యాస మహర్షి కరుణాంతరంగాన్ని వివరించిన చక్కటి వ్యాసం. వ్యాసుని జన్మదినాన్ని గురుపూర్ణిమగా పరిగణించడం, గురువు గొప్పతనం, అవసరం మొదలైన విషయాలను **గురుపూర్ణిమ** వ్యాసం ద్వారా పరిచయం చేశారు.

దక్షిణామూర్తిగారు రచించిన ఆధ్యాత్మిక గ్రంథ పీఠికలు, విలక్షణ శీర్షిలతో ఆకట్టుకుంటాయి. ఆదిశంకరుల ఆత్మబోధను గురించి చెప్పబడిన గ్రంథానికి **'ఉన్నది ఒక్కటే'** అనే శీర్షికతో పీఠిక వ్రాయగా, **గీతికారస దీపిక, దీపారాధన, గోటిమీద చూపిన గోదంత బొమ్మ, ఆనందవనం, ప్రసాదగుణం** అనేవి మరికొన్ని పీఠికా శీర్షికలు. దీవి సుబ్బారావుగారు భగవత్ ప్రేమను వర్ణిస్తూ రచించిన **'పరమగీతం'** అనే ప్రేమ కావ్యానికి రచించిన **'పీఠిక గీతికా రస దీపిక'**, భగవత్ ప్రేమను తమ కవిత్వంలో ప్రకటించిన చాలామంది కవులను ఈ పీఠికలో రచయిత ప్రస్తావించారు.

ఆధ్యాత్మిక గ్రంథాలను సమీక్షించడంలో మూర్తిగారు మూసధోరణి ప్రదర్శించలేదు. సమీక్షించిన గ్రంథాలు, సమీక్షా విధానం దేనికవే

ప్రత్యేకం. గ్రంథగత అంశాలలో మౌలిక విషయాలను విపులంగా వివేచిస్తూ గ్రంథ రచయితలు, అనువాదకులు పొరపాటు పడిన సందర్భాలలో నిర్మొహమాటంగా ఎత్తి చూపడం, తరువాతి ప్రచురణకు సూచనలందించటం, ప్రచురణకర్తల, రచయితల దోషాలను సవరించుకోవడానికి అనువుగా విడదీసి సూచించడం, వీరి సమీక్షా పద్ధతి. సమీక్షించిన గ్రంథం మెడిటేషన్ గురించైనా, సూఫీ కవిత్వం గురించైనా, తత్త్వవేత్తల గురించైనా ముందుగా తన అవగాహనను, అనుభవాలను, అభిప్రాయాలను వివరించి చివరగా గ్రంథ సారాంశాన్ని స్థూలంగా అందించడం వీరి ధోరణి. ఈ గ్రంథంలో ఏడు సమీక్షా వ్యాసాలుండగా అందులో నాలుగు జిడ్డు కృష్ణమూర్తి ఆంగ్ల రచనలకు తెలుగు అనువాదాల గురించిన సమీక్షలే.

ఆకాశవాణి ప్రసంగ పాఠ వ్యాసాలలో **'దృశ్యం'** అనే శీర్షికతో వచ్చిన వ్యాసం **'యద్దృశ్యం తన్నశ్యం'** – కనిపించేది నశిస్తుంది అన్న శంకరుల మాటలకు వివరణ వంటిది. **'నిశ్శబ్దం'** అనే ప్రసంగ వ్యాసం, **'శబ్దమంటే సుఖాన్నిచ్చేది'** అని చెబుతుంది నిఘంటువు అని ఆరంభించబడింది. ఈ అర్థాన్ని సమర్థిస్తూ ఖండిస్తూ చేసిన వ్యాఖ్యానంతో పాటు నిశ్శబ్దానికి ఉన్న శక్తి ఇందులో వివరించబడింది. ప్రసంగాల శీర్షికలన్నీ ప్రసంగ విషయానికి సంక్షిప్తీకరణే. **అంతా మన మంచికే, ఉడతాభక్తి, అహంభావం, మనస్సాక్షి, వెలుగుదారి** మొదలైన శీర్షికలతో చేయబడిన ప్రసంగాలన్నీ ఆధ్యాత్మిక విలువలను అలవోకగా అందించినవే. 'యోగపథం' అనే ప్రసంగంలో రాజయోగమే క్రియాయోగమని జ్ఞాన కర్మ మార్గాల కంటే ఇది గొప్పదని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన దానిని ఉటంకించారు. 'మనస్సు చంచలత్వం పోవాలంటే ప్రాణాలకున్న చంచలత్వం పోవాలి, అందుకు ప్రాణాయామం ఉపకరిస్తుందని ప్రాణాయామ సాధనా విశిష్టతను వివరించారు. (పి. 199). మానవుడు **'దుఃఖవిముక్తి, సుఖప్రాప్తి కోసం బయట ప్రయత్నిస్తున్నాడనీ'** కానీ లోపల పొందలేనిదేదీ బయట పొందలేడనీ, విశ్వంలో అణువూ, అణువులో విశ్వమూ నిక్షిప్తమై ఉన్నపుడు ఏది బయట ఏది లోపల అంటూ ప్రశ్న వేసి (పు.196) జిజ్ఞాసువు సాధన కొనసాగించటానికి బాటలు పరిచారు.

తనతోపాటు ఆధ్యాత్మిక రచనలు చేస్తున్న ఇతర రచయితలకు మూర్తిగారు అందించిన అభినందనలతో కూడిన ప్రోత్సాహానికి వారు ఉత్పల సత్యనారాయణాచార్యగారికి, మలపాక శివరామకృష్ణగారికి, విమలాశర్మగారికి వ్రాసిన లేఖలు చక్కటి నిదర్శనం. ఎక్కడెక్కడో ఉన్న విషయాలను ఎవరికి వారు వెతికి తెచ్చుకునే శ్రమ లేకుండా ఆ శ్రమంతా తానే పడి జిజ్ఞాసువులకు సిద్ధాన్నం సమకూర్చారని, మరొక రచయిత గురించి దక్షిణామూర్తిగారు చేసిన వ్యాఖ్యానం వారికి సరిగ్గా అన్వర్థమవుతుంది.

**"ప్రేమాభిమానాలూ, సహాయ సహకారాలు, సానుభూతీ, సౌహార్దమూ, సహనమూ, స్నేహమూ వంటి సద్గుణాలు మనిషిలో సహజంగా వెల్లడి కావడం నిజానికి ఇతరుల కోపం కాదు, కాగూడదు. తనకోసం అందరిలో ఉన్న తనకోసం, తనలో ఉన్న అందరి కోసం"** (పుట.196).

భారతీయ ఆధ్యాత్మికతకు పునాది వంటి ఈ భావనని అందరిలో పెంచడానికి అందరికీ పంచడానికి దక్షిణామూర్తిగారు చేసిన ప్రయత్నం **'అదొక్కటి తెలుసుకో చాలు'.** ఆ ఉన్నత భావవ్యాప్తికి ఉపాధిగా మలచబడ్డ ఈ గ్రంథం అందరికీ అవశ్యం పఠనీయం.

# జ్ఞాన సంకలనీ తంత్రం

**డా. ఎన్. అనంత లక్ష్మి,** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఫోన్ : 99491 98141

భారతీయ మహర్షులు మనకి అందించిన ఎన్నో విద్యలలో తంత్రం ఒకటి. రాను రాను తంత్ర విజ్ఞానాన్ని (వామాచారం) చెడుకి ఎక్కువగా ఉపయోగించే వారి సంఖ్య పెరగటంతో దానిని పక్కకి పెట్టటం జరిగింది. 'తను విస్తారే' అంటే విస్తరించటం అని, 'త్ర' ప్రత్యయానికి కాపాడటం అని అర్థాలు. ఒక పనిని విస్తారంగా అంటే అతి చిన్న అంశంలో కూడా జాగ్రత్త వహిస్తూ ఎటువంటి లోటు లేకుండా చేసి రక్షించే క్రమం. ఉదాహరణకి అందరు పూజ చేస్తారు. మరికొంతమంది ఏర్పాట్ల విషయంలో చూపే శ్రద్ధ ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ ఏర్పాట్లు, చేసే క్రమం వీటిని తంతు అనటం వింటాం. పెళ్లి తంతు అనే మాట వినే ఉంటారు అందరు. తంత్రమే నిత్య వ్యవహారంలో తంతుగా రూపాంతరం చెందింది. ఇది లౌకిక తంతు.

సాధనామార్గంలో ముందుకి సాగాలనుకునే వారికి కూడా కొన్ని తంత్రాలు ఇవ్వబడినాయి. సాధనలో సాగేవారు కొన్ని చిన్న విషయాలని పట్టించుకోకపోవటం జరుగుతుంది. అవన్నీ కూడా సమగ్రతకి, పరిపూర్ణతకి దోహదం చేసేవే కనుక వాటిని కూడా ఇవ్వటం జరిగింది. అవే తంత్రాలు. అటువంటి వాటిలో ఒకటి జ్ఞానసంకలనీ తంత్రం. ఇది శాంభవీ తంత్రంలో భాగం అని ఎన్.ఎన్. ఖండేల్‌వాల్‌గారు మొదటిసారి ఈ గ్రంథప్రచురణ జరిగినప్పుడు దానిముందు మాట **'నివేదన్'**లో పేర్కొన్నారు. దీనిని తెలుగువారికి పరిచయం చేసి, అనువాద సహితంగా అందించినవారు

శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారు. మూలగ్రంథం అనువాదానికి ముందు తాను తంత్రశాస్త్రం గురించి తెలుసుకోవటానికి అధ్యయనం చేసిన గ్రంథాలను పేర్కొని తొలిపలుకులో తంత్రశాస్త్రం గురించి సమగ్ర సుందర వివరణ ఇచ్చారు. అందులో **'తంత్రాలన్నవి కేవలం వామాచారానికే పరిమితమయినవని అనుకోవడం తప్పు అని తెలుస్తుంది... వామాచార మన్నదంతా హేయమయిందనీ, జుగుప్సాకరమైనదీ అనుకోవడం కూడా తప్పు...."** అని లోకంలో ఉన్న అపోహలను నివారించారు.

సుమారుగా 16 అనువాద గ్రంథాలను తెలుగువారికి అందించారు శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారు. అనువాదం చేయటానికి రెండు భాషలలో ప్రావీణ్యం ఉండటంతో పాటు భావ ప్రకటనా సామర్థ్యం, విషయ పరిజ్ఞానం కూడా తోడు కావాలి. ఇవన్నీ కావలసినంతగా ఉన్న కారణంగా శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారి అనువాదాలు అభినందనీయాలు. మిత్రుడి కోసం జ్ఞాన సంకలనీతంత్రం అనువాదం చేసిన స్నేహశీలురు శ్రీ దక్షిణామూర్తిగారు.

మహేశ్వరుడు పార్వతీదేవికి వేదాంతసారాన్ని వివరించిన 111 శ్లోకాలే జ్ఞాన సంకలినీ తంత్రం. దీనికే **'జ్ఞాన సంకులనీ తంత్రం'** అనే నామాంతరం కూడా ఉంది. **"జ్ఞానం అంటే ఏమిటి?"** అనే పార్వతీదేవి ప్రశ్నతో మొదలవుతుంది సంవాదాత్మకంగా సాగే ఈ గ్రంథం. **"సృష్టి ఎక్కడ మొదలయింది? నాశం ఎట్లా జరుగుతుంది. సృష్టి సంహారాలకి అతీతంగా ఉండే బ్రహ్మజ్ఞానం తెలియ చేయ"**మని అడిగింది. ఇటువంటి సందేహాలు ఆలోచించటం జీవలక్షణంగా ఉన్న మనుషులందరికీ ఎపుడో అప్పుడు కలిగేవే. అవ్యక్తమే బ్రహ్మజ్ఞానం అని, అదొక్కటే నాశం లేనిదని చెపుతాడు శివుడు. ఓంకారం నుండే సమస్త విద్యలు, సాధనలు వచ్చాయని, అవన్నీ మన శరీరంలోనే ఉన్నాయని కట్టెలో నిప్పులాగా, పువ్వులో వాసనలాగా పాపపుణ్యాలు అంటని దేవుడు శరీరంలో ఉన్నాడని, ఇడ, పింగళ, సుషుమ్నలు, ఖేచరీ ముద్ర, భిన్న దర్శనాలు, పిండాండ బ్రహ్మాండాలు, 25 లక్షణాలు, సప్త ధాతువులు, వాక్కు, మానవ శరీరంలో గ్రహాల స్థానాలు, శక్తి స్థానం,... ఈ విధంగా యోగశాస్త్రానికి సంబంధించిన అంశాలనన్నింటినీ సూత్రప్రాయంగా పార్వతి ప్రశ్నలకి సమాధానాలుగా చెప్పటం జరిగింది.

చివరికి **"ఏ జ్ఞానం వల్ల పాపం తొలగిపోతుందో అది చెపుతాను విను. భూమి, నీరు, వెలుగు, గాలి, ఆకాశం అన్న వాటివల్ల పుట్టిన దేహం స్థూల దేహం. కాని సూక్ష్మదేహం వేరేవిధంగా ఉంటుంది".** నిజానికి ఈ ఒక్కదాని వివరణే ముందు చెప్పినదంతా. వాటిలో కూడా ప్రతి ఒక్కదానికి ఎంతో వివరణ అవసరం. ఇవన్నీ ప్రాథమిక




జ్ఞానం సంపాదించి, ఆచరణలో పెట్టిన తరువాత సాధనలో కలిగే సందేహాలు. అందువల్ల వాటిని వ్యాఖ్యాన పూర్వకంగా గురుముఖతః తెలుసుకోవాలి. దాన్ని సూచించటానికే పార్వతీదేవి దక్షిణామూర్తి స్వరూపుడై జ్ఞానదాయకుడైన యోగీశ్వరుణ్ణి అడిగి ఉపదేశం పొందినట్టు చెప్పటం. ఇది స్థూల దేహం నుండి మొదలై సూక్ష్మ దేహం వరకు వెళ్ళే ప్రక్రియ. ఆపై శాంభవీ తంత్రంలో లుప్తమైన భాగంలో ఉండి ఉండవచ్చు.

పొందవలసిన జ్ఞానం చివరలో చెప్పినా పొందే మార్గం ముందుగానే చెప్పటం జరిగింది. అది **"బ్రహ్మవిద్యకు సంబంధించిన ఉపదేశాన్ని ప్రతి దినమూ వింటూ, ఉండేవాడు సమస్త పాపాల నుండి విముక్తుడై శివలోక ప్రాప్తి పొందుతాడు".**

ఇంత మంచి తంత్ర గ్రంథాన్ని తెలుగువారికి అందించిన శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారికి నమస్సులు అందించటం మాత్రమే మనం చేయగలిగింది.

# ఆధ్యాత్మిక సాధనలో దక్షిణామూర్తి

**జనస్వామి లక్ష్మి అనూరాధ,** ప్రముఖ భవన నిర్మాతలు, ఫోన్ : 924 616 5603

పరమహంస యోగానందగారు సమకాలీన ఆధ్యాత్మిక ప్రముఖులలో గుర్తింపు పొందిన వ్యక్తి. తన బోధల చేత చాలామందిని ప్రభావితం చేసి ఆధ్యాత్మిక మార్గంవైపు మళ్ళించిన మనీషి. వారి బోధనలు యథాతథంగా అనేక సమాచార మాధ్యమాల ద్వారా సగటు మనిషికి అందజేయాలనే సదుద్దేశంతో స్థాపించబడినది యోగదా సత్సంగ సొసైటీ. ఒక రచయిత యొక్క ప్రజ్ఞ వారి భాషా శైలిలో, వాక్య నిర్మాణంలో, భావ స్పష్టీకరణలో ప్రస్ఫుటమవుతుంది. ఆధ్యాత్మిక గ్రంథాలు సాధారణ వ్యక్తికి అర్థమవ్వాలంటే దానికి రచయిత ముఖ్యులవుతారు. యోగదా సత్సంగ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారు **'ఒక యోగి ఆత్మకథ'** అనే శీర్షికన పరమహంస యోగానందగారి జీవిత చరిత్రనే కాక వారు వివిధ ప్రదేశాల్లో చేసిన ప్రసంగాలను తెలుగులోకి అనువదించారు. అందులో రెండు పుస్తకాలను గూర్చి ఈ వ్యాసంలో తెలుసుకుందాం. **"జీవించడమనే కళ", "మానసిక అశాంతి – కారణం, చికిత్స".** ఈ రెండు పుస్తకాలు చాలా చిన్న పుస్తకాలుగా కనిపించినా వీటిలో మానవుడు జీవించాల్సిన విధానాన్ని, చాలా సూటిగా, తేలిక పదాలతో అన్నిన వయసులవారికీ అర్థమయ్యేలా చెప్పడం జరిగింది.

**"జీవించడమనే కళ"** అనే పుస్తకంలో వారు పరమహంస యోగానందగారి అయిదు ప్రసంగాలను, **"మానసిక అశాంతి – కారణం, చికిత్స"** అనే పుస్తకంలో నాలుగు ప్రసంగాలను అనువదించారు. జీవించడమనే కళ అన్న ప్రసంగ వ్యాసం ఒక వ్యక్తి జీవితం మీద ప్రభావం చూపించే అన్ని అంశాలను, ఒక ఉన్నత జీవనశైలి అలవరచుకుని ఆదర్శ జీవితం గడపడానికి కావలసిన ఆచరణ పద్ధతులను తెలియపరుస్తుంది. ఒక ఆదర్శ ప్రపంచం తయారు కావాలంటే ఆదర్శ మానవులు కావాలి. మానసికంగా, శారీరకంగా, నైతికంగా, ఆర్థికంగా, సాంఘికంగా, ఆధ్యాత్మికంగా సర్వతోముఖప్రజ్ఞ కల పూర్ణ మానవుల వల్ల ఒక ఆదర్శ ప్రపంచం ఏర్పడుతుంది. ఆధ్యాత్మికంగా పురోగమిస్తూ, భౌతిక సంపద పరంగా నైపుణ్యం ఉన్నవారే ఒక చక్కని జీవనమార్గాన్ని, జీవించడమనే కళను తెలుసుకోగలుగుతారు. శరీరాన్ని, మనస్సును, ఆత్మను సమానంగా అభివృద్ధి చేసుకోడానికి కొన్ని తేలికైన పద్ధతులను ఈ ప్రసంగంలో వివరించారు. ఇందులో మానవ జీవితపు నాలుగు ఆశ్రమ ధర్మాల గురించి కూడా వివరించబడి ఆయా వయస్సుల వారు అనుసరించే ధర్మాలను చాలా స్పష్టంగా తెలిపారు. చేసే ప్రతిపనిలో ప్రశాంతతను జోడించడం, ప్రశాంతతతో పనితనం పెంచుకోవాలని తెలియజేశారు.

ధ్యానం ద్వారా పొందిన ప్రశాంతతను దైనందిన కార్యక్రమాలలో చొప్పించడం ద్వారా పనిలో ప్రశాంత స్థితి వస్తుంది. గీతలో కృష్ణుడు చెప్పినట్లుగా కర్మలు నిర్వహించి, కర్మఫల త్యాగం చేసి జయం కలిగినా, అపజయం కలిగినా సమబుద్ధిని ప్రదర్శించేవారే యోగులన బడతారు. అటువంటివారే మనస్సుని భగవంతునితో అనుసంధానించుకొని ఆయనతో సంభాషించగలిగిన వారే జీవనకళలో నైపుణ్యం సంపాదిస్తారు. అటువంటివారికే ఆరోగ్యం, సంపద, వివేకం, ఆనందం, ప్రేమ అనే దివ్యగుణాలు ఉంటాయని తెల్పినారు.

పరమహంస యోగానంద ఆగస్టు 20, 1939లో కాలిఫోర్నియాలో చేసిన ప్రసంగంలో అందరూ ఇష్టపడేటట్లుగా ఉండడం ఎలా అనేది తెలిపారు. భగవంతుడు అందరినీ ఒకేవిధంగా సృష్టించినా, కొందరిని చూస్తే ఆకర్షణ కలుగుతుంది. కొందరిని చూస్తే వికర్షణ, కొందరిని కలిసినప్పుడు ఏ భావమూ కలగకపోవడం అనేది జరుగుతుంది. ఈ ఆకర్షణ, వికర్షణలకు భగవంతుని ప్రమేయం ఉండదు. పూర్వజన్మలలో అలవరచుకున్న మంచి, చెడు లక్షణాలే తరువాతి జన్మలలో ఈ భావాలకు కారణం. మనలోని మంచి లక్షణాలే మనల్ని ఇతరులు ఇష్టపడేట్టు చేస్తాయి. మంచి మంచిని ఆకర్షిస్తుంది. చెడు చెడుని ఆకర్షిస్తుంది. బాహ్య సౌందర్య ఆకర్షణ వైపు కాక అంతః చైతన్యశక్తి ఆకర్షణవైపు దృష్టిసారించాలని తెలిపారు. అంతర్గత భావాలు, వాటిలోని మార్పుల వల్ల ఆలోచనలలోని ఉద్రేకాలు, స్పందనలు ముఖంలో ప్రతిబింబిస్తాయి. ప్రశాంతతతో, ఆనందంగా ఉన్న వ్యక్తి ఆకర్షణీయుడవుతాడు. మన ప్రవర్తపైనే ఇతరుల అభిప్రాయాలు ఆధారపడి ఉంటాయి. వస్త్రధారణ ప్రాధాన్యత, సౌకర్యం అనేది బాహ్యమైనది. అంతర్గతమైన సద్గుణాలు పెరిగే కొద్దీ దుస్తుల ప్రాముఖ్యత తగ్గిపోతుంది. శరీరాన్ని ఒక సాధనం లాగా వాడుకోవాలే తప్ప అతిశ్రద్ధ కానీ, అతి తక్కువ శ్రద్ధ గానీ చూపితే సమతుల్యత నశించి, మూర్ఖత్వం పెరుగుతుంది. శరీరం కంటే మనస్సుని జాగ్రత్తగా మలచుకుంటే చక్కటి ప్రవర్తన అలవడుతుంది.

దయ, సానుభూతి, ఇతరులను అర్థం చేసుకుని వారి అవసరాలకు తగినట్టు స్పందించటం అనే సత్ప్రవర్తన ద్వారా ఇతరులు మన గురించి ఆలోచిస్తారు. నిజాయితీగా, సూటిగా, సరళంగా, ప్రేమతో మాట్లాడే వ్యక్తి మాటలను అందరూ వింటారు, అనుసరిస్తారు. ఆ మాటల వెనక ఉన్న శక్తి వారిని ప్రభావితం చేస్తుంది. ప్రతీ వ్యక్తికి ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. కానీ ఆ

ప్రత్యేక లక్షణం అహంకారం వైపు కాక భగవంతుని శరణాగతి వైపు తిప్పగలిగినవారే ఆధ్యాత్మికంగా ముందుకు సాగగలుగుతారు. భగవంతుని అన్వేషణ అనేది ఒక దృఢసంకల్పంగా పెట్టుకొని ముందుకు సాగితే అన్నింటా విజయం స్వంతమవుతుంది. ఆ సమయంలో ఈ వ్యక్తిత్వం భగవంతుడిచ్చిన కానుక. నన్ను నేను అభివృద్ధి చేసుకుని నా పాత్రను నేను సమర్థవంతంగా పోషిస్తాను అన్న భావన వస్తే ఆకర్షణ పెరుగుతుంది. ఇదే భగవంతుని దగ్గరకు చేరుస్తుంది. ఒక పువ్వులోని అందం, స్వచ్ఛమైన మనస్సులోని ఆకర్షణ ఉన్నవాడు అందరిచేతా, ఆ భగవంతుని చేత కూడా ప్రేమింప బడతారు అని తెలిపారు.

మూడవ ప్రసంగంలో ఒక వ్యక్తి తన శీలాన్ని, నడవడికను అధ్యయనం చేయడం వల్ల స్వభావ స్వరూపంలో మార్పులు ఏవిధంగా కలగవచ్చో వివరించారు. శరీర నిర్మాణం బట్టి వ్యక్తి ఎలాంటివారు అనేది తెలియదని శరీర లక్షణాలు నిజ స్వభావాన్ని వ్యక్తం చెయ్యలేవు అని అన్నారు. కళ్ళలో ఒక వ్యక్తి స్వభావం కొంతవరకూ తెలిసినా ఎన్నో జన్మల ఆలోచనలు ఒక వ్యక్తి శరీరం లక్షణాలను ప్రభావితం చేస్తాయని, దానికి సోక్రటీసు ఉదాహరణ ఉటంకించారు. పూర్వజన్మలలోని దుష్టకర్మలు శరీరాన్ని వికారంగా మార్చినా, ఈ జన్మలోని మంచికర్మలతో ఆ స్వభావాన్ని జయించవచ్చు అన్నారు.

అదేవిధంగా ప్రతీ వ్యక్తికీ ఒక సమత్వస్థితి అనేది ఒక ఆధ్యాత్మిక పురోగతికి కీలకమైన అంశం. క్రియాశీలురకూ, ఆలోచనాపరులకూ చాలా తేడా ఉన్నా ఈ రెండు తరహా వ్యక్తులూ అవసరమే. క్రియాశీలురకు ధ్యానం చేసుకోమని చెప్పడం ద్వారా వారి క్రియాశీలతను ఆధ్యాత్మిక మార్గం వైపు మరల్చవచ్చు. అదేవిధంగా ఆలోచనపరులు ధ్యానంతో పాటు శారీరక పరిశ్రమ చేస్తే వారికి ఆధ్యాత్మిక పురోగతి కలుగుతుంది. కోపం, కోరికలు, దురాశ, నిస్పృహ, నిరాశ, ఇంద్రియ లోలత్వం ఉన్నవారు వారి హృదయం లోంచి మార్పు రావాలని కోరుకుంటే తప్ప ఆధ్యాత్మిక మార్గంలోకి రాలేరు.

ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవాళ్ళు సత్వగుణం కలవారు, కార్యశీలత గలవారు. రజోగుణం, తామస గుణం ఉన్న వ్యక్తులకు కలహం, కోపం, ఇంద్రియ లోలత్వం, సోమరితనం ఉంటాయి.

ఆధ్యాత్మిక సాధనలో ఏవిధమైన అలవాటూ ఉండకూడదు. తామసగుణం ఉన్నవారు రజోగుణానికి, రజోవ్యక్తులు సత్వగుణానికి మారటానికి సాధన చేయాలి. సత్వగుణం ఉన్నవారు అహంకారానికి లోనుకాకుండా అప్రమత్తతతో ఉండాలి. మానవులందరిలోను జంతు లక్షణాలు ఉంటాయి. ఆయా లక్షణాలు సందర్భానుసారం వ్యక్తమవుతాయి. అదేవిధంగా స్త్రీ పురుషుల మధ్య తేడా వుంటుంది. స్త్రీ లేనిదే పురుషుడు లేడు. పురుషుడు లేనిదే స్త్రీ జన్మించలేదు. బుద్ధిని అనుసరించే పురుషుడు, భావాన్ని అనుసరించే స్త్రీ ఇద్దరూ పరస్పరం సహకరించి తమలోని బుద్ధికి, భావోద్రేకానికి సంతులనం సాధించాలి. ఈవిధంగా పరిపూర్ణత్వాన్ని సాధించాలి.

ఒక వ్యక్తి ఆంతరంగిక ప్రశాంతతతో ఉన్నప్పుడు ఒకానొక సహజావబోధం కలుగుతుంది. దాని ద్వారా అత్యంత విశ్లేషక శక్తి ఏర్పడుతుంది. ఆ శక్తివల్ల మాత్రమే అవతలి వ్యక్తి యొక్క స్వభావం గ్రహించడానికి వీలవుతుంది. దీనికి ధ్యానమే మార్గం. అన్ని ప్రాణులలో ఉన్న ఆత్మలకు తాము భగవంతుని నుండి విడివడామనే అచేతన జ్ఞాపకశక్తి వలన ఆ పరమాత్మను చేరడానికి మార్గాలను వెదుకుతాయి. కానీ కేవలం




మానవజన్మ ఎత్తిన ఆత్మ మాత్రమే ఆ పరమాత్మతో తన ఏకత్వాన్ని జ్ఞప్తికి తెచ్చుకోగలుగుతుంది. జ్ఞాపకశక్తి అనేది లేకపోతే ఇంతకు పూర్వం నేర్చుకున్నవి, చేసినవి అన్నీ మరచిపోతాం. మళ్ళీ మొదటినుండి మొదలు పెడతాం. అంతెందుకు నిద్రలో నుండి మేల్కొంటూనే ఈ శరీరం నాది అన్న జ్ఞాపకశక్తితో లేస్తాం. అవచేతనా మనస్సు ఎల్లప్పుడూ పనిచేస్తూ మన అనుభవాలను చిత్తంలో దాచిపెడుతుంది. ఈ జ్ఞాపకశక్తికి రెండు స్వభావాలు. ఒకటి మానవస్మృతి, రెండు దివ్యస్మృతి. అందరికీ మానవ స్మృతి ఉంటుంది. వ్యాయామం ద్వారా శారీరక శక్తి పెంచుకుని, ఆహార నియమాల ద్వారా మనస్సుని ప్రాణశక్తి మీద ఏకాగ్రం చేసినపుడు మన జ్ఞాపకశక్తి వృద్ధిపొందుతుంది. దానివల్ల నిద్రాణమైన దివ్యస్మృతి అనగా తాము భగవంతునిలోని భాగమే అన్న భావం తట్టి లేపుతుంది. నాడీ మండలంలో ప్రశాంతత, మనస్సుని శుద్ధి చేసి, జ్ఞాపకశక్తిని కలుగచేస్తుంది.

శరీర వ్యాయామం చేసుకోవడం, ధ్యానం చేయడం, మంచి అనుభవాలను గుర్తు చేసుకోవడం, చేతనా మనస్సును నిరంతరం భగవత్ చింతన చేయడం వల్ల మాత్రమే జ్ఞాపక శక్తిని పెంచుకోగలుగుతాం. తాను శరీరమన్న భావాన్ని విడనాడి, మానవ సహజమైన

పరిమితులు ఉన్నాయనే భావనను పోగొట్టుకోవాలి. తాను ఆత్మనని, అమరమైన ఆ పరమాత్మలో ఒక అణువునని గుర్తించి, సచేతనమైన మానసిక సాధన ద్వారా శరీరంతో తాదాత్మ్యం చెందకుండా ఆ పరమాత్మతో సంబంధం ఏర్పర్చుకోవాలి. అలా నిత్యం అదే ఏకాగ్రంగా ధ్యానిస్తూ ఉంటే, తన గతజన్మల అనుభవాలు గుర్తుకు వస్తుంటాయి. చివరికి అన్వేషణ తాను భగవంతుని హృదయంలోంచి ఈ భూమిపై పుట్టానని జ్ఞాని తెలుసుకుంటాడు.

మంచిని గుర్తించుకోవడానికి జ్ఞాపకశక్తి ఇవ్వడం జరిగింది. కానీ సాధారణంగా అందరం దానిని దుర్వినియోగం చేస్తాం. మంచి భావనలనే అనుభూతి చెందుతూ, మంచి విషయాలే ఆలోచించి అన్నిటియందూ మంచి మాత్రమే చూసే వ్యక్తి మంచి మాత్రమే గుర్తు చేసుకుంటాడు. ఇదే అభ్యసిస్తూ ఉంటే చివరకు భగవంతుణ్ణి పూర్తిగా గుర్తించగలుగుతాము. దీని గురించే మానవులకు జ్ఞాపకశక్తి ఇవ్వడం జరిగింది. అన్నింటిలోనూ మంచినే చూస్తూ ఉంటే ఏదో ఒక క్షణంలో ఒక అదృశ్యశక్తి సృష్టిలోని దివ్య సామరస్యాన్ని, భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని దర్శనం చేయిస్తుంది. దీనివల్ల దివ్యస్మృతి జ్వాలలు మేల్కొని భగవంతునితో ఏకత్వాన్ని గుర్తు తెస్తాయి.

స్నేహం అనేది భగవంతుడు మానవులపై తన ప్రేమను వ్యక్తం చేసేది. అత్యున్నతమైన రీతి ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పర స్నేహం కోసం పెంచడమే భగవంతుని కోరిక. భగవంతుడి దివ్యాకర్షణ వల్ల ఇది కలుగుతుంది. పూర్వజన్మలలో పరస్పరం చేసుకున్న సహాయ కార్యక్రమాల వల్ల ఒకరకమైన కర్మబంధం ఏర్పడి, ఈ జన్మలో ఒకరి పట్ల ఒకరికి అనివార్యమైన ఆకర్షణ కలిగిస్తుంది. ఈ స్నేహంలో స్వార్థం కానీ, స్త్రీ పురుష సంబంధ ఆకర్షణ కానీ ఉంటే అది కలుషితమవుతుంది.

ఎవరి పట్లనైనా, దివ్యాకర్షణ కలిగితే వారు పూర్వజన్మలలో మీకు స్నేహితులై ఉండొచ్చు. కాబట్టి అలాంటి వారితో వెంటనే స్నేహం చేయాలి. బాహ్య స్వరూపాన్ని బట్టి కాక, స్నేహితులను దివ్యమార్గమైన ధ్యానం ద్వారా గుర్తించగలిగితే నిర్మల హృదయం కలిగిన స్నేహితులతో దివ్య స్నేహకాంతి ప్రసారమవుతుంది. ఆధ్యాత్మిక భావనతో ఉండడం, పవిత్రంగా ఉండడం, స్వార్థ రహితంగా ఉండడం, పూర్వజన్మలో పునాది పడిన స్నేహాన్ని గుర్తు తెచ్చుకోవడంలో తోడ్పడుతుంది. మానవ సంబంధాలన్నింటిలోనూ స్నేహం ఉండాలి. కానీ ఏ సంబంధం లేకుండా, మనల్ని హృదయపూర్వకంగా అభిమానించేవారిని, ప్రతిఫలాపేక్ష గాక, దివ్యమైన స్నేహభావంతో మనమూ ఆ విధంగానే అభిమానిస్తున్నప్పుడు మాత్రమే ఆ స్నేహబంధంలో భగవంతుని ప్రతిబింబం చూడగలం. ఒకే వ్యక్తితో మొదలైన స్నేహబంధం నుంచి క్రమంగా అందరికీ, చివరకు శత్రువులకు కూడా స్నేహహస్తం అందించే స్థాయికి ఎదగాలి. నేను అందరికీ మిత్రుణ్ణి. చివరకు నా శత్రువులకు కూడా అని చెప్పే స్థాయికి వెళ్లాలి. స్వేచ్ఛ, ఆధ్యాత్మిక సమానత్వం ఆధారంగా స్నేహాన్ని నిర్మించుకోగలం. నిర్మలమైన స్నేహం చేయడంలో భగవంతుని మార్గదర్శకత్వం లభిస్తుంది. స్నేహం అనేది ఒక గొప్ప విశ్వాత్మక శక్తి. స్నేహం కోసం బలంగా కోరితే ఆధ్యాత్మికానుసంధానం వల్ల ఎంత దూరంలో ఉన్నా, ఇద్దరు వ్యక్తులను ఒకే చోటికి ఆకర్షిస్తుంది. స్వార్థం, కామపూరిత ఆలోచనలు స్నేహాన్ని విచ్ఛిన్నం చేస్తాయి. ఇతరులను ప్రేమించడం ఎలాగో నేర్చుకొని, తరువాత అందరికీ ఆ ప్రేమను ఇవ్వడానికే ఒక కుటుంబాన్ని భగంతుడు అందరికీ ఇచ్చాడు. వ్యక్తిని కాక, వ్యక్తిలో ఉన్న భగవత్ రూపాన్ని దర్శించి, ఆ భగవత్ స్వరూపమైన ప్రేమను అందరికీ పంచే వ్యక్తి బ్రహ్మలోనే లీనమవుతాడు.

కుటుంబంలో, వైవాహిక జీవితంలో ఉండే కట్టుబాట్లు, నిర్బంధం కేవలం స్నేహబంధంలో మాత్రమే ఉండదు. భగవత్ సంబంధమైన అందరిలోనూ స్నేహంతో ఐక్యమైతేనే భగవంతుణ్ని చేరగలం. అప్పుడు అపరిచితులెవరూ ఉండరు. అందరూ మనవారే. అందరం ఆ తండ్రి అయిన భగవంతుని సంతానమే అన్న గ్రహింపు కలిగి, సర్వప్రాణుల పట్ల ఉన్న ప్రేమ పెరుగుతుంది. భగవంతుని ప్రేమను సాక్షాత్కరింపజేసుకునేంత వరకు అది అభివృద్ధి చెందుతూనే ఉంటుంది.

ప్రతి వ్యక్తీ తన జీవితంలో కోరుకునేది ప్రశాంతతే. ఎందుకంటే అది సహజ స్థితి కాబట్టి. చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు ఉన్న ప్రశాంతత, వయస్సు పెరుగుతున్న కొద్దీ వ్యక్తి కోల్పోతూ ఉంటాడు. బాహ్యమైన విషయ పరిజ్ఞానాన్ని ఇంద్రియాల ద్వారా గ్రహించే మనస్సు ఆలోచనలతో కలుషితమై, మానసిక అశాంతికి గురిచేస్తుంది. అసూయ, కోపం, కలహం, మోహం, భయం, విచారం మొదలైన గుణాలు ఈ మానసిక అశాంతికి కారణాలు. ఈ భావోద్రేకాలు శరీరావయవాల్లో నాడీ మండలం ద్వారా ప్రవహించే ప్రాణశక్తిని నిరోధించి, సమత్వ స్థితిని పాడుచేస్తాయి. వ్యక్తి అనారోగ్యానికి గురి అవుతాడు. తనలో ఉన్న ఈ రకమైన చెడు గుణాలను వదిలించుకోవడం ద్వారా ప్రశాంతతను పొందవచ్చు. ఏ పని చేసినా, దానికి తగిన శక్తి భగవంతుడి నుంచే వస్తుందని, ఆయన మనకు రక్షణనిస్తూ, నిరంతరమూ మనతోనే ఉన్నాడని గ్రహించడం వల్ల మాత్రమే ఈ మానసిక అశాంతి నుంచి విముక్తి కలుగుతుంది. ప్రతీ రోజూ చేసే ధ్యానం ద్వారా ఆ పరమాత్ముని దివ్యశక్తి మనలో ప్రవహించి, నాడీ మండలాన్ని శుద్ధిచేసి, మనస్సును ప్రశాంతం చేస్తుంది. మనస్సుని ఆవరించిన అనేక భయాల నుంచి విముక్తిని ప్రసాదిస్తుంది. ఆత్మ తాలూకు ఎరుకను కలుగచేసి ఈ భౌతిక ప్రపంచం అంతా మాయ, శరీరం అనేది ఆ భగంతుని దివ్య సముద్రంలో ఒక చిన్న బుడగ మాత్రమే అన్న విషయం బోధపడుతుంది.

పుట్టినప్పుడు ఉన్న ఆత్మ జ్ఞప్తి, వయస్సు పెరిగే కొద్దీ విషయ

జ్ఞానంతో ముడివడడం వల్ల దేహమే ముఖ్యమనే భావన పెరిగి, ఆత్మను మరుపు చేస్తుంది. సత్సాంగత్యం వల్ల ఈ భావనలు తగ్గి ఆత్మచింతన వైపు మనస్సు లగ్నమవుతుంది. మానసిక అశాంతి శాంత స్వభావులు, వివేకవంతులు, హాస్యప్రియత్వం కలవారి సాన్నిధ్యంలో గడపడం ద్వారా తగ్గుతుంది. స్వాభావికంగా ప్రశాంతత గల వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ తన సహజ వివేకాన్ని, ధర్మాధర్మ విచక్షణను కోల్పోరు. భగవంతుడు తను సృష్టించిన ఈ ప్రపంచంలో జరిగే మంచి చెడులను సమంగానే చూస్తూ ఉంటాడు.

వ్యసనాలకు లోబడడం వల్ల ఇంద్రియాలకు లోబడి మరింతగా మనం భగవంతునకు సంబంధించిన కణాలలో ఒక కణమనే భావనను పూర్తిగా మరిచిపోయి, తామస భావాలను పెంచుకుంటాం. ఒక చిన్న కోరిక క్రమంగా కోపంలోకి, మోహంలోకి, అసూయలోకి తీసుకెళ్లి మానసిక ప్రశాంతతను పోగొడుతుంది. ఇటువంటి వారు తమ జీవితాన్ని, తనతో ఉన్న ఇతరుల జీవితాలను కూడా ప్రభావితం చేసి బాధలకు గురి చేస్తారు. దీనిని కేవలం మనస్సును నియంత్రించి నపుడు మాత్రమే అధిగమించగలం. ఉపవాసం, సాత్విక ఆహారం, సత్సాంగత్యం, యోగాసనాలు మొదలైన వాటి ద్వారా ఈ ప్రవృత్తిని జయించవచ్చు.

పశ్చిమదేశాలలోని వ్యక్తులు భౌతిక సుఖాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం అనేది అక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండే విధానం. కానీ మన దేశంలో మహాత్ములు ఇంద్రియ జనిత విషయాలను అదుపులో ఉంచుకుంటే ఈ శీతోష్ణ, సుఖదుఃఖాల మాయ నుండి విడివడి, మానసికమైన ముక్తిని పొందుతారు. తద్వారా ఒక నిర్వికార స్థితి ఏర్పడి, పరమాత్మ చైతన్యంతో ఏకత్వం పొందగలుగుతారు.

స్పర్శ, రుచి, వాసన మొదలైన ఇంద్రియ సుఖాలను గుర్తించేది మనస్సు మాత్రమే. మనస్సు లేనిచోట ఇవి ఏమాత్రం ప్రభావం చూపలేవు. అనుభూతుల తాలూకు పరిజ్ఞానం కేవలం ఇంద్రియాలతో మనస్సు తాదాత్మ్యం చెందినపుడు మాత్రమే కలుగుతుంది. మనస్సుని ఆ పరమాత్మ దగ్గర లగ్నం చేసినపుడు వీటి మీద దృష్టి తగ్గుతుంది. దీనికి జపం, ధ్యానం ఒక ఆయుధం. మనస్సుని నిరంతరం పరమాత్మతో అనుసంధానం చేయడమనేది వీటివల్ల కలుగుతుంది. వ్యక్తి చైతన్యంతో ఒకసారి తాదాత్మ్యం చెందితే ఇక విషయ వాసనల వైపు నుంచి క్రమంగా పరమాత్మ తత్వం వైపు ప్రయాణిస్తాడు. శరీరానికి విముక్తి లభిస్తుంది. అన్నిటికీ కారణం మనస్సు అని గ్రహించాలి. ఆత్మ ద్వారా వచ్చే సంకేతాలను గుర్తించడానికి మనసును అంతర్ముఖం చేసినపుడు మాత్రమే దేహాత్మ భావన పూర్తిగా నశిస్తుంది. మరణమంటే ఈ దేహాన్ని విడిచి ఇంకో దేహాన్ని పొందడమే. కర్మలు పూర్తి చేసుకోడానికి మరో దేహాన్ని ధరిస్తాము అన్న విషయం అవగాహనలోకి వచ్చినపుడు, మరణం అన్న పదం ఇచ్చే భయాన్ని, దుఃఖాన్ని అధిగమించగలుగుతాము అని ఈ వ్యాసంలో చెప్పారు.

ఇదీ కాకుండా పాఠశాలలో కేవలం ఈ భౌతిక జీవనానికి సంబంధించిన పాఠ్య ప్రణాళికలే ఉన్నాయి. చిన్న వయస్సు నుండే ఆధ్యాత్మిక జీవనానికి సంబంధించిన విషయాలు కూడా బోధించాలి. దానివల్ల పిల్లలు ఎదిగే కొద్దీ వారి జీవనపథంలో ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా, సంకల్ప బలం, ఆత్మ నిగ్రహం అనే రెండు అంశాల ద్వారా సంతోషమయమైన జీవనం కొనసాగిస్తారు. పిల్లలకు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి చెందిన శాస్త్రం బోధించడం ద్వారా ఒక మంచి సమాజ నిర్మాణం జరుగుతుంది. తద్వారా ఈ ప్రపంచం అంతా ఆనందమయంగా చేసుకోవచ్చు. ఆరోగ్యం,




కీర్తి, సామర్థ్యం, ధనం, ఆనందం అనేవి యోగ్యతా పత్రాలుగా పరిగణిస్తే జీవిత పరీక్షలలో పొందిన మానసిక ఆధ్యాత్మిక యోగ్యత అన్నింటికన్నా చివరిది. ఇందులో సాధించిన విజయం వల్ల మాత్రమే దివ్యమైన సంతృప్తి కలిగి, పరమాత్మతో ఏకత్వం, పూర్ణచైతన్యంతో అనుసంధానం లభిస్తుంది.

ఈ విధంగా పరమహంస యోగానంద గారు ప్రసంగించిన విషయాలను యథాతథంగా తెలుగులోకి అనువదించగలిగిన సామర్థ్యం ఈ రచయిత ఆధ్యాత్మిక పరిణతిని మనకు తెలియజేస్తుంది. వర్తమాన కాలంలో సాధారణ అంశాలు కూడా అందరికీ అర్థమయ్యేట్లుగా అనువదించడం అందరికీ సాధ్యం కాదు. అటువంటిది ఆధ్యాత్మిక సంపదను అనువదించడం అతి గహనమైన విషయం. రచయిత స్వతహాగా ఆ సాధనలో ఉన్నప్పుడు మాత్రమే తన రచనలో ఆ భావాలు స్పష్టంగా చెప్పగలుగుతారు. దక్షిణామూర్తి గారు క్రియాయోగ సాధకులు. ఈ విషయంగా తీసుకుంటే దక్షిణామూర్తి గారు తమ ఆధ్యాత్మిక సాధనలో ఎంతగా పురోగమించారో, ఎంతటి జ్ఞానపూర్ణులో మనకు అర్థమవుతుంది.

# ప్రాణమయం జగత్

**డా. తెన్నేటి హరీష్,** ప్రముఖ దంత వైద్యులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఫోన్ : 99499 62477




జ్ఞానమార్గంలో ఎన్నో రకాల సమస్యలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా తెలుసుకున్న జ్ఞానాన్ని పదిమందికి పంచుకోవడంలోనే అసలు సమస్య. చెప్పిన విషయాన్ని గ్రహించే మనుషులు చాలా తక్కువ. గురుశుశ్రూష చేసి ఎన్నో ఏళ్ళు కృషిచేస్తే తప్ప తెలుసుకోలేని విషయాలు ఇలా మన అందరికీ అందించారు శ్రీ యోగాచార్య వాచస్పతి అశోక్‌కుమార్ ఛటోపాధ్యాయగారు. దీన్ని తెలుగులోకి అంతే అద్భుతంగా అనువదించారు శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారు. పుస్తకం రాసే రచయిత అందరికీ నచ్చాలనీ, సేల్స్ బాగా ఉండాలని ఏదో ఒకటి అందరికీ అనుగుణంగా చేప్పేసే ప్రయత్నం ఎక్కడా చేయలేదు.

ఈ పుస్తకం చదువుతున్నంతసేపు ఎన్నో విషయాలు అనుభూతి చెందాను. గురువులు ఎన్నో రకాలుగా అనుగ్రహిస్తారు అనుకున్నాను. కానీ ఈ పుస్తకరూపంలో నన్ను చేరతారని అనుకోలేదు. కీర్తిశేషులు సత్య చరణ్ లాహరీ మహాశయుల దగ్గర ఎంతో సన్నిహితంగా ఉన్నవారు మా గురువుగారు శ్రీశ్రీశ్రీ ఆదిత్య పూర్ణానంద స్వామి (నందుబాబా అని కూడా అంటారు). ఆయన పరంపరలో మేము నేర్చుకున్నందుకు నాకీ పుస్తక పఠనం అవకాశం వచ్చిందేమో అనిపించింది.

స్థిరత్వం పొందేందుకు ఎన్ని మార్గాలు ఉన్నాయో అన్ని మార్గాలను అన్వేషించే ప్రయత్నం చేశారు. దాస్య శృంఖలాలలో చిక్కుకుపోయి ఉండి అన్ని రకాలుగా దాసుడై బ్రతికే కంటే నువ్వు దాసుడివి కాదు. నువ్వు దేవుడివి అని చెప్పే ప్రయత్నం చేశారు. ప్రపంచంలో ఉన్న ధర్మాధర్మాలు, ధర్మ సంప్రదాయాలు అన్ని కూడా ఒక్క వాక్యంలో చెప్పిన విషయం ఏమిటంటే మనసుని స్థిరం చేసుకోవాలి అని ఈ పుస్తకంలో అద్భుతమైన ప్రస్తావన చేశారు.

మనసు ప్రశాంతంగా ఉండటం, స్థిరంగా ఉండటం అన్నది ఎంత కష్టమో ఈ పాటికి అర్థం తెలిసి ఉంటుంది. అయినా దాన్ని అంత తేలిగ్గా జయించవచ్చు అన్న విషయం ఈ పుస్తకం చదివితే అర్థం అవుతుంది. **నిజమైన ధర్మం అంటే ఏంటి? శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో చెప్పిన అసలు రహస్యం ఏమిటి? ప్రాణ రూపుడైన ఈశ్వరుని ఎలా పొందగలుగుతాం?? ప్రాణాయామం యోగమార్గం తప్ప మానవ జీవితానికి సార్థకత పొందే ఇంకో మార్గం ఉందా?...** ఈ చిన్న పుస్తకం జీవితాన్ని మార్చే పుస్తకం సంపూర్ణమైన పుస్తకమిది.

ఏది చెప్పాలో అది మాత్రమే అర్థం చేసుకోవాలి. అది మాత్రమే చెప్పిన పుస్తకంగా భావిస్తున్నాను. కిందపడి మీదపడి జీవితంలో ఏదో సాధించాలని, ఏదో సంపాదించాలని, ఏదో వెనక్కి తీసుకోవాలని భావించి... ఆ వెనక ఏమీ లేదు, జీవితం ముందు ఏమీ లేదు, ఇప్పుడే మన చేతిలో ఉంది అని లోకం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ పుస్తకం చదివితే నిజంగా మనం ఏమి సాధన చేయాలో స్పష్టంగా అర్థమైపోతుంది.

**"ప్రాణమయ జగత్తు"** అనే పుస్తకంలో ప్రాణానికి మూడు స్థితులు ఉన్నాయి. అవి ఆది అంతం మధ్యమాలు. ఆదిలోనూ, అంతంలోనూ స్థిరమైనది మధ్యలో చంచలమైనది. స్థిరత్వం, చంచలత్వం అన్నవి అసలు ప్రాణానికి స్థితులని, మధ్యలో ఉండే చంచలావస్థే జీవభావమనీ తెలిపారు. ప్రాణాన్ని గమనించి ఈశ్వరుని ఎలా పొందగలుగుతామో క్లుప్తంగా, అద్భుతంగా చెప్పారు.

భగవంతుడికి ఒక పత్రం, పుష్పం, ఫలం, తోయం ఏదో ఒకటి ఇవ్వాలి అని అంటే నిజమైన అర్థం ఈ పుస్తకం తెలియజేస్తుంది. ఇది వినగానే అందరికీ పత్రం, పుష్పం దేవుడికి ఎందుకు ఇవ్వాలనే ఆలోచన వస్తూ ఉంటుంది. ఇందులో గూఢార్థం ఏంటంటే తాత్త్వికుడు భక్తుడు ఏదైనా అర్పిస్తే భగవంతుడు స్వీకరిస్తాడు. ఎందుకంటే అది భక్తుడికి అర్పించే యోగ్యత కలిగించడం అన్నమాట. భగవంతుడికి ఎప్పుడు అర్పించగలం? ఎప్పుడైతే మనం స్థిర అవస్థలో ఆత్మను తెలుసుకొని అర్పణకు సిద్ధం అయితే, అప్పుడే మనం భక్తులం అవుతాం.

ఈ పుస్తకంలో మరో అద్భుతమైన అంశం ఏంటంటే **దుర్గా దుర్గతి నాశినీ**. బెంగాలీల జాతీయపూజ దుర్గాపూజని కేవల వేడుకలా కాకుండా దుర్గాపూజ ద్వారా ఆత్మసాధన ప్రారంభించి ఆమెను ఏవిధంగా చేరుకోవాలో తెలుపుతూ నిర్దిష్టమైన శాస్త్రీయ మార్గాన్ని ఆ మహర్షులు ఎలా చూపించారో ఈ పుస్తకంలో అద్భుతంగా వివరించారు. ఆదర్శ దీప్తి, సరస్వతి, క్రియాయోగం, మహాప్రవక్త ఇలా ఎన్నో అద్భుతమైన భాగాలన్నీ జోడించారు. పురాణ పురుషులు యోగిరాజశ్రీ శ్యామాచరణ లాహిరి గారి గురించి మహా ప్రవక్త అనే విభాగంలో ఎంతో అద్భుతంగా వర్ణించారు.

ఇంకొక ఘట్టంలో జీవుల సేవాభావం మోక్షానికి దారి ఇవ్వదని, అది కేవలం ఒక్క మానసిక సంతృప్తి మాత్రమే ఇస్తుందని, మోక్షానికి ఏమాత్రం మార్గం కాదని మంచి విశ్లేషణ చేశారు.

తంత్ర సాధకుడిగా 15 ఏళ్ళు మా గురువుగారి దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. చదువులో పడి సర్జరీలు చేసుకుంటూ ఎన్నో మర్చిపోయాను. ఒక్కసారి ఈ పుస్తకం చదువుతుంటే మా గురువుగారు చెప్పిన ఎన్నో మాటలు గుర్తుకు వచ్చాయి. ఇలాంటి పుస్తకం పదో తరగతి సిలబస్‌గా పెట్టాలని నా ఉద్దేశం.

మానవాళి మనుగడకు, జీవితం యొక్క పరమార్థం తెలుసుకోవడానికి, ఎంతో సుదీర్ఘమైన ప్రయాణం కదా అని వదిలేసేవాళ్ళకి ఈ చిన్న పుస్తకం ఒక పెద్ద ఆదర్శం అవుతుంది.

# క్రియా యోగ ప్రచారాస్త్రంగా బాబాజీ ఎన్నుకున్న 'యోగానంద'

**ఎ. శ్రీనాథ్,** పత్రికా రచయిత, ఫోన్ : 944139 2230

సాధకుడు, సాధారణ మనిషి .... ఈ ఇద్దరూ ప్రపంచంలోనే ఉంటూ ఉంటారు. ఇద్దరూ అందరి మధ్యే ఉంటూ, వారివారి పనులు చేస్తూ వెళ్తుంటారు. కాకపోతే, సాధకుడి దృష్టి కోణం వేరు. సాధారణ మనిషి దృష్టికోణం వేరు. సాధకుడు నిత్యం ఈశ్వరుడితో ప్రయాణిస్తూ ఉంటే, సాధారణ మనిషి మాత్రం ప్రాపంచిక విషయాలతో ప్రయాణమవుతూ ఉంటాడు. సాధకుడు ఈశ్వరుడే సర్వస్వం అన్న భావనలో ఉంటే, సాధారణ మనిషి కనిపించే వస్తువులు, ప్రపంచమే అన్నీ అంటూ మెలుగుతాడు. ఆస్తి, వారసత్వం విషయంలోనూ అంతే. సాధకుడు వారసత్వాన్ని భగవంతుడి నుంచి ఆశిస్తాడు. భగవంతుడితో కలయికే అతిపెద్ద ఆస్తి అని సాధకుడి దృష్టి కోణం.

**"నేను వారసత్వం భగవంతుడి దగ్గరి నుంచి కోరుతున్నాను. దేవుడే ముందు, డబ్బు ఆయన బానిస"** అని స్పష్టమైన దృక్కోణంలో సాధన చేసి, పరమహంసగా మారి, క్రియా యోగాన్ని విశ్వవ్యాపితం చేసిన **'పరమహంస యోగానంద'** గారి గురించిన వ్యాసం ఇది. సాహితీవేత్త, భాషావేత్త పోరంకి దక్షిణామూర్తి పరమహంస యోగానందను పరిచయం చేస్తూ పుస్తకం రాశారు. శ్రీ త్రైలింగ స్వామి, రామకృష్ణ పరమహంస, ఏకనాథ స్వామి, జనాబాయి, నింబార్కుడు, సదాశివ బ్రహ్మేంద్ర స్వామి, పురందర దాసు, అప్పయ్య దీక్షితులు, వాసిష్ఠ గణపతిముని.... ఇలా సాధకులందరినీ పరిచయం చేస్తూ పోరంకి వారు పుస్తకాలు రచించారు. ఆ కోవలోనిదే ఈ **పరమహంస యోగానంద.**

పోరంకి వారి వాక్య ప్రారంభమే భగవంతుడి అస్తిత్వంపై ప్రశ్నలు వేస్తూ చర్చించుకుంటున్న అన్నదమ్ముల సంభాషణతో ప్రారంభమవుతుంది. ముకుందుడు, అనంతుడు ఇద్దరూ అన్నదమ్ములు. ముకుందుడు అంటే పరమహంస యోగానంద. అనంతుడు అంటే వాళ్ల అన్నయ్య. ముకుందుడిది 'వాలిన భక్తి.'. అనంతుడికి ఈశ్వరుడిపై అంతగా నమ్మకం లేదు. యోగం, సాధన, ఈశ్వరుడు అంటూ ముకుందుడు సమయాన్ని వృథా చేస్తున్నాడు అన్న భావనలో అనంతుడు ఉంటాడు. వారిద్దరి మధ్య చాలా సంభాషణలు జరుగుతాయి. ఈ సంభాషణలో అనంతుడు మాట్లాడుతూ... **"నాన్న గారు నీకు వారసత్వం సంక్రమించకుండా చేస్తే సరిపోతుంది ముకుందా... జీవితాన్ని ఎంత తెలివి తక్కువగా వృథా చేసుకుంటున్నావు?"** అని అనంతుడు అంటాడు. దీనికి అనంతుడు సమాధానంగా **"అన్నయ్యా, నేను వారసత్వం భగవంతుడి దగ్గరి నుంచి కోరుతున్నానని నీకు బాగా తెలుసు''** అని సమాధానమిస్తాడు. ఇలా వారిద్దరి మధ్య బలమైన వాదనలు జరుగుతుంటాయి. అయితే అన్నయ్య అనంతుడు ముకుందుడికి ఓ పరీక్ష పెడతాడు. దగ్గర్లో ఉన్న బృందావనం అనే ఊరు వెళ్లాలి, వెంట ఒక్క రూపాయి కూడా తీసుకెళ్లకూడదు, అన్నం కానీ, డబ్బు కానీ ఎవర్నీ అడగకూడదు, మీ ఇబ్బంది ఎవరికీ చెప్పకూడదు. అలాగని తిండి తినకుండా ఉండకూడదు, బృందావనంలోనే చిక్కుకొని ఉండిపోనూకూడదు.... అంటూ ఇన్ని నియమాల చిట్టాను అనంతుడి ముందు ఉంచుతాడు. ఈ నియమాల్లో ఏ ఒక్క నియమాన్ని అతిక్రమించకుండా అర్ధరాత్రి 12 గంటలలోగా తిరిగి ఇంటికి వచ్చేయాలి అని అనంతుడు షరతులు విధిస్తాడు. ఈ పరీక్షలో గనక నెగ్గితే, **"నీ శిష్యుడిగా మారడానికి నేను రెడీ.. ఉపదేశం అడుగుతాను"** అని అనంతుడు వ్యాఖ్యానిస్తాడు. సవాలుకు 'సై' అంటాడు ముకుందుడు. యువకుడు ముకుందుడు, ఆయన స్నేహితుడు ఇద్దరూ ఆగ్రా నుంచి బృందావనికి రైలులో బయల్దేరుతారు. ఆయన స్నేహితుడి పేరు జితేంద్రుడు. ఈయనా ఈశ్వరుడిపై నమ్మకం ఉన్నవాడే. కాకపోతే ముకుందునికి ఉన్నంత కాదు.

రైలు ఆగ్రా దాటిన కాసేపటికే జితేంద్రుడి మనసు పరిపరి విధాలా భ్రమిస్తుంటుంది. దిగాలు మొహం పెట్టేసుకున్నాడు. మాటా, పలుకూ అన్నీ బంద్. **"భగవంతుడు మనకి భోజనం ఏర్పాటు చేస్తాడన్న నమ్మకం కనిపించడం లేదు ముకుందా..."** అని సందేహం వ్యక్తం చేస్తాడు. దీనికి ముకుందుడు పరిపూర్ణ విశ్వాసంతో, నూటికి నూరు పాళ్లూ అంతఃకరణ శుద్ధితో ఇలా అంటాడు. **"ఓయి అనుమానం మనిషీ.... నిబ్బరంగా ఉండు. దేవుడు మనతోటే పని చేస్తున్నాడు. ధైర్యం తెచ్చుకో జితేంద్రా...."** అని అంటాడు. వీరిద్దరి మధ్య సంభాషణ జరుగుతుండగానే రైలు బృందావనం స్టేషన్‌కి చేరింది. ముకుందుడూ, జితేంద్రుడూ రైలు దిగి, ఓ టాక్సీ మాట్లాడుకొని ఓ పెద్ద ఆశ్రమం ముందు దిగారు. ఈ సమయంలో ముకుందుడు భగవంతుడిపై పూర్ణమైన విశ్వాసంతోనే ఉన్నాడు. జితేంద్రుడు మాత్రం షరా మామూలే. వీరు ఆశ్రమం ముందుకు వెళ్లి, ఓ రెండు అడుగులు వేశారో లేదో... ఓ వృద్ధురాలు గబగబా నడుచుకుంటూ వీరిద్దరి దగ్గరికి వచ్చింది. వారిని ఆశ్రమంలోకి తీసుకెళ్లింది. అక్కడే గౌరీమాత ఉంటారు. ఆమె సాధకురాలు. **"గౌరీమా.. గౌరీమా... యువరాజులు రాలేకపోయారు. చివరి క్షణంలో వాళ్ల కార్యక్రమాలు మారిపోయాయి. అయినా నేను వేరే అతిథుల్ని తీసుకొచ్చాను"** అని ముకుందుణ్ణి, జితేంద్రుణ్ణి గౌరీమాతకు అప్పజెప్పి, ఆ వృద్ధురాలు వెళ్లిపోతుంది.

గౌరీమాత సహజమైన మాతృప్రేమను వీరిద్దరిపై చూపించింది. వీరిద్దర్నీ భోజనశాలకు తీసుకెళ్లింది. **"మీరు రావడానికి ఇంతకన్నా మంచిరోజు లేదు. ఈ రోజు మా ఆశ్రమ రాజపోషకులు వస్తారని ఎదురుచూశాం. కానీ రాలేదు"** అంటూ వారిద్దరికీ షడ్రషోపేతమైన విందును పెడుతుంది. దాదాపు 30 రకాల వంటకాలను వడ్డిస్తుంది. ఈ రుచులను వీరిద్దరూ ఇప్పటివరకూ ఎన్నడూ తిని ఎరుగరు. రాజభోజనానికి ఏమాత్రం తీసిపోని వంటకాలు. ఇద్దరూ సుష్టుగా భుజించి, ఆశ్రమం నుంచి బయటికి వచ్చేశారు. అప్పుడు ముకుందుడు స్నేహితుడైన జితేంద్రుడ్ని ఓ గిల్లు గిల్లి...**"ఓయి అనుమానం పక్షీ... దేవుడు అన్ని ఏర్పాట్లూ చేస్తాడు... చూస్తున్నావు గదా..."** అని అంటాడు. ఆ తర్వాత వీరిద్దరూ ఓ చెట్టు కింద సేద తీరుతారు. మళ్లీ జితేంద్రుడు తన టేప్‌రికార్డును ఆన్ చేసి... **"ఏమో... ఇదంతా కాకతాళీయం ఏమో... ఇప్పటికి భోజనం సమకూరింది. మరి ప్రదేశాలను ఎవరు చూపిస్తారు? ఆ తర్వాత ఇంటికి ఎలా చేరుతాం"** అంటూ వంద అనుమానాలను వ్యక్తం చేస్తాడు. మళ్లీ ముకుందుడు పరిపూర్ణమైన భక్తి, భావాలతో స్నేహితుడికి సమాధానమిస్తూ.... **"ఇప్పుడు నీ కడుపు నిండింది కనుక... దేవుడిని ఇట్టే మరిచిపోయావు. నీలాంటి పిచ్చోడితో కలిసిరావడం ఎంత బుద్ధి తక్కువో.. నేను మరిచిపోను. నిబ్బరంగా ఉండు జితేంద్రా... మనకు తిండిపెట్టిన ఆ భగవంతుడే బృందావనం చూపించి ఆగ్రాకు తిరిగి పంపిస్తాడు"** అని సమాధానమిస్తాడు.

మళ్లీ వీరిద్దరికీ ఓ యువకుడి రూపంలో ఈశ్వరుడు సహకరిస్తాడు. ఓ యువకుడు వీరిద్దరూ సేద తీరుతున్న ఓ చెట్టు దగ్గరికి వస్తాడు. **"మిత్రమా... మా ఊరికి మీరు కొత్తగా తోస్తున్నారు. మీకు ఆతిథ్యం ఇవ్వడానికి, ఊరు చూపించడానికీ నాకు అనుమతి ఇవ్వండి"** అని సవినయంగా అభ్యర్థిస్తాడు. ఈయన ఎందుకు అలా అభ్యర్థించారంటే.. ఈ యువకుడు మధ్యాహ్నం ధ్యానం చేస్తున్న వేళ శ్రీకృష్ణుడు దర్శనమిచ్చి, చెట్టుకింద కూర్చున్న ముకుందున్ని, జితేంద్రుణ్ణి చూపించారట. ఈ నేపథ్యం చెప్పి, వీరిద్దరికీ బృందావనం అంతా చూపిస్తాడు. చివరికి రైల్వే స్టేషన్లో దించేస్తాడు. చివరకు ఈ యువకుడిని ముకుందుడు ఓ పక్కకు తీసుకొచ్చి, **'క్రియాయోగ దీక్ష'**ను ఉపదేశించి, అనుగ్రహిస్తాడు. రోజంతా జరిగిన సంఘటనలన్నింటినీ జితేంద్రుడు రైల్లో కూర్చోని 'అవలోకనం' చేసుకుంటాడు. భగవంతుడి మీద తనకు గాఢమైన విశ్వాసం లేకపోయినందుకు ఎంతో దుఃఖిస్తాడు. ఇక ముందు ఎప్పుడూ దేవుడి రక్షణను శంకించను గాక.. శంకించను అని మనస్సును ధృఢం చేసుకుంటాడు.

చీకటిపడే సమయానికి వీరిద్దరు స్నేహితులు తిరిగి తమ ఇంటికి క్షేమంగా చేరుకుంటారు. ఈ ఇద్దరు యువకులు తమ రూమ్‌లోకి చేరుకోవడాన్ని చూసి ముకుందుడి అన్న అనంతుడు ముక్కున వేలేసేకుంటాడు. ఆ తర్వాత జితేంద్రుణ్ణి అన్న అనంతుడు రకరకాల ప్రశ్నలు వేసి, వీరెక్కడా, ఎవరి సహాయమూ తీసుకోలేదని రూఢి చేసుకుంటాడు. ఆ తర్వాత తమ్ముడు ముకుందున్ని **'క్రియాయోగ దీక్ష'** ఇమ్మని అడుగుతాడు. ఆ రాత్రే 'గురు' ముకుందుడు అన్నయ్యకు దీక్ష ఇచ్చి గురుస్థానంలో నిలబడి, బాధ్యతలు మోస్తాడు.

ముకుందుడి మనసులో ఇంత భక్తి భావాలు ఎలా వచ్చాయి? ఆయన నేపథ్యమేమిటంటే... ముకుందుడి పూర్తి పేరు ముకుందలాల్ ఘోష్. గోరఖ్‌పూర్‌లో జన్మించారు. తండ్రి భగవతీచరణ్ ఘోష్, తల్లి జ్ఞానప్రభా ఘోష్. ఇద్దరూ సాధు స్వభావులే. వీరికి ఎనిమిది మంది సంతానం. వీరందర్నీ ఎంతో క్రమశిక్షణతో పెంచింది తల్లి. చిన్నప్పటి నుంచే రామాయణ, మహాభారతాల్లో నుంచి కథలు చెప్పేది. ముఖ్యంగా వీరి తల్లిదండ్రులిద్దరూ 'శ్రీ శ్యామాచరణ లాహిరీ మహాశయు'ల శిష్యులు. వారిదగ్గరే క్రియాయోగ దీక్ష తీసుకున్నారు. వారి ఇంట్లోని పూజా మందిరంలో లాహిరీ మహాశయుల ఫొటో ఉండేది. తల్లీ, ముకుందుడు ఇద్దరూ కలిసి ఆ ఫొటో ముందు ధ్యానం చేసేవారు. ఓ సారి తల్లిదండ్రులు ముకుందుడ్ని లాహిరీ మహాశయుల దర్శనార్థం తీసుకెళ్తారు. అప్పుడు లాహిరీ మహాశయులు ముకుందున్ని తన ఒళ్లో కూర్చోబెట్టుకొని ఆధ్యాత్మిక దీక్ష ఇస్తున్నట్లుగా అతని నుదుటి మీద చేయి పెడతారు. (దీనిని **'హస్తమస్తక సంయోగం'** అంటారు. గురువు శిష్యుడిని అనుగ్రహించే అతిపెద్ద ప్రక్రియ. అంటే గురువులో ఉన్న పరిపూర్ణమైన శక్తి శిష్యుడికి చేరిపోతుంది. దీంతో శిష్యుడి సాధన, శక్తి, వర్చస్సు వెలిగిపోతుంది) అప్పుడు లాహిరీ

మహాశయులు మాట్లాడుతూ..**"చిట్టితల్లీ.. నీ కొడుకు యోగి అవుతాడమ్మా.. ఆధ్యాత్మికమైన రైలింజను మాదిరిగా ఇతను, ఎన్నో ఆత్మహత్యలను దైవసాన్నిధ్యానికి చేరుస్తాడు"** అని పేర్కొన్నారు.

ఇలా కొనసాగుతుండగానే ముకుందుడికి హిమాలయాలకు వెళ్లి, సాధన చేయాలి, సాధువుల్ని కలవాలన్న తహతహ తీవ్రంగా ఉండేది. అయినా చాలాసార్లు వాళ్ల అన్నయ్య అడ్డుకుంటాడు. ముకుందుడు కూడా అంతే స్థాయిలో ప్రయత్నాలు చేస్తాడు. అయితే మధ్యలో ముకుందుడికి గురువుల దర్శనాలు లభిస్తాయి. ప్రణవానంద (రెండు శరీరాలున్న స్వామి), టైగర్ స్వామి, నగేంద్రనాథ్ భాదురీ (గాలిలో తేలే సాధువు), మహేంద్రనాథ్ గుప్త వంటి మహనీయుల పరిచయాలతో ఆధ్యాత్మిక ఆకాంక్ష రోజురోజుకీ పెరిగిపోతుంది. దీంతో కాశీలో ఉన్న 'శ్రీ భారతధర్మ మహామండల్' వారి ఆశ్రమంలో చేరుతాడు. ఆధ్యాత్మిక సాధన చేసుకుంటాడు. అయితే ధ్యానానికి తగిన వాతావరణం అక్కడ లభించలేదు. ఇంతలోనే తన గురువు గారైన 'యుక్తేశ్వర్' గారిని కలుసుకుంటాడు ముకుందుడు. **"నా తండ్రీ వచ్చేశావా.. ఎన్నేళ్లుగా కాసుకొని ఉన్నాను బాబూ నీ కోసం. నీ బేషరతుగా ప్రేమ అందిస్తాను. మరో నాలుగు రోజుల్లో నువ్వు నా దగ్గరికి వస్తావు"** అంటూ జోస్యం కూడా చెబుతారు. (అచ్చు వివేకానందుల వారికి కూడా ఇలాగే కలుగుతుంది. రామకృష్ణ పరమహంస దర్శనార్థమై మొదటి సారి నరేంద్రుడు వెళ్లిన సందర్భంలో పరమహంస అచ్చు ఇలాంటి వచనాలే పలుకుతారు) అన్నట్టుగానే నాలుగు రోజుల్లో ముకుందుడు తన గురువు గారైన యుక్తేశ్వర్ గారి ముందు వోకరిల్లుతాడు. దీంతో ఇద్దరూ కాసేపు సంభాషించుకుంటారు.ఇలా జరిగిన తర్వాత **"ముకుందా... నీవు బాగా చదువుకోవాలి..కాలేజీలో చేరాలి"** అని గురువు గారు శాసిస్తారు. గురువు దొరికారు కాబట్టి ముకుందుడి మనసు శాంతపడింది. అప్పుడు గురువు గారు ఓ జోస్యం చెబుతారు. **"ఎప్పుడో ఒకనాడు నువ్వు పడమటి దేశాలకు వెడతావు. అపరిచితుడైన హిందూ బోధకుడికి విశ్వవిద్యాలయం పట్టం ఉన్నట్లయితే అక్కడి ప్రజలు, భారత దేశ, సనాతన విజ్ఞానాన్ని ఆకళింపుచేసుకోడానికి మరింత సుముఖంగా ఉంటారు"** అని పేర్కొంటారు. అయితే దైవ సాక్షాత్కారం కావాలని గురువుతో ముకుందుడు పట్టుబడతాడు. వారిద్దరి మధ్యా వాగ్యుద్ధం కూడా జరిగింది. చివరికి యుక్తేశ్వర్ గారు సరేనంటారు. రాత్రికి గురువు గారి నీడనే ఉండిపోతాడు ముకుందుడు. గురు, శిష్యులిద్దరూ నీతి వాక్యాలు, సాధనా క్రమం, క్రియాయోగం తదితర విషయాలు కూలంకషంగా చర్చించుకుంటారు. గురువు యుక్తేశ్వర్ బాబా ముకుందుడికి ఎంతో ప్రేమతో ఈ విషయాలను బోధిస్తారు.

ఈ నీతి వాక్యాల్లో ఒకటి చూద్దాం... **"మా అమ్మ ఒకసారి నన్ను బెదిరించడానికి ఓ చీకటి గదిలో దెయ్యం ఉందని చెప్పింది. నేను వెంటనే అక్కడికి వెళ్లి చూసి, దయ్యం కనిపించడం లేదని నిరాశగా చెప్పా. మరెన్నడూ మా అమ్మ నాకు దయ్యాల కథ చెప్పి, భయపెట్టలేదు. ఇందులో నీతి ఏమంటే.... నీ భయానికి కారణమైన దానిని ఎదుటపడి చూడు... అది నిన్నింక ఇబ్బంది పెట్టదు"** అని యుక్తేశ్వర్ బాబా ముకుందుడితో అంటారు.




అచ్చు ఇదే సంఘటన స్వామి వివేకానంద జీవితంలోనూ చోటు చేసుకుంది. ఓ సారి వివేకానందుడు ఒంటరిగానే వెళ్తుంటాడు. కోతుల సమూహం ఒకటి స్వామి వివేకానంద వెంట పరుగెత్తుతాయి. దీంతో నరేంద్రుడికి భయం పుడుతుంది. గబాగబా నడవడం ప్రారంభిస్తాడు. అంతలోనే **"ఎందుకు.. భయపడటం... ధైర్యంగా ఎదుర్కో"** అన్న గురువాక్యం వినిపిస్తుంది. వెంటనే నరేంద్రుడు ధైర్యంగా, తీక్షణమైన కళ్లతో ఆ కోతుల సమూహాన్ని వెనక్కి తిరిగి చూస్తాడు. అవి అలాగే నిల్చుండి పోతాయి.

గురువు ఇంత బోధించినా, ముకుందుడికి హిమాలయాలకు వెళ్లాలన్న గాఢమైన కోరిక మరోసారి మనస్సులోకి వచ్చింది. దీంతో గురువు గారిని అనుమతి కోరుతాడు. దానికి గురువు సమాధానమిస్తూ... **"హిమాలయాల్లో కొండజాతి వారు చాలా మంది ఉంటారు. వాళ్లకి దైవదర్శన అనుభవం ఉంది. నిశ్చేతనమైన కొండదగ్గర కన్నా దైవసిద్ధి పొందిన మనిషి దగ్గర జ్ఞానం ఆర్జించడం ఉత్తమం నాయనా..."** అని ఉద్బోధిస్తారు. అయినా ముకుందుడి మనస్సు వింటే ఒట్టు. హిమాలయాల

వైపే ఆకర్షిస్తుంది. దీంతో ఉండబట్టలేక రామ్ గోపాల్ మజుమ్‌దారు (నిద్రపోని సాధువు) అడ్రస్ సంపాదిస్తాడు. తారకేశ్వర్‌లోని రణబాజ్‌పూర్‌కు వెళ్తాడు. అంతలోనే ఆ సాధువు ముకుందుడికి ఎదురుగా వస్తాడు. **"చెప్పు. దేవుడు ఎక్కడున్నాడు?"** అని అడుగుతాడు. అప్పుడు ముకుందుడు **"అదేమిటీ... అంతటా ఉ న్నాడు"** అని ఠక్కున సమాధానమిస్తాడు. అప్పుడు ఆ సాధువు **"మరి తారకేశ్వర ఆలయంలోని రాతి లింగానికి ఎందుకు మొక్కలేదు?"** అని నిలదీస్తాడు. దీంతో ముకుందుడి మొహం తెల్లబోయింది. ఆ తర్వాత అసలు విషయాన్ని ముకుందుడికి బోధిస్తాడు. **"లాహిరీ మహాశయులు అన్నట్లుగా...దివ్యత్వాన్ని లోపల కనుక్కోగలిగేటట్టు చేసే యోగవిద్య అన్నింటి కంటే ఉత్తమం. సందేహం లేదు. అయితే ఈశ్వరుడ్ని లోపల కనిపెట్టిన తర్వాత, త్వరలోనే బయట కూడా దర్శిస్తాం. తారకేశ్వర్‌తో సహా ఇతర చోట్లా ఉన్న పవిత్ర మందిరాల్ని ఆధ్యాత్మిక శక్తికి కేంద్ర స్థానాలుగా మన్నిస్తూ ఉండటం సముచితమైన పని. నువ్వు తిరిగి మీ గురువు గారి దగ్గరికి వెళ్ళు"** అని ఆదేశిస్తారు. ఆ తర్వాత ధ్యానం ఎలా చేయాలన్న విషయాన్ని ముకుందుడికి ఉ పదేశిస్తారు. 'నిద్రపోని సాధువు' సూచనతో ముకుందుడు తిరిగి గురువు దగ్గరికి వచ్చేస్తాడు. ఆశ్రమం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోయినందుకు తనపై గురువు కోప్పడతారేమోనన్నది ముకుందుడి బెంగ. కానీ గురువు గారు ఏమీ అనలేదు. ఆయన చూపిన వాత్సల్యానికి ముకుందుడి కళ్లలో నీళ్లు తిరుగుతాయి. ఆ తరువాత **"నీకు కావల్సిది కొండలు ఇయ్యలేవు నాయనా"** అని, ముకుందుడి గుండెకు పై భాగంలో, సుతారంగా చేత్తో తట్టారు యుక్తేశ్వర్ బాబా. దీంతో ముకుందుడి శరీరం నిశ్చలమైపోయింది. ఆయనకు సమాధి స్థితి కలుగుతుంది. దీంతో ముకుందుడికి పరమానందం కలిగింది. అయినా తన శిష్యుడైన ముకుందుడ్ని గురువు యుక్తేశ్వర్ బాబా ఓ కంట కనిపెడుతూనే ఉండేవారు. ముకుందుడి గ్రహస్థితి, త్వరలోనే అతని మీద అమిత ప్రభావం చూపబోతోందని గురువు గ్రహిస్తారు. ఈ విషయాన్ని ముకుందుడికి కూడా చెబుతారు. వెండి, సీసం కలిసిన ఓ దండ కడియాన్ని ధరించమని సలహా ఇస్తారు. నిజానికి కాలేయపు వ్యాధితో ముకుందుడు ఆరు నెలలు బాధపడాలి. కానీ గురువు గారు దయచూపి, జ్యోతిష సంబంధ కడియాన్ని ఇచ్చి, వ్యాధిని అతి త్వరలోనే నయం చేస్తారు. అంటే... గాఢమైన ఆత్మసాక్షాత్కారం పొందినప్పటికీ, మానవుడు తనకేదీ కాపుదల లేదని బాధపడకుండా, లోహాలు, రత్నాలు వంటి వాటిని ఉపయోగించి, ఉపశమనం పొందవచ్చని గురువు గారు తెలిపారు.

ఇలా కొన్ని రోజులు గడిచిన తర్వాత ముకుందుడు గురువు ప్రేరణతో బి.ఏ., పరీక్షలు రాస్తారు. అయితే ముకుందుడికి ధైర్యం,నమ్మకం కలగదు. దీంతో మళ్లీ గురువు గారు కలుగ చేసుకొని ఒకరిని కలవమని చెబుతారు. **'అంతరిక్షంలో సూర్యచంద్రులు తమ స్థానాలు మార్చుకోవడమయినా జరగొచ్చు. కానీ డిగ్రీ సంపాదించడంలో నువ్వు ఫెయిల్ కావడం జరగదు'** కరాఖండిగా చెబుతారు. ఆయన సహాయం చేస్తారని వెల్లడిస్తారు. దీంతో గురువు గారి ఆశీర్వాదం, ఆ స్నేహితుడి సహాయంతో మన ముకుందుడు డిగ్రీలో పాసయ్యాడు. 1915 జూన్ మాసంలో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి బి.ఏ.పట్టా తీసుకొని, గురువు గారి పాదాల మీద వాలి, ధన్యవాదాలు ప్రకటిస్తారు. దీంతో వాళ్ల నాన్న ఉద్యోగం చేయమని ముకుందుడితో అంటాడు. దీంతో ముకుందుడు గురువు గారి దగ్గరికి వచ్చి **"సన్యాస దీక్ష"** ఇవ్వమని ప్రాధేయపడతాడు. కరుణార్ద్ర దృష్టితో గురువు సరేఅన్నారు. పెద్దగా తతంగాలేవీ లేకుండా ముకుందుడికి సన్యాసదీక్ష ఇచ్చారు. సన్యాసిగా పెట్టాల్సిన కొత్తపేరు ఎంపిక చేసుకో అని ముకుందుడితో అంటారు గురువు. **'యోగానంద'** అన్నాడు ముకుందుడు. అప్పటి నుంచి ముకుందలాల్ ఘోష్ అన్న పేరుకు బదులుగా, **'స్వామి యోగానంద గిరి'** అన్న కొత్త పేరు వాడులోకి వచ్చింది.

అమెరికాలో మతధార్మిక ఉదారవాదుల మహాసభ జరగబోతోంది అని యోగానంద దృష్టికి వచ్చింది. ఆ మహా సభకు భారత దేశం నుంచి ప్రతినిధిగా రావాలని పిలుపు అందింది. వెంటనే శ్రీరాంపూర్ వెళ్లి, గురువు దేవులకు చెబుతారు. **'నీ కోసం తలుపులన్నీ తెరిచి ఉన్నాయి. వెడితే ఇప్పుడే వెళ్లాలి. లేకపోతే మరిలేదు'** అన్నారు గురువు గారు. ఈ సంగతిని తండ్రికి చెబుతారు. నాన్న కావాల్సిన డబ్బు ఇచ్చేస్తారు. అయితే అమెరికా వెళ్లడానికి మనస్సు సిద్ధపడే ఉంది. కానీ, అంతకంటే గట్టిగా దైవ అనుమతి కావాలని, ఆయన వాక్కు వినాలని ఆయన భావించారు. దీంతో తీవ్రమైన సాధన చేస్తారు. దీంతో సింహద్వారాన్ని ఎవరో తడుతున్నట్లుగా అనిపించింది. యోగానందులు తలుపు తీశారు. ఈయన **'బాబాజీ'** అయి ఉండాలే అని యోగానందుల వారికి తోస్తుంది. అంతలోనే అవతలి నుంచి సమాధానం. **"ఔను, నేను బాబాజీనే. మన పరమపిత పరమేశ్వరుడు నీ ప్రార్థనవిన్నాడు. నీ గురువు గారి ఆదేశాన్ని అనుసరించి అమెరికా వెళ్ళు. భయం వద్దు. పాశ్చాత్య ప్రపంచంలో క్రియాయోగ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి నేను ఎంపిక చేసినవాడివి నువ్వే. చాలా కాలం కిందట, ఓ కుంభమేళాలో నీ గురువు యుక్తేశ్వర్‌ను కలిశా. నిన్ను ఆయన దగ్గరికి శిక్షణకు పంపుతానని అప్పుడు ఆయనకి చెప్పాను'** అని బాబాజీ గతాన్ని చెబుతారు.

1920 ఆగస్టు మాసంలో కలకత్తా నుంచి యోగానందుల యాత్ర ప్రారంభమైంది. మరుసటి నెల చివరి వారంలో బోస్టన్ చేరుకున్నారు. అక్టోబర్ 6 న జరిగిన సభలో **'ద సైన్స్ ఆఫ్ రెలిజియన్'** (మతశాస్త్రం) అనే విషయం మీద స్వామి యోగానందులు ప్రసంగించారు. ఈ ప్రసంగం శ్రోతలను, నిర్వాహకులను ఎంతగానో ప్రభావితం

చేస్తుంది. ప్రసంగ పాఠాన్ని నిర్వాహకులు కరపత్రాల రూపంలో ముద్రిస్తారు కూడా. కొన్ని రోజుల పాటు అమెరికాలో విస్తృతంగా పర్యటిస్తారు. విద్యార్థుల సాయంతో కాలిఫోర్నియాలోని మౌంట్ వాషింగ్టన్ ఎస్టేట్స్‌లో ప్రధాన కార్యాలయాన్ని స్థాపిస్తారు. ('యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ'కు ఇప్పటికీ ఇదే ప్రధాన కార్యాలయం). అయితే 1935 నాటికి అమెరికా వెళ్లి 15 సంవత్సరాలు గడిచిపోయాయి. ఆయన్ని భారత్‌కు తిరిగి రావాలని గురువు గారు అంటున్న మాటలు యోగానందుల చెవిలోకి వస్తాయి. వెంటనే కలకత్తా వచ్చేస్తారు. ఇంటికి చేరగానే.. తండ్రి యోగానందులను గాఢంగా కౌగిలించుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే **'పుత్రగాత్ర పరిష్వంగాన్ని'** అనుభవిస్తాడు ఆయన తండ్రి. ఆ తరువాత శ్రీరాంపూర్‌లో గురువు గారి దగ్గరికి వెళ్లి పాదాభివందనం చేస్తారు. గురువు గారు కూడా ఆలింగనం చేసుకుంటారు.

ఆ తర్వాత మళ్లీ యోగానందుల వారు దక్షిణ దేశ యాత్ర చేస్తారు. మైసూరు, బెంగళూరు, హైదరాబాద్, మద్రాసు, అరుణాచలం (తిరువణ్ణామలై) కూడా వెళ్తారు. అక్కడ భగవాన్ రమణులను కలుసుకుంటారు. విశాఖపట్నం కూడా వస్తారు. అక్కడ ఓంకార స్వామి వారి ఆశ్రమాన్ని సందర్శించి, ఆనందం పొందుతారు. ఈ పర్యటన తర్వాత తిరిగి శ్రీరాంపూర్ వచ్చి, గురువు గారి ఆశీర్వాదం తీసుకుంటారు. అప్పుడే సర్వోన్నత **'పరివ్రాజక'** బిరుదును గురువు గారు యోగానందులకు ప్రసాదించి, ఆశీర్వదిస్తారు. **"భూమి మీద ఇప్పుడిక నా పని పూర్తైంది. ఇక నువ్వు కొనసాగించాలి. నేనంతా నీ చేతుల్లో పెట్టేస్తున్నాను. నువ్వు నీ జీవిత నౌకనీ, సంస్థానౌకనీ విజయవంతంగా దైవతీరాలకు చేర్చగలుగుతావు"** అని అంటారు. ఇలా ఆశీర్వచనం అందించిన కొన్ని రోజులకు 1936 మార్చి 9న గురుదేవులు మహాసమాధి చెందారు. యోగానందుల దుఃఖం కట్టలు తెంచుకుంది. (ఆత్మ స్థితికి చేరుకున్నా, సమాధి స్థితికి చేరుకున్నా... గురువులు శరీరం విడిచిపెట్టేసే శిష్యులు విపరీతంగా బాధపడటం మనం చూస్తూనే ఉంటాం. ఎందుకంటే సన్యాసం స్వీకరించిన తర్వాత ఆ శిష్యుడికి గురువే సర్వస్వం. గురువే అన్నీ. అమ్మా ఆయనే. తండ్రీ ఆయనే.) ఆ తర్వాత శిష్యుల బాధను చూడలేక సమాధిలోంచి **'గురువాణి'** వినపడటం, **"నేనున్నాను.. ఎక్కడికీ వెళ్లలేదు. నిశ్చింతగా ఉండు"** అని ఆశీర్వచనం ఇస్తారు. యోగానందుల వారి విషయం లోనూ ఇలాగే జరిగింది. యోగానందుల వారు ధ్యానంలో ఉండగా.. **"నాయనా..."** అని వాత్సల్యపూర్వకంగా పలకరించారు గురువు యుక్తేశ్వర్ బాబా. **"నా గురుదేవా.. నన్ను విడిచిపెట్టి ఎందుకు వెళ్లిపోయారు?"** అని ఆవేదనగా అడుగుతారు. అప్పుడు గురువు గారు.. **"నిన్ను విడిచి ఉన్నది కాస్సేపే.. ఇదుగో, మళ్లీ ఇప్పుడు నీ దగ్గర లేనూ?"** అని అంటారు. పురీలో ఇసకపర్రలో పూడ్చిపెట్టిన శరీరం మాదిరి మరో దేహం ధరించి వచ్చారా మీరు? అని యోగానందులు అడుగుతారు. **"నేను వాడినే నాయనా... నువ్వు ఎప్పుడు పిలిచినా...నీ దగ్గరికి వస్తాను"** అంటూ సుదీర్ఘంగా వివరిస్తారు గురువు గారు. అప్పుడు యోగానంద గారి వియోగ దుఃఖమంతా మబ్బులా వీడిపోతుంది. నిజానికి ఆధ్యాత్మిక రంగంలో గురుశిష్య సంబంధం ఒక జన్మకు పరిమితం కాదు. అనేక జన్మలతో ముడిపడి ఉంటుంది. అనేక వ్యక్తులతోనూ ముడిపడి ఉంటుంది.

ఆధ్యాత్మిక సాధన ఇంత చేసినా... యోగానందుల వారు సాహిత్య రచనా విషయంలోనూ కృషి చేశారు. **'కాస్మిక్ చాంట్స్'** రచన చేశారు. భారతీయ గీతాలు చాలా వాటికి ఆంగ్లపదాలనూ పాశ్చాత్య స్వర సంకేతాలనూ కూర్చి, అక్కడి వారికి గానానుకూలంగా చేశారు. భగవద్గీతను ఆంగ్లంలోకి అనువదించారు. (గాడ్ టాక్స్ విత్ అర్జున... ద భగవద్గీత') అనే పేరుతో ప్రచురణ కూడా అయ్యింది. ఉమర్ ఖయ్యూమ్ రుబాయీలకు (ఎడ్వర్డ్ ఫిట్జ్‌జిరాల్డ్ చేసిన ఆంగ్లానువాదాన్ని అనుసరించింది) చక్కని ఆధ్యాత్మిక వివరణలు రాశారు. వివిధ సమయాల్లో, వివిధ విషయాల మీద ప్రసంగాలు కూడా చేశారు. ఇవన్నీ కూడా (మాన్స్ ఇటర్నల్ క్వెస్ట్, ద డివైన్ రొమాన్స్, జర్నీ టు సెల్ఫ్- రియలైజేషన్) లాంటివి. వీటితో పాటు **'విస్పర్స్ ఫ్రమ్ ద ఇటర్నిటీ, సైంటిఫిక్ హీలింగ్ ఇన్ఫర్మేషన్, ద లా ఆఫ్ సక్సెస్, హౌ యు కెన్ టాక్ విత్ గాడ్, సేయింగ్స్ ఆఫ్ పరమ హంస యోగానంద'** మొదలైనవి. ఇవన్నీ ఒక ఎత్తు., యోగానంద గారి **'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి'** అన్నది ఒక ఎత్తు. తెలుగులో ఒక యోగి ఆత్మకథగా వెలువడింది. **హిందీ, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, ఉర్దూ లాంటి ప్రాంతీయ భాషల్లోకి కూడా అనువాదమైంది. ఇంతే కాకుండా ఫ్రెంచ్, ఇటాలియన్, స్పానిష్, డచ్, డేనిష్, జర్మన్, అరబిక్, జపనీస్, పోర్చుగ్రీస్** వంటి విదేశీ భాషల్లోకి కూడా అనువాదమైంది.

ఆ తర్వాత యోగానందులు 1952 లో అమెరికా పర్యటన వెళ్లారు. అక్కడ ఓ హోటల్‌లో భారత రాయబారి వినయ రంజన్ సేన్ ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. అన్ని దేశాలకు చెందిన దాదాపు 2,000 మంది పాల్గొన్నారు. యోగానందుల వారు నాలుగో వక్త. దాదాపు 10 నిమిషాలు మాట్లాడారు. అందులోని కొన్ని విషయాలు యథాతథంగా....

**"నేను భారతదేశంలో పుట్టినందుకు గర్విస్తున్నాను. నా ఆధ్యాత్మిక భారతదేశానికి ప్రతినిధిగా ఒక గొప్ప రాయబారి మనమధ్య ఉన్నందుకు గర్విస్తున్నాను. ఈనాడు గర్విస్తున్నాను. నేను తరచుగా అంటూంటాను.'**

**"దహించి వేయవచ్చు మర్త్యాగ్ని కీలలు, ఇళ్లనూ వరిపొలాలనూ**
**అయినా, ఓ భారత దేశమా, అక్కడుంటాను నేను**
**బూడిద కుప్పల మీద నిద్రించి అమరత్వాన్ని కలగనడానికి**
**దేవుడు సృష్టించాడు భూమిని, మనిషిని సృష్టించాడు,**

**సీమిత దేశాలనూ చాపల్య కల్పితమయిన, వాటి ఎల్లలనూ**
**గంగానది, అడవులు, హిమాలయ గుహలు ఎక్కడ ఉంటాయో**
**ఎక్కడ దేవుడ్ని కలగంటూ ఉంటారో జనం**
**వెంటాడుతున్నాయి నన్నవి....**
**నా దేహం తాకుతుంది అక్కడి పచ్చిక నేలను"**

ఈ చివరి మాటలు ఆయన నోటి నుంచి వెలువడటమే తరువాయి, ఆయన దృష్టి ఊర్ధ్వాభిముఖం అయిపోయింది. కళ్లు మూతలు పడ్డాయి. అమరానంద దరహాసంతో నేలకు జారిపోయింది ఆయన దేహం. కళ్లూ, చెవులూ ఒక్కటి చేసుకొని ఉన్న ఆ జనమంతా ఒక్కసారి అదిరిపడ్డారు.

**ఆర్తనాదాలు, హాహాకారాలు, విషాద నయనాలు..**
**చెమ్మగిల్లని కన్ను ఒక్కటీ లేదక్కడ**
**పరమహంస యోగానందులు మహా సమాధి చెందారు.**

ఎంత సాధనా చేసినా, సన్యాసాశ్రమం తీసుకున్నా, తమ తమ సొంత సాధన చేసుకుంటూనే... ఈ దేశం మీద, ప్రజల మీద దృష్టి పెడుతూనే ఉంటారు యోగులు. తురీయాశ్రమం తీసుకున్నా, వారికి దేశభక్తి మెండుగానే ఉంటుంది. ఎక్కడా ఏమీ మాట్లాడకుండా.. దేశం కోసం, ధర్మం కోసం నిరంతరం తపన పడుతూనే ఉంటారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూనే ఉంటారు. మన దేశాన్ని చట్టాలు, ప్రభుత్వాలు నడిపిస్తున్నట్లు మనకు కనిపించినా, వెనకుండి, దేశాన్ని నడిపించేది మాత్రం ఇలాంటి యోగులే. వారి తపోశక్తే ఈ సనాతనమైన దేశాన్ని నడిపిస్తోంది.

# మన ఆధ్యాత్మిక వారసత్వం

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 97048 29254

ప్రతి మనిషి జీవన ప్రయాణం ఒక ప్రత్యేక మజిలీ. సాహిత్యకారుల జీవిత గమనం సాధారణ మనిషితో పోల్చినప్పుడు విభిన్నంగా సాగుతుంది. ప్రతీ సాహిత్యకారుడి సాహితీ సృజన విభిన్న కోణాల్లో సాగుతుంది. అలాంటి సాహితీవేత్తల్లో నవలాకారునిగా, వ్యాసకర్తగా, కథకుడిగా, అనువాదకుడిగా, నిఘంటుకర్తగా సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించిన వ్యక్తి డా. పోరంకి దక్షిణామూర్తి. దక్షిణామూర్తి గారు 1935 డిసెంబర్ 24 న తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు నందు జన్మించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసిన వారు, విశ్వవిద్యాలయంలోనే సినారె గారి పర్యవేక్షణలో "తెలుగు కథానిక స్వరూప స్వభావాలు" అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. తన ఉద్యోగ జీవితం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే తెలుగు శాఖలో రీడర్‌గా మొదలైంది. 1993లో తెలుగు అకాడమీ ఉపసంచాలకుడిగా ఉద్యోగ విరమణ పొందాడు.

**రచనా వ్యాసంగం :**

పోరంకి వారు తెలంగాణా మాండలికంలో **'ముత్యాల పందిరి'**, రాయలసీమ మాండలికంలో **'రంగవల్లి'**, ఆంధ్రా మాండలికంలో **'వెలుగు వెన్నెలా గోదారి'** అనే నవలలు రచించారు. ఇలా మూడు మాండలికాలలో నవలలు రచించిన తొలి రచయితగా ఈయన ప్రఖ్యాతిగాంచారు. **'అదొక్కటి తెలుసుకో చాలు' (ఆధ్యాత్మిక వ్యాసాలు), 'ఉన్నది ఉన్నట్టు' (పుస్తక సమీక్ష), 'అరచేతిలో అద్దం'(పీఠికలు), 'భాష-ఆధునిక దృక్పథం'** మొదలైన వ్యాస సంపుటాలు వెలువరించారు. ఈయన రాసిన **'చంద్రవంక'** కథానిక వేదాలు, వైద్యం, సంగీతం వంటి అంశాలు తర్వాతి తరాలకు అందజెయ్యాలనే అంతర్లీన సందేశంతో కొనసాగుతుంది. అంతేకాక చేనేత, మేదర పరిశ్రమలకు చెందిన మాండలిక వృత్తి పదకోశాలు మరియు నిఘంటువులు రూపొందించారు. దాదాపు 40 పుస్తకాలను అనువాదం గావించారు. అనువాదానికి సంబంధించి ఆయన అభిప్రాయంలో **"స్వతంత్ర రచన రచయిత ప్రతిభకు గీటురాయి కావచ్చు కాని అనువాద ప్రతిభను తక్కువ అంచనా వేయడం తప్పు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనువాదకుల కృషిని తక్కువ అంచనా వేస్తుండడం దురదృష్టం"** (మన ఆధ్యాత్మిక వారసత్వం, పుట-5) అని అన్నారు. పోరంకి వారు పరమహంస యోగానంద జీవిత చరిత్రను **'ఒక యోగి జీవిత చరిత్ర'** పేరుతో అనువాదం చేశారు. దానికి గాను ఉత్తమ అనువాద పురస్కారం లభించింది.

మారుతున్న కాలంలో సగటు మనిషి ఆర్థిక, రాజకీయ, సామాజిక సిద్ధాంతాలను వాటి ప్రభావాలను అర్థం చేసుకోవడంలో విఫలం అవుతూ ప్రపంచీకరణ ధోరణులను నిందిస్తూ వున్నాడు. ఇలాంటి అయోమయానికి ఉపశమనాన్ని ఇవ్వగలిగేది కేవలం భారతీయుల వద్ద మాత్రమే గల దివ్యౌషధం ఆధ్యాత్మిక జీవనవిధానం. పోరంకి వారికి అయిదు దశాబ్దాల అనువాద రచనల అనుభవం ఉంది. ఆ నేర్పుతోనే భారతదేశంలోని మనీషులు, మహామహులుగా పేరుగాంచినవారి ఆంగ్ల వ్యాసాలను తెలుగులోకి అనువదించి

రూపొందించిన గ్రంథం **"మన ఆధ్యాత్మిక వారసత్వం".** ఈ గ్రంథంలోని వ్యాసాలను తరిచి చూసినట్లైతే, అస్సాం నందలి బంగీయ సారస్వత మఠానికి చెందిన సద్గురు నిగమానంద, శ్రీ మొనిబాగ్చీ వారి వ్యాస అనువాదాల లోని అంశాలు సూక్ష్మంగా – ప్రభు సమ్మితాలైన వేదాలు దేవుణ్ణి గురించిన జ్ఞానం ను ఇస్తాయి. వేదాలు అపౌరుషేయాలు. **'యోవేదేభ్యః అఖిలం జగత్ నిర్మాణే'** అన్నాడు సాయణాచార్యుడు. దీనర్థం సమస్త విశ్వాన్ని వేదాల విజ్ఞానం చేతనే దేవుడు సృష్టించాడని. మనిషి కర్మల ద్వారా పరిశుద్ధం అయినప్పుడు దివ్యజ్ఞానాన్ని పొందుతాడు. కర్మ, జ్ఞానం రెండూ వేదాల్లోని విషయాలే. వేదాలు ఋక్, సామ, యజుర్, అథర్వలుగా విభజించబడ్డాయి. వేదాలతో పాటు భారత ఆధ్యాత్మిక వారసత్వానికి సరిపడినంత విషయసాంద్రత కల్గిన మరిన్ని గ్రంథాలు ఉపనిషత్తులు. ఉపనిషత్తులు తత్వసంబంధ అంశాలకు భాండాగారాలు. ఉపనిషత్తులు అనేవి పిడివాదాలు, మతాచారాలు, మూఢవిశ్వాసాలు, అధికారం, శిక్షలతో ముడిపడకుండా సంకుచితం కాని రీతిలో ఆధ్యాత్మిక విషయాలకు మాత్రమే ప్రాముఖ్యత ఇచ్చాయి. ఇవి ఎటువంటి అంశానికైనా, సమస్యకైనా పరిష్కారం ఏమిటి అనే కోణంలో కాకుండా పరిష్కారాన్ని సాధించే విధానాన్ని ఉద్బోధించే గ్రంథాలు. వేదాలు, ఉపనిషత్తులతో పాటు హిందూ మతానికి తాత్విక ప్రామాణికమైన భగవద్గీత ప్రస్తావన కూడా ఉంది. ఉపనిషత్ సత్యాన్ని మనిషి మస్తిష్కంలోకి ప్రవేశింపజేయడానికి ఉపకరించే గ్రంథమే భగవద్గీత. నిజానికి భగవద్గీత అటు తాత్విక గ్రంథమూ, ఇటు మత గ్రంథమూ కాదు. అది విభిన్న ఆకృతుల్లో సమకూడిన ఆత్మ జ్ఞానపరమైన క్రమశిక్షణ, అనుష్ఠాన, మతచింతన నియమాల సమ్మేళనం. జీవితానికి ఒకే ఒక గమ్యం, అది ఆత్మజ్ఞానం లేదా దైవజ్ఞానం అని నొక్కి చెప్పేది గీత. కర్మ, జ్ఞానం ఏ పద్ధతి అనుసరించినా ఆత్మ పరమాత్మలో ఐక్యం కావడం జీవిత పరమావధిగా చెప్తుంది భగవద్గీత. ఆత్మ సాక్షాత్కారానికైఐ అభ్యసనం చేయాల్సిన విషయాలను గూర్చి మొదటిసారి తెలిపింది పతంజలి. ఆయన ఆధ్యాత్మిక అభ్యసన విషయాలను సేకరించి వాటిని ఒక గ్రంథంలో వ్యవస్థీకరించారు. ఆ గ్రంథం పేరే 'యోగదర్శనం'. పతంజలి నిర్దిష్టమైన ఈశ్వరుడి ఉనికిని అంగీకరించాడు. అంతేకాక ఓంకార పునశ్చరణమూ దాని అర్థాన్ని గూర్చి చేసే ధ్యానమూ ఈశ్వరార్చనను నెరవేరుస్తాయని అంగీకరించాడు. మనస్సు, బుద్ధి, అహంకారం మూడు అంగాలను కలిపి 'చిత్తం' అంటారు. చిత్తం నిశ్చలంగా వుండాలంటే సంగపరిత్యాగ సాధన జరగాలి. అంటే వైరాగ్యస్థితిని సాధించాలి. దానికై యోగాంగాల అభ్యసన సాధన చెయ్యాలి. వాటినే అష్టాంగాలు అని ప్రతిపాదించాడు పతంజలి.

ప్రపంచంలో ఎన్ని మతాలు ఆవిర్భవించినా, వాటి ఉపశాఖలు ఏర్పడినా, అన్ని మతాల అంతిమ లక్ష్యం దైవ సాక్షాత్కారం




పొందడం. వాస్తవానికి ప్రపంచంలోని ఏ మతమైనా దివ్యత్వాన్ని పొందే విధానాన్ని తెలుపుతుంది. మనిషికి, మనిషికి మధ్య మలినంతో కూడిన మనస్సును సృష్టించదు. సనాతన ధర్మం ఎల్లప్పుడూ మనిషికి, మనిషికి మధ్య మతాల గోడలను కూల్చి సార్వజనీన ప్రేమతో, భిన్నత్వంలో ఏకత్వ భావనతో వసుధైక కుటుంబంగా జీవించాలని కోరుకుంటుంది.

శ్రీ మొని బాగ్చీ, సద్గురు నిగమానంద వ్యాసాలలో ఉటంకించిన కొందరి మహానుభావుల గూర్చి 'మన ఆధ్యాత్మిక వారసత్వ సంపద' లో గ్రంథస్తం చేశారు. క్రీ.శ.6వ శతాబ్దం కాలానికి చెందిన అద్వైత వేదాంత ప్రవర్తకుడైన ఆదిశంకరాచార్యులు జీవించిన సమయం తక్కువే (32) అయినా ఆయన స్థాపించిన మఠాలు, హైందవ సన్యాస వ్యవస్థలు ఇప్పటికీ వుండడం విశేషం. ఉపదేశ సాహస్రి, వివేక చూడామణి, శివానందలహరి మొదలైన ఆధ్యాత్మిక, తాత్విక గ్రంథాలు రచించారు. శంకర భగవత్పాదుల మాటల్లో **'విరాగం, వివేకం, భక్తి, ఆత్మనిగ్రహం'** అనే సాధనాలను మనసులో ఉంచుకోవాలి, గురుబోధలు ఆధ్యాత్మిక ఎరుకను కల్గిస్తాయి. కాని దైవానుగ్రహం ద్వారానే పరిపూర్ణత, ముక్తి ఈ జన్మలో లభిస్తాయి. (పుట–26)

అదిశంకరుల వారి తర్వాత తత్వధార్మికత, వేదాంత శాస్త్ర వ్యాఖ్యాతల్లో ప్రథమగణ్యుడు శ్రీ రామానుజులు. క్రీ.శ.1017లో జన్మించిన రామానుజుల వారి తత్వదర్శనం 'విశిష్టాద్వైతం'. బ్రహ్మానికి,

విశ్వానికి ఉన్న దేహాత్మక సంబంధంలో రామానుజులు **ఆధార-ఆధేయ, నియామక- నియమ, శేషి-శేష** అనే మూడు సంబంధాలు నిర్వచించాడు. భగవంతుడిని ప్రేమించడం, సేవించడం వల్ల మాత్రమే మనం సంపూర్ణ సిద్ధి పొందుతాం అనేది రామానుజుల వారి సారాంశం. శంకరులు జ్ఞానయోగానికి ప్రాముఖ్యం ఇస్తే రామానుజుల వారు భక్తియోగానికి ప్రాముఖ్యం ఇచ్చారు. కాని ప్రతి మనిషిలో ప్రేమ, భక్తి, జ్ఞానం వంటి అంశాలు వెల్లివిరియడం అవసరం అని ఇద్దరూ అంగీకరించారు.

మరో ప్రవక్త 15వ శతాబ్దానికి చెందిన వ్యక్తి. ఆయన పంజాబ్ లోని 'తల్వండి' అనే గ్రామంలో జన్మించిన గురునానక్. **'సత్యాన్వేషణ కోసం నేనీ ప్రపంచంలోకి వచ్చాను'** అన్నారు (పుట-30) గురునానక్. భారతదేశానికి జాతీయత అనే భావనను మొదటిసారి కల్గజేసిన మహనీయుడు గురునానక్. 500 సంవత్సరాల కిందటే ఈయన 'హిందుస్థానం' అనే మాట వాడారు. ఈయన శిష్యులకు 'శిఖులు' అనే పేరు కలదు. అది తదనంతర కాలంలో సిక్కు మితంగా ఆవిర్భవించింది. ఆధ్యాత్మిక సాధనకు గురువు అవసరం అని భావిస్తుంది ఈ మతం.

15వ శతాబ్ద కాలంలోనే వంగదేశంలోని నవద్వీపంలో జన్మించిన మరో ఆదర్శమూర్తి శ్రీ చైతన్యులు. ఈయనలో ప్రేమ తత్వము, ప్రేమ మతము అనే భావనలు సమ్మిళితమై వుంటాయి. ఈయన తాత్వికాభివ్యక్తి వైష్ణవ మతం. శ్రీ చైతన్యుల వారు ప్రేమాదర్శాన్ని, ద్వైత సిద్ధాంతాన్ని బోధించారు. ఆదిశంకరుల వారు చెప్పిన అనంత జ్ఞానం అనే భావనను రామానుజుల వారు అనంత ప్రేమ అన్నారు. కాని రెండింటి మధ్య తేడా లేదు. నైతిక గుణాల ఆచరణకు వినయం, సహనం ప్రధాన అంశాలుగా చెప్పారు చైతన్యులు.

1836లో పశ్చిమ బెంగాల్ లోని కామర్పుకుర్ అనే పల్లెలో జన్మించారు **శ్రీ రామకృష్ణులు.** ఈయన మాటల్లో **'మనిషయి పుట్టే విశేష హక్కు పొంది కూడా దైవాన్ని సాక్షాత్కరింపజేసుకోకపోతే అతని పుట్టుకకు ప్రయోజనం లేదు అన్నారు'** (పుట-40). ఆధునిక ప్రపంచం ఉపేక్షించదల్చుకున్న వాటికి విలువనివ్వడం ఈయన జీవిత విశేష లక్షణం. భక్తి, స్వచ్ఛత, చిత్తశుద్ధి, నిస్వార్థత, ప్రేమ, వినయం మానవుడి నిజమైన సంపదలు. వాటన్నింటినీ ఆలంబనగా చేసుకొని దైవసాక్షాత్కారం పొందడం విలువైన జీవితలక్ష్యం అని చెప్పాడు.

ఆధ్యాత్మిక మహానుభావులలో **శ్రీ రమణ మహర్షి** ఒకరు. రమణుల వారు దక్షిణ భారతదేశంలోని తమిళనాడులో తిరుమణ్ణామలైలో జన్మించాడు. ఈయన ఆధ్యాత్మిక ప్రతిభా సంపన్నుడు. ఈయన రచనలు అరుదు కాని నలభై పద్యాలతో కూడిన **'ఉపదేశసారం'**లో వేదాల సారాన్ని ఇనుమడింపజేశారు. శ్రీ రమణుల తత్వదర్శనం యొక్క లక్ష్యం - ఆత్మ సాక్షాత్కారం. జడమైన శరీరం 'నేను' అనే భావనను చెప్పదు. కాని మనలోని అహంకారం శరీరానికి ప్రతినిధిగా 'నేను' అనే భావనను ఉచ్చరిస్తుంది. కాని అహంకారాన్ని జ్ఞానాగ్నికి సమర్పించి ఆత్మ సాక్షాత్కారం పొందడమే జీవితాశయంగా ఉండాలని శ్రీ రమణుల వారు బోధించారు.

**శ్రీ అరవిందుల వారు** పరిణామదశలను గూర్చి వ్యాసంలో పొందుపర్చిన అంశాలను గూర్చి అనువదిస్తూ భౌతికద్రవ్యం, ప్రాణం, మనస్సు, అతిమానసం అనే అంశాలను చర్చించారు. ద్రవ్యం అనేది శక్తి, పదార్థం రెండునూ. ద్రవ్యం యొక్క మౌలిక పదార్థ శక్తి బ్రహ్మశక్తి. ద్రవ్యం శక్తి ద్రవ్య పదార్థాన్ని రూపొందిస్తుంది. భూమి, బండ, లోహం, వాయువు ప్రతీ అంశలోనూ ప్రాణం వుంటుంది. కాని అది మనం కనిపెట్టలేని విధంగా వుండొచ్చు. కాని ద్రవ్యం భౌతిక రూప నిర్మాణ ప్రధానంగా వుంటుంది. ఈ భౌతిక ద్రవ్యంలో సృజనాత్మకత సృష్టించదానికి ప్రాణం తోడ్పడుతుంది. ఇక ద్రవ్యంలోని ప్రాణంలో నుండి మనస్సు వెలువడుతుంది. కాని మనస్సుకు భౌతిక రూపం లేదు. చేతన తాలూకు శక్తిస్థాయి వ్యవస్థ అతిమానసం. అది మనస్సు కన్నా ఉన్నత, విస్తృత పదార్థం. మనిషి ఇంద్రియాల ద్వారా పొందే అనుభూతుల సంవేదనలను వదిలి తనలోకి తాను అన్వేషించుకొని బ్రహ్మజ్ఞాన సాక్షాత్కారానికై మనస్సును చైతన్య స్థితిలో వుంచగల్గడమే అతిమానసం. జడమైన ద్రవ్యపదార్థంలో ప్రాణం, మనసు అక్కడి నుండి అత్మాసాక్షాత్కారం కొనసాగేలా మనిషి పరిణామ క్రమం సాగాలి.

**స్వామి వివేకానందుల వారు** రాసిన వ్యాసాల్లోని అంశాల ఆధారంగా పోరంకి వారు ఈ గ్రంథంలో ఆత్మ, దేవుడు, మతం అనే అంశానువాదం పొందుపరిచారు. మనిషి గతించినా చావు పొందని విషయం మనిషిలో ఒకటి వుంది. దానికి మొదలు, తుది వుండదు. అంటే అది ఆద్యంతాలు లేని విషయం. మనందరికీ పైన శాశ్వతత్వానికి పైన శాశ్వత సత్తగా అది వుంటుంది. దాని పేరే దేవుడు.

కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు స్థితప్రజ్ఞతను కోల్పోయి అజ్ఞానిగా వ్యవహరిస్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు గీతను ఉద్బోధిస్తాడు. ప్రకృతిపరంగాను, మానసికంగాను, భౌతికంగాను అహంకారయుతమై వున్నది ఎప్పటికీ దైవంలో అంశ కాజాలదు. ప్రకృతిలోని యాంత్రిక అంశాలు మనచుట్టూ వుండే లోకంలోని భౌతిక రూపాలు మాత్రమే. కాని వీటన్నింటి కన్నా ఉన్నతమైనది ఆధ్యాత్మిక వ్యక్తిత్వ స్వభావం. మనం చేసే కర్మలన్నింటిలో చేతనావస్థలోని నాలుగింటి క్రమంలో ఉండేది బ్రహ్మమే. అంతా వాసుదేవుడే అంటుంది భగవద్గీత. ఆయనే బ్రహ్మం. సృష్టించేవాడు, పోషించేవాడు ఆయనే. దేవుడూ, ప్రకృతి, జీవుడూ ఒకే అస్తిత్వానికున్న మూడు పేర్లు. ఉన్నతమైన సత్యం మీద ఆత్మ కనుక విశ్వాసాన్ని ఏర్పరుచుకొన్నట్లైతే అది సాధారణ వ్యర్థ జీవన విధానానికి

విముక్తిని ఇవ్వగలదు. నిమ్న స్థాయి శక్తిని భౌతిక, మానసిక విశృంఖల పనుల నుండి త్యజిస్తేనే వాస్తవమైన దైవత్వం లభిస్తుంది. సంపూర్ణ విశ్వాసంతో, అహంకారం లేకుండా దేన్నైతే నమ్ముతామో భగవంతుడు దాన్ని తప్పక నెరవేరుస్తాడు. దానికై మనలో గోప్యంగా వున్న దైవం చేతుల్లో రూపాంతరం చెందడానికి మన మనసును అర్పించడం ముఖ్యం.

శ్రీ అరవిందుల వారి వ్యాసాల్లోని అంశాల ఆధారంగా పోరంకి వారు అనువాదం చేసిన అంశాలకు శీర్షికలు **గుహ్యాతిగుహ్యం, పరిణామ దేశాలు, మనిషి : పరిణామం, హిందూ మతం : భారతదేశం.** మనిషి బతుకు పోరాటం వాటికి సంబంధించి అరవిందుల వారిచే విరచించబడిన **హిందూధర్మం: భారతదేశ ధర్మం** నందు రహస్యాలు లేకుండా, గారడి లేకుండా, గుడ్డివాడై చూడమనే మూఢప్రబోధాలు లేకుండా ఆధ్యాత్మికతకు సంబంధించిన నిదర్శనాలనూ, విధానాలనూ వెల్లడించే గుహ్యవిద్య అవసరం అని భావించారు. మనలో హేతువాద కోణం మంచిదే కాని అది పాశ్చాత్య భౌతికవాద కోణాల్లో వుండకూడదు అని తెలిపారు.

చారుచంద్రదత్త రాసిన వ్యాసాన్ని **'శ్రీ అరవిందుల దృష్టిలో'** అనే శీర్షికతో భారతీయ సంస్కృతి యొక్క లక్ష్యం, నాలుగు జీవిత దశలు, సనాతన ధర్మం, ఒక దేవుడు అనేక దేవతలూ, వైదిక ధర్మంలోని బాహ్యాంతర జీవితం, వేదం నిగూఢార్థం: అది ఎలా అవతరించింది, భారతీయ నాగరికతలో వేదానంతర దేశం, వ్యక్తుల్లో మూడు ముఖ్యమైన రకాలు, భారతీయ ధర్మాన్ని జీవితానికి వర్తింపజేయడం, భారతీయ సాహిత్యం, తంత్రాలు తదితర అంశాల పట్ల అరవిందుల వారి దృక్కోణాన్ని ఈ వ్యాసాల్లో వివరించారు.

భారతీయ ఆలోచనా విశిష్టత ఏమిటంటే అది ఆత్మను అంతటా చూడడం, అన్వేషించడం అనగా ప్రపంచం గుర్చి, ప్రకృతిని గుర్చి, ఉనికిని గుర్చి. దాని భావన భౌతికమైంది కాదు మానసికమైంది, ఆధ్యాత్మికమైంది. ప్రతి పని వెనుక భగవంతుని చైతన్య శక్తి, చైతన్య సంకల్పం వుంటాయనేది మన ఆధ్యాత్మికత లక్షణం. అరవిందుల వారి మాటల్లో **'ఒక జాతి సమృద్ధిగా జీవించినప్పుడు, అత్యంత గాఢంగా ఆలోచించినప్పుడు ఆధ్యాత్మికత దాని ఎత్తులనూ, లోతులనూ మరియు సంతతమైన బహుముఖీన సాఫల్యాన్ని కనుక్కొంటుంది'** (పుట-107). అరవిందుల దృష్టిలో హిందూమతం అనేదే లేదని అదొక సామాజిక వ్యవస్థ మాత్రమేనని పరస్పర విరుద్ధ వ్యవస్థల, మతవిశ్వాసాల కలగలుపు అని అంటారు. హిందువులు అనేక దేవతలను ఆరాధించినప్పటికీ ఆ దేవతలు అద్వితీయుడైన ఒకే ఒక్కడి రూపాలను, నామాలను కొలుస్తారు. ఈ దేశంలో దేవుడి పట్ల మూడు రకాల భావనలు కలవు. మొదటిది ఏకేశ్వరుడిగా కొలవడం, రెండు వివిధ రూపాల్లో కొలవడం అనగా సృష్టికర్త బ్రహ్మగా, స్థితి కారకుడైన విష్ణువుగా, లయకారుడైన రుద్రుడిగా, దేదీప్యమానమైన రూపిణి దుర్గగా వివిధ రూపాల్లో కొలవడం, మూడవ భావన విశ్వాత్మ రూపాలుగా, బాహ్యాంతర ప్రకృతులుగా కొలవడం.

ఆత్మ **'అత్యంత కోమల, బహువిధ స్వీయాభివ్యక్తి'** కోసం మనం చూడవలసింది ఒక దేశపు ప్రజల సాహిత్యం అంటారు శ్రీ అరవిందులు. భారతదేశ సాహిత్య కృషి తరచి చూస్తే : వేదాలు, ఉపనిషత్తులు, మహాభారతం, రామాయణం, దమ్మపదం, జాతకకథలు, పంచతంత్రం మొదలైనవి అలాగే కాళిదాసు, భవభూతి, భర్తృహరి, జయదేవుడు, తులసీదాస్, కబీర్, రామదాసు, తుకారామ్, కంబన్, తిరువళ్ళువర్, మీరాబాయి మొదలైన వారిచే విరచితమైన సాహిత్యం. ఇన్ని అద్భుత గ్రంథాల, అద్భుత వ్యక్తుల సాహిత్యం మన ఆధ్యాత్మిక వారసత్వ సంపదలు. శ్రీ అరవిందుల వారు వేదమంత్రాలలో నుండి విశేషమైన వాటిని ఎంపిక చేసి **"ద డిఫెన్స్ ఇండియన్ కల్చర్"** అనే గ్రంథంలో చేర్చారు.

ఈ **"మన ఆధ్యాత్మిక వారసత్వం"** గ్రంథంలో స్వామి శివానంద వారు రచించిన జప నియమాలను అనువదించారు. ఇవి 14. ఇవి సరళంగానూ, సాధారణ దినచర్యల ఆచరణ రీతిలో ఉన్నాయి. మరొక వ్యాసం **'మన సాంస్కృతిక వారసత్వం'** శీర్షికతో రచించారు. ఇది కె.వై.ఎల్ నరసింహరావు గారి వ్యాసానికి అనువాదం.

**ముగింపు:**

మనం ఆధ్యాత్మిక వారసత్వం వేదకాలం నుంచి నేటి దాకా అవిచ్ఛిన్నంగా తరతరాలకు అందజేయబడుతూ వస్తున్నది. అదొక అమరవాహిని. ఈ ఆధ్యాత్మిక జ్ఞానసంపద అక్షరజ్ఞానం లేని అమాయకులకూ, అఖండ పండితులకూ ఏ తారతమ్యం లేకుండా జీవన ధారగా వుంది. నిరక్షరాస్యులు జ్ఞానహీనులు అనుకుంటే అది అజ్ఞానమే. కారణం అక్షరాస్యత వేరు జ్ఞానం వేరు. నేర్పిస్తే వచ్చేది చదువు. కాని చదువు నేర్చిన ప్రతిఒక్కరూ జ్ఞానులు కాలేరు. సహజంగా వచ్చేదీ, పెంపకంతో పెరిగేది జ్ఞానం. జ్ఞానానికి చదువుతో నిమిత్తం లేదు. ఇతర జీవరాసులతో పోల్చినప్పుడు మానవ చైతన్యం ఉన్నత స్థితిలో కాలేదు. దానికి తోడు పుట్టిన ప్రతి మనిషికీ చిన్నతనంలోనే ఆధ్యాత్మిక భావన మొలకెత్తించడానికి కావాల్సిన సంపద మన భారతీయ సమాజాల సంస్కృతిలో కలదు. మరోవైపు ఆధ్యాత్మికత ఎక్కువైపోవడం వల్ల మనదేశం పేదరికంలో మగ్గిపోయిందనే వారు కూడా ఉన్నారు. కాని పేదరికానికి కారణాలు వేరు. దాని నిర్మూలనకై చేయాల్సిన ప్రయత్నాలు వేరు. **"మనకు ఆధ్యాత్మికత ఏమీ ఎక్కువైపోలేదు, ఉన్నదే చాలదు అన్నారు"** - శ్రీ అరవిందులు. కాబట్టి భౌతికవాదులు, నాస్తికులు, ఎంత వాదించినా వాటిని నమ్మకుండా మన ఆత్మ బలమే మనకు శ్రీరామరక్ష అనే నినాదంతో, విశ్వాసంతో, చిత్తశుద్ధితో మన ధర్మాన్ని అనుసరించి మన దేశ ఆధ్యాత్మిక సంపత్తికి వారసులమవుదాం.

# డా॥ దక్షిణామూర్తి 'లఘు అనువాదాలు'

**మంత్రి శ్రీనివాస్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 83283 33720

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసి అందరి హృదయ ఫలకాలపై తనదైన ముద్రను వేసిన వారు డా. పోరంకి దక్షిణామూర్తి. గోదావరి పరవళ్ళను తన ఎదనిండా నింపుకొని తెలుగు తల్లి పాదాలకు సాహితీ నైవేద్యాన్ని సమర్పించిన వ్యక్తి ఆయన. ఉన్నత విద్య నిమిత్తం తూర్పు గోదావరి నుండి భాగ్యనగరానికి వచ్చి ఇక్కడి ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకొని అదే విశ్వ విద్యాలయంలో కొంతకాలం పనిచేశారు. అనంతరం తెలుగు అకాడమీలో పనిచేసి రూపుదిద్దుకోని ఎన్నో కార్యాలకు తనవంతు సహకారం అందజేశారు. ఆయన కథానికుడిగా, నవలాకారుడిగా, వ్యాసకారుడిగా, నిఘంటుకారుడిగా, అనువాదకుడిగా అందరికీ సుపరిచితులు. ఈయన రాసిన ఒక యోగి ఆత్మకథ (పరమహంస యోగానంద జీవిత చరిత్ర) అనువాదం ఎందరికో మార్గదర్శకంగా ఉంది. పరమహంస యోగానంద గారి ఆత్మకథనే కాదు ఆయన, ఆయన శిష్యులు రాసిన లఘు గ్రంథాలను కూడా అనువాదం చేసి తెలుగు పాఠకులకు అందజేశారు డా.పోరంకి దక్షిణామూర్తి.

పోరంకి వారు అనువాదం చేసిన లఘు గ్రంథాల్లో **'గురు శిష్య సంబంధం'** (శ్రీ మృణాలినీ మాత రాసినది), **'సఫలతా నియమం', 'గతించిన మన ఆప్తులు ఎక్కడున్నారు', 'స్వభావ దోషాలను తొలగించుకోవడం'** (శ్రీ దయామాత రాసినది), **'సఫలతకోసం అవధాన శక్తిని కేంద్రీకరించడం', 'రోగ చికిత్స చేసే భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక పద్ధతులను పొత్తుపరచడం'** మొదలగునవి ఉన్నాయి. ఈ లఘు గ్రంథాలు మానవ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడంలో తనదైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

## గురుశిష్య సంబంధం

పరమహంస శ్రీ యోగానంద గారి శిష్యురాలు యోగిని శ్రీ మృణాలినిమాత వై.ఎస్.ఎస్. / ఎస్.ఆర్.ఎఫ్.స్నాతక స్వర్ణోత్సవం సందర్భంగా 1970 జూలై 07న లాస్ ఏంజిలిస్ లో ఇచ్చిన ఉపన్యాసాన్ని **'గురుశిష్య సంబంధం'** అనే లఘు పుస్తకంగా రూపొందించి భక్తులకు అందజేశారు. ఆ పుస్తకాన్ని డా.పోరంకి దక్షిణామూర్తి తెలుగులోకి అనువాదం చేశారు. భగవంతుడు మనుషులను తన స్వరూపంగా చేసి లోకం అనే నాటకరంగంలోకి పంపి వారిలో ఉండి, వారిచేత భిన్నమైన పాత్రలను పోషింపజేసి ధర్మ సందేశాన్ని అందజేస్తాడు. ఈ లోక నాటకం నడిచే విధానం, అది తిరిగి తనలోకి తానూ ఇమిడిపోవడం ఏ విధంగా జరుగుతుందో మొదలైన వివరాలన్నీ గురువుచేత చెప్పిస్తాడు భగవంతుడు. అందుకే గురువును సృష్టించాడు. జ్ఞాన పరంపరను ముందుకు సాగించడానికి గురుకులాలు ఏర్పడి మనిషిని బాల్యావస్థ నుండే తీర్చిదిద్దుతున్నాయి. అలా లోకానికి ధర్మనిరతిని ప్రసాదించే గురువును, అతడిని ఆశ్రయించి జీవితాన్ని తీర్చిదిద్దుకునే శిష్యుని మధ్య ఉండవలసిన సంబంధం గురించి ఈ గ్రంథం వివరిస్తుంది.

సద్గురువును నిర్వచిస్తూ భారతదేశపు ప్రాచీన సన్యాసి అయిన ఆది శంకరాచార్యులు గురువును వర్ణించిన విధాన్ని అందరికి పంచుతుంది ఈ గ్రంథం. **"మూడు లోకాలలోనూ సద్గురువుతో పోల్చదగినది ఏది లేదు. చింతామణి నిజంగా అటువంటిదేనని భావించినప్పటికీ అది ఇనుమును బంగారంగా మార్చడం మట్టుకే చేయగలదు. కానీ మరొక చింతామణిని చేయజాలదు. కాని అర్చితుడైన గురువు, తన చరణాలను ఆశ్రయించిన శిష్యుణ్ణి తనంతటివాణ్ని చేస్తాడు. కాబట్టి ఆయన సాటిలేనివాడు. అంతేకాదు అతీతుడు"** అన్న ఆది శంకరాచార్యుని మాటలని చెబుతూ గురువు గొప్పతనాన్ని ఆవిష్కరిస్తారు మృణాళినీ మాత. నిజమే ఒక్క గురువు మాత్రమే శిష్యుణ్ణి తనంతటి వాడిగా, ఇంకా తనకన్నా అధికుడిగా తీర్చిదిద్దడానికి సదా ఉద్యుక్తుడవుతాడు. అందుకే కబీర్ తన దోహాల్లో ....

**"గురుగోవింద్ దోనో ఖడే కాకే లాగో పాయ్ / బలిహారి గురు ఆప్ ని గోవింద్ దియో బతాయ్"** అంటారు. గురువు, గోవిందుడు ఒక్కసారిగా తనముందు ప్రత్యక్షమైతే ఎవరి పాదాలకు ముందు వందనం చేస్తావు? అంటే ముందుగా తాను గురువు పాదాలకు వందనం చేస్తాను అంటాడు కబీర్. అవే మాటల్ని గురువు పరమహంస చెబుతూ **"గురువు శిష్యుడిలో నిద్రపోతున్న దేవుణ్ణి మేలుకొలుపుతున్న, మేలుకున్న దేవుడు. సానుభూతి ద్వారాను లోతయిన చూపు ద్వారాను సద్గురువు, భౌతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా పేదలయిన వాళ్ళలో భగవంతుడే బాధపడుతుండడం చూస్తాడు. అదే భావనను శిష్యుడిలో మేల్కొలుపుతాడు"** అంటారు. అందుకే భారతావనిలో ఉత్తమ స్థానం గురువుకే ఇవ్వబడింది. సర్వం జగన్నాథమయం అనే సత్యాన్ని శిష్యుడికి తెలియజేసి సమస్త జనుల్లో, ప్రాణుల్లో భగవంతుడినే దర్శింపజేస్తాడు.

గురుశిష్య సంబంధం దేవుడు సృష్టించిన ఈ విశ్వం, వ్యవస్థితమైన విశ్వ నియమం ప్రకారం నడుస్తుందని, దైవాన్ని అన్వేషించువాడు, తన మూలాన్ని వెతికేవాడు చేరాల్సింది గురువునే అంటారు మాత. నిజమే ఈ జన్మ తనను తాను ఉద్ధరించుకోవడానికి లభించింది.

ఈ జన్మను సఫలం చేసుకోవాలంటే అన్వేషణ ఒక్కటే మార్గం. ఆ అన్వేషణలో ముందుగా చేరేది గురువునే. అతడు మాత్రమే సత్యాన్ని దర్శించడానికి తోడ్పడతాడు. శిష్యుని చిత్తశుద్ధి, సత్యనిష్ఠను చూసి శిష్యుని చేయి పట్టుకొని దారి చూపిస్తాడు గురువు. గురు శిష్య సంబంధంలో క్రమశిక్షణ, సత్కర్మాచరణ వంటి సూత్రాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి అంటారు రచయిత్రి.

శిష్యుడి విధేయత గురువుపట్ల ఏ విధంగా ఉండాలో తెలియజేస్తూ **"గురువు మార్గదర్శకత్వం పట్ల విధేయత లేదా శరణాగతి గురుశిష్య సంబంధంలోని మరొక మౌలిక సూత్రం అంటారు రచయిత్రి".** గురువువద్ద శిష్యుడు తనను తాను వదిలివేయాలి. తాను అనే అహంభావన వీడి **త్వమేవ శరణం మమ** అని శరణువేడాలి. అప్పుడే శిష్యుని మనసు అహంభావ కోరికలనుండి, భావవృత్తులనుండి ముక్తిని పొంది ఏకాగ్రతను పెంపొందించుకుంటుంది. అప్పుడే గురువువద్ద నున్న జ్ఞానాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటాడు శిష్యుడు.

మానవ మనస్సు చంచలమైనది. అది ఒక్కదగ్గర కుదురుగా ఉండదు. గాలికంటే వేగంగా కోరికల వెంట పరుగెడుతుంది. అటువంటి మనసుకు ఎలా కళ్ళెం వేయాలో గురువు శిష్యునికి నేర్పుతాడు. సాధనా విద్య ద్వారా మనసును ఏకాగ్రచిత్తంలోకి ఎలా తెచ్చుకోవాలో నేర్పి మార్గదర్శిలా తన వాత్సల్యాన్ని పంచుతాడు. శిష్యుడు తనను తాను గురువు చెప్పిన మార్గంలో నడుస్తూ తనను తాను తీర్చిదిద్దుకుంటాడు. అందుకే తల్లిదండ్రులు జన్మను మాత్రమే ఇస్తారు కాని గురువు జ్ఞాన జన్మను ఇస్తాడు అంటారు పెద్దలు. ఇది అక్షరాల నిజమని గుర్తించాలి. ఈ విధంగా గురు శిష్య సంబంధాన్ని లోకగతం చేసింది ఈ లఘు గ్రంథం.

**స్వభావ దోషాలను తొలగించుకోవడం :** పరమహంస యోగానందకు తొలుతటి శిష్యులలో ఒకరైన శ్రీ శ్రీ దయామాత ఒకరు. ఈమె లాస్ ఏంజిల్స్ లోని సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ అంతర్జాతీయ కేంద్రస్థానంలో సన్యాసులను ఉద్దేశించి 1971 జనవరి 13న చేసిన ప్రసంగాన్ని **'స్వభావ దోషాలను తొలగించుకోవడం'** అనే లఘు గ్రంథంగా ప్రచురించారు. దీనిని డా. పోరంకి దక్షిణామూర్తి గారు తెలుగులోకి అనువాదం చేశారు.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించే వారికి స్వభావ స్వచ్ఛత ఎంతో అవసరం. మనస్సు నిర్మలమైనప్పుడే మనలో కొలువైన దైవాన్ని చూడగల్గుతాము. ఎన్ని చదువులు చదివినా, ఎన్ని ఉన్నత పదవులు పొందినా సాటివారిని ప్రేమించకుంటే, సాటి మనిషిలో తనను తాను చూడకుంటే వ్యర్థమే. అందుకే స్వభావ స్వచ్ఛత ఎంతో అవసరం. అటువంటి స్వభావ స్వచ్ఛతను పొందాలంటే మనలోని స్వభావ దోషాలను తొలగించుకోవాలి. అందుకు అవసరమైన మార్గదర్శనాన్ని అందిస్తుంది ఈ గ్రంథం.




భగవంతుని పొందే మార్గంలో స్వభావ దోషాలు ఎంతటి విఘ్నకారకాలో చెబుతూ.... **"ఆధ్యాత్మిక పథం కత్తి అంచు లాంటింది. సూటిగాను, సునిశితంగాను ఉండే మార్గ సూత్రాలకు కట్టుబడి ఉండనిదే భగవంతున్ని కనుక్కోవడం చాలా కష్టం. అత్యధికంగా త్యాగం చేయనిదే అంటే ఈ భౌతిక రూపంతోను, అహంకారంతోను విడదీయలేనంతగా ఒకటిగా చూసే, ఆ విధంగా మనకూ భగవంతునికి మధ్య అడ్డుగా నిలిచే స్వభావ దోషాలన్నిటినీ విడిచిపెట్టనిదే అత్యంత అమూల్యమైన నిధిని (భగవంతుని) మనం పొందలేము"** అంటారు రచయిత్రి. మనిషిని నిష్కామకర్మ చేయడం వైపు నడిపిస్తాయి ఈ మాటలు. పరిపక్వత వైపుకు మనిషిని ఆలోచింపజేస్తాయి ఈ వాక్యాలు.

నిష్పక్షపాతంగా ఉండడానికి మనసుకు శిక్షణ ఇవ్వమంటూ తన గురించి, తన దుఃఖం గురించి ఆలోచించడం మానివేయాలంటారు రచయిత్రి. వ్యక్తి తన గురించి, తన సుఖదుఃఖాల గురించి ఆలోచిస్తున్నాడంటే ఇంకా అహంకారం వీడలేదని అర్థం. పరిపక్వుడు అలాంటి పొరపాటు చేయడు. ఈ శరీరం, భౌతిక సుఖాలు నశ్వరాలు అని తెలుసుకొని సంసారిక దుఃఖానికి అంటకుండా నిశ్చలంగా ఉంటాడు. అందుకే అహంకారం, రాగద్వేషాలు లేని స్థితికి మనిషి సాధకుడు ఎదగాలి. అప్పుడే అహరహంలో భగవంతుణ్ణి చూడగల్గుతాడు.

**"తప్పులెన్నువారు తండోపతండంబు / ఉర్విజనులయందు నుండు తప్పు / తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు/ విశ్వదాభిరామ వినురవేమ"** అన్నాడు వేమన. ఈ లోకంలో ఇతరుల తప్పుల్ని వెతికే వారే గాని తాము చేసిన తప్పుల్ని ఎవరూ గమనించరు. ఎవరైతే తమ తప్పుల్ని తాము గమనిస్తారో వాటిని సరిదిద్దుకుంటారో వారు వ్యక్తిగా ఉద్ధరించబడుతున్నాడు అని గమనించాలి. తప్పుల విషయంలోనూ సమతుల వైఖరి కలిగి ఉండాలని, నిష్పక్షపాతంగా తన దోషాలను కడిగేసుకోవాలంటారు రచయిత్రి. అటువంటి రచయిత్రి భావాల్ని చదువరులకు అతి సులువైన భాషలో అందిస్తారు డా. పోరంకి దక్షిణామూర్తి.

## గతించిన మన ఆప్తులు ఎక్కడున్నారు

శ్రీ శ్రీ పరమహంస యోగానంద కాలిఫోర్నియా ఎన్సీనిటస్ లోని సెల్ఫ్ – రియలైజేషన్ ఫెలోషిప్ మందిరంలో 1938 ఆగస్ట్ 28న చేసిన ప్రసంగాన్ని **'గతించిన మన ఆప్తులు ఎక్కడున్నారు'** అనే లఘు గ్రంథంగా రూపొందించారు. ఆ లఘు గ్రంథాన్ని డా.పోరంకి దక్షిణామూర్తి తెలుగులోకి అనువాదం చేశారు.

భగవంతుడు మనిషిని ఒంటరిగానే పంపుతాడు. ఇక్కడికి చేరే క్రమంలోనే తల్లిదండ్రులతో బంధాన్ని ముడివేస్తాడు. అలా ప్రారంభమైన బంధాల సుడి పెరుగుతూనే పోతుంది. అలా మానవుడు బంధాల అనుబంధాల చక్రంలో తననుతాను కోల్పోతాడు. అలా తన చుట్టూ అల్లుకున్న బంధాలను ఒక్కసారిగా దూరం చేయడు భగవంతుడు. ఒక్కొక్కరిని దూరం చేస్తూ బంధాల విలువను తెలియజేస్తాడు. ఈ దూరం చేయడం అనే ప్రక్రియ వల్ల ఈ ప్రపంచం ఏమిటి? ఈ బంధాలు ఏమిటి? నేనెవరిని? నా తర్వాత ఏమిటి? అనే ప్రశ్నలను మనిషిలో లేవనెత్తుతుంది. ఆ ప్రశ్నలకు జవాబుగా ఈ గ్రంథం ఉపయోగపడుతుంది.

పరమహంస యోగానంద తన తల్లిని కోల్పోయినప్పుడు దివ్యజనని అయిన పరాశక్తితో తన గోడును వెళ్లబోసుకున్న తీరును, పరాశక్తి యోగానంద గారికి ఇచ్చిన జవాబు ద్వారా ప్రపంచానికి గతించిన తమ ఆప్తులు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలియజేస్తారు. వారితో ఎలా సంభాషించవచ్చో తెలియజేస్తారు. ఉర్ధ్వ లోకాలలో ఉన్న మన పూర్వీకులతో సంప్రదింపులు జరపాలంటే యోగ మార్గం ఒక్కటేనని ఎరుకపరుస్తారు. పరమహంస యోగానంద వారి తపస్విక, తాత్విక, పరమాత్మిక భావాలను ఎంతో నిగూఢంగా తెలియజేసారు డా. పోరంకి దక్షిణామూర్తి.

## సఫలత కోసం అవధానతా శక్తిని కేంద్రీకరించడం

శ్రీ శ్రీ పరమహంస యోగానంద 1940 జులై11 నాడు లాస్ ఏంజిల్స్ లో ఉన్న సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ అంతర్జాతీయ కేంద్ర కార్యస్థానంలో చేసిన ప్రవచనాన్ని **'సఫలత కోసం అవధానత శక్తిని కేంద్రీకరించడం'** అనే లఘు గ్రంథంగా తీసుకువచ్చారు. ఆ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు డా. పోరంకి దక్షిణామూర్తి.

భౌతిక ప్రపంచం నశ్వరమైనది. ఈ ప్రపంచంపై తృష్ణను త్రుంచుకొని తనలో స్థిరమైన అనంతుడు, అశరీరుడు, ఆత్మ స్వరూపుడు అయిన పరమాత్మను చేరే క్రమంలో సాధకుడు తన దృష్టిని ఏకాంశం మీద ఉంచవలసి వస్తుంది. అందుకుగాను మనస్సును స్థిరపరిచి ఏకాగ్రతను నిలుపవలసి ఉంటుంది. చపల స్వభావియైన మనస్సుకు, అది సంధించే కోరికల బాణాలను విరిచేస్తూ తాననుకున్న లక్ష్యాన్ని చేరుకోవలసి ఉంటుంది. అందుకు మార్గాన్ని సూచిస్తారు పరమహంస యోగానంద.

అవధానతను పొందడానికి దైవాన్వేషణ, దైవ రాజ్యాన్ని అన్వేషించడం అయితే ధ్యానం మీద దృష్టిని నిలపడం, దైవశక్తి మీద ఏకాగ్రతను నిలపడం వంటి మార్గాలను అవలంబించాలని చెబుతారు పరమహంస. లోక పంకిలం నుండి, తననుండి తానూ విడివడి నిష్కామిగా మనిషి ఎదగాలనే సందేశాన్ని పరమహంస యోగానంద అందిస్తారు. ఆయన ఇచ్చిన విలువైన సందేశాన్ని ఎంతో భక్తితో తెలుగువారికి అందించారు డా. పోరంకి వారు.

## సఫలతా నియమం

శ్రీ మహావతార్ బాబాజీ గారి అమూల్యమైన మానవతా సందేశాన్ని శ్రీ లాహిరీ మహాశయుడు, శ్రీ యుక్తేశ్వర్ గిరి స్వామి, శ్రీ పరమహంస యోగానందలు మోసుకొచ్చారు. మానవుడు తన జన్మను సఫలం చేసుకునేందుకు మార్గాన్ని ఉపదేశించారు. ఆ క్రమంలో బోధించిన ఒకానొక ఆధ్యాత్మిక ప్రసంగమే **'సఫలతా నియమం'** అనే లఘు గ్రంథం.

గ్రంథం ప్రారంభంలోనే తనకు లభించిన దివ్యమైన తన జన్మహక్కును చాటుకుంటూ... **"ఈశ్వరుడు నన్ను తన రూపంలో సృష్టించాడు. మొదట ఆయన్ని వెతుకుతాను, ఆయనతో నాకు సంపర్కం వాస్తవంగా కలిగేలా రూఢి చేసుకుంటాను. అప్పుడిక, ఆయన సంకల్పిస్తే జ్ఞానం, సంపద, ఆరోగ్యం ఇవన్నీ దివ్యమైన నా జన్మహక్కులో భాగంగా నాకు సంక్రమించవచ్చు"** అంటారు పరమహంస యోగానంద. ఈ మాటలు కేవలం దృఢ సంకల్పం గలవారు మాత్రమే మాట్లాడగలరు.

మానవ జీవితంలో సఫలత అనేది పూర్తిగా సామర్థ్యం మీద, శిక్షణ మీద కాక తనకు లభించిన అవకాశాలను చేజారనివ్వకూడనివ్వకూడదన్న నిశ్చయం మీద ఆధారపడుతుందని అంటారు పరమహంస. నిజమే సామర్థ్యం ఉన్నంత మాత్రాన, శిక్షణ లభించిన మాత్రాన లక్ష్యం పూర్తవ్వదు. లభించిన అవకాశాలను

సంపూర్ణంగా ఉపయోగించుకున్నప్పుడే అనుకున్న లక్ష్యం పూర్తవుతుంది అనే సందేశాన్ని ఈ గ్రంథం అందిస్తుంది.

మనిషి ఆలోచనలను బట్టి సఫలత, విఫలతలు నిర్ణయించ బడతాయి అంటూ, నకారాత్మకమైన ఆలోచనల వలయం లోంచి మనిషిని సకారాత్మకమైన ఆలోచనల వైపుకు మళ్ళించే ప్రయత్నం చేస్తుందీ ఈ గ్రంథం. మానవుని సఫలతకు సంకల్పం ప్రాణం పోస్తే ఆత్మ విశ్లేషణ ఆయువు పోస్తుంది. ఆత్మ విశ్లేషణలో మానవుడు తానేమిటో, ఎవరో తెలుసుకుంటాడు. సమస్త మానవాళిలో దైవాన్ని చూస్తాడు. ధ్యానమార్గాన్ని అనుసరించి తనలోని దోషాలను తొలగించుకొని నిత్యానందుడై వెలుగొందుతాడంటూ పరమహంస ఇచ్చిన దివ్యమైన సందేశాన్ని తెలుగు లోగిళ్ళకు అందిస్తారు పోరంకి దక్షిణామూర్తి.

## రోగ చికిత్స చేసే భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక పద్ధతులను పొత్తుపరచడం

శ్రీ పరమహంస యోగానంద అమెరికాలో చేసిన ప్రసంగాల క్రోడీకరణలో భాగంగా వచ్చిన మరొక లఘు పుస్తక రాజము ఇది. ఈ లోకంలో ఏది సాధించాలన్నా ఉండాల్సింది శరీరం. శరీరం ప్రసన్నంగా ఉండి కార్యసాధనకు సహకరించాలంటే ఆరోగ్యం అవసరం. శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనిషి తాను అనుకున్నది సాధించగలడు. అందుకే శరీరాన్ని సర్వార్థసాధకంగా పేర్కొంటూ అందుకు అవసరమైన మహత్తర సందేశాన్ని ఈ లఘు గ్రంథం అందిస్తుంది.

మనిషి ఆరోగ్యాన్ని నిలబెట్టే మూడు పద్ధతుల్లో భౌతిక చికిత్స ఒకటి. ఈ చికిత్స మానవుని శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు తోడ్పడుతుంది. శరీరంలో ఆరోగ్యాన్ని నిలబెట్టేది ప్రాణశక్తి. ప్రకృతి విరుద్ధమైన జీవనం, ఆహారపు అలవాట్లు ప్రాణశక్తి ప్రవాహానికి అడ్డంకులుగా మారుతాయి. ఈ అడ్డంకి కారణంగా శరీర ధర్మ క్రియలు అదుపు తప్పుతాయి దాని ఫలితంగా శరీరం అనారోగ్యానికి గురవుతుంది. అందుకే ప్రకృతికి అనుగుణమైన జీవనం సాగించాలి. ఆహారపు అలవాట్లు కూడా అలాగే ఉండాలి. అప్పుడే ప్రకృతి




సమతౌల్యతతో పాటు శారీరక సమతౌల్యతకు ఆస్కారం ఏర్పడుతుంది.

మనసు ఉత్సాహంగా ఉన్నప్పుడే మనిషి కుదురుగా ఉండగలడు. మనస్సు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆత్మతో సంలీనం చేయవచ్చు. మనసు ఆరోగ్యంగా ఉండాలంటే మాయనుండి ముక్తిని పొందాలి. ఇంద్రియ లాలస, ఐహిక సుఖాల తృష్ణ నుండి మనస్సును బయటవేసి నిరంతరం ఆత్మానందంలో ఉంచగలిగితే మనస్సు ఆరోగ్యంగా ఉంటుంది. వికారాలకు దూరం అవుతుంది.

శారీరక, మానసిక ఆరోగ్యాలకు బలాన్ని, సంతులనాన్ని అందించేది ఆధ్యాత్మిక చికిత్స. అందుకు యోగుల సాంగత్యం, సాధువుల మార్గంలో నడవడం, సద్గ్రంథాల పఠనం ద్వారా, గురువుల మార్గదర్శనం ద్వారా, సాధన ద్వారా ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పొందవచ్చు నన్న శ్రీ పరమహంస యోగానంద సందేశాన్ని అందిస్తారు డా. పోరంకి దక్షిణామూర్తి.

పరమహంస యోగానంద వారి శిష్యులు మృణాలిని, దయామాతలు ప్రబోధించిన ప్రసంగాలను తెలుగులో అనువదించి తెలుగు ప్రజలను ఆధ్యాత్మ వీధుల్లో విహరింపజేశారు డా.పోరంకి దక్షిణామూర్తి. యోగానంద గారి భావాలను తనలో తాదాత్మ్యం చేసుకొని తనదైన రీతిలో ప్రస్తుతపరిచారు పోరంకివారు. ఈ అనువాదాలతో తానూ ఒక పరమహంస అయ్యారని అనడంలో సందేహం లేదని చెప్పవచ్చు.

**మీకున్న చికాకుల నుంచి పారిపోవడానికి ప్రయత్నించడం తెలివితక్కువతనం. ఏమంటే, మీరు ఎక్కడికి వెళ్ళినా మీతోనే వస్తుంటాయి, మీ చికాకులు. నేను చేసినట్లుగానే మీరు కూడా మీ సమస్యలను నిర్భయంగానూ, నిర్మలమైన అంతఃకరణంతోనూ ఎదుర్కోవాలి. ఇప్పుడు నేను, నా ఆత్మకోసమో, దేహంకోసమో చేసే ప్రార్థనలు లేవు. కారణం, ఈశ్వరుడి దగ్గరనుంచి నేను శాశ్వతమయిన హామీని పొందాను. ఇది చాలు. ప్రార్థించడమంటే నా దృష్టిలో, శంకించడం. నా అంతఃకరణం విముక్తం; నేను ఏ మానవుడికీ చెరుపు చెయ్యలేదు కాబట్టి ఇది సత్యమని నాకు తెలుసు. "నేనెవ్వరికీ చెరుపు చెయ్యలేదు", అని అనుకోగలగడం, ఈ లోకంలో అందరికంటె గొప్ప సుఖవంతుడయి ఉండడం.**

**(మనస్సులో కలత పోగొట్టుకోడం ... పరమహంస యోగానంద)**

# సద్గురు స్వామి నిగమానంద సరస్వతి (ఒక యోగి అద్భుత కథ)

**సాగి తేజశ్రీ,** బి.ఏ., తెలుగు విద్యార్థిని, కోఠి మహిళా కళాశాల. ఫోన్ : 80082 80140

సద్గురు స్వామి నిగమానంద సరస్వతి (ఒక యోగి అద్భుత కథ) పుస్తకం కాళీకింకర్ చక్రవర్తి గారు హిందీలో రచించారు. దీనిని తెలుగులోకి డా॥ పోరంకి దక్షిణామూర్తి గారు అనువదించారు. వారు ఈ గ్రంథాన్ని ఒక అనువాద గ్రంథంగా కాకుండా ప్రత్యేక గ్రంథంగా రచించారు. ఆధ్యాత్మిక భావనలు ఉన్నవారికి, జిజ్ఞాస కలిగిన వారికి ఈ పుస్తకం చాలా బాగా ఉపయోగపడుతుంది. ఈ గ్రంథం మొత్తం 16 అధ్యాయాలు. ఒక్కొక్క అధ్యాయం ఆయన జీవితంలోని వివిధ కోణాలను, ఘట్టాలను ఆవిష్కరిస్తుంది. అయితే ఒక అధ్యాయంలో వచ్చిన విషయం, మరో అధ్యాయంలో కనపడదు. ఇదీ పోరంకి వారి అనువాద శైలి.

నిగమానంద సరస్వతి జీవిత చరిత్ర చదివితే, నమ్మలేని విషయాలు ఎన్నో తెలుస్తాయి. ఈయన జీవిత చరిత్ర విశిష్టమైనదే. అంతేకాదు... చిత్రమైనది కూడా. చిన్నప్పుడు అల్లరి పిల్లవానిగా ఉన్నప్పటి నుంచి మొదలు, ఒక యోగిగా మారే వరకూ జరిగిన ఒక్కొక్క సంఘటన కూడా చదువరులను ఆశ్చర్యపరుస్తుంది. నిగమానందుల వారి జననం బెంగాల్‌లోని కుతుబ్‌పురంలో జరిగింది. అక్కడ ఎక్కువగా కుమ్మరులు, చర్మకారులు, హరిజనులు ఉండేవారు. బ్రాహ్మణుల ఇళ్లు రెండో, మూడో మాత్రమే ఉంటాయి. కానీ...వారికి చాలా మర్యాద ఉండేది. వారి ఆర్థిక పరిస్థితి కూడా మిగిలిన వారికంటే చాలా బాగుండేది. పౌరోహిత్యం మొత్తం వారే చూసేవారు. ఈ బ్రాహ్మణ బృందానికి ప్రధాన వ్యక్తి భువన మోహన భట్టాచార్య.

ఒకనాడు అత్తగారింటి పనిమీద వారందరూ బయటికి వచ్చారు. వారు భైరవనదిని దాటి వస్తూ ఆలోచనల్లో మునిగిపోయారు. ఇంతలో హఠాత్తుగా ఒక వెలుగుతో నిండిన ఉజ్జ్వల నక్షత్రం ఆయన పాదాలను తాకుతూ నదిలోకి దూసుకుపోయింది. వారికి ఆ కాంతి పుంజంలో తేజస్సు కనిపించింది. కానీ, ఇది ఎందుకో వారికి కీడును శంకించింది. వెంటనే వారి గురువుగారైన భాస్కరానందుల వారిని తలుచుకున్నారు. అయినా కూడా ఆ ఆలోచనలు వారిని వెంటాడాయి. ఆయన పని పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లారు. అప్పుడే వారికి వారి భార్య యోగేంద్ర మోహిని గర్భవతి అని తెలిసి, జరిగిన సంఘటన శుభ సూచకం అని ధైర్యం కలిగింది వారికి. ఈ సన్నివేశాన్ని దక్షిణామూర్తి గారు అనువదించిన తీరు అద్భుతంగా ఉంటుంది.

సంప్రదాయం ప్రకారం మొదటి కాన్పు పుట్టింట్లోనే జరిగింది. అక్కడ ఆమెకు దివ్యమైన అనుభూతులు, కలలు వచ్చాయి. వింత వింత సంఘటనలు జరుగుతూ వచ్చాయి. ఆమెకు పూర్ణిమ రాత్రి నాడు ఒక మగపిల్లవాడు పుట్టాడు. ఆయనే నళినీకాంత ఛటోపాధ్యాయ (నిగమానందుల వారు. నళినీకాంత ఛటోపాధ్యాయ ఆయన అసలు పేరు) ఈయన జననంతో అక్కడి ప్రజలు ధన్యులయ్యారు. సౌష్ఠవమైన శరీరం, కండరాలతో నిగనిగ మెరిసిపోయేవాడు. చాలా గారాబంగా పెరిగారు. కానీ అల్లరి పిల్లవాడు. ఊరంతా ఈయన్ను ప్రత్యేకంగా, అపురూపంగా చూసుకునేవారు. చాలా అల్లరిపిల్లవాడు. భయం జాడలే కనిపించేవి కావు. కింది స్థాయి వారితో మాట్లాడుతూ, వారి సమస్యలను అర్థం చేసుకునేవాడు. ఉన్నదంతా అందరికీ పంచేవాడు. (యోగులందరూ మొదట్లో అల్లరిగానే ఉంటారేమో...స్వామి వివేకానంద కూడా తెగ అల్లరి పిల్లవాడే చిన్నతనంలో. ఇంట్లో ఉన్న వస్తువులన్నింటినీ అవసరం ఉన్నవారికి ఇచ్చేవారు. భగవాన్ రమణులు కూడా అంతే. చిన్నతనంలో విపరీతమైన అల్లరి పిల్లవాడే. స్నేహితులతో విపరీతమైన ఆటలు).

నళినీ జీవించే పల్లెలో ప్రజలు విపరీతమైన పూజలు చేసేవారు. పూజలు చేస్తూనే సహజమైన పల్లె జీవితంలోనే బతికేవారు. ఎంత పూజలు చేసినా, వాటి వెనుక దాగివున్న ఆధ్యాత్మిక రహస్యాలను మాత్రం గ్రహించే స్థితిలో వారుండేవారు కాదు. ఈ ప్రభావం చిన్న పిల్లవాడైన నళినీపై పడింది. దీంతో ఆధ్యాత్మికతపై జిజ్ఞాస ప్రారంభమైంది. నళినీ కాస్త పెద్దవాడైనా... అల్లరి మాత్రం తగ్గలేదు. దీంతో తల్లిదండ్రులు దగ్గర్లోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఆ బడిపంతులు మహా పిసినారి. ఆయన్ను సంతోష పెట్టడానికి ప్రతి విద్యార్థీ కానుకగా ఏదో ఒకటి ఇవ్వాల్సి వచ్చేది. తేవడం మరిచిపోతే, ఏదో నెపంతో విద్యార్థులను కొట్టేవాడు. ఒకనాడు ఉపాధ్యాయుడు నళినిని కారణం లేకుండా కొట్టాడు. కొడవలితో ఆయన్ని అంతం చేయాలన్న లక్ష్యంతోనే ఓ పథకం వేశాడు. కానీ సాధ్యం కాలేదు. అయితే వాళ్ల అమ్మకు తెలియకుండా ఉపాధ్యాయునికి ఇంట్లోని వస్తువులు ఇచ్చేస్తుండేవాడు. అయితే అమ్మ అడిగితే మాత్రం ఏదీ చెప్పేవాడు కాదు. అబద్ధం చెప్పడం ఆయన సంస్కారంలోనే లేదు. కానీ అతనిలో తిరుగుబాటు తత్వం ప్రారంభమైపోయింది. కారణమేంటని అమ్మ అడిగితే... అమ్మమ్మ దగ్గరికి వెళ్లి రాజకుమారుడిలా ఉంటూ నెలలు గడిచినా, అక్కడి నుంచి రాకపోయేవాడు. దీంతో తల్లికి ఈయన ఓ సమస్యలా మారిపోయాడు. ఏదైనా చివాట్లు పెడితే అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయేవాడు. ఇలా ఇలా... తల్లితో మాట్లాడటమే ఆగిపోయింది. తల్లీ కొడుకుల మధ్య దూరం పెరిగిపోయింది. అసలు నళినీ ఇలా ప్రవర్తించడానికి కారణమేంటని తల్లి ఆలోచించింది. చివరికి అర్థమైంది. ఇంట్లోకి ఓ కొత్త అతిథి రావడం వల్లే అని తెలిసింది. ఆ తల్లి ఓ తమ్ముడిని కనింది. అమ్మ

పూర్తిగా తనది కాదని, నళిని మనస్సులో అనిపించడం ప్రారంభ మైంది. మెల్ల మెల్లగా ఇంట్లోకి మరో నలుగురు ప్రవేశించారు. వారిలో ఇద్దరు చనిపోయినా, ఇద్దరున్నారు. తల్లి చూపే ప్రేమ నకిలీది అనిపించింది. దీనికంటే అమ్మమ్మ ఇల్లే బావుందనుకున్నాడు. అక్కడైతే అందరూ నా మాటే వింటారు అని అనుకున్నాడు. ఎవరికీ చెప్పకుండా అమ్మమ్మ గారి ఇంటికి వెళ్ళిపోయాడు. తల్లిదండ్రులు కంగారుపడి, అమ్మమ్మ ఇంట్లోనే ఉన్నాడని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలో భాస్కరానందులు కలకత్తాలో ఉన్నారని తెలిసి భువన మోహనులు నళినిని తీసుకొని కలకత్తాకు వెళ్లారు. శ్రీ రామకృష్ణుల పరమహంసుల వారి దర్శనం కూడా చేయించారు. నళిని జాతక చక్రం వేయిస్తే అందులో పెళ్లి అయిన తరువాత సన్యాస యోగం ఉందని చెప్పారు. ఈ మాట విని భువనమోహనులు నళినిపై బెంగ పెట్టుకున్నారు. అప్పటికి నళిని వయస్సు 6 ఏళ్లు. చండీ మండపంలో దీపం పెట్టి రమ్మని అమ్మ చెప్పింది. నళిని దీపం పట్టుకొని మండపంపై కాలు పెడుతూనే, అక్కడ ఇంకో దీపం ఉండడటం గమనించాడు. దీపం అని ఆలోచనలో ఉండగా ఆ దీపం ఒక అగ్నిజ్వాల అయ్యింది. అందులోంచి ఒక బాలిక వచ్చింది. నళిని భయంతో వెళ్ళి, అమ్మ కొంగు చాటున దాక్కున్నాడు. ఆమె తన నిమురుతూ **"ఇందులో భయపడాల్సింది ఏమీలేదు. నీకు భగవతి దర్శనమిచ్చింది. నువ్వు అదృష్టవంతుడివి"** అని చెప్పేవరకూ కుదుటపడలేదు.

ఒక రాత్రి నళిని నిద్రపోతూ ఉండగా, నడిరాత్రి తరువాత అతని నిద్ర చెదిరి చూపు ఇంటికప్పుపై పడింది. చీకటికి బదులు అక్కడ చంద్రుడు ఉదయించాడు. చాలాసేపు ఆలోచించాక అది తన కళ్లలోని జ్యోతేనని నిర్ణయించుకున్నాడు. ఇవన్నీ తెలుసుకున్న భువన మోహనులు, వారి వంశంలో పుట్టిన ఒక సంతానంతో గ్రామంలోని కులదేవత సెలవు తీసుకుంటుందని జనశ్రుతిగా వస్తున్న మాటలకు, ఆ సంతానం నళినినేనా అని ఆలోచనలో పడ్డారు. నళిని స్కూలుకు వచ్చాడు. అతనికి స్కూలంటే విరక్తి వచ్చింది. పగటి పూట స్కూలుకు వెళ్తాడు. రాత్రివేళ ఎవరికీ తెలియకుండా ఊళ్లో జరిగే నాటక ప్రదర్శన చూడ్డానికి వెళ్తాడు. తెల్లవారేసరికి దొంగలా ఇంటికి వచ్చి నిద్రపోతాడు. పురాణ, జానపద కథల మీద ఆధారపడిన యాత్ర, గానం చూసేకొద్దీ దేవతల మీద ఆకర్షణ పెరిగింది. ఆ కథలు మనస్సులో ప్రశ్నలు లేవనెత్తేవి. అతను రామాయణం, భారత పురాణాలు చదువుతుంటే కొత్త ప్రశ్నలు పుట్టుకొచ్చేవి. తల్లిదండ్రుల దగ్గర, పెద్దల దగ్గర ఈ ప్రశ్నలు అడిగినపుడు వాళ్లు దాటేసేవారు. దేవునికి ఏదీ అన్యాయం కాదు, ఆయన ఏదైనా చేయవచ్చు అని చెప్పేవారు. కానీ ఆయన హేతువాద మనసుతో అలాంటి సమాధానా లతో సంతోషం కలగదు. అతనిలో జిజ్ఞాస పెరుగుతూ వచ్చింది.

నళిని తన 14 ఏళ్ల ప్రాయంలో ఓసారి రైల్లో ప్రయాణిస్తున్నాడు. ఏదో ప్రమాదం రాబోతోందని ఆయన హఠాత్తుగా ఊహించాడు. వెంటనే నడుస్తున్న రైలులోంచి దూకేశాడు. కిందపడగానే ఆ రైల్ వెళ్లి డౌన్ ట్రెయిన్‌ను ఢీకొట్టింది. చాలామందికి గాయాలు, మరణాలు సంభవించాయి. ఇలాంటి సంఘటనలు అతని జీవితంలో చాలా జరిగాయి. వాటి ద్వారా ఏదో శక్తి తనను నడిపిస్తున్నట్లుగా అతనికి విశ్వాసం కలిగింది. ఒకసారి నళిని ఎక్కడికో వెళ్తుండగా, పల్లెలోని సిద్ధేశ్వరీ దేవి గుడి దగ్గరికి చేసేసరికి పెద్ద స్థూపాకారంలో ఉన్న వస్తువేదో కదులుతుంది. అతనికి




భయం వేసి, రాయిని దానిపైకి విసిరాడు. అది తగలగానే స్థూపం వెనక్కి జరగడం మొదలు పెట్టింది. అది అలా జరుగుతూ సిద్ధేశ్వరీ దేవి గుడిలోకి వెళ్లింది. పెద్దవారు దానిని భూతప్రేతాల మాదిరిగానే ఒక జీవుడని చెప్పారు. అలా నళినికి చిన్నప్పుడే భూతజన్ముడితో పరిచయమైంది. ఇలాంటివి అతన్ని చిన్నప్పుడే ఆలోచనాపరుడ్ని, యుక్తివాదిని చేశాయి.

కిశోర ప్రాయంలో ఉన్న నళిని యువకుడయ్యాడు. ఒకనాడు నళినికి కల వచ్చింది. అతను కుల కుండలిని పట్టుకొని మూలాధారాది చక్రాలను ఛేదిస్తూ 7 లోకాలకు అతీతంగా భావనా లోకంలోకి చేరాడు. కానీ కిందికి రావడం ఎలా? అతనికి భయం వేసింది. నిద్ర చెదిరిపోయింది. కలలు నిరాధారమైన ఆలోచనలే అయితే నా బుర్రలోకి ఎలా వచ్చింది అనుకున్నాడు. నళినికి గ్రామీణ సమాజంలో చేసే రీతులపై వెగటు పుట్టి, హిందూమతంపై ఆకర్షణ తగ్గింది. కానీ హిందూ ధర్మశాస్త్రం కట్టుకథ అనీ, పిల్లలాట అని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు. నళిని నాస్తికుడైపోయాడు. అతని మనసులో చాలా ప్రశ్నలుండేవి. ఇలా మనసు గందరగోళంగా ఉండడంతో అతను ముక్కోపి అయ్యాడు. అతని నడతలో మార్పు వచ్చింది. అప్పుడప్పుడూ

పిచ్చివాడిలా ఉండేవాడు. తల్లిదండ్రులకు ఈ యువకుడ్ని శాంతపరచడం ప్రశ్నలా మారిపోయింది. నళిని స్కూలుకు వెళ్లడం మానేసి, పగలు తిరగడం, రాత్రి ఎంత దూరమైనా సరే నౌటంకీ చూడడానికి వెళ్తున్నాడు. నళినికి పెళ్లి చేస్తే బాధ్యతలు తెలిసివచ్చి, ఇంటిదగ్గర నిలకడా ఉంటాడని అనుకున్నారు. తలిదండ్రులు గుట్టుగా తల్లి, కోడలు పిల్లకోసం వెదుకుతోంది. ఇక్కడ నళిని రహస్యంగా కవితలు, నాటకాలు, నవలలు రాయడం మొదలుపెట్టాడు.

నళిని అమ్మమ్మ గారింట్లో ఉన్నప్పుడు తల్లికి చాలా జబ్బుగా ఉన్నట్టు కల వచ్చింది. ఆమె మరణశయ్యపై ఉండి, క్షీణస్వరంతో నళిని గురించి అడుగుతుంది. నళిని నిద్ర చెడిపోయింది. కంగారు పడ్డాడు. భయమేసింది కానీ, అప్పుడే విద్యాసాగరులు చెప్పిన కలలు నిరాధారమైన ఆలోచనలు మాత్రమే అని గుర్తుకు వచ్చి ధైర్యం వచ్చింది. కానీ అతని మనస్సు ఒప్పలేదు. కుతుబ్ పురానికి బయలుదేరాడు. కానీ ఇప్పటికీ ఆలస్యమై, తల్లి చనిపోయింది. అతనికి విద్యాసాగరులపై పట్టరాని కోపం వచ్చింది. ఆయన అలాంటి మాటలు రాసి ఉండకపోతే తాను తల్లిని చూసి ఉండేవాడు. కనీసం కడసారి చూపైనా దక్కేది. తల్లి మరణం అతన్ని పుస్తకాల్లో రాసిన మాటల నుంచి, ఉపదేశాల నుంచి విముక్తి చేసింది. విద్యాసాగరుల వారు చెప్పినా, స్వయంగా ఈశ్వరుడే చెప్పినా సరే, ఆలోచించకుండా ఎవరి మాటలను నమ్మవద్దని, అతని జీవితంలో మొదటి పాఠంగా నేర్చుకున్నాడు. రెండోది అతను మొట్టమొదటిసారిగా వైరాగ్య స్వరాన్ని సచేతనంగా అనుభవించాడు.

నళినికి ఒకరు ఆజ్ఞాపించడం నచ్చదు. అది ఇంట్లోవారైనా సరే. అమ్మమ్మ గారింట్లో కూడా ఎవరైనా అడ్డుచెబితే, నచ్చేది కాదు. ఇంట్లో డబ్బు సంపాదించే వారి మాట చెల్లుతుందని, వారికే గౌరవం ఉంటుందని అనుభవం అయ్యింది. కాబట్టి సొంతంగా సంపాదించిన డబ్బుతోనే బ్రతకాలనుకున్నాడు. కానీ మెట్రిక్ పాస్ కాకుండా డబ్బు, గౌరవం, సంపాదించే పని ఎక్కడ దొరుకుతుంది అని చాలా ఆలోచించి ఢాకా సర్వే స్కూలులో చేరాడు. ఇందులో శిక్షణ కోసం పిల్లల్ని పల్లెకు పంపేవారు. ఈ ప్రయాణంలో ఇతనికి చాలా విషయాలు నచ్చలేదు. భార్యాభర్తల ప్రేమ కూడా నటనగానే అనిపించింది. అయితే నిజమైన ప్రేమ ఎక్కడ దొరుకుతుంది?

నళిని పెళ్లి సుధాంశుబాలతో జరిగింది. సుధాంశుబాల అత్తవారింట్లో అడుగు పెడుతూనే, ఇంటికి వెలుగు తెచ్చింది. అందరూ ఈమెలో దైవీ గుణాలు కనిపిస్తున్నాయనే వారు. భువన మోహనులు కోడలు గురించి **"ఈమె నా ఇంటి కోడలు కాదు. సాక్షాత్తూ జగదాంబే. ఆడపిల్ల రూపంలో నా ఇంటికి వచ్చింది"** అని అన్నారు. సుధాంశుబాలతో అతని సంబంధం పెరగసాగింది. నళిని సుధాంశు బాలని రాణి అని పిలిచేవాడు. ఇద్దరిలో ఒకరిపై ఒకరికి ఆకర్షణ ఏర్పడింది. అమ్మ నాన్నగారిని ఎంత ప్రేమిస్తుండేది తన రాణి కూడా తనని అంతే ప్రేమిస్తుందా అని నళిని అనుకునేవాడు. నళినికి ఉద్యోగం వచ్చింది. అక్కడికి వెళ్ళడానికి సిద్ధం అవుతున్నాడు. రాణి తనదైపోయింది. నళిని ఉద్యోగపుటూరికి బయల్దేరేటప్పుడు ఇద్దరి కంటి నుండి నీరు ధారగా కారాయి. కానీ, అక్కడ పనిలో ఇంజనీరు గారితో గొడవ జరిగి ఉద్యోగం పోయింది. కానీ, ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం దొరికింది. సెలవుల మీద ఇంటికొచ్చినప్పుడు రాణిని చూస్తే జుట్టు చిందర వందరగా, మొహం ఉబ్బి, కళ్ళు వాచి ఉన్నాయి. నళిని రాణి దగ్గరికి వెళ్ళి ఏమైంది? నీ నగలు, చీరలు ఏవి? ఇలా ఎందుకున్నావని అడిగేసరికి రాణి అవన్నీ ఎవరి కోసం కట్టుకుంటాను? పెట్టుకుంటాను? అని అంది. ఆ అమ్మాయి ఆలోచనకు, ఆచరణకు నళిని ముగ్ధుడయ్యాడు. వారి మధ్య జరిగిన కొన్ని సందర్భాల వల్ల ఈ పవిత్ర నారి భక్తి విశ్వాసాలు నళిని నాస్తికతను సవాలు చేస్తున్నాయా అన్నట్టుంది.

ఒకనాడు నళిని బయటికి వెళ్లగా ఊరికి నిప్పు అంటుకుంది. రాణి ఇంటికి కూడా నిప్పు అంటుకుంది. రాణి వీరబాలగా మారి, ఇంట్లో వారిని, వస్తువులను బయటకు చేర్చింది. ప్రాణం అరచేతిలో పెట్టుకున్న జనాన్ని కాపాడింది. ఒకనాడు రాత్రి రాణి పుట్టింటికి వెళ్తుంటే ఎద్దుబండి మెల్లగా సాగుతుంది. అంతలో అడవిలోంచి పెద్దపులి వచ్చింది. పులి ఎద్దుబండి వైపు ఉరికింది. బండివాడు భయపడ్డాడు కానీ, రాణి ఏ మాత్రం భయపడలేదు. పులి కళ్ళలోకి సూటిగా చూసింది. పులి వెనక్కి తగ్గి వెళ్ళిపోయింది. ఒకసారి తన పుట్టింట్లో నళినికి జరగవలసిన సత్కారాలు జరగలేదని పుట్టింటికి వెళ్ళడం మానేసింది.

తరువాత నళిని రాణిని తన ఉద్యోగపుటూరికి తీస్కెళ్లాడు. రాణి అక్కడ తన కొత్త సంసారం మొదలుపెట్టింది. ఆమె కాపురాన్ని దిద్దుకున్న తీరు చూసి చుట్టుపక్కల వారు ఆశ్చర్యపడేవారు. చూస్తూ చూస్తూనే 2 నెలలు సుఖంగా గడిచిపోయాయి. రాణి గర్భవతి అయింది. నీరసించిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో రాణిని ఇక్కడ ఉంచడం ఎందుకని నళిని ఆమెను కుతుబ్‌పురం దింపేసి వచ్చాడు.

ఒకనాడు రాత్రి నళిని పని చేసుకుంటూ అతనికి రాణి కనిపించింది. **'అరే! నువ్వు ఒక్కతివే ఎలా వచ్చావిక్కడికి?'** అని అడిగి, మళ్ళీ సంభాలించుకుని, ఇది కల కాదు కదా. భ్రమ అయి ఉండవచ్చు అనుకున్నాడు. కలతపడి యోగక్షేమాలు తెలపమని కుతుబ్ పురానికి ఉత్తరం రాశాడు. దానికి సమాధానం రాకముందే రాణికి జబ్బు చేసిందని వర్తమానం వచ్చింది. కానీ, మానసిక విచారం కంటే కర్తవ్యం ముఖ్యమనుకున్నాడు. సెలవులకు కుతుబ్ పురానికి వెళ్లాడు. అప్పుడు రాణి ప్రాణం లేని పిల్లను కని కన్ను మూసిందని తెలిసింది. అతని సందేహం నిజమైనదే. క్యాంపులో రాణిని చూసిన గంట ముందే రాణి చనిపోయింది. అతనికది జీవితంలో చాలా గట్టి దెబ్బ.

రాణి చనిపోయిన తరువాత అతను ఆమెను చూశాడు. ఇంత పెద్ద సంఘటన జరిగిన తరువాత అతను మరణాంతర జీవితం లేదు అంటే ఎలా నమ్ముతాడు? అతని హృదయం రాణి జ్ఞాపకాలతో నిండిపోయింది. నిద్ర పట్టడం లేదు. అప్పుడే అతని గదిలోకి ఎవరో వచ్చినట్టనిపించింది. **'ఎవరు?'** అని అడిగాడు. **'నేను'** అంది ఆ శబ్దం. **'నువ్వు అయితే నేను నిన్ను ఎందుకు చూడలేకపోతున్నాను?'** అన్నాడు. **'మీరు నా రూపాన్ని చూసి భరించలేరు'** అంది ఆ కంఠం. **'నీ రూపాన్ని భరించలేకపోతే ఇంక దేన్ని భరిస్తాను?'** అన్నాడు నళిని. అపుడు రాణి అతని దగ్గరకు వచ్చి **'మీరు నాకు శ్రాద్ధం ఎందుకు పెట్టడం లేదు? అందుకే నాకు శాంతి కలగట్లేదు. కానీ, మీరే స్వయంగా పెడ్తే ఎక్కువ శాంతి కలుగుతుందని'** చెప్పింది. **'అయితే రేపే నీ శ్రాద్ధం జరుగుతుందని'** అన్నాడు నళిని.

తెల్లవారగానే నళిని లేచి, అన్నీ సమకూర్చుకుని పిండం చేసి, రాణిని ఆహ్వానిస్తున్నాడు. గంటలు గడిచినా రాణి రాలేదు. చివరకు ఆ అన్నపిండాన్ని తానే తినడానికి సిద్ధమయ్యాడు. అపుడు రాణి వచ్చి **'ఇది నా ఎంగిలి. మీరెందుకు తింటున్నారు?'** అంది. నళిని ఆశ్చర్యంతో **'ఇది ఇక్కడే ఉంది. నువ్వెలా తిన్నావు?'** అన్నాడు. అపుడు రాణి **'నేను సూక్ష్మ శరీరంలో ఉన్నాను కాబట్టి అన్నంలోని సూక్ష్మభాగాన్ని మాత్రమే తినగలుగుతాను. మీరు పెట్టినప్పుడే నాకు ఇది ముట్టింది.'** అని చెప్పింది. తరువాత నళిని వాటిని గంగలోకి పడేశాడు.

మరణాంతర జీవనంపై అతనికి నమ్మకం మొదలైంది. అతనిలో ప్రశ్నలు మొలకెత్తాయి. రాణి ఆత్మ చెప్పింది – **'మీరు దివ్యజ్ఞాన సమాజానికి వెళ్లండి. అక్కడ సమాచారం దొరుకుతుంది'** అని. అక్కడ నళినికి మనిషి మాట్లాడేది/వినేది వాయు మండలంలో సంచితమయి ఉంటాయి. మనస్సును ఏకాగ్రం చేస్తే వాటిని వినగలుగుతాం అని తెలిసింది. కానీ, దీంతో నళినికి సంతృప్తి లభించలేదు. ఈ జ్ఞానం అధమమైంది అనిపించింది. మాధ్యమం ద్వారా జ్ఞానం పొందడం అతనికి నచ్చలేదు. ప్రత్యక్షంగా పొందాలనుకున్నాడు. ఇప్పుడు రాణిని ప్రత్యక్షంగా చూడాలనుకుంటున్నాడు.

కలతపడ్డ నళినీకాంతుడు కనిపించిన సాధువులు, ఫకీర్ల దగ్గరికి వెళ్లినా ఏమీ దొరికేది కాదు. దాంతో మనసు ఇంకా అశాంతి పాలయింది. అతను కలకత్తా వెళ్లి పూర్ణానంద స్వామిని కలుసుకున్నాడు. ఆయనకు తన సమస్యను నివేదిస్తే, **'సాధన ద్వారా నువ్వు మహామాయ ప్రాప్తమయ్యేట్లు చేసుకో. తరువాత అన్నీ నీ గుప్పిట్లో ఉంటాయి. నేను నీ గురువును కాదు. గురువును వెతుకు. దొరుకుతాడు.'** అని చెప్పారు.

నళిని పక్కపై పడుకుని ఆలోచిస్తూ ఉండగా అతనికి మగత వచ్చింది. ఒక మహా పురుషులు తన దగ్గరికి వచ్చి **'నాయనా. ఈ మహామంత్రం తీసుకో. నీవు దేనికోసం వెతుకుతున్నావో అది ఇదే'** అని చెప్పాడు. నళిని ఆ మంత్రం తీసుకొని జప విధానం అడుగుదా మనుకునే లోపు ఆయన అదృశ్యమయ్యాడు. దాన్ని ఎంతమందికి చూపించినా సరైన సమాధానం రాలేదు. కానీ శక్తి మంత్రమని తెలిసింది.

కాశీకి వెళితే ఏదైనా తెలుస్తుందని అక్కడికి వెళ్తాడు. ఒకనాడు అర్ధరాత్రి వీధుల్లో తిరుగుతుంటే ఏదో పిశాచం తనను వెంబడిస్తున్నట్లు చూశాడు. భయపడి పరుగెత్తడం మొదలెట్టాడు. కానీ ఎవరో తనను కాపాడినట్టుగా అనిపించింది. కాశీలో కూడా అతనికి ఏమీ దొరకలేదు. చివరకు, ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాడు. ఈ నిర్ణయం తీసుకున్నాక అతనికి నిద్ర వచ్చింది. కలలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు నళిని తల నిమురుతూ **'నాయనా! నీ గురువు వామాక్షీపుడు బెంగాలు వీరభూమి జిల్లాలో చండీపురమనే గ్రామంలో నీ కోసం ఎదురుచూస్తున్నాడు'** అని చెప్పాడు. అతని నిద్ర చెదిరిపోయింది. వెంటనే గురువు కోసం బయలుదేరాడు.

నళినీకాంతుడు ఉరుకులు పరుగుల మీద చండీ పురానికి వెళ్లాడు. వామక్షీపుల చరణాలలో తనను తాను అర్పించుకున్నాడు. వామాక్షీపులు అతన్ని పైకి లేవదీసి, **'నువ్వు ఎవరివి? ఎక్కడి నుంచి వచ్చావు?'** అని అడుగుతాడు. నళినుడు జరిగింది చెప్పాడు. వామాక్షీపులు ఆ ఏకాక్షరీ మంత్రం చూస్తూనే త్రుళ్లిపడి **"నాయనా నువ్వు చాలా అదృష్టవంతుడివి. నీకు తారామంత్రం దొరికింది. నేను నీకు సాధనా పద్ధతి చెప్తాను. కానీ నా ఆజ్ఞలను ఉల్లంఘిస్తే సర్వనాశనమవుతావు"** అన్నారు. నళిని సిద్ధంగానే ఉన్నానని చెప్పాడు. ఆయన తన విద్యనంతా శిష్యుడికి ప్రదానం చేశారు. నళిని నిష్ఠతో తంత్ర సాధనలో మునిగిపోయాడు. కఠిన పరీక్ష ఎదురైంది. నిశ్చయించిన తిథి రావడమే ఆలస్యం.

**"జాగ్రత్త ... నేను ఎలా చెబితే అలా చేయు. నీ సాధనలో విఘ్నం కలిగించడానికి నాలుగువైపుల నుంచి శతవిధాలా ప్రయత్నాలు జరుగుతాయి. కానీ నువ్వు స్థిరంగా ఉండాలి. నేను ఈ మంత్రాన్ని చైతన్యం చేస్తున్నాను. సాక్షాత్తూ అమ్మవారి దర్శనం కలుగుతుంది. అమ్మయితే విశ్వరూప. ఇష్టదేవి ఏ రూపంలో వచ్చినప్పటికీ ఆమె 'నీ అదృష్టదేవిని' అని చెబుతుంది. ఇష్ట దేవతకు తప్ప మరెవరికీ సాధకుడి నుదుటిని పాదంతో తాకగల సామర్థ్యం ఉండదు. మృత్యుంజయమైన వీరత్వంతో జీవనాన్ని ఐశ్వర్యశీలిగా చేయడమే తాంత్రికుడి పురుషార్థమవుతుంది"**

నళినీకాంతుడు గురువు చెప్పిన విధంగా జప విధానాన్ని మొదలు పెట్టాడు. జపం చేస్తుండగా అన్ని రకాల అడ్డంకులు ఎదురయ్యాయి. కానీ, అతని మనస్సు లయమైంది. ఒక మానవ స్త్రీ కిందకు దిగింది. నళిని ఆశ్చర్యంతో **"మీరు ఎవరు? మా గురువు గారు మీ రూపం ఆకాశంలా ఉంటుందని చెప్పారు"** అన్నాడు. ఆ ఆకారం **'నాకున్న ఆ రూపాన్ని చూస్తే నీవు తట్టుకోలేవు. ఏదైనా వరం కోరుకో'** అంది. నళిని **'కేవలం నిన్నే కోరుతున్నాను. ఎప్పుడు కోరితే అప్పుడు, ఇదే**

**రూపంలో దర్శనమివ్వు'** అన్నాడు. ఇంకా **"దేవీ ఒక్కసారి నీ అసలు రూపాన్ని దర్శనమిస్తే కృతజ్ఞుణ్ణి అవుతాను"** అన్నాడు. దానికి ఆ రూపం తథాస్తు అని అన్నది. ఆ రూపం చూస్తూనే నళిని భయం, ఆశ్చర్యం, ఆనందం ఏకకాలంలోనే పొందాడు.

సిద్ధి కలిగిన తరువాత అతను మూడురోజుల వరకూ ఉన్నాడు. తరువాత తన ఉద్యోగపుటూరికి వెళ్లాడు. కోరీకోరగానే రాణిని చూడగలుగుతున్నాడు. కానీ కేవలం చూడడంతోనే అతని కోరిక తీరడం లేదు. తాకాలనుకుంటున్నాడు. కానీ తాకగానే ఆ రూపం అదృశ్యమవుతుంది. అతని ఆనందం పూర్ణం కాలేదు. మళ్లీ ఇలా ఆలోచించాడు. వెలుగు నా శరీరం నుండే వెలువడి తారామాత రూపాన్ని ధరించింది. తరువాత గురువు నళిని దగ్గరకు వచ్చి **"అమ్మ దగ్గర నుంచి అన్నీ తెలుసుకున్నాను. నీవు తత్వజ్ఞానం పొందాలను కుంటున్నావు. దీని కోసం సన్యాసం తీసుకోవాల్సి ఉంటుంది"** అన్నారు. దానికి నళిని సరే అన్నాడు. దీంతో ఉద్యోగం వదిలిపెట్టాడు. ప్రపంచం అతనికి విషంలాగా అనిపించింది. కాశీలోని స్వాములతో సన్యాసంపై చర్చించాడు. నళిని సన్యాసం తీసుకోవాలనుకుంటు న్నాడని, ఇంట్లో తెలిసిపోయింది. వారు అతన్ని ప్రాపంచిక జీవనంలోకి మళ్లించాలని ప్రయత్నించారు. ఈ విషయం తెలిసి నళిని బృందావనానికి వెళ్లిపోయాడు. మధ్యలో నళిని చాలా కష్టపడతాడు. ఒకానొక సమయంలో మురికి నీటిని కూడా తాగాడు. చివరకు పుష్కర క్షేత్రంలో సావిత్రీ పర్వతం మీద సచ్చిదానందుల ఆశ్రమం ఉండేది. అక్కడే నళినీకాంతుని ఆశ్రమ జీవనం ప్రారంభమైంది. మొదట బ్రహ్మచర్య పాఠం, తరువాత సంస్కృతం, హిందీ నేర్చుకోవడం, తరువాత ఉపనిషత్ వేదాంత విద్య, నిత్య గీతాపఠన చేయడం. ఇదీ దినచర్య. అంతే కాకుండా కట్టెలు కొట్టి తేవాలి, గుర్రాల కోసం గడ్డి తేవాలి. గో సేవ చేయాలి, వంట కూడా చేయాలి. ఆ పైన గురువు గారి తిట్లు కూడా తినాలి. ఇలా శుశ్రూష చేస్తుండగా, ఓసారి ధైర్యం తెచ్చుకొని సన్యాసం ఇవ్వమని గురువుగారిని కోరతాడు. గురువుగారు కూడా సన్యాస దీక్ష ఇవ్వడానికి ముహూర్తం చెబుతారు. దీంతో నళినీ కాంతుడు ఎగిరి గంతేస్తాడు. గురువు సచ్చిదానందులు అతనితో **'విరజా హోమం'** చేయిస్తాడు. యజ్ఞోపవీతాన్ని విసర్జింపచేస్తారు. ఆ తరువాత **'స్వామి నిగమానంద'** అన్న యోగ పట్టాను బహూకరిస్తాడు. సన్యాస దీక్ష ఘట్టం ముగిసిన తర్వాత గురు శిష్యులిద్దరూ తీర్థయాత్రలకు బయల్దేరతారు. బదరీ, కైలాస పర్వతం, మానస సరోవరానికి కూడా వెళ్తారు. ఈ సమయంలో స్వామి నిగమానందకు చిత్ర, విచిత్ర అనుభవాలు కూడా కలుగుతాయి. ఆ తర్వాత రామేశ్వరం వెళ్లి, **'అహం బ్రహ్మోస్మి'** అన్న మహావాక్య అనుభవాన్ని పొందుతారు. అలాగే ఋగ్వేద మంత్రమైన **'ప్రజ్ఞానం బ్రహ్మ'** అన్నది అనుభవమైంది. నిగమానందుల సంచారం ముగిసింది. సన్యాస కఠిన దీక్ష కూడా ముగిసింది.

ఆ తర్వాత స్వామీజీ యోగి గురువు కోసం అన్వేషణ ప్రారంభ మవుతుంది. మార్గమధ్యంలో ఓ యోగిని దర్శనమిస్తుంది. ఆమె దగ్గర యోగ విద్య నేర్చుకోవాలని భావిస్తారు. కానీ ఆమె బదులిస్తూ **"నీ గురువులు నిర్ణయమై ఉన్నారు. తూర్పుకు వెళ్లు"** అని చేతిలో డబ్బులు పెట్టి మరీ పంపిస్తుంది. ఆ తర్వాత కూడా నిగమానందులు వివిధ యాత్రలు చేస్తారు. కామాఖ్య, కాశీ ఇలా యాత్రలు చేస్తూనే శాస్త్రాలు, ఉపనిషత్తులను జీర్ణించుకున్నారు. క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఇలా ధర్మశాస్త్రాలను విశాలదృష్టితో వ్యాఖ్యానించడంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. వివిధ గ్రంథాలను కూడా రాశారు. ఇంత జ్ఞానం సంపాదించుకోవడంతో శిష్యగణం కూడా తయారైంది.

మొత్తానికి స్వామి నిగమానంద జీవన వ్రతాన్ని రెండు భాగాలుగా చూడవచ్చు. జీవసేవ ఒకటి. అంటే సనాతన ధర్మ ప్రచారం, సద్విద్యా వ్యాపనం, ఆర్తుల పరిచర్య. రెండోది- సద్గురు సేవ. గురువు కావడమే జగద్గురు సేవ అవుతుంది. నిగమానందుల తత్వ మండపానికి నాలుగు స్తంభాలున్నాయి. తంత్రం, వేదాంతం, యోగం, భక్తి, శంకరుల జ్ఞానం, చైతన్య దేవుల ప్రేమ. శిష్యుల విషయంలోనూ నిగమానందులు అత్యంత వాత్సల్యంతో ఉండేవారు. వారికి వచ్చే ఇబ్బందులను స్వయంగా ఈయన మోసేవారు. ఒకనాడు స్వామికి విపరీతమైన గుండె పోటు వచ్చింది. జబ్బు ఏమిటో వైద్యునికి కూడా అంతుపట్టలేదు. చివరికి తెలిసిందేమిటంటే... ఓ శిష్యుడి ప్రారబ్ధాన్ని తమ మీదికి తెచ్చుకున్నారు. ఈ ఘటన తర్వాత సుమారు 6 సంవత్సరాల పాటు జీవించే ఉన్నారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకునే వారు. 16 గంటల సేపు నిద్రలోనే ఉండేవారు. కానీ అంత సేపు యోగనిద్రలోనే. అందరి క్షేమాన్ని కోరేవారు. నిగమానందులు రాణిని గురుబ్రహ్మ స్థానంలో నిలిపేవారు. ఇద్దరూ ఒకేస్థాయి వారని భావించేవారు. ఇలా నిగమానందులు కాలం గడిపేస్తున్నారు. వైద్యులు కూడా చేతులెత్తేశారు. చివరి వరకూ కలకత్తాలో వైద్యం అందుతూనే వచ్చింది. అయినా శిష్యులకు జ్ఞానబోధ నడుస్తూనే వుండేది. ఆయన చివరి ఆశీర్వాదం ఏమిటంటే.. **"మీ చిత్తాన్ని నిర్మలంగా చేసుకోండి. దాంట్లో మీరు మీ కోరికలను స్పష్టంగా చూడగలుగుతారు. సద్గురువును ఇచ్చును ప్రత్యక్షం చేసే సౌభాగ్యం ఏర్పడే భూమి మీద అడుగు పెట్టండి. మీరందరూ నా గొప్ప ఇచ్ఛకు ప్రతీకలు కండి. ఇదే నా చివరి దీవెన".** ఆ తర్వాత నిగమానందుల వారు మహా సమాధి పొందారు.

భాగీరథీ ఒడ్డు వెంబడి నడుస్తూ హాలిశహార్ చేరితే సారస్వత మఠ మందిరంలో ఈనాటికీ సద్గురు స్వామి నిగమానంద సరస్వతీ పరమహంస వారి దర్శనం లభిస్తుంది.

# భారతీయ ఆధ్యాత్మికతను పరిచయం చేసిన "భక్తి కథలు"

డా. బి. మనోహరి, ఫోన్ : 9347971177

భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్యానానికి మూలం భక్తి. భక్తి అనేది మన మనసులో భగవంతుని పట్ల ఉండే ఒక పవిత్రమైన భావన. పరిపూర్ణ విశ్వాసం, పవిత్రత, ఆరాధన.. ఇటువంటి భావాలు కలవారు భక్తులుగా పిలువబడుతున్నారు. ఇది ఎవరికి ఏ రూపంలో ఏవిధంగా గోచరమౌతుందో వారి వారి ఆధ్యాత్మిక సాధన, అంతఃకరణ శుద్ధి ద్వారా మాత్రమే వ్యక్తమౌతుంది. ఇటువంటి భక్తిభావనలు కలిగిన వారు తాము మోక్షసాధనకు చేసే ఆయా ప్రయత్నాలనే పెద్దవారు నవవిధ భక్తిమార్గాలుగా పేర్కొన్నారు. పోతన భాగవతంలో

**"తను హృద్భాషల సఖ్యమున్, శ్రవణమున్, దాసత్వమున్, వందనా ర్చనముల్, సేవయు, ఆత్మలో నెఱుకయున్, సంకీర్తనల్, చింతనం బను నీ తొమ్మిది భక్తిమార్గంబుల సర్వాత్ముడైన హరిన్ నమ్మి స జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా!**

శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చన, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదన ఇవన్నీ భగవంతుని చేరడానికి భక్తి మార్గాలు. పరీక్షిత్తు, వాల్మీకి, నారదుడు, ప్రహ్లాదుడు, తులసీదాసు, త్యాగరాజు, గుహుడు, లక్ష్మణుడు, హనుమంతుడు, కుచేలుడు, అర్జునుడు, సుగ్రీవుడు మొదలైనవారు వారి భక్తిద్వారా భగవంతుని ప్రేమకు ప్రీతిపాత్రులైనారు. వీరందరూ పురాణ, ఇతిహాస పురుషులు.

మానవులు నిత్యజీవన విధానంలో మోక్షమార్గం చేరడానికి భక్తికి మించిన అద్భుతమైన మార్గం లేదని చాలామంది భక్తులు నిరూపించినారు. చిన్న వయసు వారి దగ్గర నుండి వృద్ధాప్యంలో ఉన్నవారి వరకు భగవంతుని కృప ఎప్పుడు ఎవరి మీద ఏవిధంగా ఉంటుందో తెలియదు. అందరి జీవన విధానం ఒకేవిధంగా ఉ ండదు. ఆయా మార్గాల ద్వారా దేవుడిని చేరుకునే మార్గంలో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని భగవంతుడు వారికి మోక్షమార్గాన్ని చూపిస్తాడు. అటువంటి మోక్షమార్గాన్ని చేరుకునే క్రమంలో వారికి అనేక సమస్యలు, కష్టాలు కల్పించి, వాటిని అధిగమించే మార్గం కూడా భగవంతుడే చూపుతాడు. అతని మీద పూర్తి నమ్మకం ఉ ంచితే అన్నీ తానై చూసుకుంటాడు.

భక్తిభావనతో, సంపూర్ణ విశ్వాసంతో భగవంతుని ఆరాధించిన, పూజించిన, అర్చించిన భక్తులు కోకొల్లలు. అందులో వారి భక్తి ద్వారా ప్రజల్లో భక్తిభావాన్ని కల్గించి, భగవంతుని మార్గాన్ని చూపించిన కొందరు భక్తుల జీవిత చరిత్రలను కథల రూపంలో మనకు అందించినారు డా. పోరంకి దక్షిణామూర్తిగారు.

24 మంది భక్తుల చరిత్రలను, వారి ఆధ్యాత్మిక ప్రయాణాన్ని 2 సంపుటాలలో ప్రచురించారు. మొదటి భాగంలో 13 మంది, 2వ




భాగంలో 11మందికి సంబంధించిన కథలు ఉన్నాయి. ప్రతి కథకు వారి పేరుకు ముందు విశేషణాన్ని చేర్చినారు. ఉదా: వేపచెట్టుకు సూర్యుని వేలాడదీసిన తెలుగు వెలుగు "శ్రీ నింబార్కాచార్యులు", దాదాపు మూడువందల ఏళ్ళు జీవించిన తెలుగుయోగి శ్రీ త్రైలింగస్వామి, పుట్టగానే పరిమళించిన భక్తి కుసుమం "శ్రీ జనాబాయి".... ఇట్లా అన్ని కథలకు పేర్లు పెట్టినారు.

సాధారణంగా కథలు వ్రాయలంటే ఒక వ్యక్తి లేదా సంఘటనలు, ప్రేమ, సంస్కృతి, సంప్రదాయాలు, దేశ, ప్రాంతీయ సంబంధమైన అనేక సమస్యలను ఆధారం చేసుకొని వ్రాస్తుంటారు. కానీ భక్తుల జీవిత చరిత్రలను ఆధారం చేసుకొని కథలు వ్రాయడమంటే అంత సులువైనది కాదు. ఎందుకంటే దక్షిణామూర్తిగారు ఇందులో ఎంచుకున్న వ్యక్తులందరూ మనకు పూర్వం రెండు శతాబ్దాల్లో జీవించినవారే. వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి అది కథలో కథా లక్షణాలకు అనుగుణంగా జీవితచరిత్రను

చదువుతున్నట్లుగా కాక ఒక కథను చదువుతున్న అనుభూతి కలిగించే విధంగా వ్రాయాలి. ఇటువంటి కథా రచనల్లో కల్పనలకు అవకాశం తక్కువ. కథనాత్మకత అధికంగా ఉండకూడదు. వాస్తవిక సంఘటన లను ఆధారం చేసుకొని వాటిని కథల్లో ఆయా సందర్భాల్లో ప్రవేశపెట్టి భక్తుడి కథను అందరికీ అర్థమయ్యేవిధంగా వివరించాలి. దీనికై ఆయా భక్తుల యొక్క జీవిత చరిత్రలు, వారు రచించిన రచనలు, భజనలు, స్తోత్రాలు, చేసిన ఆధ్యాత్మిక యాత్రలు, ఉపన్యాసాలు అన్నీ చదివి, వాటికి ఒక రూపకల్పన ఇవ్వడమనేది అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు.

మద్రాసు నుండి వెలువడిన కుముదంవారి భక్తి మాసపత్రికలో దాదాపు 20 నెలలకు పైగా వచ్చిన ఈ భక్తి కథలు 2012లో రెండు సంపుటాలుగా వెలువడినాయి. ఇందులో మొదటి సంపుటంలో 1. శ్రీ త్రైలింగస్వామి 2. శ్రీ రామప్రసాద్ 3. శ్రీ రామకృష్ణ పరమహంస 4. శ్రీ చండీశ్వర నాయనారు 5. శ్రీ మత్స్యేంద్రనాథుడు 6. శ్రీ ఏకనాథస్వామి 7. శ్రీ జనాబాయి 8. శ్రీ రామరాజు 9. శ్రీ ధనాజాటుడు 10. శ్రీ పుణ్యవతి 11. శ్రీ దీనబంధు దాసు 12. శ్రీ గుణవతి 13. శ్రీ సజ్జనక చారుకదాసుల కథలు ఉన్నాయి.

రెండవ సంపుటంలో 1. శ్రీ నింబార్కాచార్యులు 2. శ్రీ సదాశివ బ్రహేంద్ర సరస్వతి 3. శ్రీ పురందరదాసు 4. శ్రీ వల్లభాచార్యులు 5. శ్రీవక్షఃస్థలాచార్యులు 6. శ్రీ అప్పయ్య దీక్షితులు 7. శ్రీ శ్యామశాస్త్రి 8. శ్రీ చిదంబర రామలింగం 9. శ్రీ బొంతబాబా 10. శ్రీ వాసిష్ఠ గణపతిముని 11. శ్రీ పరమహంస యోగానంద.

24 మంది భక్తుల జీవిత కథలను పరిచయం చేసిన దక్షిణామూర్తి గారు వీరందరి భక్తి భావాలను ఆకళింపు చేసుకొని ఈ కథలల్లో భాగంగా ఉన్న శ్రీ జనాబాయి (మొదటి భాగం)లో భక్తికి ఒక నిర్వచనాన్ని ఇచ్చారని మనం అర్థం చేసుకోవచ్చు. భక్తి అనేది వారి మాటల్లోనే **"భక్తి అనేది హృదయానికి సంబంధించినది" "ఒక వ్యక్తిమీదో, వస్తువుమీదో, దృశయం మీదో కలిగేది కాక, తల్లిగానో, తండ్రిగానో, ప్రభువుగానో, సఖుడిగానో, బిడ్డగానో భగవంతుడి మీద కలిగే ప్రేమను భక్తి అంటాం. ఈ భక్తికి జాతి, మత, కులాది భేదాలతో ప్రమేయం లేదు. స్త్రీ, పురుష వ్యత్యాసంతోనూ సంబంధం లేదు. వయస్సుతోనూ నిమిత్తం లేదు. చదువు సాముల వంటివి అసలే అక్కరలేదు. కొందరికిది చిన్నవయస్సులోనే బయలు పడుతుంది. కొందరిలో పెరుగుతూ వచ్చిన తరువాత బయట పడుతుంది. ఈ రెంటిలో చిన్నవయసులో బయటపడేదే మేలని అందరికీ తెలుసు..... మనిషి జన్మ ఎత్తిన తరువాత భక్తి ఏర్పడటమన్నదే పూర్వజన్మ పుణ్యఫలం. మనిషిలో పరిపక్వత ఏర్పడ్డప్పుడు అది సిద్ధిస్తుంది..."** అంటూ భక్తికి స్పష్టమైన నిర్వచనం ఇచ్చినారు.

దక్షిణామూర్తిగారు రచించిన 24మంది భక్తుల కథల్లో ఆయా భక్తుల జీవితాల్లో జరిగిన ముఖ్య సంఘటనలు, వారు ప్రదర్శించిన అద్భుతాలను చాలా చక్కగా వివరించారు. అందులో కొందరు భక్తుల కథల్లోని కొన్ని అంశాలను తెలుసుకుందాం.

300 సంవత్సరాలు జన్మించిన త్రైలింగస్వామి ఒక తెలుగు యోగి. ఇతడు చిన్నతనం నుండే ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ అనేక అద్భుతాలను తన భక్తి ద్వారా లోకానికి తెలియజేసినాడు. చలమాన విశ్వనాథుడిగా పేరు పొందిన ఈ స్వామి ప్రభావం తెలుగుదేశంలో కంటే వంగదేశంలోనే అధికంగా ఉంది. నేటికీ ఆ స్వామిని అక్కడ ప్రాంతీయులు ఆరాధిస్తారు. దాదాపు 50 సం॥ల క్రితమే ఆయన జీవిత కథను బెంగాలలో చలనచిత్రంగా తీసినారు. స్వామి కాలికానంద సరస్వతి, కాళీచరణస్వామి, బ్రహ్మానంద సరస్వతి, బోలానాథ సరస్వతి, మాతా అంబాదేవి, యోగీశ్వరీమాత వంటి దాదాపు 20 మంది ప్రసిద్ధ యోగులకు గురుస్థానంలో ఉన్న ఈ తెలుగుయోగి రామకృష్ణ పరమహంసచే **'నడిచే విశ్వనాథుడిగా'** ప్రశంసించబడినాడు.

కలకత్తాలో కాళీమాత, దుర్గామాత ఆరాధన ఎక్కువగా ఉంటుంది. ఆ అమ్మ భక్తుల్లో శ్రీ రామప్రసాద్ ఒకరు. ఒక గుమాస్తాగా పనిచేస్తూ పద్దు పుస్తకాల్లో అమ్మమీద పాటలు అనేకం రాసి యజమాని చేత తిట్లు తిని చివరకు ఆ యజమాని ఈయన రాసిన పాటలు గమనించి అతనికి అనేక కానుకలు ఇచ్చి సాగనంపిన గొప్ప భక్తుడు ఈ రామప్రసాద్

**"జీతం లేని దాసుణ్ణి నేను**
**నీ కాలి దుమ్ముకే హక్కున్నవాణ్ణి..."**

అంటూ అమ్మకు దాసుడిగా, పాదధూళి తప్ప మరేమీ తనకు వద్దన్న భావనతో రాసిన ఈ పంక్తులు అతని పరిపూర్ణ భక్తిని మనకు తెలియజేస్తున్నాయి. చివరకు రామప్రసాద్‌గారు దేహం చాలించి అమ్మను చేరిన సందర్భంలో దక్షిణామూర్తిగారు **"మాతృచైతన్య సాగరంలో నిమగ్నుడయాడు రామప్రసాద్. అతని దేహమంతా దివ్యకాంతిలో వెలుగొందిపోయింది. పరమోన్నత పారవశ్య స్థితిలో ఉండగా, అతని నడినెత్తిన బ్రహ్మరంధ్రం (మాడుపట్టు) చిట్లింది. అమ్మవారి కలశం ఏటి ఒడిలోకి చేరింది. హంస లేచిపోయింది"** అంటూ కలశం ఏటి ఒడిలోకి చేరడం, హంస లేచిపోవడం వంటి ప్రతీకాత్మక పదాలను ఉపయోగించారు.

రామకృష్ణ పరమహంస గురించి చాలామందికి తెలుసు. అతని జీవితం మొత్తం అద్దంలో కనిపించే ప్రతిబింబమే. ఆయన గురించిన చారిత్రక సంఘటనలన్నీ అనేక పుస్తకాల్లో మనకు లభిస్తుంది. అయితే తన భార్య అయిన శారదామత గురించి ఆయన చెప్పిన వాక్యాలను ఈ కథలో దక్షిణామూర్తిగారు చాలా ఉదాత్తంగా రచించారు. **"ఆలయంలో పూజలందుకుంటున్న ఏ తల్లి ఈ శరీరానికి కన్నతల్లి అయి ఇప్పుడు నహబత్తులో ఉంటున్నదో, ఆ తల్లే ఇప్పుడు నా పాదాలు ఒత్తుతున్నది. ఆనందమయి అని జగజ్జననికి ప్రత్యక్షరూపాని**

**వనే నిన్ను గురించి ఎప్పుడూ తలుస్తూ ఉంటాను"** అని తనకు జన్మనిచ్చిన తల్లి, తను సేవించే జగజ్జనని, తనను పెండ్లి చేసుకున్న భార్యలకు మధ్య అభేదం చూసిన మహనీయుడు రామకృష్ణులు. అంతేకాదు సామాజిక అసమానతలను పాటించకుండా తనను మాలమాదిగలకు సేవకుడిని చేయమని, మాలవాడికంటే అల్పుడననే భావం తనకు కలిగించమని ఆ జగజ్జననిని వేడుకున్నారు. అంతేకాక మాలవాడలకు వెళ్ళి వారు చూడకుండా వాళ్ళ దొడ్లను ఊడ్చేవాడట.

**"శుష్క పాండిత్యం నిరర్థకం. భగవంతుణ్ణి పొందే మార్గాన్ని తెలుసుకోడానికే గ్రంథపఠనం"** అంటూ ఈశ్వరచంద్ర విద్యాసాగరులను కలిసినప్పుడు రామకృష్ణులవారు చెప్పిన మాటలు మనందరికీ నేటికీ ఆచరణయోగ్యమైనవే.

చండీశ్వర నాయనారు కథలో గోసేవ, అందులోనే పశుపతి అయిన సర్వేశ్వరుని పూజను చేసుకొని తరించిన విచార శర్మ చోళదేశంలో చండీశ్వర నాయనారుగా ప్రసిద్ధి పొందినాడు. గురువుగారి వద్ద గోపాలక పాత్ర నిర్వహించే విచారశర్మ ఆవుల మందను మందగా భావించక ఒక్కొక్క ఆవుకు లక్ష్మీదేవి అష్టోత్తరంలోని పేర్లతో పిలిచేవారని వాటి ఆలనా పాలనలో శ్రీసూక్తం, భూ, నీలా సూక్తాలు, నారాయణ మన్యుసూక్తాలు పలికేవాడని, ఇక తైత్తిరీయోపనిషత్తు, దశోపనిషత్తులు క్రమంలో ఉచ్చరించేవాడని చెప్పారు. ఇంకా **"ఆపాతాళ నభస్థలాంతభువన బ్రహ్మాండ..."** అంటూ రుద్ర అనువాకం, నమక చమకాలు చదివేవారని చెప్తూ దక్షిణామూర్తిగారు తన ఆధ్యాత్మిక ప్రపంచంలో తాను పారాయణ చేసుకునే ఆయా మంత్రాలను పేర్కొనడం మనం గమనించవచ్చు.

గులకరాతిని గోపాలుడుగా పూజించిన ధనాజటుడు పామరుడు. ఎటువంటి మాయమర్మాలు తెలియనివాడు. అడవిలో శిష్ట సాధువులు సాలగ్రామానికి నిర్వహించే పూజలను చూసి వారి పూజ పరిసమాప్తమయిన తర్వాత దేవుడి పూజ ఎవరైనా చేసుకోవచ్చా? అని అమాయకంగా అడిగి, అతడి నిర్మల భక్తిని గమనించి సాధువులు ముచ్చటపడ్డారు. వారు పూజచేసిన సాలగ్రామాల వంటివి తనకు ఇమ్మని అడిగాడు ధనాజటుడు. అయితే పవిత్రమయిన ఆ సాలగ్రామం పూజావిధానాలు మంత్రాలు తెలియని ధనాజటునికి ఇవ్వడం ఇష్టంలేని సాధువులు ఒక గులకరాయిని అతని చేతిలో పెడతారు. అదే సాలగ్రామశిల అని చెప్పి నచ్చినవిధంగా పూజ చేసుకోమన్నారు. ఆనాటినుండి ధనాజటుడు చాలా భక్తి శ్రద్ధలతో ఒక ఆకులో పెట్టి గులకరాతిమీద నీళ్ళు పోసేవాడు. గోవింద, గోపాల అంటూ పూలు పేర్చేవాడు. అరటిపండ్లు, చద్దన్నం పెట్టి తినమనేవాడు. గోపాలుడు తినకపోతే తాను తినడం కుదరదన్నాడు. చాలా సేపటికి నెమలి ఈకతో, పిల్లనగ్రోవి ఉన్న గోపాలుడు వచ్చి అన్నం తిన్నాడు. ఆ తరువాత ఇదే వరుస. గోపాలుడు తిననిదే ధనాజటుడు తినేవాడు కాదు.




అతని భక్తి ఎంత గొప్పది అంటే పొలంలో నాటవలసిన విత్తనాలు దంచి ఆకలి అని వచ్చినవారికి వండి పెట్టాడు. చివరకు గోపాలుడే తనకు ఉన్నాడని నమ్మి, పొలంలో విత్తనాలు విత్తకుండానే పైరు లేవడమే కాదు ప్రతి సంవత్సరం కంటే చాలా అధికంగా దిగుబడి వచ్చింది. ఇదంతా తన గులకరాతి గోపాలుడి మహిమే అని భావించి ఇంకా శ్రద్ధగా అతని పూజను నిర్వహించేవాడు. ఈ కథ చదవడానికి చాలా బాగుంటుంది. కానీ ఆధునిక కాలంలో ఇటువంటివి జరుగుతాయా? అని ప్రశ్నించేవాళ్ళు కూడా ఉంటారు. కానీ, అచంచలభక్తితో తన అమాయకత్వంతో భగవంతుడిని మెప్పించిన ధనాజటుని కథ ఈ భక్తుల కథలల్లో చాలా విభిన్నమైనదిగా చెప్పుకోవచ్చు.

అనన్య భక్తితో పరమేశ్వరుని ఆదేశానుసారం తిరువాలంగాడు చేరి అక్కడ పరమేశ్వరుని నృత్యాన్ని చూస్తూ ఆయనను స్తుతిస్తూ జీవన్ముక్తి పొందిన శ్రీ పుణ్యవతి కారక్కాలమ్మగా పేరు గడించి నేటికి గొప్ప భక్తురాలుగా పిలువడుతుంది. ఆమె కథలో చాలా అద్భుతాలు జరిగినట్లు పోరంకివారు తెలియజేశారు.

రెండవ సంపుటం నింబార్కాచార్యుల కథతో ప్రారంభం అవుతుంది. ఉత్తర భారతీయుడుగా పేరుగాంచిన నింబార్కుడి మూలాలు తెలుగు ప్రాంతమని ఈ కథ ద్వారా తెలుస్తుంది. నింబార్కుల శిష్యులలో శ్రీనివాసాచార్యులు, ఔదుంబరాచార్యులు, దేవాచార్యులు, కేశవ కాశ్మీరీగారు వంటివారు ఉన్నారు. ఉత్తర భారతదేశంలో శ్రీకృష్ణ భక్తి రసామృతాన్ని అందరికీ అందించి, నేటికి ఆ అమృత ప్రవాహం కొనసాగడానికి కారణభూతులైన నింబార్కులు సుదర్శన చక్రావతారులని దక్షిణామూర్తిగారు ఈ కథలో పేర్కొన్నారు.

మరో తెలుగు భక్తాగ్రేసరుడైన వల్లభాచార్యులవారు ఉత్తర భారతంలో తన మధుర గానంతో ఏవిధంగా కృష్ణభక్తిని ప్రచారం చేశాడో ఈ కథలో వివరంగా తెలుస్తుంది. తెలుగు కర్ణాటక వల్లభుడైన శ్రీకృష్ణదేవరాయలు వల్లభాచార్యుల శిష్యులుగా వారి దగ్గర దీక్ష తీసుకొని పుష్టిమార్గ వైష్ణవ సిద్ధాంత అనుయాయిగా ప్రసిద్ధి చెందాడు. **"మీరు బహిర్ముఖులై అంటే లౌకిక వ్యవహారాలలో పాల్గొనేటట్టయితే కాలప్రవాహంలో మునిగి కొట్టుకొని పోయే మిమ్మల్ని దేహమూ చిత్తమూ పూర్తిగా తినేస్తాయి. అంటే మీరు దేహానికి, చిత్తానికి లొంగిపోయి ఇంద్రియాలకు దాసులయిపోతారు. ప్రభువైన శ్రీకృష్ణుడు లౌకికుడు కాదు. మనస్సూ లౌకికం కాదు. సర్వభావంతో సర్వదా, సర్వస్వాన్ని, లోక పరలోకాలను శ్రీకృష్ణుడనే భావించాలి అట్లా చేసినట్లయితే మీకు పశ్చాత్తాపడవలసిన అగత్యం కలగదు. ఇతర రూపాలను వదిలి స్వరూపంతో ఉండడమే ముక్తి"** అని వల్లభాచార్యులు ముక్తిని గూర్చి చెప్పిన వాక్యాలను ఈవిధంగా దక్షిణామూర్తి గారు కథలో అంతర్భాగంగా తెలిపారు.

మిగతా ఇతర కథల్లో కూడ భక్తుల ఆర్తి, ఆవేదన, తమను తాము భగవంతునికి సమర్పించుకొన్న విధానం, తద్వారా సాధనలో వారు సాధించిన ముక్తిమార్గం వంటి అనేక అంశాలను ఆయా సంఘటనల ద్వారా మనకు కథలలో దక్షిణామూర్తిగారు స్పష్టం చేసినారు. కథను చదవడం మొదలు పెట్టితే కొన్నిసార్లు ఆ సంఘటనలు మనకు దృశ్యమానమవుతాయి. మనం వాటిని విజువలైజేషన్ చేయగలుతాము. అంతగా ఆ కథలు మనలను ఆకర్షిస్తాయి.

ఆధ్యాత్మికరంగంలో పరమహంస యోగానందగారి అనేక గ్రంథాలు, వారి ఆత్మ కథలను అనువాదం చేసిన దక్షిణామూర్తిగారు ఈవిధంగా భక్తుల కథలను రాయడంలో తన ఆధ్యాత్మిక సాధనా క్రమానికి ఒక రూపు కల్పించుకున్నారని చెప్పవచ్చు. ఈ రెండు సంపుటాలను తన శ్రీమతి, కూతురు-అల్లుడు, కొడుకులు-కోడళ్ళు, మనుమరాళ్ళు, మనుమలకు ఇంకా అందరు ఆధ్యాత్మిక బంధుమిత్రులకు అంకితం ఇచ్చారు. ఇది ఒక ఆధ్యాత్మిక వేత్త మాత్రమే ఆలోచించగలడు. సర్వేజనాః సుఖినో భవంతు అన్న సూక్తికి ఈ అంకితం ఉదాహరణగా నిలుస్తుందని చెప్పవచ్చు.

## చిరునామా

### మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

మానవ యంత్రంలో అన్నింటికంటే బలహీనమయినదీ, తరచుగా ఎక్కువ దురుపయోగమయ్యేది పొట్ట. మితిమీరి తినడం వల్లనో, తప్పుగా తినడం వల్లనో జీర్ణక్రియ సరిగా జరక్కపోతే, అది శరీరంలో అన్ని రకాల కష్టాలూ కలిగిస్తుంది. సాధారణంగా, పొద్దున మీరు అద్దంలో చూసుకున్నప్పుడు చాలా బాగున్నానని అనుకుంటారు. మీ శరీరంలో చాలా విషపదార్థాలను (టాక్సిన్స్) మోస్తున్నారని మీరు గ్రహించరు. శరీర వ్యవస్థ నిండా ఉన్నాయవి. వాటిని వదిలించుకోడం ఎలాగో మీకు తెలియకపోతే, మీ శరీరం వాటిని మీరే మాత్రమూ సంభాళించలేని పరిస్థితి వచ్చినప్పుడు కనిపించే ఫలితం, జబ్బు. అమెరికా వాళ్ళ ఆహారంలో, జీర్ణంకాని మాంసకృత్తుల (ప్రోటీన్)లోని విష పదార్థాల వల్ల ప్రోటీన్ పాయిజనింగ్ (విషయుక్తం కావడం) జరగడం, తరచుగా అన్నిటికంటె ఎక్కువగా ఉండే దోషం. తూర్పుదేశాల్లో ఆహారంలో తరచు కనిపించే దోషం, మాంసకృత్తులు లేకపోవడం. కానీ, పడమటి దేశాల్లో అవి అవసరానికి మించి నిలవ ఉంచడానికి కారణం, మీరు మాంసం అతిగా తింటారు. జీర్ణంకాని మాంసకృత్తుల వల్ల కలిగే ఫలితాల్లో ఒకటి – గుండెజబ్బు, పుట్టకురుపు (కేన్సర్) వంటి తీవ్ర పరిణామాలకు తోడు, ఆ విష పదార్థాలు మీ ముక్కుపొరమీద పనిచేసి మిమ్మల్ని జలుబుకు లోను కాగలవాళ్ళలా చేస్తుంది.

# ఆధ్యాత్మిక అనువాద శిఖరం - ఒక యోగి ఆత్మకథ

**డా. సాగి కమలాకర శర్మ,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉ.వి. ఫోన్ : 9704 22 77 44

అనేక భాషల్లో అనేకమార్లు అనువాదాలు పొందిన ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథం **"ఒక యోగి ఆత్మకథ".** యోగివర్యులు, యోగదా సత్సంగ సొసైటీ వ్యవస్థాపకులు అయిన పరమహంస యోగానంద గారు రచించిన గ్రంథమిది. ఇది తన ఆత్మకథే. కాని పేరు మాత్రం ఒకయోగి అన్నారు. అది జీవిత చరిత్ర కూడా కావచ్చు అని ధ్వనిస్తుంది. ఆంగ్లంలోనూ దాదాపు అదే అర్థం ఉంది. (Autobiography of a Yogi) ఈ గ్రంథాన్ని అపూర్వంగా తెలుగులోకి అనువదించి గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ప్రముఖులు డా. పోరంకి దక్షిణామూర్తి గారు. ఈ గ్రంథాన్నే కాకుండా యోగదా సత్సంగ సొసైటీ వారి చిన్న పుస్తికలను కొన్నింటిని కూడా అనువాదం చేసినారు. యోగానందుల వారిని, వారి ఉపదేశాలను, వారి జీవిత చరిత్రను తెలుగు వారికి పరిచయం చేయడానికి దక్షిణామూర్తిగారిని ఈ విశ్వశక్తి వినియోగించుకుంది. అందుకే 1986లో మొదటి తెలుగు అనువాద రచనగా వచ్చిన ఈ గ్రంథం ఇప్పటికే దాదాపు 25 పునర్ముద్రణలను అందుకున్నది. ఈ గ్రంథ అనువాదానికి 1989లో డా. దక్షిణామూర్తి గారికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి పురస్కారం కూడా లభించింది.

అనేక రకాల యోగులుంటారు. శరీరం వ్యక్తమైనా, మనస్సును చాలా ప్రశాంత స్థితికి చేర్చి భావనను అవ్యక్తంగా ఉంచే సాధువులు, యోగులు కొందరు. భావనను కూడా వ్యక్తం చేసి కొన్ని సంస్థలకు పునాదులు వేసి, భావి తరాలకు వాటి ఫలితాలను అందించే మూల శక్తిగా మారిన యోగులు మరికొందరు. ఈ రెండవ వారి కోవలోకి చెందే సాధువు, యోగి శ్రీ పరమహంస యోగానంద.

అనువాదాలు అనేక రూపాల్లో చేయవచ్చు. అనువదించిన గ్రంథం మూల గ్రంథానికి దాదాపు సమానంగానే ఉండాలి. ముఖ్యంగా ఆధ్యాత్మిక వ్యవహారాలతో కూడుకున్న అంశాల్లో స్వేచ్ఛ చాలా తక్కువగా ఉంటుంది. మూల గ్రంథ కర్త భావాన్ని స్పష్టంగా అనువాదకుడు అందించగలగాలి. దానిలోని ప్రత్యేక శాస్త్రీయ, సాంకేతిక పదజాలాల విషయంలో స్పష్టంగా, సరళ సుందరంగా, పాఠకుని ఆకట్టుకునేలా ఉండాలి. శాస్త్రాంశం కావడం వల్ల ఆ శాస్త్రంలో అనువాదకునికి కనీస ప్రవేశం అన్నా ఉండాలి. కేవల ప్రవేశమే కాకుండా ఆయా అంశాలను పూర్ణంగా అధ్యయనం చేసినవారైతే ఇంకా మంచిది. అన్నింటికన్నా మూల గ్రంథ రచయితపై ప్రేమ, గౌరవం ఉండాలి. చక్కని అనువాదం చేసి, ఆ గ్రంథంలోని సమాచారాన్ని తాను ఎన్నుకున్న భాష లోని వారికి అందించాలనే తపన ఉండాలి. అనువాదాలు ఈ విధంగా ఉంటేనే




మళ్ళీ మళ్ళీ కొనుక్కొని పాఠక లోకం చదువుకుని దాచిపెట్టు కుంటుంది. డా. పోరంకి దక్షిణామూర్తి గారు పై లక్షణాలన్నీ కలిగిన గొప్ప అనువాదకుడు. లోలోపల వీరు కూడా ఒక యోగ భావనలో ఉంటేనే ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడానికి తగిన 'సమిధ'గా మారగలడు. ఆయనలోని దైవత్వమే అనువాదానికి తగిన భాషా పాండిత్యాన్ని, అవసరమైనవారి సహకారాన్ని అందించి ఈ గ్రంథానువాదం చేయించింది. పరమహంస యోగానందుల వారిని తెలుగువారికి పూర్ణంగా పరిచయం చేయించింది.

మూలభాషలోని పదాలను తెలుగులోకి అనువదించే సందర్భంలో క్రియా పదాలు, విశేషణాలు, వర్ణనలు, కవితాత్మక భావానువాదంలో ఎంతో జాగ్రత్త అవసరం. కష్టమైన ఈ కార్యాన్ని ఇష్టంగా పూర్తిచేసి తెలుగువారికి యోగానందుల వెలుగును ప్రసాదించినారు దక్షిణామూర్తిగారు.

ఒక యోగి ఆత్మకథ అనే గ్రంథం ఒక స్వీయచరిత్రకు సంబంధించిన కథ కావడం వల్ల లోపలి ఉపశీర్షికల మధ్యలో సారూప్యత కనిపించడం లేదు. చిన్నవయస్సు నుండి పెద్ద వయస్సు వరకు వచ్చే మార్పులు ఈ గ్రంథంలో ఉన్నాయి. చిన్న చిన్న ప్రయాణాలు వాటిలో ఎదుర్కొనే కష్టనష్టాల నుండి, అతి పెద్ద ప్రయాణాదులు వాటిలోని సాధక బాధకాలు, పరిచయాలు, పరామర్శలుంటాయి. జీవితంలో ఎన్నో పార్శ్వాలలో ఎందరో ఎదుర్కొంటున్న సమస్యలు కూడా దీనిలో ఏకరువు పెట్టడం జరుగుతుంది. అనుబంధాల వ్యవహార శైలి అంతా ఒక నవలగా కనిపిస్తుంది. అటువంటి అంశాల నిర్వహణలో రసదృష్టి ఉంటుంది. పాఠకుడు కూడా ఏదో ఒక రసానుభూతిని పొందుతుంటాడు. ఇదే గ్రంథంలో యోగశాస్త్ర అంశాలు, యోగుల జీవిత చర్యలు, వారి మహిమలు, క్రియాయోగ శాస్త్ర పరిచయం అంతా సాంకేతికంగా, ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడ రసానుభూతి కన్నా, శాస్త్రానుభూతి ఉంటుంది. చదువరికి చాలా ఏకాగ్రత అవసరం అవుతుంది. జీవితంలో వేరు వేరు సమయాల్లో కలిసిన వ్యక్తుల గూర్చి వర్ణించినపుడు, వారి వారి స్థాయిని, విధానాన్ని బట్టి రచన మరో రకంగా ఉంటుంది. ప్రత్యేకంగా ఒక నవలగానో, నాటకంగానో, యాత్రాచరిత్రగానో, ఒక శాస్త్ర సంబంధ గ్రంథంగానో కాకుండా అన్ని భావాలు కూడగట్టుకున్న ఆత్మకథ ఇది. దీనిని తెనిగించే సందర్భంలో అనువాదకుడు పై వ్యవహారాలన్నింటిలోనూ సముచితమైన పాండిత్యాన్ని, ఔచిత్యాన్ని కలిగి ఉండాల్సి ఉంటుంది. డా. పోరంకి వారిలో ఇవి కావలసినన్ని ఉన్నాయి. అందుకే ఈ గ్రంథం ఊహాతీతంగా తెలుగు ప్రజలకు ఆనందాన్ని పంచింది.

గ్రంథాంతరంగాన్ని పరిశీలిస్తే, ఒక యోగి ఆత్మకథను పరమహంస యోగానందుల వారు 49 విభాగాలను చేసుకున్నారు. ఈ ఉపశీర్షికలు ఇవే :

1. మా తల్లిదండ్రులు, నా బాల్యజీవితం
2. మా అమ్మ మరణం, విచిత్రమైన రక్షరేకు
3. రెండు శరీరాలున్న సాధువు
4. హిమాలయాలకు పారిపోతుంటే ఆటంకం
5. "గంధబాబా" అద్భుతాల ప్రదర్శన
6. టైగర్ స్వామి
7. గాలిలో తేలే సాధువు
8. భారతదేశపు గొప్ప శాస్త్రవేత్త, సర్ జగదీశ్ చంద్రబోసు
9. ఆనందభరిత భక్తుడు, ఆయన విశ్వప్రేమ లీల
10. గురుదేవులు శ్రీ యుక్తేశ్వర్ గారిని కలుసుకోవడం
11. చేతిలో పైసలేని కుర్రవాళ్ళిద్దరు బృందావనంలో
12. గురుదేవుల ఆశ్రమంలో గడచిన కాలం
13. నిద్రపోని సాధువు
14. విశ్వచేతనానుభవం
15. గోబిపువ్వు దొంగతనం
16. గ్రహాల్ని ఓడించడం
17. శశి, మూడు నీలాలు
18. మహమ్మదీయ గారడీవాడు
19. కలకత్తాలో ఉన్న గురుదేవులు శ్రీరాంపూర్‌లో కనిపించడం
20. మేము కాశ్మీరు వెళ్ళలేదు
21. మేము కాశ్మీరు వెళ్ళాం
22. రాతిబొమ్మ గుండె
23. విశ్వవిద్యాలయ పట్ట ప్రాప్తి
24. నేను సన్యాసం తీసుకోవడం
25. అన్నయ్య అనంతుడు, చెల్లెలు నళిని
26. క్రియాయోగ శాస్త్రం
27. రాంచీలో యోగవిద్యాలయ స్థాపన
28. కాశీ పునర్జన్మించడం, అతన్ని కనుక్కోడం
29. రవీంద్రనాథ్ టాగూరు, నేను విద్యాలయాల్ని పోల్చి చూడడం
30. అలౌకిక ఘటనల నియమం
31. పూజ్యమాతతో సమావేశం
32. చనిపోయిన రాముణ్ణి బతికించడం
33. ఆధునిక భారతీయ యోగి – క్రీస్తు (యోగీశ్వరులు) బాబాజీ
34. హిమాలయాల్లో మహాభవన సృష్టి
35. లాహిరీ మహాశయుల పావన జీవితం
36. పాశ్చాత్య ప్రపంచం పట్ల బాబాజీ ఆసక్తి
37. నా అమెరికా ప్రయాణం
38. గులాబీల మధ్య సాధువు, లూథర్ బర్బాంక్
39. శిలువ గాయాలున్న థెరిసా నాయ్‌మన్
40. భారతదేశానికి తిరిగి రాక
41. దక్షిణ భారత విహార యాత్ర
42. గురుదేవులతో చివరి రోజులు
43. శ్రీ యుక్తేశ్వర్ గారి పునరుత్థానం
44. గాంధీమహాత్ములతో వార్ధాలో
45. బెంగాలీ "ఆనందమయి మాత"
46. నిరాహార యోగిని
47. పడమటికి నా తిరుగు ప్రయాణం
48. కాలిఫోర్నియాలో ఎన్సినీటస్‌లో
49. 1940–1951 మధ్యకాలం

పరమహంస యోగానంద : జీవితంలోనూ మరణంలోనూ కూడా యోగి

ఎన్నో మత సంబంధ అంశాలు దీనిలో చర్చించబడినాయి. బైబిలు, భగవద్గీతలలో నుండి చాలా ఉదాహరణలున్నాయి. పతంజలి యోగసూత్రాలు, ఉపనిషత్తుల నుండి సూచికలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి.

ముందు పేజీలోని ఉపశీర్షికలన్నీ గమనిస్తే పరమహంస యోగానందుల వారి జీవన ప్రస్థానం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. చిన్న వయస్సు నుండి పెద్ద వయస్సు అంటే దాదాపు మరణానికి చేరువ అయ్యేంతవరకు జరిగిన సంఘటనలన్నింటి రూపకల్పన ఈ గ్రంథం. అనేక విధాలైన సందర్భాలను సూచన చేస్తున్న గ్రంథమిది. దాదాపు 620 పేజీల గ్రంథమంతా ఆధ్యాత్మిక పరిమళాలలతో చదువరులను పవిత్రం చేస్తుంది. ఎన్నో నూతన విషయాలను తెలుపుతూ పాఠకుని స్థాయిని బట్టి ఏదో ఒక అంశాన్ని ఉపదేశం చేస్తూనే ఉంటుంది.

జనవరి 5, 1893 లో పుట్టిన పరమహంస యోగానందులు రాసుకున్న తన ఆత్మకథలో దాదాపు 1951వ సంవత్సరం వరకు జరిగిన సంఘటనల సారాంశాన్ని ఈ గ్రంథంలో నిబిడీకృతం చేసినారు. ఈ గ్రంథంలో ఉన్నవన్నీ అతి ముఖ్యమైన అంశాలు మాత్రమే. ఈ వరుసను 49 ఉపశీర్షికలు సూచన చేస్తున్నాయి. యోగానందుల వారి జీవితచరిత్రకు సంబంధించిన లోతుల్లోకి పోకుండా, వారిని తెలుగువారికి పరిచయం చేసిన డా. పోరంకి వారి అనువాద విధానాన్ని గమనించడం ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

అనువాదకుని గొప్పదనాన్ని తెలియజేయడానికి ఈ గ్రంథంలోని ప్రతి భాషణా, సంభాషణా వినియోగపడుతూనే ఉంటాయి. సాధారణ అనువాదకులన్నా పోరంకి వారు వినియోగించే పదజాలాన్ని తెలియజేసే నేపథ్యంలో కొన్ని ఉదాహరణలను క్రింద సూచించడం జరిగింది. భాషా ప్రయోగాలు కొన్ని, భావనలు కొన్ని, శాస్త్ర పరమైన విషయాలు మరికొన్ని మనం క్రింది ఉదాహరణల్లో గమనించవచ్చు.

"మీకు దారి చూపించడానికి నేను ఈ శరీరంతో లేనప్పుడు కూడా, ఈ యోగకీలకానికున్న సామర్థ్యం పోదు. సిద్ధాంతపరమైన ఆవేశాల సముదాయంగా తలచి, **కట్టుదిట్టంగా కవిలెకట్టలో దాచిపెట్టి,** తరువాత మరిచిపోవడానికి వీలనయిది కాదు ఈ యోగపద్ధతి. క్రియాయోగం ద్వారా నిరంతరాయంగా ముక్తిమార్గంలో ముందుకు సాగు; నువ్వు చేసే సాధనలోనే దీని శక్తి ఇమిడి ఉంది." (హిమాలయాలకు పారిపోతుంటే ఆటంకం)

**"మానవులు మోక్షం పొందడానికి సారభూతమైనదిగా ఋషులు దర్శించిన దాన్ని పాశ్చాత్యుల కోసం పలచన చేయనక్కర లేదు.** బాహ్యానుభవం వేరయినా ఆత్మ మట్టుకు ఒకే తీరుగా ఉన్న పాశ్చాత్యులు కాని, ప్రాచ్యదేశాల వాళ్ళు కాని క్రమశిక్షణతో కూడిన ఏదో ఒక యోగ పద్ధతిని అభ్యాసం చేయకపోతే బాగుపడరు." (గాలిలో తేలే సాధువు)

"ఒక్క క్షణంలో నేను బోనులోకి ప్రవేశించాను; కాని నేను తలుపు మూస్తూ ఉండగానే రాజా-బేగం నిలువునా నా మీదకు వచ్చిపడింది. నా కుడిచెయ్యి ఘోరంగా చీలుకుపోయింది. పులికి అన్నిటికంటె ఇష్టమైన మానవరక్తం, చేతినుంచి వరదలా ప్రవహించింది. ఆనాడు సాధువు చెప్పిన జోస్యం నిజమవుతున్నట్టు అనిపించింది." (టైగర్ స్వామి) – జరుగుతున్న సంఘటనలను వర్ణించే విధానం.

**"అజ్ఞానాన్ని విశ్వాసంతో కలిపి గందరగోళపరిచే దైవశాస్త్రపరమైన పక్షపాతం కూడా ఒకటి అనుకోకుండా పనిచేస్తోంది.** నిరంతర పరిణామశీలమైన సృష్టిరహస్యంతో మనల్ని ఆవరించి ఉన్న భగవంతుడు, ప్రశ్నించి తెలుసుకోవాలన్న కోరిక కూడా మనలో పాదుగొలిపాడన్న విషయాన్ని తరచుగా మరిచిపోతుంటాం. **నేను అనేక సంవత్సరాలపాటు ఇతరుల అపార్థానికి గురి అయినమీదట, విజ్ఞాన శాస్త్రాన్ని ఆరాధించే శాస్త్రవేత్తల జీవితం, అంతులేని సంఘర్షణ అని తెలుసుకున్నాను. లాభనష్టాల్నీ, జయాపజయాల్నీ ఒక్కటిగానే భావించి, జీవితాన్ని అతడు భక్తిపూర్వకంగా అర్పణ చేసుకోవాలి."** (భారతదేశపు గొప్ప శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్)

**"నా తండ్రీ! వచ్చేశావా!"** అంటూ గురుదేవులు, ఆనందంతో తబ్బిబ్బయి వణుకుతున్న గొంతుతో, బెంగాలీ భాషలో మళ్ళీమళ్ళీ అన్నారు. **"ఎన్నాళ్ళు కాచుకుని ఉన్నాను బాబూ నీ కోసం!"** (గురుదేవులు శ్రీయుక్తేశ్వర్‌గారిని కలుసుకోవడం)

క్రింది కొన్ని ఉదాహరణలు వేరు వేరు సందర్భాలలోనివి. ఇవి కొంత విజ్ఞానశాస్త్ర సంబంధమైనవి. యోగానందుల వారి ఆంగ్ల పాండిత్యాన్ని అత్యంత సులువు చేస్తూ పోరంకి వారు చేసిన అనువాద రీతి ఆ విషయాన్ని మనను చేరువ చేయడం గమనించవచ్చు.

**"కండరాలు నిద్రలో విశ్రాంతి పొందుతాయి; కాని గుండె, ఊపిరితిత్తులు, రక్తప్రసరణమండలం ఎడతెరిపి లేకుండా పనిచేస్తూనే ఉంటాయి; వాటికి విశ్రాంతి దొరకదు. అధిచేతనస్థితిలో ఉన్నప్పుడు అంతరింద్రియాలన్నీ విశ్వశక్తి చేత విద్యుత్ప్రేరితాలయి, తాత్కాలికంగా నిశ్చల స్థితిలో ఉండిపోతాయి.** ఈ పరిస్థితుల్లో నాకు ఏళ్ళతరబడిగా నిద్రే అవసరం లేకపోయింది." (నిద్రపోని సాధువు)

**"అందులో చెప్పిన 'సర్పం', లైంగిక నాడుల్ని ఉద్రేకపరిచే వెనుబాములోని శక్తిని, సూచిస్తుంది. 'ఆదాము' వివేకానికి సంకేతం; 'అవ్వ' అనుభూతికి సంకేతం. ఏ మనిషిలోనయినా భావోద్రేకాన్ని అంటే స్త్రైణస్పృహను, కామవాంఛ లోబరచుకున్నట్లయితే అతని వివేకం, అంటే ఆదాము నశించక తప్పదు."** (గ్రహాల్ని ఓడించడం)

క్రియాయోగ రహస్యాలను ఈ విభాగంలోని ప్రతి పేరాలోనూ కనిపిస్తాయి. తాము పూర్ణమైన దీక్ష తీసుకున్న క్రియాయోగి అయితే తప్ప అనువదించలేని కొన్ని మాటలు ఈ శీర్షికలో ఉన్నాయి. యోగానందుల వారి ప్రచారమే క్రియాయోగమైతే, ఈ గ్రంథమంతా క్రియాయోగ గంధ వ్యాపనంతోనే ఉంటుంది. ఆ సుగంధవ్యాపనాన్ని అందుకున్న పోరంకి వారి సులువైన అనువాదం మనకు కూడా ఆ ఆధ్యాత్మిక పరిమళాన్ని అందిస్తూనే ఉంటుంది.

**"క్రియాయోగి తన ప్రాణశక్తిని, వెనుబాములోని ఆరు కేంద్రాల్ని (ఆజ్ఞా, విశుద్ధ, అనాహత, మణిపూర, స్వాధిష్ఠాన, మూలాధారలనే**

**షట్చక్రాల్ని) చుట్టి, కిందినించి పైకీ, పైనించి కిందికీ పరిభ్రమించే టట్టు మానసికంగా నిర్దేశిస్తాడు.** ఈ ఆరు చక్రాలూ విరాట్పురుషుడికి సంకేతమయిన రాశిచక్రంలోని పన్నెండు రాశులకు సమానం. మానవుడి సున్నితమైన వెనుబాము చుట్టూ అరనిమిషం సేపు పరిభ్రమించేశక్తి, అతని పరిణామంలో సూక్ష్మ ప్రగతిని సాధ్యం చేస్తుంది; ఒక్క క్రియకు పట్టే ఆ అరనిమిషం కాలం, ఒక సంవత్సరంలో జరిగే ప్రకృతి సహజమైన ఆధ్యాత్మిక వికాసానికి సమానం." (క్రియాయోగశాస్త్రం)

"నాన్నగారు, సారవంతమైన ఈ భూమిని నాకు బహూకరించారు. దీంట్లో అంతకు పూర్వమే ఆయన ఒక అతిథి గృహం, దేవాలయం నిర్మించారు," అని చెప్పారు రవీంద్రులు. ఇక్కడ నా విద్యాబోధన ప్రయోగాన్ని 1901లో, ఒక్క పదిమంది కుర్రవాళ్ళతో ప్రారంభించాను. నోబెల్ బహుమానంతో వచ్చిన ఎనిమిదివేల పౌన్ల డబ్బు ఈ విద్యాలయ నిర్వహణకే ఖర్చయింది." (రవీంద్రనాథ్ టాగూరు, నేను విద్యాలయాల్ని పోల్చి చూడడం)

**"నేను దిగ్భ్రమ నుండి ఇంకా తేరుకోకముందే ఆకాశంలో పరిభ్రమిస్తూ వస్తున్న ఒక అలౌకిక తేజోబింబాన్ని చూసి మరింత ఆశ్చర్య పోయాను. వడివడిగా దిగుతూ ఆ తేజోవలయం, మా సమూహానికి దగ్గరిగా వచ్చి ఒక అందమయిన యువకుడిలా ఆకృతి దాల్చింది. ఆయన బాబాజీ అని నాకు తక్షణమే అర్థమయింది. ఆయన లాహిరీ మహాశయుల్ని పోలి ఉన్నారు; అయితే తమ శిష్యుడికంటె చాలా వయసు తక్కువవారిగా ఉన్నారు; నిగనిగలాడే పొడవైన జుట్టు వారిది."** (ఆధునిక భారతదేశపు యోగి – క్రీస్తు (యోగీశ్వరులు) బాబాజీ)

బాబాజీని వర్ణిస్తున్న ఘట్టంలో ఎన్ని మాటలు చెప్పినా యోగానందుల వారికి తనివి తీరదు. పోరంకి వారు కూడా వర్ణనాత్మకమైన ఆ మాటలను అంతే సులువైన భాషలో మనకు అందించిన వైనం పై పేరాలో కనిపిస్తుంది.

"ధగధగ మెరిసే రత్నాల మాదిరిగా భూమి అంతటా వ్యాపించి ఉన్న వేలాది మంది క్రియాయోగులకు ప్రేమపూర్వకమైన భావతరంగాల్ని ప్రసారం చేస్తూ కృతజ్ఞతతో నేను తరచు అనుకుంటూ ఉంటాను :

**"ఈశ్వరా, ఈ సన్యాసికి పెద్ద సంసార మిచ్చావు కదయ్యా!"**

ఇటువంటి అనేకమైన పదాలను అనువదించడం చాలా కష్టం. కాని ఈ గ్రంథంలో ఇటువంటి స్టేట్‌మెంట్స్ అనేకంగా కనిపిస్తుంటాయి. ఉదాహరణకు :

**"దుఃఖించే సాధువు సాధువే కాదు"**

**"దేవుడొక్కడే తప్పులేని సలహా ఇస్తాడు: ఆయన తప్ప మరెవ్వరు మొయ్యగలరు ఈ బ్రహ్మాండ భారాన్ని?"**

**"నీళ్ళలో కప్పకూడా హాయిగానే ఉంటుంది!" (ఎత్తిపొడుపు మాట)**

**"పీల్చే గాలిని విడిచే గాలిలో వేల్చి, విడిచే గాలిని పీల్చే గాలిలో వేల్చి, రెండు శ్వాసల్నీ తటస్థీకరిస్తున్నాడు యోగి."**

**"నిశ్చలంగా ఉండి, నేను దేవుణ్ణని తెలుసుకో"**

**"కొన్ని రహస్యాల్ని అంతకాలంలో ఛేదించడానికి వదిలిపెట్టు"**

**"చిత్తశుద్ధి లేని సభ్యత నిర్జీవమైన సుందరాంగి వంటిది"**

**"ఉచ్ఛ్వాస నిశ్వాసల గతిని విచ్ఛేదించడం ద్వారా జరిగే ప్రాణాయామం వల్ల ముక్తి సాధించవచ్చు"**

**"బిచ్చగాడు సంపద ఏమీ త్యాగం చేయలేదు"**

పరమహంస యోగానందుల వారి తేజోమయ జీవితాన్ని తెలుగులోకి అనువదించడంలో శిఖరాయమైన ప్రజ్ఞను చూపించిన వారు డా. పోరంకివారు. అనేక మార్లు చదివితే తప్ప అర్థం కాని గహనమైన యోగాంశాలతో కూడుకున్న ఈ గ్రంథం అత్యంత సులభతరం చేయడానికి రచయిత చేసిన ప్రయత్నం ఊహించలేనిది. ఇది అనువాద గ్రంథం కాకుండా, స్వతంత్ర గ్రంథంగా అధ్యయన శీలురకు అందించిన డా. పోరంకి వారికి తెలుగుజాతి మొత్తం ఋణపడి ఉంటుంది.

**"పరమహంస యోగానందగారి జీవితంలో దేవుని పట్ల ప్రేమ, మానవజాతికి సేవ అనే ఆదర్శం పూర్తిగా వ్యక్తమయింది ... వారి జీవితంలో ప్రధానభాగం భారతదేశానికి వెలుపల గడిచినప్పటికీ, మనదేశపు గొప్ప సాధువుల్లో ఆయనకు సముచిత స్థానం ఉంది. సర్వదేశాల ప్రజలను ఆత్మయాత్రా పథలోకి ఆకర్షిస్తూ, ఆయన ప్రారంభించిన కృషి అవిరళంగా అభివృద్ధి చెందుతూ ప్రకాశిస్తోంది."**

**"దృశ్య జగత్తులో కార్యకారణ నియమం చేత బద్ధుడైన మానవుడిలో ఉన్న వివేకశక్తి, ఆద్యంతరహితుడూ కారణ రహితుడూ అయిన దేవుడి చిక్కుముడిని చూసి గాభరా పడుతుంది. మానవుడి వివేకం సృష్టి రహస్యాల్ని ఛేదించలేకపోయినప్పటికీ భగవంతుడే భక్తుడికోసం, ప్రతి రహస్యాన్నీ చివరికి వెల్లడి చేస్తాడు. "**